ఆంధ్రప్రభ

Estd 1938

www.prabhanews.com

Journalism first!

సంపుటి:56 • సంచిక: 339 • బుధవారం 21 మార్చి 2018 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 5.00. Published from:Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం

శ్రీ విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, చైత్ర మాసం, తిథి: శుద్ధ చవితి మ. 3.51 వరకు అనంతరం పంచమి; నక్షత్రం: భరణి రా. 7.33 వరకు, అనంతరం కృత్తిక; అమృతకాలం: మ. 2.50 నుండి 4.20 వరకు; వర్జ్యం: ఉ. 7.03 వరకు; దుర్ముహూర్తం: ఉ. 11.36 నుండి 12.24 వరకు; రాహుకాలం: మ. 12.00 నుండి 1.30 వరకు; యమగండం: ఉ. 7.30 నుండి 9.00 వరకు;

అభివృద్ధి కోసం అప్పు తప్పు కానే కాదు

మనకంటే కేంద్రానివే ఎక్కువ

జీడీపీలో కేంద్రం అప్పులు 49.5%



అమెరికా, జపాన్‌లూ అప్పులు చేశాయి

అసెంబ్లీలో సీఎం కేసీఆర్

- తెలంగాణలో జీఎస్‌డీపీలో 21శాతమే
- కేంద్ర ఉదయ్ పథకంలో రుణాలు రూ.9 వేల కోట్లు
- ఇవన్నీ బడ్జెట్‌లో భాగమే
- బీజేపీ పాలిత రాష్ట్రాలు అరువు తీసుకోకుండానే పాలిస్తున్నాయా?

హైదరాబాద్ ఆంధ్రప్రభ: ద్వేషపూరిత, విమర్శపూరిత వైఖరి వీడి సద్విమర్శ చేస్తే పాజిటివ్‌గా స్వీకరిస్తాం...రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అప్పులు తప్పు కాదు అంటూ సీఎం కేసీఆర్ శాసనసభలో విపక్షాల విమర్శలకు తనదైన శైలిలో ఘాటుగా బదులిచ్చారు. రాష్ట్రంలో, దేశంలో అప్పులు కొత్తకావని, 1956నుంచే అప్పుల వ్యవస్థ నడుస్తోందన్నారు. రాష్ట్రం కంటే కేంద్ర ప్రభుత్వం చేసిన అప్పులే ఎక్కువని ఆయన వ్యాఖ్యానించారు. 21 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపి పాలిత రాష్ట్రం ఏదైనా అప్పు లేకుండా ఉందా...? అప్పులు లేకుండానే ఆ రాష్ట్రాలు పాలన సాగిస్తున్నాయా...? మా పరిమితికి లోబడే అప్పులు చేస్తున్నాం..అప్పులు తీసుకోవడం బడ్జెట్‌లో భాగం, కేంద్ర ప్రభుత్వంతోపాటు, అభివృద్ధి చెందిన అమెరికా, జపాన్ దేశాలూ అప్పులు చేస్తున్నాయి అని ఆయన శాసనసభలో ఆయా గణాంకాలను సవివరంగా సభకు వెల్లడించారు. బడ్జెట్‌పై సాధారణ చర్చలో భాగంగా ఆయన సమాధానమిచ్చారు. దేశ జీడిపి 167 లక్షల కోట్లుగా ఉందన్నారు. అయితే దేశంలో అప్పులు రూ. 82 లక్షల కోట్లుగా ఉన్నాయని చెప్పారు. అంటే దేశ జీడిపిలో 49.5 శాతం మేర కేంద్ర అప్పులు ఉన్నాయని, ఈ ఏడాది కేంద్రం చెల్లిస్తున్న అప్పులు రూ. 8.76 లక్షల కోట్లని ఆయన తెలిపారు. గత మూడేళ్లలో బీజేపి ప్రభుత్వం చేసిన అప్పులు 2016-17 ఆర్థిక యేడాదిలో రూ.5,35,618కోట్లు, 2017-18లో రూ.5,94,849కోట్లు, 2018-19లో రూ.6,24,276 కోట్లుగా ఉన్నాయన్నారు. ఈ ఏడాది ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ వెల్లడించి లెక్కలే ఇవని చెప్పారు. అప్పులు తీసుకోవడం బుద్ధి తక్కువపని కాదని, తెలంగాణ రాష్ట్ర జీఎస్‌డిపిలో 21 శాతం ⇨ 2వ పేజీలో...

కోల్‌కతా చర్చలతో ఖుషీ..ఖుషీ

ఢిల్లీలో ఫ్రంట్ ఆఫీస్

- జాతీయ ఎజెండాతో త్వరలో హస్తినకు
- తదుపరి అడుగుపై కేసీఆర్ కసరత్తు
- ఎజెండా రూపకల్పనకు భారీ వ్యూహరచన
- డీఎంకే, ఎస్పీ, శివసేనల మద్దతు?

హైదరాబాద్, ఆంధ్రప్రభ: జై తెలంగాణ నుంచి జై భారత్ నినాదం అందుకున్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ పార్లమెంటు సమావేశాల అనంతరం జాతీయ ఎజెండాతో హస్తిన బాట పట్టనున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీలకు ప్రత్యామ్నాయంగా తృతీయ ఫ్రంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించి సోమవారం పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీతో మంతనాలు జరిపిన కేసీఆర్ తదుపరి కార్యాచరణపై కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. జాతీయ ఎజెండా రూపకల్పనకు ఢిల్లీ వెళ్లి రాజ్యాంగ నిపుణులు..ఆయా రంగాల్లోని నిష్ణాతులు, వివిధ రాజకీయ పార్టీల ముఖ్యులతో సమావేశం కావాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఢిల్లీకి వెళ్లే ముందు జాతీయస్థాయిలో ఉన్న భావసారూప్యత కల పార్టీల అధినేతలు, ముఖ్యులతో చర్చించాలని సంకల్పించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. తొలి అడుగుగా తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీతో జరిగిన చర్చలు ఫలప్రదం కావడంతో ఇక దూకుడుగా వెళ్లాలని ఆయన నిర్ణయించినట్లు కేసీఆర్ సన్నిహితులు చెబుతున్నారు. తాను ఏర్పాటు చేయనున్న ఫ్రంట్‌కు వివిధ పార్టీల ⇨ 2వ పేజీలో...

టెన్త్ దాకా తెలుగు కంపల్సరీ

ప్రయివేటు, ప్రభుత్వ స్కూళ్లలో విధిగా బోధన • ప్రస్తుత సమావేశాల్లోనే ప్రత్యేక చట్టం

ఈ విద్యా సంవత్సరం నుంచే అమలుకు నిర్ణయం • విధివిధానాలపై సీఎం కేసీఆర్ సమీక్ష

2 లో



అంగుళం వదులుకోం

నెత్తుటి పోరుకైనా సిద్ధం

- మా భూభాగం కోసం యుద్ధానికి సై
- పార్లమెంట్ ముగింపు సమావేశాల్లో జిన్‌పింగ్

11 లో



హలో.. పర్మినెంట్ ప్రెసిడెంట్.. కంగ్రాట్స్

- ప్రధాని మోడీ

కవ్వించైనా యుద్ధోన్మాదం

ప్రత్యేక కథనం 11లో



మూడోసారీ! అవిశ్వాసంపై చర్చ ఇక అనుమానమే

తెరాస, అన్నాడీఎంకె ఎంపీల ఆందోళన • సభ ఆర్డర్లో లేదని స్పీకర్ ప్రకటన

10



వాయిదాల పర్వంపై అసంతృప్తి

ఎంపీల విందు రద్దు చేసిన ఉపరాష్ట్రపతి

10

పార్లమెంటులో పిల్లలాటా?


- మాది సామంత రాష్ట్రం కాదు
- కేసీఆర్‌కు ఎవరినైనా ఆడించే సత్తా ఉంది
- కేంద్రంపై విమర్శనాస్త్రాలు సంధించిన తెరాస ఎంపీలు

10 లో



పార్లమెంట్ వద్ద మంగళవారం తెరాస ఎంపీల ధర్నా

ఎస్సీ, ఎస్టీ చట్టం కేసుల్లో వెంటనే అరెస్టులు వద్దు



సుప్రీంకోర్టు స్పష్టీకరణ

7 లో

అరగంటకు పార్కింగ్ ఫ్రీ

ఏప్రిల్ 1నుంచి కొత్త పాలసీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి పట్టణ ప్రాంతాల్లోని వాణిజ్య సముదాయాల్లో నూతన పార్కింగ్ విధానం అమలుకానుంది. ఈ మేరకు రాష్ట్ర పురపాలక శాఖ విభాగం తగు విధి విధానాలను ఖరారు చేసింది. మొదటి అరగంట లోపు వాహనాలను నిలిపితే వారి నుంచి ఎలాంటి రుసుం వసూలు చేయవద్దని పేర్కొంటూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం తగు ఉత్తర్వులను జారీ చేసింది. అరగంట నుంచి గంటపాటు వాహనాలను నిలిపిన వారి విషయంలో రసీదు చూపి రుసుం వసూలు చేయాలని స్పష్టం చేసింది. కాగా రశీదు చూపని వారి నుంచి కూడా నిర్దేశిత పార్కింగ్ రుసుం వసూలు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కాగా అన్ని వాణిజ్య సముదాయాలు ఖచ్చితంగా పార్కింగ్ సదుపాయాలను కల్పించాలని కోరింది. దీంతో ఇప్పటి వరకు వాణిజ్య సముదాయాల వద్ద నెలకొన్న వాహనాల పార్కింగ్ సమస్యకు వెసులు బాటు లభించనుంది. పైగా వాహనదారులకు కూడా కొంత మేరకు రిలీఫ్ పొందనున్నారు. ఇప్పటి వరకు వాణిజ్య సముదాయాల్లోకి ఐదు నిమిషాల కోసం అడుగుపెట్టినా వాహనాల పార్కింగ్‌ను చెల్లించాల్సి వస్తోంది. దీని వల్ల చాలా మంది వాహనదారులు రోడ్డుపైనా, లేదా పుట్‌పాత్‌లపై పార్కింగ్ చేసి వెళ్ళేవారు. దీనివల్ల పాదాచారులతో పాటు వాహనదారులకు కూడా పలు సందర్భాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇక పండుగలు, సెలవులు రోజుల్లో అయితే వాణిజ్య సముదాయాల వద్ద పార్కింగ్ సమస్య మరింత వర్ణనాతీతంగా ఉంటుంది. దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట్, కూకట్‌పల్లి, హౌజింగ్ బోర్డు కాలనీ, అమీర్‌పేట్, సనత్‌నగర్, పంజగుట్ట, ఆబిడ్స్, కోఠి, సుల్తాన్‌బజార్, చార్మినార్, చాంద్రాయణగుట్ట, నాంపల్లి, తార్నాక, సికింద్రాబాద్, హబ్సిగూడ, ఉప్పల్, రామంతాపూర్ తదితర ప్రాంతాల్లోని వాణిజ్య సముదాయాల వద్ద పార్కింగ్ సమస్య నిత్యకృత్యంగామారుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ముఖ్య మైన పట్టణాలల్లో నూతన పార్కింగ్ విధానం తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పలుమార్లు సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని కూడా ఏర్పాటు చేసిన ⇨ 9వ పేజీలో...

స్వచ్ఛ భారత్‌లో ఇదేమి విషాదం?!



సెప్టిక్ ట్యాంకుల్లో మరణాలు • వ్యాక్యూమ్ క్లీనర్ యంత్రాలు అందుబాటులోకి తేవాలి




న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి: మానవ విసర్జితాల్ని మనుషులే చేతుల్తో తొలగించే అత్యంత బాధాకరమైన పారిశుధ్య కార్మిక వ్యవస్థను రద్దు చేయాలని మహాత్మాగాంధీ స్వాతంత్ర్యానికి పూర్వమే భారతజాతికి ఉద్బోధించారు. సాటిమనిషిని ఇందుకోసం వినియోగించుకోవడం నాగరిక సమాజంలో సభ్యతకాదంటూ ఆయన పదే పదే పేర్కొనేవారు. కాలగమనంలో అనేక సామాజిక మార్పులొచ్చాయి. నాగరికత పెరిగింది. సాంకేతికత అందుబాటులోకొచ్చింది. స్వచ్ఛత, పరిశుభ్రత పట్ల చైతన్యం వెల్లివిరిసింది. కానీ ఈ వ్యవస్థ మాత్రం ఇప్పటికీ ఇలాగే కొనసాగుతోంది. దీంతో పాటు ఈ వ్యవస్థలో పని చేసే కార్మికులకు ప్రమాదాలు పెరిగాయి. తరచూ ఎక్కడోచోట సెప్టిక్‌ట్యాంక్ శుభ్రపర్చేందుకు కిందకు దిగిన కార్మికులు విషవాయువులు వెలువడ్డంతో లోపలే ఊపిరాడక మరణించారన్న వార్తలు తరచూ వెల్లువెత్తుతున్నాయి. అప్పటికప్పుడు ప్రభుత్వాలు దీనిపై స్పందిస్తున్నాయి. అధికారులు నష్టపరిహారం ప్రకటిస్తున్నారు. ఆ తర్వాత మరణకారణాల్ని ఆరాతీసేందుకు కమిటీలేసి చేతులు దులుపుకుంటున్నారు. అయితే ఇప్పటికీ ఇలాంటి వ్యవస్థ కొనసాగడం పట్ల సభ్యసమాజంలో చైతన్యం మాత్రం రావడంలేదు. దీన్ని నిర్మూలించి ఇంతవరకు ఈ వ్యవస్థలో ఉన్న కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పనా అవకాశాలపై ప్రభుత్వాలు దృష్టిపెట్టడంలేదు.

ఈ మధ్య తరచూ తవ్వి వదిలేసిన బోరుబావుల్లో పడి పిల్లలు మృతి చెందుతున్నారు. అలాగే సెప్టిక్‌ట్యాంక్‌ల్ని శుభ్రపర్చేందుకు దిగి కార్మికులు మరణాలబారిన పడుతున్నారు. ఇప్పటికే ప్రత్యామ్నాయ సాంకేతిక విధానాలు అందుబాటులోకొచ్చినా ఆదిశగా జనాన్ని ప్రోత్సహించక పోవడమే ఇలాంటి ప్రమాదాలు తరచూ చోటు చేసుకోవడానికి ⇨ 3వ పేజీలో...

పోలవరానికి రూ. 1400 కోట్లు

- నాబార్డు రుణానికి కేంద్రం అనుమతి
- ఆర్థికశాఖ ఉత్తర్వులు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ప్రత్యేక హోదా సహా విభజన హామీల అమలు కోసం ఆంధ్రప్రదేశ్ ఎంపీలు పోరాడుతున్న వేళ, కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు కోసం రూ. 1,400 కోట్లు మంజూరు చేసింది. ఈ మొత్తం నిధులను నాబార్డు నుంచి రుణం రూపేణా పొందేందుకు అనుమతినిస్తూ కేంద్ర ఆర్థిక శాఖ ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేసింది. ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ. 1,795 కోట్లు రుణం మంజూరు చేయాల్సిందిగా కేంద్రాన్ని కోరింది. దీనిపై స్పందించిన కేంద్ర ప్రభుత్వం, నాబార్డు ద్వారా రూ. 1,400 కోట్లు మంజూరు చేసేందుకు అనుమతించింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ, కేంద్ర జల వనరుల ⇨ 3వ పేజీలో...



మిషన్ కాకతీయకు సహకరించని కేంద్రం

- రూ. 5 వేల కోట్లు ఇవ్వాలని నీతిఆయోగ్ సిఫారసు
- అయినా ఒక్క రూపాయి విడుదల కాలేదు
- ప్రాజెక్టుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు • శాసనమండలిలో మంత్రి హరీష్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మిషన్ కాకతీయ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం సహకరించడం లేదని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి హరీష్‌రావు అన్నారు. ఈ కార్యక్రమానికి రూ. 5వేల కోట్లు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి నీతి ఆయోగ్ సిఫారసు చేసిందన్నారు. కానీ కేంద్రం ఇప్పటి వరకు స్పందించలేదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, ఆర్థిక మంత్రి ⇨ 3వ పేజీలో...



ఇరాక్‌లో 39మంది భారత కార్మికుల కిడ్నాప్ విషాదాంతం



మృతుల కుటుంబీకులతో సుష్మా స్వరాజ్ (ఫైల్‌ఫోటో)

11

బందీలు బలయ్యారు

- ఐసిస్ ఉగ్రవాదుల చేతిలో హతం
- డీఎన్ఏ నమూనాలతో ధ్రువీకరణ
- రాజ్యసభలో సుష్మాస్వరాజ్ ప్రకటన



వ్యవసాయ వర్సిటీలో ఊరపిచ్చుకల చిత్ర ప్రదర్శన

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రపంచ ఊరపిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రదర్శన నిర్వహించారు. రకరకాల ఊరపిచ్చుకలను సేకరించి వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో ప్రదర్శనకు ఉంచారు. ఈ సందర్భంగా చిత్రప్రదర్శన కూడా నిర్వహించారు. టెక్నాలజీ అభివృద్ధి చెందిన తర్వాత ఊరపిచ్చులకు మనుగడ కరువైందని ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ అర్నిథాలజీ విభాగాధిపతి డాక్టర్ వాసుదేవరావు అన్నారు.

కోల్‌కతా చర్చలతో

ఖుషీ..ఖుషీ

(మొదటిపేజీ తరువాయి)

నుంచి మద్దతు వస్తోందని సాక్షాత్తూ సీఎం కేసీఆరే ప్రకటించిన సంగతి తెలిసిందే. కేసీఆర్ ప్రతిపాదనకు జెఎంఎం ఇప్పటికే జే కొట్టగా ఇదే బాటలో రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) కూడా ఉన్నట్లు తెలుస్తోంది. జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్, బీజీపీలకు ప్రత్యామ్నాయంగా కూటమి ఏర్పాటు ఆవశ్యకతపై గళమెత్తి సంచలనానికి తెరలేపిన కేసీఆర్ భవిష్యత్తులో చేయాల్సిన కార్యక్రమాలపై దృష్టిసారించినట్లు చెబుతున్నారు. కోల్‌కతా నుంచి సోమవారం రాత్రి తిరిగివచ్చిన కేసీఆర్ మంగళవారం నూతన ఫ్రంట్ ఏర్పాటు, రూపొందించాల్సిన ఎజెండాపై కొంతమంది నిష్ణాతులతో చర్చలు జరిపినట్లు సమాచారం. వీరిలో మాజీ కేంద్రమంత్రులు, ఆయా రాష్ట్రాల సభాపతులు, రాజ్యాంగ నిపుణులు, హైకోర్ట ు, సుప్రీంకోర్టులో పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులు, జాతీయస్థాయిలోని వివిధ విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాల్లో పనిచేసిన విశ్రాంత అధ్యాపకులు, ఉప కులపతులతో చర్చించినట్లు తెలుస్తోంది. వీరిలో



(ఫైల్)

కొంతమంది ఇప్పటికే ఫెడరల్ ఫ్రంట్ స్వరూపం ఎలా ఉంటే బాగుంటుందో అన్న అంశంపై నివేదికలు సిద్ధం చేసి పరిశీలన నిమిత్తం కేసీఆర్‌కు పంపించినట్లు సమాచారం. ఢిల్లీ వెళ్లనున్న కేసీఆర్ కూటమిలో చేరేందుకు కలిసివచ్చే పార్టీల నేతలతో చర్చలు జరపాలని భావిస్తున్నారు. జాతీయ రాజధాని ఢిల్లీలో ప్రత్యామ్నాయ కూటమి కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందుకు విశాలమైన భవనాన్ని అద్దె లేదా లీజు ప్రాతిపదికన తీసుకోవాలని ఢిల్లీ వెళ్లినప్పుడు ఈ భవనంలోనే బస చేసి జాతీయస్థాయి నేతలతో సమావేశాలను నిర్వహించేందుకు వీలుగా మౌలిక సదుపాయాలు, వసతి సౌకర్యాలు ఉండేలా చూడాలని.. ఆ తరహా భవనాన్ని ఎంపిక చేయాలని కేసీఆర్ ఇప్పటికే ఢిల్లీలోని పార్టీ పెద్దలను కోరినట్లు సమాచారం. ఢిల్లీ వెళ్లనున్న కేసీఆర్ వారం పదిరోజుల పాటు అక్కడే ఉండి జాతీయస్థాయి నేతలతో వరుస భేటీలు నిర్వహించాలన్నది ఆయన ఆలోచనగా తెలుస్తోంది. ఈ నెల 27న శాసనసభ బడ్జెట్ సమావేశాలు ముగియనుండటంతో ఏప్రిల్ మొదటివారంలో ఢిల్లీ వెళితే ఎలా ఉంటుందన్న అంశంపై ఆయన మంతనాలు జరుపుతున్నారు. జాతీయ ఎజెండాను రూపొందించి.. ఇందుకు కలిసివచ్చే పార్టీల నేతల అభిప్రాయాలను పరిగణనలోనికి తీసుకుని ఎజెండాకు తుదిరూపం ఇవ్వాలని కేసీఆర్ సంకల్పిస్తున్నట్ల ు సమాచారం. కేసీఆర్ ప్రారంభించాలని నిర్ణయించిన తృతీయ ప్రత్యామ్నాయానికి ఆర్జేడీ కూడా మద్దతు ప్రకటించింది. లాలూ ప్రసాద్ యాదవ్‌కు చెందిన ఆర్జేడీ నేత శివానంద తివారీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు కేసీఆర్ తన ప్రాణాన్ని పణంగా పెట్టారని, ఇటువంటి నాయక ుడు ఏర్పాటు చేసే జాతీయస్థాయి ఫ్రంట్‌ను ఎవరైనా సమర్థించక తప్పదని పేర్కొన్నారు. తమ పార్టీ కూడా కేసీఆర్ ప్రకటనను స్వాగతిస్తోందని చెప్పిన విషయం విదితమే. తమిళనాడులోని డీఎంకే, సమాజ్‌వాది పార్టీతో పాటు బీజేపీపై గుర్రుగా ఉన్న శివసేనతో కూడా కేసీఆర్ మంతనాలు జరుపు తున్నట్లు తెలుస్తోంది.

టెన్త్‌దాకా తెలుగు కంపల్సరీ

- ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రత్యేక చట్టం
- తమిళనాడు విధానం అమలుపై అధ్యయనం పూర్తి
- విధివిధానాల రూపకల్పనపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి వరకు మాతృభాష తెలుగును తప్పనిసరిగా ఒక సబ్జెక్టుగా బోధించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఆదేశించారు. ఈ విధానం అమలు చేయడం కోసం ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే చట్టం తెస్తున్నట్లు వెల్లడించారు. మాతృభాష బోధన అమలుకు సంబంధించిన తమిళనాడులోని విధానాన్ని అధ్యయనం చేయడానికి వెళ్ళివచ్చిన అధికారులతో కేసీఆర్ మంగళవారం ప్రగతి భవన్‌లో సమావేశమయ్యారు. తెలుగును ఒక సబ్జెక్టుగా బోధించడం కోసం రూపొందించాల్సిన విధి విధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాతృభాష తెలుగును రక్షించుకోవడం, మన సంస్కృతిని కాపాడుకోవడం లక్ష్యంగా తెలంగాణలోని అన్ని విద్యాసంస్థల్లో తెలుగును ఒక ప్రత్యేక సబ్జెక్టుగా బోధించాలని నిర్ణయించామన్నారు. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ఇంగ్లీషు మీడియంలో చదవడం అందరికీ అనివార్యమవుతుందన్నారు.

అంతర్జాతీయ భాష ఆంగ్లం అవశ్యమైనప్పటికీ విద్యార్థుల భవిష్యత్తును కూడా దృష్టిలో పెట్టుకుని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదే క్రమంలో తెలుగు భాష కనుమరుగు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అధికారులకు గుర్తు చేశారు. అందుకే ఇంగ్లీషు మీడియంలో చదివే విద్యార్థులు కూడా తెలుగు భాష



నేర్చుకోవాలనే నిబంధన పెడుతున్నామని, అది త్వరలో ప్రారంభమయ్యే విద్యా సంవత్సరం నుంచే అమల్లోకి వస్తుందని కేసీఆర్ స్పష్టం చేశారు. మొదట ఇంటర్మీడియట్ వరకు తెలుగును తప్పనిసరి చేయాలని భావించామన్నారు. అయితే ఇంటర్మీడియట్ విద్య అన్ని విద్యాసంస్థల్లో ఒకే మాదిరిగా లేనందున తెలుగును అమలు చేయడం కాస్త ఇబ్బందిగా మారుతుందన్నారు. తమిళనాడు, పంజాబ్ తదితర రాష్ట్రాల్లో మాతృభాష బోధన అమలును పరిశీలించిన అనంతరం మొదటి దశలో 10వ తరగతి వరకు తెలంగాణలో తెలుగును తప్పనిసరిగా సబ్జెక్టుగా బోధించాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు.

తరగతుల వారీగా తెలుగులో బోధించాల్సిన అంశాలకు సంబంధించి సిలబస్ రూపొందించాల్సిందిగా తెలుగు యూనివర్సిటీ సాహిత్య అకాడమీలను సీఎం కోరారు. భాషను కాపాడుకోవడంతో పాటు మాతృభాష ద్వారా జీవితంలో ఉపయోగపడే విషయాలను విద్యార్థులకు బోధించాలని చెప్పారు. విద్యార్థుల్లో నైతిక విలువలు, దేశభక్తిని పెంచే అంశాలు ఉండాలని వివరించారు. తెలుగు చదివే పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉండడం కోసం అవసరమైన చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. ప్రైవేట్ పాఠశాలల్లో కూడా తప్పనిసరిగా ఒక తెలుగు పండిట్ ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను సీఎం ఆదేశించారు.

ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు కేటీ రామారావు, జూపల్లి కృష్ణారావు, పద్మారావు, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజీవ్ రంజీవ్ ఆచార్య, సాంస్కృతికశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, పాఠశాల విద్యా డైరెక్టర్ జి.కిషన్, సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి, కార్యదర్శి ఏనుగు నర్సింహారెడ్డి, తెలుగు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఎస్‌వి సత్యనారాయణ, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు, ఎస్‌ఈఆర్‌టి అధికారి సువర్ణ వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో తెలుగు తప్పనిసరి

- నిర్ణయంపై ప్రభుత్వం వెనక్కి
- ఏబీవీపీ హర్షం

ఇంటర్‌లో తెలుగు తప్పనిసరి అన్న నిర్ణయాన్ని సీఎం కేసీఆర్ వెనక్కి తీసుకోవడం వలన గందరగోళంలో ఉన్న 5 లక్షల మంది విద్యార్థులకు ఊరట లభించిందని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఎల్.అయ్యప్ప, జాతీయ కార్యసమితి సభ్యులు రాఘవేందర్‌లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రస్తుతం తీసుకున్న నిర్ణయం సముచితంగా ఉందని వారు తెలిపారు. సంస్కృతం, హిందీ, అరబిక్, ఫ్రెంచీ లెక్చరర్ల స్పాట్ వాల్యుయేషన్ విధులకు హాజరు అవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. భవిష్య త్తులో ఇలాంటి విషయాల్లో ప్రభుత్వం విద్యావేత్తల సలహాలు తీసుకోవా లని వారు కోరారు. తెలుగు భాష పరిరక్షణను ప్రోత్సహిం చడం కోసం ప్రభుత్వం ఏ నిర్ణయం తీసు కున్నా దానిని ఏబీవీపీ సమర్ధిస్తుందన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాల యాల వ్యవహారాలు తెలుగులో లేకపోవడంతో అనేక సమస్యలు ఎదుర్కొం టున్నందున వాటిని తెలుగు లో జరిగే విధంగా ప్రోత్సహించాలని వారు డిమాండ్ చేశారు.

బంగారు భారత్ వైపు కేసీఆర్ అడుగులు

తెరాస ఎన్నారై విభాగం సమన్వయకర్త మహేష్ బిగాల

హైదరాబాద్, ఆంధ్రప్రభ: బంగారుభారత్ కోసమే కెసిఆర్ తపన పడుతున్నారని, ఆయన అడుగులు భావితరాలకు మార్గదర్శకం కావాలని టిఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం సమన్వయకర్త మహేష్ బిగాల అన్నారు. సిడ్నీలో టిఆర్ఎస్ ఆస్ట్రేలియా విభాగం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆయన కెసిఆర్ ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుకు నడుం బిగించడం, మమతాబెనర్జీతో భేటీ కావడం హర్షదాయకమన్నారు. ఆస్ట్రేలియా ఉపాధ్యక్షుడు రాజేష్ రాపోలు మాట్లాడుతూ తెలంగాణ బడ్జెట్‌పై ప్రవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్ఆర్ఐ శాఖకు చరిత్రలో ఎవరూ కేటాయించని విధంగా రూ.100కోట్లు కేటాయించారన్నారు. గల్ఫ్ బాధితుల పట్ల కెటిఆర్, కవిత మానవీయ కోణంలో ఎప్పటికపుడు స్పందిస్తున్నారన్నారు. సమావేశంలో విక్రమ్ కటికనేని, జస్వంత్, రవి ధూపాటి, పరశురాం, ముటుకుల్లా, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రాచకొండ లిఫ్ట్ ఇరిగేషన్ సర్వేకు రూ.1.72 కోట్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాచకొండ ఎత్తిపోతల పథకం సర్వే పనులకు రూ.1.72కోట్లు మంజూరుచేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. సుదీర్ఘకాలంగా సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రాచకొండ పరిధిలోని ప్రజలకు లిఫ్ట్ పథకం సర్వే పనులకు జీవో జారీచేయడం గొప్ప ఊరట అని ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగే సర్వే పనులు త్వరితగతిన పూర్తయి రాచకొండ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కల సాకారమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జీవో విడుదలకు కృషిచేసిన నీటిపారుదల శాఖా మంత్రి హరీష్‌రావు, విద్యుత్ శాఖా మంత్రి జగదీష్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నీటి విడుదలకు కృష్ణాబోర్డు ఉత్తర్వులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రా లకు నీటి విడుదల ఉత్తర్వులను కృష్ణానది యజమాన్య బోర్డు మంగళవారం జారీ చేసింది. మే నెలాఖరు వరకు తాగునీటి అవసరాల కోసం నీటి విడుదలకు అనుమతిచ్చింది. ఈ మేరకు శ్రీశైలం ద్వారా ఇరు రాష్ట్రా లు చెరో టీఎంసీ నీటిని వినియోగించుకునేందుకు అవకాశం కల్పించింది. అలాగే నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి తెలంగాణ రాష్ట్రా నికి 16 టీఎంసీల నీరు, ఆంధ్రప్రదేశ్‌కు 15 టీఎంసీల నీటికీ అనుమతి ఇచ్చింది. ఇరు రాష్ట్రా ల్లో రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని కృష్ణానది యజమాన్య బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది.

రాహుల్ స్పీచ్ స్ఫూర్తి.. గోవా చీఫ్ రాజీనామా

న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీలో యువతకు పెద్ద పీట వేయడంలో భాగంగా సీనియర్లు పదవుల నుంచి తప్పుకోవాలంటూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చేసిన ప్రసంగం నాయకులపై ప్రభావంచూపినట్లు కనిపిస్తోంది. రాహుల్ ప్రసంగాన్ని స్ఫూర్తిగా తీసుకుని గోవా కాంగ్రెస్ అధ్యక్షుడు శాంతారామ్ నాయక్ తన పదవికి రాజీనామా చేశారు. ఆదివారం ప్లీనర్ సమావేశంలో రాహుల్ ప్రసంగిస్తూ.. 'కాంగ్రెస్‌లో యువ రక్తానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని.. అవసరమైతే సీనియర్లు స్వచ్ఛందంగా త్యాగాలు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు . ఆ ప్రసంగానికి ఆకర్షితుడినయ్యే తాను పదవికి రాజీనామా చేస్తున్నట్లు శాంతారామ్(72) చెప్పారు. తన రాజీనామా లేఖను నేరుగా రాహుల్ గాంధీకే పంపుతాన్నారు.మరోవెపు గుజరాత్ పార్టీ చీఫ్ భరత్‌సిన్హాసోలంకి కూడా తన పదవికి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

రాజ్యసభ పోలింగ్‌పై తెరాస దృష్టి

- తెలంగాణ భవన్‌లో మాక్ పోలింగ్
- పొరపాట్లు జరగకుండా ముందు జాగ్రత్తలు
- మూడు గ్రూపులుగా ఎమ్మెల్యేల విభజన
- మంత్రులకు బాధ్యతలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో.. టిఆర్ఎస్ ముందు జాగ్రత్తలు తీసుకుంటోంది. మూడు సీట్లు సునాయాసంగా గెలుచుకునే బలమున్నా.. ఎలాంటి పొరపాట్లకు, గ్రహపాట్లకు తావివ్వకూడదన్న ఉద్దేశ్యంతో మాక్‌పోలింగ్ నిర్వహిస్తోంది. రాజ్యసభ ఎన్నికలలో ఓటింగ్ పై ఎమ్మెల్యేలకు అవగాహన కల్పించేందుకు తెలంగాణభవన్‌లో మంగళవారం సాయంత్రం టిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యేలంతా హాజరయ్యారు. ఉపముఖ్యమంత్రి కడియంశ్రీహరి, మంత్రులు హరీష్ రావు, కెటిఆర్, ఈటలరాజేందర్, తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మాక్ పోలింగ్ కార్యక్రమం జరగ్గా.. ఎమ్మెల్యేలంతా హాజరయ్యారు. తెలంగాణలో మూడు స్థానాలకు ఎన్నిక జరుగుతుండగా.. మూడింటినీ గెలుచుకునే సామర్థ్యం టిఆర్ఎస్‌కు ఉంది. టిఆర్ఎస్ అభ్యర్థులుగా బండప్రకాష్, బడుగుల లింగయ్యయాదవ్, సంతోష్‌కుమార్ జోగినిపల్లిలు అభ్యర్థులుగా ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పి.బలరాంనాయక్ పోటీ చేస్తున్నారు. ఏకగ్రీవంగా ఎన్నిక జరుగుతుందని భావించినా.. అనూహ్యంగా కాంగ్రెస్ బరిలో నిలవడంతో ఎన్నిక అనివార్యమైంది. గత ఎన్నికల్లో టిఆర్ఎస్ 63స్థానాలు గెలుచుకోగా, ఆ తర్వాత ఉప ఎన్నికల్లో రెండుస్థానాలు గెలుచుకుంది. ఇతర పార్టీల నుండి



25మంది ఎమ్మెల్యేలు టిఆర్ఎస్‌లో చేరారు. దీంతో మొత్తం బలం 90గా ఉండగా, ఎంఐఎం కూడా మద్దతిస్తుండడంతో బలం 97కు పెరిగింది. కాంగ్రెస్‌కు 13మంది సభ్యులుండగా.. ఇద్దరిపై అనర్హత వేటువేసినట్లు ప్రభుత్వం గెజిట్ జారీచేసింది. వీరికి ఓటింగ్ అర్హతపై ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. బిజెపికి ఐదుగురు, సిపిఎంకు ఒక ఎమ్మెల్యే ఉండగా.. వీరు ఎన్నికకు దూరంగా ఉండనున్నారు. టిడిపి కూడా తటస్థవైఖరి అవలంభించాలని యోచిస్తోంది. గత ఎన్నికల్లో ఒకరిద్దరు ఎమ్మెల్యేలు పొరపాటుగా ఓటేయగా, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని టిఆర్ఎస్ ఒక్కో అభ్యర్థికి 32మంది ఎమ్మెల్యేలను కేటాయించింది. మొత్తం ఎమ్మెల్యేలను మూడు గ్రూపులుగా విభజించి ఒక్కో గ్రూపు ఒక్కో అభ్యర్థికి ఓటేసేలా వ్యూహం ఖరారుచేశారు.

గ్రూపులవారీగా బాధ్యతలు..

సంతోష్‌కుమార్‌కు కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల ఎమ్మెల్యేలను కేటాయించారు. ఈ గ్రూపుకు మంత్రులు కెటిఆర్, ఈటల రాజేందర్‌లు ఇన్‌ఛార్జిలుగా వ్యవహరించనున్నారు. బండప్రకాష్‌కు వరంగల్, మెదక్, ఖమ్మం జిల్లాల ఎమ్మెల్యేలను కేటాయించారు. ఈ గ్రూపుకు ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రి తుమ్మలనాగేశ్వరరావులు ఇన్‌ఛార్జిలుగా వ్యవహరిస్తారు.

బడుగులింగయ్యయాదవ్‌కు నల్లగొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఎమ్మెల్యేలను కేటాయించారు. ఈ గ్రూపుకు మంత్రులు హరీష్‌రావు, జగదీష్‌రెడ్డిలు బాధ్యతలు తీసుకుంటున్నారు. పార్టీ నుండి ముగ్గురు అభ్యర్థులు బరిలో ఉన్నందున మూడు ప్రాధాన్య ఓట్లను ఎలా వేయాలో మంగళవారం ఎమ్మెల్యేలకు వివరించారు. బుధవారం, గురువారం కూడా టిఆర్ఎస్ఎల్పీలోనే ఈ మాక్‌పోలింగ్ నిర్వహించాలని నిర్ణయించారు.



హోదా అవసరమే

- ఆర్థిక సాయం ఒక్కటే సరిపోతుందని అనలేదు
- నా మాటలు వక్రీకరించారు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర విభజన చట్టంలోని హామీ మేరకు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ డిమాండ్ చేశారు. ఈ సున్నితమైన సమయంలో విభజన హామీలపై వక్రీ కరించవద్దని, తప్పుగా చిత్రీకరిస్తూ అభిప్రాయాలు వెల్ల డించవద్దని ఆయన కోరారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీ లను కేంద్ర ప్రభుత్వం అన్నింటిని అమలు చేయాలని, అలా గే రాష్ట్ర అవసరాలను తీర్చాలని పవన్ కళ్యాణ్ డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా, రాష్ట్రానికి నిధులు ఇచ్చే అంశంపై తన వ్యాఖ్యలను వక్రీకరించారని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రజలు, జనసేన పార్టీ సభ్యులు దీన్ని అర్థం చేసుకుని స్పష్టమైన వైఖరితో ఉన్నారని ఆయన అన్నారు. టెలి విజన్ ఛానల్‌కు తాను ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రత్యేక హోదా పై తన వ్యాఖ్యలను కొన్ని పత్రికలు, మీడియా ఛానల్స్ వక్రీకరించాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రానికి ఆర్థిక సాయం ఒక్కటే సరిపోతుందని తాను అనలేదని ఆయన వివరణ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాతో పాటు ఆర్థికసా యం కూడా అవసరమని పవన్ పునరుద్ఘాటించారు.

అప్పు తప్పు కానే కాదు

(మొదటిపేజీ తరువాయి)

మాత్రమే అప్పులు ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వ ఉదయ్ పథకంతో రూ.9వేల కోట్ల అప్పు మనమీద పడ్డదని స్పష్టం చేశారు. అది లేకపోతే తెలంగాణ అప్పు 19శాతానికి మించదని తెలిపారు. చాలా దేశాల్లో జీడీపీ కంటే అప్పులే ఎక్కువగా ఉన్నాయి... యూఎస్ఏ 14 ట్రిలి యన్ డాలర్ల అప్పుచేస్తే, జపాన్ అప్పు ఆ దేశ జీడీపికంటే 300 శాతం ఎక్కువని చెప్పారు. పదేళ్లలో అప్పటి ప్రభుత్వాలు ఖర్చు చేసిన క్యాపిటల్ వ్యయం తాము నాలుగేళ్లలో చేశా మని గుర్తు చేశారు. విపక్షాలకు రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు కన్పించడం లేదా... రూ.1000 పెన్షన్ బీజేపి పాలిత రాష్ట్రాల్లో ఇస్తు న్నారా... అంతా వక్రమేనా... 22 శాతం వృద్ధి రేటుతో దేశంలో తెలంగాణ నెంబర్-1గా ఉంది. చిన్నచిన్న పొరపాట్లు జరిగితే రైతు రుణమాఫీ జరలేదనడం సరికాదు...కేంద్ర ప్రభుత్వ ఉద్యో గులకంటే రాష్ట్రంలో ఉద్యోగులకు వేతనాలు అధికంగా ఉన్నాయి...మా కేసీఆర్ కిట్లను చూసిన మధ్య ప్రదేశ్ సృజన్ సే విజర్జన్ తక్ అనే పథకాన్ని ప్రవేశపెడుతోంది...ఇది మన ఘనత...ఇతర



రాష్ట్రాలు గుర్తిస్తుంటే మీకు కళ్లకు కన్పించడంలేదు అని విమర్శించారు. వెల్‌పెయిడ్ ఉద్యోగులు మన రాష్ట్రంలో ఉన్నారు... ఎఆర్‌సి తప్పక వేస్తాం...ఇంకా టైం రాలేదు... బడ్జెట్లో నిధులు కేటాయించాం..కొత్త రాష్ట్రం...శాపాలు మంచివి కావు...మీకు దీంతో మైలేజీ రాదు అని హితవు పలికారు.

రుణమాఫీ విజయవంతం...

99శాతం రుణమాఫీ క్లీయర్‌గా జరిగింది. ఎక్కడైనా చిన్నచిన్న పొరపాట్లు ఉంటే ఉండొచ్చు... ఇంకా రూ. 100, రూ. 50 కోట్లు ఇచ్చేందుకు సిద్ధం.. ఎక్కడైనా స్పెసిఫిక్‌గా ఉంటే మాకు పంపండి... కన్సిడర్ చేస్తాం...రూ.17వేలకోట్లు మాఫీ చేశాం... వందకు వంద శాతం అన్నీ క్లీయర్ చేస్తాం...మై స్టాండ్ వెరీ క్లీయర్...నో డిబేట్ అంటూ రైతు రుణమాఫీపై నిక్కచ్చిగా ఉంటానని సభలో పేర్కొన్నారు.

ఏమీ చేయలేదన్న మాటలు బాధాకరం...

టీఆర్ఎస్ ప్రభుత్వం ఏమీ చేయడం లేదన్నట్లుగా విపక్షాలు మాట్లాడ్డం బాగో లేదు.. ఇది బాధాకరమని అన్నారు. 38లక్షల మంది రైతుల్లో ఆనందం ఉంది...ఎక్కడో ఒకటి పట్టుకొని సభా గౌరవాన్ని పాడు చేయొద్దు...కొత్త రాష్ట్రంలో ద్వేషాలు వద్దు...ప్రతీ ఒక్కరూ సభా సంప్రదాయాలను కాపాడాలి..తిమ్మిని బమ్మిని చేస్తామంటే కుదరదు...ఇసుకమీద కాంగ్రెస్ ప్రభుత్వం 10శాతం కూడా ఆదాయం తేలేదు...మేం 100 శాతం తెచ్చాం..మాఫియా ఎవరు..? అని సీఎం ప్రశ్నించారు.

అసెంబ్లీకి 'అసైన్డ్ ల్యాండ్స్' బిల్లు

- రాజకీయ జోక్యం లేకుండా సర్కారు చర్యలు
- ఉచితంగా యాజమాన్య హక్కుల మార్పు
- కలెక్టర్లే కీలకం.. వారికే అధికారం

ఆంధ్రప్రభ, హైదరాబాద్: అసైన్డ్‌భూముల క్రమబద్ధీకరణకు అనువుగా మంగళవారం శాసన సభలో సవరణ బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అసైన్డ్‌భూములను కొను గోలు చేసి సాగుచేసు కుంటున్నవారికి, ఆక్రమించిన వారికి ప్రయోజనం కలిగించేలా క్రమబద్ధీకరణకు వీలుగా గడువు తేదీని గతేడాది డిసెంబర్ 31కి మార్చుతూ ఈ సవరణ బిల్లును ఆమోదించనున్నారు. అసైన్డ్‌భూ ముల పునః కేటాయింపు నియోజకవర్గ ఎమ్మెల్యే అధ్య క్షతన ఉన్న కమిటీకి బదులుగా కలెక్టర్లకు అధికారం ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. తద్వారా చేతులు మారిన 2.41 లక్షల ఎకరాలను తిరిగి అసైన్డ్ చేయనుంది. మొత్తం 20.01 లక్షల ఎకరాల భూమి అసలైన లబ్దిదారుల చేతుల్లో ఉంది. దాదాపు 84 వేల మంది ఆక్రమణలకు పాల్పడినట్లుగా తాజా సర్వేలో తేలింది. తెలంగాణ అసైన్డ్‌భూములు(బదలీ నిషేదిత పీఓటి చట్టం)1977ను సవరించేందుకు 2008నాటికి ముందు మాత్రమే అవకాశం ఉంది. తెలంగాణ అసైన్డ్‌ల్యాండ్ (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్) పీఓటి చట్టం-1977లోని సెక్షన్ 4ప్రకారం క్రమబద్ధీకరించేందుకు ప్రయత్నాలు ఆరంభిం చింది. ఇందు లో భాగంగానే తెలంగాణ అసైన్డ్ ల్యాండ్స్ (పీఓటి) సవరణ చట్టం -2018ను శాసనసభలో ప్రవేశపెట్టింది తెలంగాణ ప్రభుత్వం. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో 22,63,139ఎకరాల అసైన్డ్‌భూమి 15.83లక్షల మంది వద్ద ఉంది. 1,85,101 ఎకరాలతో అసిఫాబాద్ మొదటి స్థానంలో ఉండగా, భద్రాద్రి కొత్తగూడెంలో 1,66,557 ఎకరాలు, నల్గొండలో 1,38, 686 ఎకరాలు, కామారెడ్డిలో 1,33,157 ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని గుర్తించారు. బీసీ సామాజిక వర్గంలో 6లక్షల 33 వేల451 మందికి 8లక్షల 14వేల 8ఎకరాలు పంపిణీ అయి నట్లుగా తేల్చారు. ఎస్సీలకు 5,75,497ఎకరాలు, ఎస్టీలు 6,72, 959 ఎకరాలు, ఓసీలు 1,46,102 ఎకరాలు, మైనార్టీ లకు 54565 ఎకరాలను పంపిణీ చేసినట్లుగా రికార్డులు



ధ్రువీకరిస్తున్నాయి. భూములు అన్యా క్రాంతం కాకుండా కాపాడేందుకు ఉమ్మడి రాష్ట్రంలో 1977లో అసైన్డ్‌భూముల బదలాయింపు నిషేద చట్టం(పీఓటి 77) నుఅమలులోకి తెచ్చింది.

అన్యాక్రాంతం...

రాష్ట్రవ్యాప్తంగా 22,63,139 ఎకరాల భూమిని పేదలకు ఆయా ప్రభుత్వాలు అసైన్ చేశాయి. 15.83 లక్షల మంది నిరుపేదలకు వీటిని పంపిణీ చేసినా అవి వారి చేతిలో లేవని తాజాగా ప్రభుత్వం గుర్తించింది. సమాచారం మేరకు 98 వేల అసైన్డ్ భూములు ఇత రుల చేతుల్లోకి చేరినట్లుగా గుర్తించారు. పట్టా ఒకరి పేరుతో ఉండగా పొజిషన్‌లో మరొకరు ఉండటం, కొందరి భూములు నాలుగైదు చేతులు మారడం, కొం దరి భూములు వివాదాల్లో ఉండటం, కోర్టు పరిధిల్లో పేరుకుపోవడం వంటి సమస్యలు నెల కొన్నా యి. వీటిని పీఓటి చట్టం ప్రకారం ఏకపక్షంగా రద్దు చేసే అవ కాశం ప్రభుత్వానికి ఉంది. ఎవరికీ ఇబ్బంది లేని రీతి లో సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వం నిర్ణ యిం చింది. పొజిషన్‌లో ఎన్నేళ్లుగా ఉంటున్నారు...ఆయా భూముల్లో పాగా వేసిన వారి ఆర్థిక సామాజిక స్థితి గతుల ఆధారంగా క్రమబద్ధీకరించనున్నారు. ఇందు కు కలెక్టర్లకు అధికారాలను అప్పగించింది ప్రభుత్వం.

స్వచ్ఛ భారత్‌లో ఇదేమి విషాదం?!

(మొదటిపేజీ తరువాయి)



కారణంగా పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. మోడి అధికారంలోకొచ్చాక స్వచ్ఛతకు అగ్రప్రాధాన్యతనిచ్చారు. సాక్షాత్తు మహాత్ముడి జయంతి రోజున స్వచ్ఛభారత్ ఆవశ్యకతను దేశ ప్రజలకు వివరించారు. దేశవ్యాప్తంగా స్వచ్ఛత, పరిశుభ్రత కోసం ప్రభుత్వమే పెద్దెత్తున ఉద్యమిం చింది. అన్ని రాష్ట్రాల్ని ఇందులో భాగస్తుల్ని చేసింది. అన్ని వర్గాలకు ఈ బాధ్యతల్ని అప్పగించింది. ప్రజల్లో ఈ దిశగా చైతన్యం తెచ్చే కార్యక్రమాలు అమలు చేసింది. ప్రధాని మోడి నుంచి గ్రామసర్పంచ్ వరకు చీపుళ్ళతో రోడ్లు ఊడ్చారు. దేశ ప్రధాని నుంచి గ్రామ రెవెన్యూ కార్యదర్శి వరకు వీధుల్లోకొచ్చి పరిశుభ్ర విధానాల్లో భాగస్తులయ్యారు. ఈ పథకాన్ని క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేసేందుకు ప్రత్యేకంగా స్వచ్ఛ భారత్ మిషన్ ఏర్పాటు చేసారు. దీని ద్వారా వేలకోట్లు వ్యయం చేశారు. అయితే ప్రభుత్వం స్వచ్ఛతపై ఇంతపెద్దగా కార్య క్రమాల్ని నిర్వహించినా, భారీ ప్రచారం చేపట్టినా సెప్టిక్‌ట్యాంక్ మరణాలు మాత్రం ఆగలేదు. ఇందుక్కారణం ప్రభుత్వ యంత్రాంగాల ఆలోచనల్లో లోపమేనని విశ్లేషిస్తున్నారు. ఒకప్పుడు మానవ విసర్జితాల్ని ట్యాంకుల్నుంచి చేతుల్తోనే తీసి తరలించాల్సిన పరిస్థితుండేది. కానీ వ్యాక్యూమ్ క్లీనర్లతో కూడిన వాహనాలు అందుబాటులోకొచ్చాయి. ఇప్పుడు దేశవ్యాప్తంగా ఇదో పెద్ద వ్యాపారంగా మారింది. ప్రైవేటు పెట్టుబడిదార్లు ఈ వాహనాల్ని కొనుగోలు చేసి ప్రజలకు సెప్టిక్‌ట్యాంక్‌ల్ని పరిశుభ్రపర్చే సేవలం దిస్తున్నారు. అయితే ఇదిప్పుడు పూర్తిగా వ్యాపార దృక్పథం తోనే సాగుతోంది. వారి డిమాండ్ చేసిన మేరకు చెల్లించగలిగే ఇళ్ళ యజమానులు మాత్రమే ఈ సేవల్ని వినియోగించు కుంటున్నారు. సాదాసీదా కుటుంబీకులింకా పాతపద్ధతుల్లోనే మనుషుల్ని దింపి శుభ్రంచేయించు కుంటున్నారు. వాస్తవానికి ఈ వాహనాల కొనుగోలు భారీ ఆర్థిక వ్యవహారం కాదు. నగర పాలక సంస్థలు, పురపాలక సంఘాలేకాదు.. పంచాయతీలు కూడా ఈ వాహనాల్ని కొనుగోలు చేసి నిర్వహించుకోగలిగే సామర్ధ్యాన్ని కలిగున్నాయి. వాటిని అందరికీ అందుబాటు లోకి తేవడం ద్వారా యంత్రాల సాయం తో వ్యాక్యూమ్ క్లీనర్లతో సెప్టిక్‌ట్యాంక్‌లను పరిశుభ్రపర్చే అవకాశం అందుబాటులోకొస్తుంది. ఈ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. స్వచ్ఛభారత్ మిషన్ ఏర్పాటు తర్వాత కేంద్రం ప్రతి కొనుగోలుపైన స్వచ్ఛభారత్ సెస్‌ను వసూలు చేస్తోంది. ఇలా ఏటా వందలు, వేల కోట్లు వసూలౌతోంది. ఈ మొత్తాన్ని ఎందుకు వ్యయం చేస్తుందో ఆరాలేదు. కనీసం ఈ మొత్తాన్ని ఈ వాహనాల కొనుగోలుకైనా మళ్ళిస్తే ఆశించిన ఫలితం నెరవేరుతుంది. అప్పుడే ట్యాంక్‌ల్లో దిగి విషవాయువుల బారిన పడి జరుగుతున్న మరణాలు నిల్చిపోతాయి. స్వచ్ఛత పేరిట ఇంటింటికి మరుగుదొడ్డిని తప్పనిసరి చేశారు. ఇందుకోసం వేలకోట్లు ప్రభుత్వం వ్యయం చేస్తోంది. నూరుశాతం సబ్సిడీలిచ్చి వీటి నిర్మాణాల్ని ప్రోత్సహిస్తోంది. అంతమాత్రాన సరిపోదు. వాటిని శుభ్రం చేసే యంత్రాంగాన్ని కూడా అభివృద్ధిపర్చి అందుబాటులోకి తేవాలి. లేనిపక్షంలో స్వచ్ఛభారత్ కేవలం ప్రచారానికి మాత్రమే పరిమితమైన పథకంగా చరిత్రలో మిగిలిపోతుందని పరిశీలకులు పేర్కొంటున్నారు.

మిషన్ కాకతీయకు సహకరించని కేంద్రం



(మొదటిపేజీ తరువాయి)

ఈటెల రాజేందర్‌తో పాటు తాను కూడా పలుమార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం లేదన్నారు. కేంద్ర సహకారం లేకపోయినప్పటికీ మిషన్ కాకతీయకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు లభించాయన్నారు.

మంగళవారం శాసనమండలిలో సభ్యులు పాతూరి సుధాకర్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్ తదితరులు అడిగిన ప్రశ్నలపై మంత్రి హరీష్‌రావు సమాధానమిస్తూ,మిషన్ కాకతీయ కార్యక్రమం వల్ల అద్భుతమైన ఫలితాలు వస్తున్నాయన్నారు. చెరువుల పునరుద్దరణ కారణంగా కృష్ణాబేసిన్‌లో 89 టిఎంసీలు, గోదావరి బేసిన్‌లో 165 టిఎంసీల సామర్ధ్యం పెరిగిందని మంత్రి హరీష్‌రావు తెలిపారు. దీని కారణంగానే దేశ, విదేశాల నుంచి మిషన్ కాకతీయకు ప్రశంసలు లభిస్తున్నా యన్నారు. మహరాష్ట్ర, పాండిచ్చేరి రాష్ట్రా లలో కూడా మిషన్‌కాకతీయ అమలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం అమలు తీరును శాస్త్రీయంగా అధ్యయనం చేసిన నాబార్డుకు చెందిన నాబ్కాన్ నివేదికను ప్రభుత్వానికి సమర్పిం చినట్లు హరీష్‌రావు చెప్పారు. మిషన్ కాకతీయ మొదటి దశలో ఎంపిక చేసిన చెరువులున్న గ్రామాల్లో చెరువు ల కింద ఆయుకట్టు రైతాంగ కుటుంబాల్లో సర్వే వారితో చర్చలు, ఉపగ్రహ చిత్రాల పరిశీలన, విశ్లేషణ, కొన్ని చెరువులపై కేస్‌స్టడీ ఇతరత్రా లభ్యమయ్యే సమాచారం ఆధారంగా మిషన్ కాకతీయ ప్రభావాలను ఆ సంస్థ అధ్యయనం చేసినట్లు మంత్రి తెలిపారు. 400 చెరువుల గ్రామాల్లో 12వేల కుటుంబాలను నాబ్‌కాన్ సర్వే కోసం ఎంపిక చేసిందన్నారు. 2016 ఖరీఫ్‌లో వర్షపాతం ఆశాజనకంగా లేకపోయినా మిషన్ కాకతీయ అమలు కారణంగా 51.5శాతం సాగు విస్తీర్ణం పెరిగిం దన్నారు. ఈ పెరుగుదల రబీ పంట కాలంలో ఎక్కువగా నమోదు అయిందని చెప్పారు. రాష్ట్రంలో చెరువుల కింద 10.53 లక్షల ఎకరాలకు పైగా ఆయుకట్టు స్థిరీకరణ జరిగిందన్నారు. కాకతీయ అమలు తరువాత చెరువుల్లో నీటి నిల్వ పెరిగిన కారణంగా నీటి లభ్యత పెరిగిం దన్నారు. ఫలితంగా చేపల ఉత్పత్తి 36శాతం నుంచి 39 శాతానికి పెరిగిందన్నారు. వరి పంట సాగు 49.2 శాతం నుంచి 62.1శాతం పెరిగిందన్నారు. 2016-2017 రబీ సీజన్‌లో ఖరీఫ్‌లో సాగు అయిన వరి పంట విస్తీర్ణం కంటే 7.2శాతం పెరిగిందని చెప్పారు. వరి పంట దిగుబడి 4.1శాతం , పత్తిపంట దిగుబడి6.5శాతం పెరిగిందన్నారు. సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు పంట దిగుబడి కూడా పెరగడం విశేషమన్నారు. నేలలో తేమ నిలుపుకునే సామర్ధ్యం పెరిగింద న్నారు. అలాగే మిషన్ కాకతీయలో చెరువు కట్టలు బలోపేతం అయిన కారణంగా వరదలకు తెగిపోయిన చెరువులు, ఇతరత్రా నష్టపోయిన చెరువుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని మంత్రి హరీష్‌రావు వివరించారు. పునరుద్దర ణకు నోచుకున్న చెరువుల్లోకి పుష్కలంగా నీరు వచ్చి చేరినం దున గత సంవత్సరం రబీపంటకాలానికి చెరువులకిందసాగునీరు పుష్కలంగా అందిందన్నారు. దీని కారణంగానే మిషన్ కాకతీయకు పెద్దఎత్తున ప్రశంసలు లభించాయన్నారు. వారిలో రామన్ మెగసెసె అవార్డు గ్రహిత, వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరు పొందిన పి. రాజేంద్రసింగ్ రెండేళ్ళ క్రితం మన రాష్ట్రా నికి వచ్చి ప్రశంసించారన్నారు. అలాగే బ్రిటీష్ పార్లమెంట్, యుకె కామన్‌వెల్త్ పార్లమెంటరీ సమాఖ్య సభ్యులు వీరేందర్ శర్మ, లోర్డ్ రానా, నష్‌రత్‌ఘని, ఫర్మాక్, బ్రిటీష్ హై కమిషనర్ హండ్రో మిచెండ్రో, కేంద్ర ప్రభుత్వ నీటివనరుల మంత్రిత్వ శాఖ మంత్రి ఉమాభారతి ఆదేశాల మేరకు 30 మంది సీడబ్యూసీ సాగునీటి అధికారుల బృందం, ఉత్తర్‌ప్రదేశ్, మహరాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిషా రాష్ట్రా ల నుంచి చీఫ్ ఇంజనీరు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు రాష్ట్రా నికి వచ్చి మిషన్ కాకతీయ పనులను పర్యవేక్షించారని మంత్రి హరీష్‌రావు తెలిపారు. అలాగే నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ అరవింద్ ఫనగారియా, సభ్యులు జైన్‌తో ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, హరిత విప్లవ పితామహులు ఎంఎస్ స్వామినాధన్ తదితరులు సైతం మిషన్ కాకతీయను ప్రశంసించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.



కార్బైడ్ వాడకంపై కఠిన చర్యలు: మంత్రి హరీష్‌రావు

రసాయనాలు వినియోగించి పండ్లను మగ్గబెట్టి విక్రయించే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుం టుందని మంత్రి హరీష్‌రావు స్పష్టం చేశారు. మండలిలో సభ్యులు బోడకుంటి వెంకటేశ్వర్లు, బాలసాని లక్ష్మీనా రాయణ, సుంకరి రాజు తదితరులు అడిగిన ప్రశ్నలపై ఆయన సమాధానమిస్తూ, పండ్లను మగ్గబెట్ట డానికి కార్బైడ్ వాడుతున్న 19 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. అలాగే రూ. 10వేల చొప్పున జరిమానా విధించడమే కాకుండా 6గురు కమీషన్ ఏజెంట్లపై చర్యలు తీసుకున్నామని మంత్రి తెలిపారు. ఆరోగ్య శాఖ క్రమం తప్పకుండా పండ్ల మార్కెట్లను తనిఖీ చేస్తూ పరీక్షించడం కోసం పండ్ల నమూనాలను సేకరిస్తోందన్నారు. అలాగే కాల్షియం కార్బైడ్ పండ్ల మార్కెట్‌లో వినియోగించకుండా మార్కెటింగ్ శాఖసైతం ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తోందన్నారు. అలాగే ప్రజలను చైతన్యవంతం చేసేందుకు పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతమున్న గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్‌ను రంగారెడ్డి జిల్లా కొహెడ గ్రామంలో సేకరించిన 175 ఎకరాల్లో, జగిత్యాలలోని మామిడి పంట్ల మార్కెట్‌ను చెల్గల్ గ్రామంలోసేకరించిన 23.09 ఎకరాల్లో ఆధునికసదుపాయాలతో అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు.



గడువులోగా పనులు పూర్తి చేయాలి

● భగీరథపై మంత్రుల సమీక్ష

హైదరాబాద్,ఆంధ్రప్రభ: నిర్ణీత గడువులోగా మిషన్ భగీరథ పనులు పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రులు జోగు రామన్న,ఇంద్రకరణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం అరణ్యభవన్‌లో ఉమ్మడి అదిలాబాద్ జిల్లా మిషన్ భగీరథ పనుల పురోగతిపై మంత్రులు సమీక్షా సమావేశం నిర్వహించారు. మిషన్ భగీరథ పనుల విషయంలో ఎలాంటి నిర్లక్షతను సహించది లేదని అధికారులకు స్పష్టం చేశారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా పనుల పురోగతిపై కూలంకషంగా చర్చించారు. ఆయా నియోజకవర్గాల వారీగా పనుల పూర్తికి తాజా గడువు నిర్దేశించారు. మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి మున్సిపాలిటీలతో పాటు నియోజకవర్గాల్లో నెలకొన్న తీవ్ర మంచినీటి ఎద్దడి ఈ సందర్భంగా చర్చకు వచ్చింది. యుద్ధప్రాతిపదికన పైప్‌లైన్ల పనులు పూర్తి చేసి మంచి నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మిషన్ భగీరథ పనుల వేగవంతం కోసం అవసరాన్ని బట్టి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకుని త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. అదిలాబాద్ పట్టణంలో 26వేల ఇళ్లకు మిషన్ భగీరథ కింద మంచినీటి కనెక్షన్లు ఇవ్వాలని మంత్రి జోగు రామన్న అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ విప్ నల్లాల ఓదేలు, ఎమ్మెల్సీ పురాణం సతీష్ కుమార్ , ఎమ్మెల్యేలు దివాకర్ రావు, కోనేరు కోనప్ప, బాపురావు రాథోడ్ ,దుర్గం చిన్నయ్య ,గడ్డం వివేక్ రెడ్డి, కోవా లక్ష్మి, రేఖా నాయక్ , మిషన్ భగీరథ ఈఎన్సీ సురేందర్ రెడ్డి, సీఈ జగన్మోహన్ రెడ్డితో పాటు జిల్లాకు చెందిన మున్సిపల్ కమీషనర్లు , ఇంజనీర్లు పాల్గొన్నారు.

అత్యంత భద్రంగా పాస్ బుక్‌లు

● నాలుగు కంపెనీలకు టెండర్లు ● లెటర్ ఆఫ్ ఇండెంట్ జారీ ● రెండు రోజుల్లో మోడల్ పుస్తకాలు ● ఆ తర్వాతే స్పష్టత ● 72 లక్షల మందికి పాస్‌బుక్స్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అత్యంత భద్రతా ప్రమాణాలు, మాటిమాటికీ మార్పులు అవసరం లేని రీతిలో పాట్టదార్ పాస్ పుస్తకాలు కం టైటిల్ డీడ్‌ల ముద్రణకు నాలుగు కంపెనీలు సర్వం సిద్ధం చేశాయి. ప్రభుత్వం లెటర్ ఆఫ్ ఇండెంట్ ఇవ్వడంతో 72లక్షల రైతు సమాచారం ఆధారంగా ప్రింటింగ్ పనులకు మోక్షం కల్గుతోంది. భూ యాజమాన్యపు హక్కులు మరింత ద్విగుణీకృతం అయ్యేలా ప్రభుత్వం ఈ దఫా ప్రాధాన్యత నిస్తోంది. మొత్తం ఆరు కాలమ్స్‌తో వీటికి రూపకల్పన జరుగుతోంది. క్రమసంఖ్య, స్వే నెంబర్, భూమి విస్తీర్ణం, భూ సంక్రమణ వివరాలు, ఎలా సంక్రమించింది, భూమి స్వభావం, తహాశీల్దార్ డిజిటల్ సంతకం ముద్రించనున్నారు. రిమార్క్స్ కాలమ్‌ను అవసరం మేరకు వదిలేయనున్నారు. అనుభవదారు కాలమ్ తొలగింపుతో అనేక వివాదాలకు ఫుల్‌స్టాప్ పడనుంది. భూమి శిస్తు కాలమ్‌ను పూర్తిగా ఎత్తివేయడంతో కాలమ్స్ సంఖ్య తగ్గి పాస్‌బుక్ మరింత సౌలభ్యంగా, రైతులకు అర్ధమయ్యే సరళ తెలుగులో ఉండనుంది.

రాష్ట్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం 1.65 కోట్ల ఎకరాల వ్యవసాయ భూములకు చెందిన 72లక్షల మంది రైతాంగానికి పట్టాదార్ పాస్ పుస్తకాలు జారీ చేయాల్సి ఉంది. మొత్తం 2,55,98,091.19 ఎకరాల విస్తీర్ణానికి చెందిన భూములను ప్రభుత్వం పరిశీలించింది. ఇందులో 96 శాతం భూములపై స్పష్టత వచ్చింది. 2,38,08,650 ఎకరాలను అసైన్డ్, సాదాబైనామా భూములను కలుపుకుని క్లీయర్‌గా తేల్చారు. వీటికి పట్టాదార్ పాస్ పుస్తకాలను అందజేయాల్సి ఉంది. 72,13,111 ఖాతాలు దస్త్రాల స్పష్టంగా ఉన్నాయని, ఇందులో 1,42,12,826 ఎకరాలు వ్యవసాయ భూమిగా 55.5 శాతంగా గుర్తించారు. వ్యవసాయేతర పట్టా భూములు 4.7 శాతంతో 11,95,889 ఎకరాలుగా ప్రభుత్వం నిర్ణయించింది. 7.8 శాతంతో అసైన్డ్ భూముల వాటా 20,01,512 ఎకరాలుగా తేల్చారు. ఇందులోనుంచి ఆక్రమణలు, కొనుగోళ్లు జరిగిన 0.9 శాతం అసైన్డ్ భూములు 2,41,127 ఎకరాలుగా ప్రభుత్వం తాజా సర్వేతో గుర్తించింది. వీరందరికి పాస్ పుస్తకాలు ఉంటేనే ఎకరాకు రూ. 8వేల పెట్టుబడి సాయం రైతులక్ష్మి ద్వారా అందించేందుకు వీలు కల్గనుంది.

మూడు దఫాల్లో సాయం చెక్కులు...

వచ్చే నెల 19,30, మే 15 తేదీలలో మూడుసార్లు గ్రామ సభలు నిర్వహించి చెక్కులను పంపిణీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకుగానూ ఎస్‌బిఐకి 321 మండలాలు, ఆంధ్రాబ్యాంకుకు 128 మండలాలు, సిండికేట్ బ్యాంకుకు 38, కార్పొరేషన్ బ్యాంకుకు 31, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకుకు 27, కెనరాబ్యాంకుకు 23 మండలాలను కేటాయించారు.



ఇకపై ఇలా...

- బయోమెట్రిక్ విధానంలో ఇద్దరి వేలిముద్రలు, ఫోటోలు, సంతకాలు తీసుకుంటారు.
- ఎంత భూమిని అమ్ముతున్నారో అంత భూమిని విక్రయదారు పాస్ పుస్తకం నుంచి సబ్ రిజిస్ట్రార్ తొలగిస్తారు. కొనుగోలుదారుకు ఇదివరకే పాస్‌పుస్తకం ఉంటే అందులో నమోదు చేస్తారు. సబ్ రిజిస్ట్రార్ సంతకం చేసి ముద్ర వేస్తారు.
- భూమిని కొత్తగా కొంటున్నవారయితే కొత్తపాస్ పుస్తకం జారీ చేస్తారు. అందులో కొనుగోలు చేసిన భూమి వివరాలను నమోదు చేస్తారు.
- ఇద్దరి పాస్ పుస్తకాలను అదే రోజు ఎమ్మార్వోకు పంపి, భూ యజమాని కాలమ్‌లో అమ్మినవారి పేరు తొలగించి కొనుగోలుదారు పేరును చేర్చి మ్యుటేషన్ పూర్తి చేస్తారు.
- వివరాలను ఎమ్మార్వో కార్యాలయంలోని భూమి రికార్డుల్లో నమోదు చేస్తారు.
- ఎమ్మార్వో కార్యాలయంలోని ఐటీ అధికారికి వివరాలు పంపి, వాటిని వెబ్‌సైట్‌లో ఎంటర్ చేస్తారు.
- వెబ్‌సైట్‌లో నమోదైన వివరాలు కొనుగోలు చేసిన వారికి, విక్రయించినవారికి వెంటనే ఎస్సెమ్మెస్ వెళుతుంది.
- పాస్ పుస్తకాలను ఇప్పటివలె ఆర్డీవోకు పంపాల్సిన అవసరం లేదు. పేరు మార్పిడి (మ్యుటేషన్) బాధ్యత పూర్తిగా ఎమ్మార్వోదే.
- మ్యుటేషన్ తర్వాత ఎమ్మార్వో కార్యాలయం ముద్ర వేసి, ఎమ్మార్వో సంతకం చేస్తారు. పాస్ పుస్తకా లను అదే రోజు తిరిగి సబ్ రిజిస్ట్రార్‌కు పంపిస్తారు.
- ఎమ్మార్వోనుంచి తనకు అందిన పాస్ పుస్తకాలను సబ్ రిజిస్ట్రార్ కొరియర్ ద్వారా అమ్మినవారికి, కొన్న వారికి పంపిస్తారు. కొన్నవాళ్లకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ కూడా పంపుతారు.
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డిస్పాచ్ అయిన వెంటనే ఇద్దరికీ ఎస్సెమ్మెస్ వస్తుంది.
- రైతులకిచ్చే పాస్ పుస్తకంలో ఖాతా నెంబర్‌తోపాటు పాస్ పుస్తకం యూనిక్ కోడు, గ్రామం కోడ్, మండలం కోడ్, యజమాని ఆధార్ నెంబర్లు ఉంటాయి.

హక్కులు కూడా వీటితోనే...

ఇకపై యాజమాన్య హక్కులు కూడా పట్టాదార్ పాస్ పుస్తకాలద్వారానే రైతులకు సంక్రమించనున్నాయి. రికార్డ్ ఆఫ్ రైట్ (ఆర్ఓఆర్) చట్టంలో సవరణలను తేవడం ద్వారా 15 రోజుల్లోనే కొనుగోలు దారుకు నేరుగా పట్టాదార్ పాస్‌పుస్తకం కొరియర్‌లో ఇంటికి చేరనుంది. భూముల రిజిస్ట్రేషన్ తహాశీల్దార్ చేస్తారు. కొనుగోలుదారుడి ఆధార్, విక్రయదారుడి పట్టాదార్ పాస్ పుస్తకం, టైటిల్‌డీడ్‌లను పరిశీలించి ఈ ప్రక్రియ పూర్తి చేస్తారు. ఈ వెంటనే రికార్డుల్లో మ్యుటేషన్ చేసి తహాశీల్దార్ బయోమెట్రిక్ వేస్తారు. తర్వాత రికార్డుల అభ్యంతరాలు వ్యక్తమయ్యే అవకాశం లేదు. కాగా ఈ పట్టాదార్ పాసుపుస్తకాలు అత్యంత అధునాతనంగా ఉండనున్నాయి. ఇందుకు రెండు డిజైన్లను ప్రభుత్వం పరిశీలించింది. ఇప్పుడున్న 90 రోజుల గడువును 15 రోజులకు తగ్గించడంతోపాటు పాస్ పుస్తకాల జారీలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టినట్లయింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యాక మ్యుటేషన్ తతంగాన్ని 15 రోజుల్లోగా పూర్తి చేసేలా చట్ట సవరణ చేసిన సంగతి తెలిసిందే. వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో సంస్కరణలతోపాటు ఆర్వోఆర్ చట్టంలోని సెక్షన్ 60లోమార్పులు పూర్తయ్యాయి.

గతేడాది జూన్ నుంచి నిలిపివేత...

గతేడాది జూన్ 17న సర్కార్ జారీ చేసిన ఆర్డినెన్స్ ప్రకారం రాష్ట్రంలో కొత్తగా పట్టాదార్ పాస్ పుస్తకాల జారీ నిల్చిపో యింది. డిజిటలైజ్డ్ ఇ పట్టాదార్ పాస్ పుస్తకాలు, టైటిల్ డీడ్ లను అమలులోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించిన నేప థ్యంలో ఈ ఆర్డినెన్స్‌ను జారీ చేశారు. రిజర్వ్ బ్యాంకు సూచనల మేరకు రాష్ట్రంలోని 82 లక్షల పట్టా దారు పాస్ పుస్తకాలు, టైటిల్ డీడ్‌లను పూర్తిగా రద్దు చేసి వాటి స్థానం లో కొత్తగా ఈ-పాస్ పుస్తకాలను జారీ చేయాలని నిర్ణయించింది.

పోలవరానికి రూ. 1400 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

శాఖకు సమాచారం అందించింది. ప్రాజెక్టుకు సంబంధించి ఆడిట్ రిపోర్టులు అందిన తర్వాత మిగతా రూ. 300 కోట్లు మంజూరు చేయనున్నట్టు ఆర్థిక శాఖ తెలిపింది. గతంలో నాబార్డు ద్వారా రెండు విడతలుగా రూ. 2,000 కోట్లు విడుదలయ్యాయి.

నాబార్డు రుణంతో పాటు గ్రామీణ ఆరోగ్య మిషన్‌కు గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద రూ. 16.7 కోట్లు విడుదల చేస్తూ కేంద్ర ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఏమీ ఇవ్వడం లేదని రాష్ట్రంలోని అధికార తెలుగుదేశం తీవ్ర ఆరోపణలు చేస్తున్న తరుణంలో కేంద్రం ఈ నిధులు విడుదల చేయడం చర్చనీయాంశంగా మారింది.



స్పీకర్ పేషీలో ఈటల జన్మదిన వేడుకలు

స్పీకర్ పేషీలో మంత్రి ఈటల పుట్టిన రోజు వేడుకలు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ పుట్టిన రోజు వేడుకలు మంగళవారం శాసనసభ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి చాంబర్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్పీకర్ మధుసూధనాచారి, డిప్యూటి స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి, మంత్రులు కె తారకరామారావు, టి హరీష్‌రావు తదితరులు ఈటలకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి ఈటల కేక్ చేసి అందరికి తినిపించారు. తన ఛాంబర్‌లో కూడా ఈటల కేక్ కట్ చేశారు. పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేలు,మంత్రులు ,ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె రామకృష్ణారావు, కార్యదర్శి ఎన్ శివశంకర్, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఈటల రాజేందర్‌కు గ్రీటింగ్స్ చెప్పారు. శాసనసభలో స్పీకర్ మధుసూదనాచారి ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు.



వేతన సవరణపై సీఎందే తుది నిర్ణయం

● ఆర్టీసీ సమస్యలపై మంత్రుల స్థాయిలో చర్చలు ● కార్మిక సమస్యలపై ప్రభుత్వం సానుకూలం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆర్టీసీలో వేతన సవరణపై ముఖ్యమంత్రి స్థాయిలో నిర్ణయం తీసు కొనవలసి ఉందని ప్రభుత్వ వర్గాలు పేర్కొ న్నాయి. కార్మికుల వేతన సవరణ డిమాండ్ న్యాయ మైం దేనని అంగీకరిస్తున్నాయి. ఆర్టీసీ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నందున ముఖ్య మంత్రి స్థాయిలో సమీక్ష జరిపి సానుకూల నిర్ణయం తీసుకొనే విధంగా చర్యలు తీసుకుంటు న్నామని వెల్లడిం చారు. ఆర్టీసీలో గుర్తింపు సంఘం తెలం గాణ మజ్దూర్ యూనియన్ నాయకులతో మంత్రు లు మహేందర్ రెడ్డి, హరీశ్‌రావు, ఈటల రాజేందర్ పోచారం శ్రీనివాసరెడ్డి ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్య నారాయణ, రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. రమణారావు రెండు రోజుల పాటు అసెంబ్లీ కమిటీ హాల్‌లో చర్చలు జరిపారు. ఆర్టీసీ స్థితిగతులు, కార్మికుల సమస్యలు, వేతన సవరణ అంశాలపైన ప్రధా నంగా చర్చిం చారు. తెలంగాణ మజ్దూర్ యూని యన్ అధ్యక్షులు ఎం. థామస్ రెడ్డి, ప్రధాన కార్య దర్శి అశ్వద్దామ రెడ్డి, ఉపాధ్యక్షులు బి.వి.రెడ్డి, ఎల్. మంగయ్య, వి.కె. రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగ భద్రత పైన కమిటీ వేయడానికి, ఖాళీలను భర్తీ చేయ డానికి, సకల జనుల సమ్మె కాలాన్ని వేతనంతో కూడిన సెలవుగా ప్రకటించడానికి, అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రభుత్వం సాను కూలంగా స్పందించిందని టీఎంయూ నాయకులు తెలిపారు. వారం పది రోజులలో ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేసి వేతన సవరణతో పాటు ఇతర సమస్యలపై సానుకూల ప్రకటన చేయించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుం టుందని తెలిపారు.

కొనసాగుతున్న ఎంప్లాయిస్ రిలే దీక్షలు

ఆర్టీసీలో కార్మికుల సమస్య లపై ఆర్టీసీ ఎంప్లాయిస్ యూని యన్ రిలే దీక్షలను కొనసాగిస్తుంది. వేతన సవరణతో పాటుగా ఉద్యోగుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని డిమాండ్ చేస్తే చేపట్టిన దీక్ష రెండవ రోజు భారీ ఎత్తున జరిగింది. ఈ నెల 23 వరకు దీక్షలు కొనసాగుతాయని ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి తెలిపారు. గత సంవ త్సర కాలంగా కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. 2017 ఏప్రిల్ నుండి వేతన సవరణ జర గవలసి ఉం దన్నారు. ఎంప్లా యిస్ యూనియన్ రిలే దీక్షలు చేపట్ట డంతో ప్రభు త్వం లో కదలిక వచ్చిం దన్నారు. గుర్తింపు కార్మి.క సంఘం సమస్యల పరి ష్కారంతో ఘోరం గా విఫలమైం దన్నారు.

2జీ కేసులో హైకోర్టుకు సీబీఐ

న్యూఢిల్లీ : 2జీ కుంభకోణం కేసులో సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం తీర్పును సవాల్ చేస్తూ సీబీఐ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. సీబీఐ కోర్టు మాజీ కేంద్ర మంత్రి ఏ రాజా, డీఎంకే ఎంపీ కనిమొళిలను నిర్ధోషులుగా ప్రకటించడంపై సీబీఐ అధికారులు హైకోర్టులో అప్పీల్ చేశారు. రాజా, కనిమొళితో పాటు 17 మంది నిందితులకు ఈ కేసు నుంచి ప్రత్యేక న్యాయస్థానం గత ఏడాది డిసెంబర్ 21న విముక్తి కల్పించిన సంగతి తెలిసిందే. ఈ కేసు తీర్పును సోమవారం హైకోర్టులో ఈడీ సవాల్ చేయగా..తాజాగా సీబీఐ అప్పీల్ చేసింది. డీఎంకే నిర్వహిస్తున్న కళై ంగర్ టీవీకి స్వాన్ టెలికాం ప్రమోటర్లు రూ. 200 కోట్లు చెల్లించారని ఈడీ తన చార్జిషీట్‌లో ఆరోపించగా, 2జీ కేటాయింపుల్లో సర్కార్ ఖజానాకు రూ. 30వేల 984 కోట్ల నష్టం వాటిల్లిందని సీబీఐ ఆరోపించింది. అయితే ఈ ఆరోపణలను రుజువు చేయడంలో ప్రాసిక్యూషన్ ఘోరంగా విఫలమైందని సీబీఐ న్యాయస్థానం నిందితులపై అభియోగాలను కొట్టివేసింది.

ఒక్క చానల్ ఫుటేజీనే ఎందుకు తీసుకున్నారు?

● పశ్చిమ గోదావరి జిల్లా కోడి పందేల్లో కేవలం ఒక్క ఎమ్మెల్యే పాల్గొన్నారా,హైకోర్టు విస్మయం

● ఏపీ ఏజీని నిలదీసిన హైకోర్టు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తామిచ్చిన ఉత్తర్వులకు విరుద్ధంగా కోడిపందేలు నిర్వహించడం, ప్రోత్సహిస్తూ నాయకులు ఇంటర్వ్యూలు ఇవ్వడం జాతీయ మీడియా ఛానల్లలో ప్రసారం కావడం, తాము చూశామని హైకోర్టు ఏసీజే వ్యాఖ్యానించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగిన కోడిపందేల్లో కేవలం ఒక్క ఎమ్మెల్యే మాత్రమే పాల్గొన్నారా, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు పాల్గొనలేదా, అని హైకోర్టు ధర్మాసనం విస్మయం వ్యక్తం చేసింది. కోర్టుకు ఎందుకు తప్పుడు సమాచారం ఇస్తున్నారని ఏపీ ఏజీని నిలదీసింది. అన్ని ఛానెళ్ల నుంచి వీడియో ఫుటేజీలను సేకరించారా అని ధర్మాసనం ఏపీ ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ ను ప్రశ్నించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ , జస్టిస్ కె.విజయలక్ష్మి లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ఏప్రిల్ 3కి వాయిదా వేసింది. అయితే కేవలం టీవీ-9 ఛానెల్ నుంచి మొదటి ఫుటేజీ వచ్చిందని విన్నవించారు. మిగిలిన ఛానెళ్ల నుంచి ఇంకా సమాచారం అందాల్సి ఉందన్నారు. ఆ ఛానెల్ ఇచ్చిన ఫుటేజీలో కేవలం ఒక ఎమ్మెల్యే మాత్రమే ఉన్నారా అని ధర్మాసనం ఏజీని నిలదీసింది. ఆ ఫుటేజీలను ఎవరు పరిశీలించారని ప్రశ్నించింది.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

బుధవారం 21 మార్చి 2018

రోజువారీ అవిశ్వాసం!


అవిశ్వాసం.. అవిశ్వాసం.. అవిశ్వాసం! దేశవ్యాప్తంగా మూడు రోజులుగా ఇవే ప్రతిధ్వనులు. ఎక్కడ చూసినా ఇవే చర్చలు! ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం మీద ఏకకాలంలో సంధించిన రెండు అవిశ్వాస తీర్మానాలు సంచలనమే సృష్టిస్తున్నాయి. అవి సభ ఆమోదం పొందితే మోడీ ప్రభుత్వం పడిపోతుందని కాదు. మూడున్నరేళ్లుగా అప్రతిహతంగా దూసుకెళ్తున్న మోడీ మీద ఒక్కసారిగా ఏకంగా రెండు అవిశ్వాసాలేమిటా అన్నదే ఆ సంచలనానికి కారణం. అందులోనూ వాటిని ప్రవేశపెడుతున్న పార్టీలు రెండూ బీజేపీకి జీవితకాల శత్రువులేమీ కాదు. వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీకి, బీజేపీకి తీవ్రమైన రాజకీయ శత్రుత్వమీదీ లేదు. అలాగే తెలుగుదేశం. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ, తెలుగుదేశం కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపాయి. మరి మరీ బద్ధ శత్రువులు కాని పక్షాలు ఏకంగా అంతటి బలమైన మోడీ ప్రభుత్వం మీద అవిశ్వాసాలకు దిగడమంటే అది మామూలు సమయాల్లో అయితే నిస్సందేహంగా సాహసోపేతమనే చెప్పుకోవాలి. కాని ఇప్పటి రాజకీయ స్థితిగతుల్లో ఈ అవిశ్వాసాలు అనివార్యమైన తీరు చూస్తే..అవి ఏమంత భయంకరమైన తీర్మానాలు కావని ఇట్టే అర్థమవుతున్నది.

కేంద్రంలో ఉండే ప్రభుత్వాల మీద విశ్వాసం పోవడం అసాధారణమేమీ కాదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో అదొక సర్వసాధారణమైన రాజ్యాంగపరిధిలోని ప్రక్రియే. ప్రభుత్వాన్ని అభిశంసించడం..లేదా ప్రభుత్వం మీద అవిశ్వాసం ప్రకటించడం..రెండూ వేర్వేరు ప్రక్రియలు. అభిశంసన అనేది ఒక మంత్రికో లేదా కొందరు మంత్రుల సమూహానికో మాత్రమే పరిమితమైనది. దీనికి కారణాలు చెప్పాల్సి ఉంటుంది. కాని అవిశ్వాసం అలా కాదు. కారణాలైతే చెప్పనక్కర్లేదు. ఒకేఒక వాక్యం రాస్తే చాలు. ఈ ప్రభుత్వం మీద ఈ సభ అవిశ్వాసం ప్రకటిస్తున్నది అని మాత్రమే పేర్కొనాలని నిబంధనలు సూచిస్తున్నాయి. అలాగని ప్రపంచం మొత్తం మీద ప్రజాస్వామ్య దేశాలన్నింటిలోనూ ఒకే విధానం అమలవుతున్నదని కాదు. మన దేశంలో అవిశ్వాసానికి అవిశ్వాసానికి మధ్య ఆరు నెలల సమయం ఉండాలని రూల్స్ చెబుతుంటే..వివిధ దేశాల్లో మూడు నెలలు, నాలుగు నెలలు, ఆరు నెలలు..ఇలా విభిన్నంగా ఉన్నాయి. మన దేశంలో ఈ తీర్మానం చెల్లాలంటే కనీసం యాభై మంది సభ్యుల మద్దతు అవసరం. ప్రస్తుతం లోక్‌సభలో మూడు రోజులుగా సుడులు తిరుగుతున్న అవిశ్వాస నోటీసులకు ఈ అర్హతలన్నీ ఉన్నాయా లేవా అనేది లోక్‌సభ స్పీకర్ చెప్పాల్సి ఉంటుంది. రెండు పార్టీలూ నోటీసులు ఇచ్చాయి. వాటిని చర్చకు చేపట్టడానికి తనకు సభలో వాతావరణం అనుకూలించడం లేదని ఆమె అంటున్నారు. అలాంటి వాతావరణం ఎవరు కల్పించాలి? ఆ బాధ్యత ప్రభుత్వానిదే. కాని అదెందుకు ఆ బాధ్యత తీసుకోవడం లేదు? ప్రభుత్వానికి సహజంగానే అవిశ్వాస తీర్మానాలు చర్చకు రావడం రుచించదు. అందుకే తెరాస, అన్నాడీఎంకే పార్టీలు చేస్తున్న నిరసనలను చొరవ తీసుకుని ఆపించడం లేదు. ప్రభుత్వ బిల్లులను అదే అల్లరిలో, అదే గందరగోళంలో ఆమోదింపచేసుకుంటున్న ప్రభుత్వం ఈ తీర్మానాలకు అదే అల్లరిని, గందరగోళాన్ని అడ్డేస్తున్నదని అందరూ అనుకుంటున్నారు. ఒకవేళ తీర్మానాల మీద చర్చ, ఓటింగ్ జరిగినా మోడీ ప్రభుత్వానికి వచ్చే ఢోకా ఏమీ లేదు. ఆ సంగతి అందరికీ తెల్సిందే. అలాగని చర్చకు, ఓటింగుకు పాలకపక్షమే దారి ఇచ్చి, ప్రతిపక్షం చేత ఏడెనిమిది గంటలు ఏకధాటిగా తలంటించుకోవడానికి సిద్ధపడుతుందని ఆశించడం దురాశ కాక మరేమవుతుంది. అయినా అవిశ్వాస ప్రస్తావనే రాకుండా ఉండాలి గాని ఇంత రచ్చ జరిగాక మోడీ కేబినెట్‌కి జరగాల్సిన నష్టం వాటిల్లినట్టే భావించాలి.

భారతదేశ లోక్‌సభ చరిత్రలో అవిశ్వాస తీర్మానాలు సృష్టించిన సంచలనాలు తక్కువేమీ కాదు. 1963 ఆగస్టులో లోక్‌సభలో మొట్టమొదటి అవిశ్వాస తీర్మానం రంగప్రవేశం చేసింది. చైనాతో యుద్ధం జరిగాక అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ తీవ్ర సంక్షోభంలో పడ్డారు. సోషలిస్టు నాయకుడు ఆచార్య కృపలానీ నెహ్రూ కేబినెట్ మీద అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. 2008 జులై నాటికే మొత్తం 26 అవిశ్వాస తీర్మానాలు రికార్డు అయ్యాయి. వీటిల్లో ఇందిరిగాంధీ అత్యధికంగా..అంటే 15సార్లు అవిశ్వాసాలను ఎదుర్కొన్నారు. లాల్ బహదూర్ శాస్త్రి, పీవీ నరసింహారావు మూడేసి సార్లు వీటి రుచి చూశారు. మొరార్జీ దేశాయ్ మీద రెండుసార్లు, జవహర్‌లాల్ నెహ్రూ, వాజ్‌పేయి మీద ఒక్కోసారి అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టారు. చరిత్రలో రెండుసార్లు మాత్రమే అవిశ్వాస తీర్మానాలు గెలిచాయి. మొదటిది మొరార్జీ దేశాయ్ కేబినెట్ మీద. 1979 జులై 12న ఆయన మీద అవిశ్వాస తీర్మానం గెలవడంతో ఆయన రాజీనామా చేయాల్సి వచ్చింది. రెండోది..1999 ఏప్రిల్ 17న వాజ్‌పేయి ప్రభుత్వం మీద. ఒకేఒక్క ఓటు తేడాతో గెలిచిన అవిశ్వాసంగా భారతదేశ లోక్‌సభ చరిత్రలో అది నమోదైంది. ఒరిస్సా సీఎంగా ఉన్న గిరిధర్ గొమాంగో అప్పటికింకా ఎంపీగా రాజీనామా చేయలేదు. ఆ హక్కుతో అప్పటికప్పుడు లోక్‌సభకు వచ్చి ఓటేసి అందర్నీ ఆశ్చర్యపరిచారు. వాజ్‌పేయి ప్రభుత్వాన్ని ఇంటికి పంపారు. సంకీర్ణ ప్రభుత్వాల్లోనే ఇలాంటి సస్పెన్స్, థ్రిల్లర్ అవిశ్వాసాలకు సాధారణంగా ఆస్కారముంటుంది.

ప్రస్తుతం మోడీ ప్రభుత్వం చుట్టూ చక్కర్లు కొడుతున్న రెండు అవిశ్వాస తీర్మానాల గతి ఏమవుతుందన్నదే ప్రశ్న. వరసగా రోజూ పన్నెండింటికి సభ సమావేశం కావడం..ప్లకార్డులతో సభ్యులు పోడియం చుట్టుముట్టడం..స్పీకర్ సభను వాయిదా వేయడం..ఇదే నిత్యకృత్యమై..అతి త్వరలోనే ఏకంగా పార్లమెంటు నిరవధికంగా వాయిదా పడుతుందని ప్రచారం జరుగుతున్నది. సభలు వాయిదా పడటాన్ని పెద్ద విశేషంగా భావించతగదు. అవిశ్వాసాల భవితవ్యం తేలిస్తేనే కేంద్ర ప్రభుత్వానికి పరువు నిలిచేది. అలా కాకుండా ఇంకెలా జరిగినా మోడీ పలాయనం చిత్తగించారన్న అపప్రథ రావడం ఖాయం. ఈ రెండు తీర్మానాలు ఏమాత్రం సీరియస్ కాదని, కేవలం రాజకీయపరమైనవని అధికార పక్షం వాదించొచ్చు. ఏ కారణాల ప్రాతిపదికగా అవిశ్వాస తీర్మానాల భవితవ్యాన్ని స్పీకర్ నిర్ధరించరు కాబట్టి ఆ వాదనకు దూరంగా ఉండటమే సముచితం. ప్రభుత్వం తలుచుకుంటే సభలో దేన్నయినా...ఏ రూపంలోనైనా..ఎలాగైనా ప్రవేశపెట్టేలా చేయగలదు...వాటి గమ్యాన్ని నిర్ణయించగలదు. ఇది అందరికీ తెలిసిన చిదంబర రహస్యమే. అందువల్ల ఈ తీర్మానాలను కూడా ప్రభుత్వమే చొరవ తీసుకుని అవి చర్చకు వచ్చేలా చేస్తే..అప్పుడది శంఖంలో పోసిన తీర్థమవుతుంది. ప్రతిపక్షాల పంతం నిలిచినట్టవుతుంది. పాలకపక్షం ఎదిరించి గెలిచినట్టవుతుంది. ఇదే ఉభయతారక మంత్రం!

'మహా' పరువు మిగిలింది!



హర్షవాక్కు

-వేటూరి శ్రీహర్ష(న్యూఢిల్లీ)

పరువు కాపాడుకునేందుకు ఏం చేయాలో అది చేసింది మహారాష్ట్ర ప్రభుత్వం. అన్నదాతల ఆందోళన నుంచి చాకచాక్యంగా బయటపడింది. సాధారణంగా ఈ స్థాయి ఆందోళనలు కచ్చితంగా ఉద్రిక్తతకు దారితీస్తాయి. అల్లకల్లోలం చెలరేగుతుంది. 35 వేల మందికిపైగా రైతులు ఎర్ర జెండాలు చేతబూని, సుశిక్షితులైన కార్యకర్తల్లా నడిచివస్తుంటే ఒక ఎర్ర రంగులో ఉన్న ఉత్తుంగ తరంగంలా కనిపించారు. హోస్నీ ముబారక్‌ను పదవీచ్యుతుడిని చేయడానికి ఎగసిన అరబ్ స్ప్రింగ్ విప్లవం మాదిరిగా గోచరించింది. ఫడ్నవిస్ ప్రభుత్వానికి సవాలుగా నిలిచింది. మోడీ ప్రభుత్వం సైతం ఉత్కంఠతో మహారాష్ట్ర వైపు చూసింది. ఈ ఉద్యమం కారణంగా మహా సర్కారు పరిపాలన స్తంభించింది. కొద్ది రోజుల పాటు ప్రభుత్వాధినేతలకు వెన్నులో వణుకు పుట్టించింది. రైతులు తమ ఆందోళనను విరమించడానికి అంగీకరించడంతో బీజేపీ నేతలూ ఊపిరి పీల్చుకున్నారు. రైతుల ఇక్కట్లను సానుభూతితో పరిశీలించి, సమస్యలను పరిష్కరిస్తానని దేవేంద్ర ఫడ్నవిస్ హామీకి వారు తలూపడంతో ఆందోళన సుఖాంతమైంది. ఆర్నెల్లలో సమస్యలను తీరుస్తానని ఆయన హామీ ఇచ్చారు. రైతుల సమస్యల పరిష్కారంపై ఎంతమేరకు నిలబడి ఉంటుందనేది ఇప్పుడు అసలు ప్రశ్న. అప్పుడు గానీ అసలు విషయం బయటపడదు. బలహీనపడిన వామపక్షాల నేతృత్వంలో కదలివస్తున్న రైతన్నను చూసి, రాజకీయంగా కొన్ని అనుమానాలు రేగాయి. అవెలా ఉన్నా వారు సాధించిన విజయం అమోఘం..అద్వితీయం. ఈ విజయం వారికి త్రిపుర పరాజయాన్ని మరిపించింది.

రుణ మాఫీ చేస్తామని ఫడ్నవిస్ ఎన్నికలలోనే హామీ ఇచ్చారు. గిరిజనులకు అటవీ భూమిని బదలాయిస్తామన్న హామీ నెరవేర్చడానికి ఆరు నెలలు సమయమడిగారు. ఈ సమయంలో ప్రత్యేక కమిటీ దీనిని అధ్యయనం చేస్తుంది.35లక్షల మంది పత్తి రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని కూడా ముఖ్యమంత్రి అంగీకరించారు. రుణమాఫీ పథకం 2009నుంచి పరిగణనలోకి తీసుకుంటారు. ఎక్కువ మంది రైతులను ఈ పరిధిలోకి తేవడమే దీని ఉద్దేశం. ఉద్యమకారుల్లో ఎక్కువ మంది నాసిక్ ప్రాంతానికి చెందినవారు. అటవీభూములపై యాజమాన్య హక్కులు లేని ఆదివాసీలు. ఈ హామీ నెరవేర్చడానికి ప్రభుత్వంపై ఎంత భారం పడుతుందన్నది తాజా ప్రశ్న.

మహారాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంస్థాగత రుణ విధానం అమలులోకొచ్చేసరికి క్లిష్టంగా మారుతోంది. ఆ రాష్ట్రంలోని రైతులు ప్రధానంగా దీనిపైనే ఆధారపడుతున్నారు. ఫడ్నవిస్ హామీ ఇచ్చిన రుణ మాఫీ సన్న, చిన్నకారు రైతులకు వర్తిస్తుంది. అమలు ఎంతవరకూ సాధ్యమనేది సందేహంగా మారింది. అధిక మద్దతు ధర, స్వామినాథన్ కమిటీ సిఫార్సుల అమలు కూడా రైతుల డిమాండ్లలో ఉన్నాయి. 2013-15 మధ్య కాలంలో రుతుపవనాలు మందకొడిగా ఉండటం వల్ల రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు. పరిస్థితులు అధ్వానంగా మారిపోవడమే కాక, రబీ పంట దిగుబడి తగినంతగా రాలేదు. ప్రతి దరఖాస్తుదారును రుణమాఫీకి అర్హునిగా పరిగణించాలని ఆందోళనకారులు ఒత్తిడిచేయడంతో ఫడ్నవిస్ ప్రభుత్వం ఇరకాటంలో పడింది. మిగిలిన నష్టపరిహార చర్యలకూ పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్లు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో పప్పుధాన్యాల సాగు చేయాలని ప్రధాని నరేంద్రమోడీ 2016లో రైతులకు సలహాఇచ్చారు. ఈ మాట విని రైతులెందరో పెద్ద మొత్తంలో అపరాల సాగుపై పెట్టుబడులు పెట్టారు. ఇది మార్కెట్లోకి పప్పు దినుసుల దిగుబడి వెల్లువను సృష్టించింది. ఇది పప్పుల ధరలను దిగజారేలా చేసింది. మద్దతు ధర కూడా దిగజారింది. ఇది రైతులలో మరింత ఆందోళనకు కారణమైంది. మోడీ సలహా విని తాము ఎంతో నష్టానికి గురయ్యామని రైతులు అన్నారు. ప్రభుత్వం తమను మోసం చేసిందని వారు ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో రుణ మాఫీయే దీనికి పరిష్కారం కాదనీ, చిన్నపాటి ఉపశమనాన్ని కలిగించి, రైతులను తిరిగి రుణవ్యవస్థలోకి తెస్తుంది. రుణ మాఫీని ప్రకటిస్తూనే సరైన సమయంలో దాన్ని



వెల్లడిస్తానని ముఖ్యమంత్రి ఫడ్నవిస్ సస్పెన్స్‌ను సృష్టించారు.

మహారాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న గడ్డుకాలంలో రుణ మాఫీ పథకాన్ని అమలుచేయగలదా? 2017-18 సంవత్సరానికి రెవెన్యూ లోటు నాలుగు వేల కోట్లు దాటుతుంది. ఎక్సయిజ్ ఆదాయం 7వేల కోట్ల రూపాయలు తగ్గిపోయింది. రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు ఏడో వేతన కమిషన్ నివేదికను అమలుచేయడానికి 21వేల కోట్ల రూపాయలు ఖర్చవుతుంది. అర్బన్ మెట్రో ప్రాజెక్టులు, శివాజీ విగ్రహం ఏర్పాటు వంటివి దీనికి తోడవుతాయి. 31లక్షల రైతులకు రుణమాఫీ అమలుకు 30వేల కోట్లు ఖర్చవుతాయి. వీటిలో కొన్నింటిని అమలుచేయాలంటే కేంద్ర అనుమతి తప్పనిసరి. కష్టానికి తగ్గ ఫలితంగా ధర ఉండాలని కోరుతూ రైతులు రోడ్డెక్కడం ఇది మొదటిసారి కాదు. ఈ అంశంలో ఒక్కసారి గతాన్ని నెమరేసుకుంటే చాలానే రైతు ఉద్యమాలు కనిపిస్తాయి. మహేంద్ర తికాయత్ ఈ అంశంలో ముందడుగులో ఉంటారు. పశ్చిమ ఉత్తర ప్రదేశ్ రైతులకు ఆయన దైవంలాంటివాడు. 1988లో ఢిల్లీలోని బోట్స్‌వానా క్లబ్ లాన్స్ చేపట్టిన మార్చ్ అధికార కేంద్రాన్ని గడగడలాడించింది. ఆ మార్చ్‌లో 5లక్షల మంది రైతులు పాల్గొన్నారు. అప్పటి రాజీవ్ గాంధీ ప్రభుత్వం రైతుల 35 డిమాండ్లకూ తలొగ్గింది. చెరకుకు అధిక మద్దతు ధర, విద్యుత్తు, నీటి చార్జీల రద్దు ఇందులో ప్రధానమైనవి.

ఇప్పుడు మహారాష్ట్ర రైతుల డిమాండ్లు 30ఏళ్ళ తరవాత కూడా ఏం మారలేదు. ఒక్కటే తేడా.. తికాయత్ చేపట్టిన ఉద్యమం హింసాత్మకంగా మారింది. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ వంటి రెండు పెద్ద రాష్ట్రాల డిమాండ్లలో వివిధ కారణాల వల్ల వ్యత్యాసముంది. వందేళ్ళ సగటు చూసుకుంటే 2016లో వర్షపాతం 3శాతం తక్కువగా నమోదైంది. అదే సంవత్సరం దేశంలో అత్యధిక దిగుబడులు వచ్చాయి. ఇవి వ్యవసాయ శాఖ అందించిన వివరాలే. గడిచిన 5ఏళ్ళ కంటే దిగుబడులు 6.37శాతం ఎక్కువ. 2015-16తో పోలిస్తే ఇది 8.6శాతం అధికం. 2022నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని ప్రధాన మంత్రి స్వయంగా భరోసా ఇచ్చారు. ఇవన్నీ రైతు తమ సమస్యలను తగ్గించుకోవడానికి మార్గంగా కనిపించి ఉంటాయి.

2017లో మధ్య ప్రదేశ్ రైతులు హింసాత్మక ఆందోళనలకు దిగారు. దీనికి కారణం మందసర్‌లో పోలీసులు ముగ్గురు రైతులను హతమార్చడం. ఆ ఆందోళనను అదుపు చేయడానికి కర్ఫ్యూ విధించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అన్నం దొరక్క అలమటిస్తున్న అన్నదాతపై డీమానిటైజేషన్ పిడుగులా పడింది. మహారాష్ట్ర రైతుల ఆగ్రహానికి కారణం, ఉత్తరప్రదేశ్ రైతులకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ. 36వేల 359కోట్ల రూపాయల వ్యవసాయ రుణాలను రద్దు చేసి యోగి ఆదిత్యనాథ్ సంచలనం సృష్టించారు. అలాంటి సౌకర్యమే తమకూ కల్పించాలని మహారాష్ట్ర రైతులు డిమాండ్ చేస్తున్నారు. 2014-15మధ్య కాలంలో మహారాష్ట్ర అత్యధికంగా రైతుల ఆత్మహత్యలను చవిచూసింది. మరాత్వాడా అత్యంత దుర్భరమైన కరువును ఎదుర్కొంది. నీరు లేక చెరకు, ఇతర వాణిజ్య పంటలు ఎండిపోయాయి. భారత్‌లోనే రైతులు ఎందుకింత దీనావస్థలో ఉంటారన్న ప్రశ్న ఇక్కడ తలెత్తుతుంది. తమిళనాడు రైతులు ఢిల్లీ వెళ్ళి, 2017లో నిర్వహించిన ఆందోళనలను ఎలా మరిచిపోగలం? ఢిల్లీ వీధుల్లో వారు అర్ధ నగ్నంగా యాచించారు. ప్రధాన మంత్రి నివాసానికి కూడా ర్యాలీగా వెళ్ళారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, తెలంగాణ రైతులు వీరికి సుహృద్భావంగా నిరసన ప్రదర్శనలు కూడా నిర్వహించారు. టీవీ మీడియా దృశ్యాలు రైతుల ఇక్కట్లను దేశం కళ్ళకు కట్టింది. వర్షం దయమీద ఆదాయం ఆధారపడి ఉండే రంగాలలో వ్యవసాయం ఒకటి. గ్రామీణ పరిస్థితులలో ఏదో విపరీతమైన అంశం చోటుచేసుకుంటోందని 2006లో జాతీయ రైతు కమిషన్‌కు అధ్యక్షత వహించిన ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ ఎమ్ఎస్ స్వామినాథన్ ఆందోళన వ్యక్తంచేశారు. వ్యవసాయం అస్థిరంగా ఉందన్నారు. 2012-13లో 1.5శాతం పెరుగుదలను నమోదు చేసిన వ్యవసాయరంగం, 2013-14లో 5.6శాతానికి ఎగబాకి, 2014-15లో 0.2శాతానికి పడిపోయింది. 2015-16లో అది 0.7శాతానికి ఎగబాకింది. 2016-17లో 4.9శాతం ఉండవచ్చని అంచనా వేశారు. వ్యవసాయంపైనా, భూ ఆస్తులపైన ప్రజల ఒత్తిడి పెరగడం ఈ రంగంలో సంక్షోభానికి ముఖ్యమైన కారణాలు. వ్యవసాయ భూములు క్రమేపీ తగ్గుతున్నాయి. రైతు తనకు తిండిపెట్టే ఉద్యోగాన్ని వెతుక్కుని వెళ్ళిపోతున్నాడు. దిగుబడి నష్టాలలో సంకటాన్ని ఎదుర్కొని నిలబడడానికి రైతు పోరాడుతున్నాడు. వాతావరణంతోనూ, ధరలతోనూ, అప్పులతోనూ, మార్కెట్‌తోనూ, విధానాలతోనూ వారికి పోరాటం తప్పడం లేదు. అవసరం, సరఫరాలకు సంబంధించి ధరలలో మార్పులు చోటుచేసుకుంటూ రైతులకు ఇబ్బందికరంగా పరిణమిస్తున్నాయి. ఇది వారిలో అనిశ్చితిని పెంచుతోంది. దిగుబడులలో అతివృష్టి, అనావృష్టి దీనికి కారణం. మూలధనాన్ని కూడా కొద్దిగా పెంచితే ఇక్కట్లు తగ్గే అవకాశం ఉంది. లాభం లేని వృత్తిలో రైతు కొనసాగక తప్పనిసరి పరిస్థితిలో అప్పు చేసి, వ్యవసాయం చేస్తున్నాడు. తెలంగాణలో రైతులు ఇలాంటి పరిస్థితుల మధ్యే అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అన్నం పెట్టే రైతును ఆదుకుంటే మనకే లాభం. అందుకోసం ప్రభుత్వాలు చేయాల్సింది ఎంతైనా ఉంటూనే ఉంటుంది.

అలవి కాని వాగ్దానాలతోనే సమస్యలు

ప్రాంతీయ పార్టీల సహకారంఉంటేనే జాతీయ పార్టీలు అధికారంలోకి వస్తాయనే విషయం ఇటీవల ఈశాన్య రాష్ట్రాల అసెంబ్లీ ఫలితాలు రుజువు చేశాయి. కేంద్రంలో ఏ పార్టీ లేదా, కూటమి అధికారంలో ఉన్నా ఆయా ప్రాంతాల, వర్గాల ప్రజల మనోభావాలకు తగినట్టు నిర్ణయాలు తీసుకోవల్సిందే.

ముఖ్యంగా ఆర్థిక పరమైన అంశాల విషయంలో జాతీయ పార్టీలు క్షేత్ర స్థాయిలో పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకపోవడం వల్లనే ఎక్కడికక్కడ ప్రజల్లో భావోద్వేగాలు పెల్లుబుకుతున్నాయి.ఆయా ప్రాంతాల వనరులు,అవసరాలను బట్టి బడ్జెట్‌లు రూపొందించాలి. ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు ఎక్కువ కేటాయింపులు జరపడం, ఇతర రాష్ట్రాలకు అరకొర కేటాయింపులు జరపడం వల్ల ప్రజల్లో ఈ భావోద్వేగాలు పుట్టుకొస్తున్నాయి. కేంద్రం ఏ పథకాన్ని లేదా, కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినా అన్ని రాష్ట్రాలకూ వర్తించేట్టు ఉండాలి. అలా చేయకపోవడం వల్లనే ప్రాంతీయ పార్టీలు సంఘటితం అవుతున్నాయి. అలాగే, రిజర్వేషన్ల విషయంలో కేంద్రం స్పష్టమైన వైఖరి తీసుకోవాలి. రాష్ట్రాలు ఎక్కడికక్కడ రిజర్వేషన్ కోటాను పెంచేస్తుండటం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయి. వాగ్దానాల విషయంలో జాతీయ పార్టీలు కానీ, ప్రాంతీయ పార్టీలు కానీ సాధ్యాసాధ్యాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలే తప్ప ఓటర్లకు గాలం వేసే రీతిలో ఉండరాదు.రైతులు,ఉద్యోగులు, కార్మికులు సమాజంలో ఏ వర్గంప్రయోజనం కోసమైనా కేంద్రం తీసుకునే నిర్ణయాలు అన్ని రాష్ట్రాలకూ మేలు చేకూర్చే రీతిలో ఉండాలి. ఎన్నికలను దృష్టిలోపెట్టుకుని తీసుకున్న నిర్ణయాల వల్లనే వ్యత్యాసాలు,వివాదాలు తలెత్తుతున్నాయి. ప్రాంతీయ విభేదాలు తలెత్త కుండా కేంద్రం అధికార వికేంద్రీకరణ సూత్రాన్ని అనుసరించాలి.రైతుల విషయంలో జాతీయ విధానాన్ని రూపొందించాల్సిన అవసరంఎంతైనా ఉంది.

-కోదాటి శ్యాం సుందర్
9949505780

విశ్లేషణం

అమలుకాని చట్టం... ఆగని వేధింపులు

ఎంత పెద్ద ఉద్యోగం చేస్తున్న మహిళలకైనా లైంగిక వేధింపులు తప్పడం లేదు. ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల కార్యాలయాల్లో, కార్ఖానాల్లో, కంపెనీల్లో ఉద్యోగాలు చేసుకునే మహిళలకు మన దేశంలోని అన్ని రాష్ట్రాల్లో రక్షణ కల్పించడానికి కేంద్రం ప్రవేశపెట్టిన పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నియంత్రణ, నిషేధ పరిష్కార చట్టం -2013 ఇంకా అమలులోకి సంపూర్ణంగా రాలేదు. దీంతో మహిళలు పనిచేసే చోట అవమానాలను ఎదుర్కొంటున్నారు.

ఈ తరహా కేసుల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే 3వ స్థానంలో నిలవగా ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచినట్లు జాతీయనేర గణాంక సంస్థ విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. తెలంగాణ రాష్ట్రం రెండున్నర సంవత్సరాలు దాటినా జిల్లాల్లో ఈ చట్టం నిర్దేశించిన లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు కార్యాలయాల్లో ఏర్పాటు చేయడం లేదు.

ఫిర్యాదు కమిటీ ఏర్పాటు విధానం - వివరణలు... ప్రతీ కార్యాలయం, సంస్థ, మహిళా అధికారిణి ఆధ్వర్యంలో మొత్తం సభ్యుల్లో సగం నుంచి మహిళలతో అంతర్గత కమిటీని అధికారులు ఏర్పాటు చేయాలి. ఫిర్యాదుల కమిటీ బాధిత మహిళా ఉద్యోగినికి అన్ని విధాల సహకరిస్తూ అండగా ఉంటూ 90 రోజుల్లోగా విచారణ పూర్తి చేయాలి. కమిటీ చేసిన సిఫార్సుల అమలు కోసం బాధిత సంబంధిత కార్యాలయాధికారికి, సంస్థ యాజమాన్యానికి జిల్లా అధికారి 60 రోజుల గడువు ఇవ్వాలి. మహిళా ఉద్యోగిని స్వచ్ఛందంగా బదిలీ లేదా సెలవు కోరినా సంబంధిత అధికారులు తప్పనిసరిగా మంజూరు చేయాలి. సంబంధిత శాఖ లేదా సంస్థ యాజమాన్యం ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయడంలో విఫలమైతే ఆ శాఖ అధికారిపై సంస్థ యాజమాన్యంపై ప్రభుత్వం జిల్లాల్లో (జిల్లా పాలనాధికారి) చర్యలు తీసుకోవాలి. రూ.50 వేల జరిమానా పదోన్నతులు నిలిపివేత, సస్పెన్షన్ చేసే వీలుంటుంది. ఆ మొత్తం ఫిర్యాదు తప్పుగా తేలితే ఆ మహిళా ఉద్యోగినిపై కూడా చర్యలు తీసుకుంటారు.

అధికారులు, సంస్థలు, యాజమాన్యాల విధులు... మహిళా ఉద్యోగినులకు సురక్షితమైన వాతావరణాన్ని పనిచేసేచోట కల్పించాలి. అంతర్గత ఫిర్యాదు కమిటీకి సంబంధించిన నోటీస్ బోర్డును అందరికీ కనిపించే ప్రదేశంలో ప్రదర్శించాలి.

మహిళా ఉద్యోగినిల రక్షణ చట్టం గురించి అందరికీ అవగాహన కల్పించడానికి ప్రభుత్వం ఉద్యోగులందరికీ (ఆడ/మగ) శిక్షణ కార్యక్రమాలు అన్ని ప్రభుత్వ శాఖ అధికారులు, సంస్థల యాజమాన్యాలు నిర్వహించాలి. అన్ని కార్యాలయాల్లో, సంస్థల్లో ఫిర్యాదుల బాక్స్‌లు ఏర్పాటు చేయాలి.

-హరి అశోక్ కుమార్
9440463498

రోగులపై ఇలా కూడా కరుణ చూపవచ్చు

ఆయన హిందూ దినపత్రికలో సుప్రసిద్ధమైన జర్నలిస్టు. కుమారుడికి కిడ్నీల సమస్య. డయాలిసిస్‌తో రోజులు గడిచిపోతున్నాయి. రాయవేలూరు, మద్రాసులోని అపోలో ఆస్పత్రి, ముంబయ్ నుంచి వచ్చిన ప్రపంచ ప్రఖ్యాత నెఫ్రాలజిస్టు - అందరూ నెలల తరబడి ఎంతెంతో వైద్యం చేశారు. లక్షలాది రూపాయల బిల్లుల చెల్లింపు జరిగింది. ఎట్టకేలకు ఒక దశలో ఈ కేసు ఇక నయమయ్యే అవకాశం లేదు అని తీర్మానించారు. తల్లిదండ్రులు సరేనని అనేట్లయితే పిల్లవాడికి ప్రాణాధార సదుపాయాలను ఉపసంహరిస్తామని ప్రతిపాదించారు.

కానీ, ఒక చిత్రం జరిగింది. తమకు అప్పటివరకూ ఎలాంటి నమ్మకమూ లేని హోమియోపతి వైద్యం ప్రయత్నించాలని తండ్రి ఆలోచించారు. రోగశాస్త్రంలోనే కాదు, హోమియోపతి వైద్యశాస్త్రంలో కూడా కేవలం అతి తక్కువ పరిజ్ఞానం కలిగిన ఒక మిత్రుడిని ఏమైనా ఆశ ఉందా అని దీనంగా అడిగారు. ప్రయత్నించడమే తప్ప, హామీలు ఇవ్వలేమని ఆ మిత్రుడు బదులిచ్చారు.


పంచదార మాత్రల వైద్యంలో ప్రాణం పోయినా పర్వాలేదని భావిస్తున్నానని చెప్పి ఆ జర్నలిస్టు తన కుమారుడికి హోమియోపతి వైద్యం చేయించారు.పిల్లవాడు ఆస్పత్రిలో ఉండగానే, అక్కడి వైద్యులకు తెలియకుండా ఈ వైద్యం జరిగింది. చిత్రంకాదు. అత్యంత సహజంగా పిల్లవాడు కొద్ది గంటల వ్యవధిలో కోలుకున్నాడు. ఏ వైద్య పరీక్షలలోనో ఎక్కడో పొరపాటు జరిగి ఉంటుందనీ, లేకుంటే పిల్లవాడు బతికే అవకాశమే లేదనీ ముంబయ్ నిపుణుడు చిందులు తొక్కారు. కానీ, ఆయన చేయదగినది ఏమీ లేదు. పిల్లవాడు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యాడు. తరువాత కాలంలో హోమియో కళాశాల పూర్వ ప్రధానోపాధ్యాయులు పావులూరి కృష్ణయ్య చౌదరి గారి వద్ద కొన్ని వారాలపాటు వైద్యం కొనసాగించారు. మధ్యలో ఒకటి రెండుసార్లు తిరిగి డయాలిసిస్ చేయాల్సిన అవసరం వచ్చినప్పటికీ, కొద్దిరోజుల వ్యవధిలోనే పిల్లవాడు సంపూర్ణంగా కోలుకున్నాడు. ఈ వాస్తవం ఏం పాఠం చెబుతుంది? ఏమి సందేశమిస్తుంది?

ఇలాంటి ఉదంతాలు లేదా అద్భుతాలు హోమియోపతి, ఆయుర్వేద వైద్యుల అనుభవంలో ఎన్నెన్నో చెప్పలేము. ఒక వైద్యవిధానంలో చికిత్స లేని ప్రాణప్రమాద కేసులను మరో వైద్యవిధానంలో చికిత్సలున్నాయి. ఇది సత్యం.కారుణ్య మరణాల గురించి విచారణ జరిపినప్పుడు సుప్రీం కోర్టు ఈ వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకున్నదీ లేనిదీ ఈ రచయితకు తెలియదు. కానీ, క్షేత్రస్థాయి లోని ఇటువంటి వాస్తవాలను పరిగణనలోకి తీసుకునే పక్షంలో సుప్రీం కోర్టు తీర్పు మరింత విస్తృతంగా ఉండేదని మాత్రం అనిపిస్తుంది.

తీర్పులు చెప్పడం, చట్టాలు చేయడం అన్ని వేళలా సంతోషం కలిగించే విషయాలు కావు. అనేక సందర్భాలలో అట్టి బాధ్యతలు మన నిస్సహాయ స్థితిని వెల్లడించే సందర్భాలు కూడా. జీవన్మరణ స్థితిలో నిస్సహాయంగా ఉన్న వ్యక్తి మృత్యువువైపు మొగ్గు చూపితే అందుకు పరోక్షంగా సహకరించడం నేరం కాదని ఎట్టకేలకు సుప్రీం కోర్టు ఒక నిర్ణయాన్ని వెలువరించింది. అభ్యుదయమైనదిగా కొందరు పరిగణిస్తున్న ఈ తీర్పు వాస్తవానికి యావత్ మానవజాతి నిస్సహాయతకు ఒక ప్రతీక. నిజానికి శాస్త్రజ్ఞులు అంత నిస్సహాయులు కారు. శాస్త్రాలు అంత నిస్సహాయమైనవి కావు. ఒక వైద్యవిధానంలో మరణమే శరణమైనప్పటికీ, మరో వైద్యవిధానం ప్రాణదాత అయిన కేసులు చరిత్రకెక్కకుండా కోకొల్లలుగా ఉన్నాయి. నిజానికి ప్రత్యామ్నాయ వైద్యవిధానాలను మూఢమైనవిగా కొట్టివేయకుండా వాటి ప్రయోజనాన్ని ప్రజలకు అందనివ్వడమే అసలైన అభ్యుదయం అవుతుంది.

ఒక వ్యక్తికి ఏదో ఒక రూపంలో విషమివ్వడం మృత్యువుకు ప్రత్యక్షంగా దోహదం చేయడం. అది హత్య అవుతుంది. తనే బుద్ధిపూర్వకంగా తీసుకుంటే ఆత్మహత్యా ప్రయత్నం అవుతుంది. క్రిటికల్ అనే పరిస్థితిలో ఉన్న సమయంలో ప్రాణాధార సదుపాయాలను ఉపసంహరించడం పరోక్షమైన కారుణ్య హత్యగా పరిగణిస్తారు. ఇది నేరం కాదని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. కానీ, క్షేత్రస్థాయిలో ఆలోచించవలసిన అంశాలు ఇంకా ఉన్నాయి కాబట్టి, సర్వోన్నత న్యాయస్థానం వాటిని కూడా కాలక్రమంలో పరిశీలనకు తీసుకుంటుందని ఆశిద్దాం!

నేటి కాలంలో ఆధునిక వైద్య సాంకేతికత పుణ్యంగా దేహవ్యవస్థలో కొన్ని భాగాలు



మృతి చెందకుండా నిలిపే సదుపాయాలున్నాయి. అంటే పంచప్రాణాలలో ఏ ఒక్కదానినో, కొన్నింటినో మాత్రమే నిలిపిఉంచే సాంకేతిక వైద్యతంత్రం. మరి, గతించిన ప్రాణాన్ని పునరుద్ధరించే అవకాశంగానీ, దానికదే కోలుకునే అవకాశం గానీ ఆ వైద్యవిధానంలో ఉన్నాయా? లేనప్పుడు లేదా ఖండితంగా అవి ఉన్నాయని చెప్పలేనప్పుడు అది మనిషి శవంగా మారకుండా జీవచ్ఛవంగా నిలిపి ఉంచడమే. దానిని వైద్యం అని అనలేము. అదొక విన్యాసం. అలాంటి విన్యాసాల వల్ల ఆధునిక ఆస్పత్రులకు డబ్బులు వర్షంలా కురుస్తాయి. కానీ, పాపం కుటుంబ సభ్యులకు ఆ రోగే దక్కడు. అలాంటప్పుడు బీమా ఛత్రం పూర్తయ్యే వరకు, అటు తరువాత రోగి కుటుంబం వద్ద ఉన్న డబ్బులు, అప్పు తెచ్చే సామర్థ్యం పూర్తిగా కరిగిపోయేంత వరకూ ఆస్పత్రులు తమ విన్యాసాలను కొనసాగిస్తాయి. ప్రయత్నశీలి అయిన మానవుడు చివరి శ్వాస వదిలేవరకూ ప్రయత్నం చేయాలనే స్ఫూర్తే అక్కడివరకూ అందరినీ నడిపిస్తుంది. కానీ అటు తరువాత?

ఆ ఆధునిక సదుపాయాలను ఉపసంహరించే ప్రసక్తి నెమ్మదిగా, లోపాయికారీగా బయటకు వస్తోంది. మృత్యువుకు పరోక్షంగా సహకరించడం అని దీనినే అంటున్నారు. ఏతావాతా ఆధునికమైందిగా చెబుతున్న వైద్యం రోగిని ఒక త్రిశంకు నరకంలో పడేసిందనే కఠిన వాస్తవాన్ని తరచుగా చూడాల్సివస్తోంది. మానవుడు ఆశావాది, ప్రయత్నశీలి అయినప్పుడు, రోగి కోలుకునే అవకాశాలు 50 శాతం కన్నా తక్కువకు పడిపోయిన సందర్భాలలో, లేదో రోగి బంధువులు కోరుకున్నప్పుడు ఇతర వైద్యవిధానాలతో సమన్వయ ప్రయత్నం చేయడానికి ఆస్పత్రులు అంగీకరించాలి. నిజానికి అదీ అభ్యుదయం. ఆదర్శం.

కానీ అప్పుడు ఆ ఆస్పత్రులు చేస్తున్న వాదన ఏమిటి? ఆస్పత్రి బాధ్యత ఏమీ లేదని రాసిచ్చి, ఆస్పత్రిలోని ఆక్సిజన్ తీసేసి, ప్రాణాధార సదుపాయాలు అన్నీ తీసేసి, అంబులెన్స్‌లో వేరే ఆస్పత్రికి తీసుకుపోయి, అక్కడ మీ ప్రయత్నాలు మీరు చేసుకుంటే మా అభ్యంతరం లేదు అని వారు చెబుతున్నారు. అంటే చివరి క్షణం దాకా ప్రయత్న శీలత అనే సిద్ధాంతాన్ని వీరే తుంగలోతొక్కుతున్నారు. దీని అర్థం చావైనా, రేవైనా మా చేతుల మీదుగానే అని పట్టుబట్టడమే. ఇది జీవించే అవకాశం ఉన్న రోగిని మరణించే నిస్సహాయతలోకి ప్రత్యక్షంగా నెట్టివేయడమే. మీ వైద్య విధానంలో రోగి కోలుకునే అవకాశం లేదని తెలిసినప్పుడు కేవలం మీ ప్రాణాధార సదుపాయాల వ్యాపారం స్థాయికి పవిత్ర వైద్యవృత్తిని దిగజార్చేయడం మినహా ఇది మరొకటి కాదు. ముందర ఈ సమస్య గురించి ఆలోచించాలి. కారుణ్య మరణం గురించి ఆలోచించాల్సిన సందర్భాల కన్నా ఎక్కువగా ఎదురవుతున్న సందర్భాలివి. మా ఆస్పత్రికి వచ్చారు కాబట్టి, మరో వైద్యవిధానాన్ని ప్రయత్నించడం నిషిద్ధం అనడం అనేక సందర్భాలలో రోగి మరణానికి ప్రత్యక్షంగా దోహదం చేయడమే. ఆధునిక ఆస్పత్రులలో పరిస్థితి చేయిదాటినప్పుడు గుర్తింపు పొందిన ఇతర వైద్యవిధానాలను ప్రయత్నించే హక్కు నిజమైన ప్రాణరక్షక పరిశోధనలకు వేదికను కల్పించడం కూడా అవుతుంది. అందుకే క్షేత్రస్థాయిలో ఉన్నవారు కేవలం కారుణ్యమరణాల గురించి కాకుండా, ప్రత్యామ్నాయాల ప్రయత్నాన్ని గురించి ముందుగా ఆలోచన చేస్తారు. జీవించే హక్కుకి అదే అసలైన రక్షణ. ఈ హక్కును తోసిరాజంటున్న ఆస్పత్రులు కారుణ్యమరణాల గురించి ఏమి చెప్పినా, అది ప్రజల నిస్సహాయ స్థితిని వారికి ఖరీదైన అద్దంలో చూపించడమే అవుతుంది.

విజయవాడలో ఎండీలు, ఎంఎస్‌లు దండిగా ఉన్న ఒకానొక వైద్యుల కుటుంబంలో ఒకరికి ఆస్మా వ్యాధి ఉండేది. దానికి వారు ఒక హోమియోపతి వైద్యుడిని ఇంటికి రప్పించుకుని, వారి వద్ద హోమియో వైద్యం తీసుకునే వారు. కానీ, తమ ఆస్పత్రికి వచ్చిన ఆస్మారోగులకు మాత్రం తమ ఇంజక్షన్‌లే పొడిచేవారు. తమ మాత్రలే రాలిచ్చేవారు. అంతే తప్ప హోమియోపతి వైద్యం ప్రయత్నించండని చెప్పేవారు కాదు.ఇవన్నీ క్షేత్రస్థాయి వాస్తవాలు.

ప్రస్తుత విషయానికివస్తే,క్లిష్టపరిస్థితులలో ముందుగా ప్రత్యామ్నాయ వైద్యాలను అనుమతించడాన్ని విధి, విధాయకం చేయాలి. రోగి చచ్చినా సరే ప్రత్యామ్నాయ వైద్యాలను అనుమతించడం అనే ఆస్పత్రులలో జరిగేవి కారుణ్యహత్యలు కావు. అవి ప్రత్యక్షహత్యలే అవుతాయి.

-జి.వి.ఎస్.మూర్తి
సీనియర్ పాత్రికేయులు

రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ

(భారత ప్రభుత్వము)

బహిరంగ ప్రకటన

(జాతీయ రహదారుల చట్టము 1956లోని సెక్షన్ 3-జి (3) క్రింద నోటీసు, ఎన్‌హెచ్- 161 పై సంగారెడ్డి- నాందేడ్ - అకోల సెక్షన్ లోని కి.మీ. 39.980 నుండి 66.210 వరకు నాలుగు లేన్ల రహదారి విస్తరణ కొరకు)

నెం.సి/2342/2016 తేది :20.03.2018

మెదక్ జిల్లా, మెదక్ రెవెన్యూ డివిజన్ పరిధిలో 161 నెంబరు జాతీయ రహదారి కి.మీ. 39.980 నుండి కి.మీ. 66.201 వరకు విస్తరణ చేయు నిమిత్తం భారత ప్రభుత్వ అధికార రాజపత్రంలో అసాధారణ భాగం-II, విభాగం 3, ఉప విభాగం (i) మార్చి 09, 2018 తేదీలో ప్రచురించబడిన నోటిఫికేషన్, ఎస్.ఓ 1061(ఇ)లో పేర్కొనబడిన ప్రకారం జాతీయ రహదారుల చట్టం, 1956లోని సెక్షన్ 3-డి(2) క్రింద దిగువ షెడ్యూల్‌లో సూచించిన నిర్మాణములు, చెట్లు వగైరాలతో కూడిన భూములు ఎటువంటి వివాదములు లేకుండా భారత ప్రభుత్వానికి సంక్రమించినవి. ఈ భూములందు గల నిర్మాణములపై ఆసక్తి గల వ్యక్తులు స్వయంగా లేదా మధ్యవర్తి ద్వారా, న్యాయ సలహాదారుల ద్వారా వారి భూములలో గల నిర్మాణములకు సంబంధించిన అసలు పత్రములు మరియు వాటి నకలు ప్రతులను తీసుకుని సంబంధిత అధీకృత అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, మెదక్ వారి సమక్షంలో, దిగువ పట్టికలో పేర్కొన్న తహసీల్దార్ వారి కార్యాలయంలో ఆయా గ్రామాల ఎదురుగా సూచించిన తేదీలో హాజరయి వారికి గల హక్కును ధృవపరచుకొనవలసిందిగా, తెలియజేయ వలసిందిగా కోరడమైనది.

క్ర. సంఖ్య	జిల్లా పేరు	మండలం పేరు	గ్రామం పేరు	విచారణ స్థలం	తేదీ మరియు సమయం
1	మెదక్	అల్లాదుర్గ్	చిల్వెర అల్లాదుర్గ్ ముస్లాపూర్ పెద్దాపూర్ రాంపూర్ కాయిదంపల్లి	తహసీల్దార్ వారి కార్యాలయం, అల్లాదుర్గ్	11.04.2018 ఉ॥10.00 గంటలు
2		శంకరంపేట (ఎ)	వెంకటాపూర్ (కల్లెల) కొల్లపల్లి తిరుమలాపూర్ కమలాపూర్ సిహెచ్.లక్ష్మాపూర్ (డి.పి) జంబికుంట	తహసీల్దార్ వారి కార్యాలయం, శంకరంపేట (ఎ)	13.04.2018 ఉ॥10.00 గంటలు
3		టేక్మాల్	బొడ్మట్‌పల్లి	తహసీల్దార్ వారి కార్యాలయం, టేక్మాల్	09.04.2018 ఉ॥10.00 గంటలు


షెడ్యూల్

తెలంగాణ రాష్ట్రంలోని మెదక్ జిల్లాలో జాతీయ రహదారి నెం.161 యొక్క కి.మీ. 39.980 నుండి కి.మీ.66.210(సంగారెడ్డి - నాందేడ్ - అకోలా సెక్షన్) వరకు గల భూ భాగంలో ఉన్న కట్టడాలతో లేదా కట్టడాలు లేకుండా, సేకరించవలసిన భూముల వివరణ.

సర్వే నెం.	భూమి రకం	భూమి స్వభావం	విస్తీర్ణం చ.మీ.	భూమి యజమానులు / ఆసక్తిగల వ్యక్తుల పేర్లు /అనుబంధ కట్టడాలు
1	2	3	4	5
మండలం : 1.అల్లాదుర్గ్				గ్రామం : (1) చిల్వెర
1	ప్రైవేట్	మెట్ట	1720	1) పి.ముణెమ్మ భర్త రామిరెడ్డి : ఇల్లు 2) పి.రుక్మమ్మ భర్త నర్సారెడ్డి : ఇల్లు 1-తుమ్మచెట్టు 3)చింతకాయల అంజయ్య తండ్రి భాగయ్య ఖాళీ ప్లాట్ 4) హస్సేనబీ భర్త సత్తార్ : ఖాళీ స్థలం 5)దూదేకుల జావేద్ తండ్రి మహ్మద్‌హుస్సేన్ : ఖాళీ ప్లాట్ 6) దూదేకుల అబ్దుల్ హుస్సేన్ తండ్రి బందేలి:ఖాళీ ప్లాట్
2	ప్రైవేట్	మెట్ట	1619	1)ఎం.నర్సారెడ్డి తండ్రి విఠల్‌రెడ్డి : ఆర్‌సిసి హౌస్ 2) ఎం.బోజిరెడ్డి తండ్రి వీరారెడ్డి : ఖాళీ ప్లాట్ 3) ఎం.జగన్‌రెడ్డి తండ్రి రామచంద్రారెడ్డి :ఖాళీ ప్లాట్ 4)ఎం.సంగారెడ్డి తండ్రి వీరారెడ్డి : ఖాళీ ప్లాట్ 5)ఎం.మోహన్‌రెడ్డి తండ్రి భీంరెడ్డి 6) ఎం.బోజిరెడ్డి తండ్రి విఠల్‌రెడ్డి 7) ఎం.మల్లారెడ్డి తండ్రి నారాయణరెడ్డి
252	ప్రైవేట్	మాగాణి	405	1)పి. ప్రభాకర్ రెడ్డి తండ్రి మాణిక్‌రెడ్డి 2) పి.చంద్రారెడ్డి తండ్రి మాణిక్‌రెడ్డి 3) పి.నర్సింహారెడ్డి తండ్రి మాణిక్‌రెడ్డి 4) పి.శ్రీనివాస్ రెడ్డి తండ్రి మాణిక్ రెడ్డి
253	ప్రైవేట్	మాగాణి	1579	1) పి.ప్రభాకర్ రెడ్డి తండ్రి మాణిక్‌రెడ్డి 2) పి.చంద్రారెడ్డి తండ్రి మాణిక్‌రెడ్డి 3) పి.నర్సింహారెడ్డి తండ్రి మాణిక్‌రెడ్డి 4) పి.శ్రీనివాస్ రెడ్డి తండ్రి మాణిక్ రెడ్డి
279	ప్రైవేట్	మాగాణి	328	1) ఎనమదిరి బోక్రాబీ భర్త నబీసాబ్
330	ప్రైవేట్	మెట్ట	51	1)పోతరాజు లచ్చమ్మ భర్త మాణికయ్య 2)పోతరాజు భూమమ్మ భర్త భూమయ్య 3)పోతరాజు మొగులయ్య తండ్రి పాపయ్య
332	ప్రైవేట్	మాగాణి	388	తాయబ్ బాను తండ్రి ఆరిఫొద్దిన్
333	ప్రైవేట్	మాగాణి	269	చిట్టెపు లచ్చమ్మ భర్త విఠల్ రెడ్డి
335	ప్రైవేట్	మాగాణి	999	చిట్టెపు లచ్చమ్మ భర్త విఠల్ రెడ్డి
357	ప్రైవేట్	మెట్ట	521	స్మశానం : స్మశానం
407	ప్రైవేట్	మెట్ట	152	ఎం.ఎ. బేలాల్ అహ్మద్ తండ్రి అబ్దుల్ సహీం
410	ప్రైవేట్	మెట్ట	1012	1)ఎంఎ ఇసామొద్దీన్ తండ్రి హమీముద్దీన్ 2)ఎంఎ వహీనొద్దీన్ తండ్రి అబ్దుల్ రహీం
411	ప్రైవేట్	మెట్ట	405	దర్గాభూమి : దర్గాభూమి
412	ప్రైవేట్	మెట్ట	202	ఎండి అలీమొద్దీన్ ఖురేషీ తండ్రి హమీనొద్దీన్
758	ప్రైవేట్	మెట్ట	905	దేవస్థ విఠల్ తండ్రి లచ్చానాయక్
759/1	ప్రైవేట్	మెట్ట	504	1)చిట్టెపు శిరిషమ్మ భర్త రాంరెడ్డి 2)ముక్తాపూర్ సంగయ్య భర్త జర్గయ్య
762	ప్రైవేట్	మెట్ట	45	పొదారం సంగమేశ్వర్ తండ్రి విఠల్
792	ప్రైవేట్	మెట్ట	568	పట్లోళ్ళ రమేష్ రెడ్డి తండ్రి బాల్‌రెడ్డి
మండలం : 1.అల్లాదుర్గ్				గ్రామం : (2) అల్లాదుర్గ్
261	ప్రైవేట్	మెట్ట	776	1)శ్రీ లంబాడి సంగ్యానాయక్ తండ్రి రాంజినాయక్ 2)శ్రీవద్యా రాంజినాయక్ తండ్రి రెడ్యానాయక్
110	ఇనాం	మాగాణి	304	వాంకిడి లింగయ్య తండ్రి బాలయ్య
112	ఇనాం	మాగాణి	1922	మంగలి రామకిష్టయ్య తండ్రి బాలయ్య
113	ప్రైవేట్	మెట్ట	911	దేవళ్ళ అశోక్ తండ్రి పీరయ్య
114	ప్రైవేట్	మాగాణి	405	మంగలి నాగమణి భర్త పోచయ్య
116	ఇనాం	మాగాణి	1113	1)మంగలి కిష్టయ్య తండ్రి రామయ్య 2) మంగలి రాజు తండ్రి పోచయ్య
119	ఇనాం	మాగాణి	2428	1)బానంగారి బలరాం తండ్రి పెంటయ్య 2) నక్కా బాలయ్య తండ్రి మొగులయ్య 3) బండ బేతయ్య తండ్రి దుర్గయ్య
120	ప్రైవేట్	మాగాణి	1113	వడ్లగోమయ్య తండ్రి శివరాములు
124	ప్రైవేట్	మాగాణి	1416	1)అవుల బ్రహ్మం తండ్రి సాయిలు 2)అవుల పెంటయ్య తండ్రి కొండయ్య 3)అవుల సత్యమ్మ భర్త నాగయ్య 4)అవుల మణెమ్మ భర్త చంద్రయ్య 5)అవుల భాగమ్మ భర్త ఎల్లయ్య 6)అవుల వెంకయ్య తండ్రి కొండయ్య 7)అవుల విజయ భర్త యాదయ్య 8)అవుల అంజయ్య తండ్రి మానయ్య 9)అవుల అంజయ్య తండ్రి భాగయ్య
125	ప్రైవేట్	మాగాణి	2023	1)అవుల అంజయ్య తండ్రి మానయ్య 2)అవుల బ్రహ్మ తండ్రి సాయిలు 3)అవుల విజయ భర్త యాదయ్య 4) అవుల నర్సింహ తండ్రి అశయ్య
126	ఇనాం	మాగాణి	405	ఆకుల వెంకటరాములు తండ్రి వెంకటేశం
127	ప్రైవేట్	మాగాణి	1113	మంగలి కిష్టయ్య తండ్రి కేశయ్య
128	ఇనాం	మాగాణి	3642	ఈర్ల విజయాదేవి భర్త ప్రేమారెడ్డి
129	ఇనాం	మాగాణి	5767	ఈర్ల విజయాదేవి భర్త ప్రేమారెడ్డి
157	ఇనాం	మాగాణి	3035	ఈర్ల విజయాదేవి భర్త ప్రేమారెడ్డి
158	ఇనాం	మాగాణి	4958	ఈర్ల విజయాదేవి భర్త ప్రేమారెడ్డి
159	ఇనాం	మాగాణి	1214	ఈర్ల విజయాదేవి భర్త ప్రేమారెడ్డి
165	ఇనాం	మాగాణి	911	వెంకటేశ్వర దేవస్థానం దేవాలయం
166	ఇనాం	మాగాణి	2833	1)చింతరబోయిన పోచయ్య తండ్రి లింగయ్య 2)తిమ్మాపురం పాపమ్మ భర్త పోచయ్య 3)తిమ్మాపురం సోతమ్మ భర్త భూమయ్య
167	ఇనాం	మాగాణి	4452	1)బోయిని బేతయ్య తండ్రి రామయ్య 2)బోయిని దుర్గయ్య తండ్రి రామయ్య
177	ప్రైవేట్	మాగాణి	3946	బండ సత్యమ్మ భర్త బేతయ్య
284	ప్రైవేట్	మెట్ట	3440	బండ సాయిలు తండ్రి బేతయ్య
379	ప్రభుత్వ	మెట్ట	31160	1)దేవసోత్ చావ్లి బాయి భర్త లోక్యానాయక్ 2)దేవసోత్ ఈశ్వర్ నాయక్ తండ్రి జోగ్యానాయక్ 3)దేవసోత్ దేప్లి బాయి భర్త సోమ్లానాయక్ 4)దేవసోత్ నంగుబాయి భర్త రమేష్ :1 ఆర్‌సిసి ఇల్లు 5)దేవసోత్ తారాబాయి భర్త రాంచందర్ :1ఆర్‌సిసి ఇల్లు 6)దేవసోత్ గంసీబాయి భర్త ఈశ్వర్‌నాయక్:1-ఆర్‌సిసి ఇల్లు 7)దేవసోత్ శంకర్ తండ్రి ఈశ్వర్‌నాయక్ 8)రామిగారి లక్ష్మినారాయణ తండ్రి పెంటయ్య : 1-ఆర్‌సిసి జి+1, 1-బోరు 9)బండ సత్యమ్మ భర్త బేతయ్య 10) బండదుర్గయ్య తండ్రి బక్కయ్య 11)మంగలి సంతోషకుమార్ తండ్రి కిష్టయ్య:1-బేస్‌మెంట్ 12)నాయకోటి రమేష్ తండ్రి అగమయ్య 13)బోడయాదగిరి తండ్రి చంద్రయ్య 14)యామగిరి పొచేందర్ తండ్రి చంద్రయ్య: 1-ఆర్‌సిసిఇల్లు 15)జంగం ప్రభు తండ్రి వెంకయ్య 16) ప్రభుత్వ ఆసుపత్రి 17) ఎంఇఓ కార్యాలయం 18) ఎంపిడిఓ కార్యాలయం 19)ఎంఆర్ఓ కార్యాలయ రోడ్డు 20)బక్క అశయ్య తండ్రి బాలయ్య : 4 షట్టర్లు 21) బానన్నగారి బాల్‌రాం తండ్రి పెంటయ్య :1-హోటల్ 22)దేవసోత్‌మోహన్‌రాథోడ్ తండ్రి రావత్ :1-హోటల్ 23)గొల్ల రాములు తండ్రి భూమయ్య : 1 -ఆర్‌సిసి భవనం, షట్టర్లు 24)రామిగారి శ్రీనివాస్ తండ్రి పెంటయ్య 25)పోలీస్ స్టేషన్ 26) గ్రామ రోడ్డు 27)దూసరి విఠల్ తండ్రి కిష్టయ్య 28)దేవసోత్ జిమ్మీ బాయి భర్త జన్యానాయక్ 29)అంగోత్ ప్రమీల భర్త గంగారాం 30)మంగలి నాగమణి భర్త పోచయ్య 31)ప్రభుత్వ భూమి
262	ప్రైవేట్	మెట్ట	912	1)డి.గంసీబాయి భర్త ఈశ్వర్‌నాయక్ 2)ఎం.శశికళ భర్త జగదీశ్వర్ 3)లంబాడి హెర్కిబాయి భర్త తాగ్య
264	ప్రైవేట్	మెట్ట	2096	1)నూనావత్ శంకర్ తండ్రి సోమ్యానాయక్ 2)నూనావత్ దేవిదాస్ తండ్రి సోమ్యానాయక్
281	ఇనాం	మెట్ట	2903	ఈర్ల సులోచన భర్త అంజిరెడ్డి
393	ప్రైవేట్	మెట్ట	4304	1)లంబాడి రాములు తండ్రి హెరాబ్యా 2) లంబాడి మేరీ బాకి భర్త విఠల్ 3)లంబాడి శంకర్ తండ్రి అంబర్యా 4)దేవసోత్ బీంలాల్ తండ్రి శంకర్ 5)మూరోని బాయి భర్త రామచందర్ 6)గంగులూరి నాగరాజు తండ్రి వీరసంగప్ప
394	ప్రైవేట్	మెట్ట	8610	1) ఎండి జహీరుద్దీన్ తండ్రి షర్ఫుద్దీన్ 2)షమీన్ బేగం భర్త అబ్దుల్ అలీం 3)ఎండి పాషా తండ్రి ఖాదర్‌సాబ్
402	ఇనాం	మెట్ట	760	1)దూసరి రుక్కమ్మ భర్త అంజయ్య 2) లంబాడి సోమ్లాబాయి భర్త మారుతి
మండలం : 1.అల్లాదుర్గ్				గ్రామం : (3) ముస్లాపూర్
165	ప్రైవేట్	మెట్ట	46	1) చెందు పోచయ్య తండ్రి లింగయ్య 2) చెందు ఎల్లయ్య తండ్రి లింగయ్య
168	ప్రైవేట్	మెట్ట	1060	1) బందారుగళ్ల సంజీవ రావు తండ్రి దాసు 2) మద్దూరి పొంతమ్మ తండ్రి బసలింగప్ప
196	ప్రైవేట్	మెట్ట	3764	శ్రీమతి బేగరి సువర్ణ భర్త ప్రభాకర్
197	ప్రైవేట్	మెట్ట	280	జోగయ్య తండ్రి పెంటయ్య
199	ప్రైవేట్	మెట్ట	5362	1) బేగరి సావిత్రి భర్త భరత్ కుమార్ 2) బేగరి మొగులయ్య తండ్రి రామయ్య 3) బేగరి రాములు తండ్రి రామయ్య 4) బేగరి సంగమ్మ భర్త అంజయ్య 5) మహ్మద్ జమాలొద్దీన్ తండ్రి మూర్తుజ
208	ప్రైవేట్	మెట్ట	6148	1) నైకిని బాగయ్య తండ్రి నాగయ్య 2) వడ్ల చంద్రయ్య తండ్రి భూమయ్య 3) నైకిని కిష్టయ్య తండ్రి నారాయణ 4) సుందర చైతన్య స్వామి ఆశ్రమం 5) చర్చి
209	ప్రైవేట్	మెట్ట	2226	1) శ్రీశైలం రెడ్డి తండ్రి రాంరెడ్డి 2) వెంకట్ రెడ్డి తండ్రి కిష్టా రెడ్డి 3) కిష్టా గౌడ్ తండ్రి ఎల్లా గౌడ్
210	ప్రైవేట్	మెట్ట	3611	1) మూరి మణెమ్మ భర్త దుర్గయ్య 2) మూరి బాలయ్య తండ్రి దుర్గయ్య 3) మూరి శంకరమ్మ భర్త మల్లయ్య 4) మూరి సుశీల భర్త ఎల్లయ్య
మండలం : 1.అల్లాదుర్గ్				గ్రామం : (4) పెద్దాపూర్
311	ప్రైవేట్	మెట్ట	618	శ్రీమతి ఫాతిమా సలాం భర్త సలాం బావజీర్
312	ప్రభుత్వ	మెట్ట	6779	1) ఎండి. మునీరుద్దీన్ అన్వర్ తండ్రి సాదత్ హుస్సేన్ 2) ఎండి. సిరాజొద్దీన్ అహ్మద్ తండ్రి సాదత్ 3) ఎండి. కరీమొద్దీన్ అసద్ తండ్రి సాదత్ హుస్సేన్
359	ప్రైవేట్	మెట్ట	6576	1) గొరగళ్ల కిష్టయ్య తండ్రి అశయ్య 2) వెంకట్ గౌడ్ తండ్రి వెంకట్ గౌడ్ 3) రాయపల్లి సత్యనారాయణ తండ్రి నారాయణ
315	ఇనాం	మెట్ట	4259	1) ఎండి సాజిద్ తండ్రి అబ్దుల్ అజీజ్
316	ప్రైవేట్	మెట్ట	4333	1) పట్నం రాములు తండ్రి జోగయ్య 2) పట్నం సత్యం తండ్రి అంజయ్య
317	ప్రైవేట్	మెట్ట	3213	1) ఎండి. లైక్-ఉర్-రెహమాన్ తండ్రి షైక్-ఉర్-రెహమాన్ 2) పర్వీన్ సుల్తాన్ తండ్రి షఫిక్-ఉర్-రెహమాన్ 3) ఎండి.అతీబ్-ఉర్-రెహమాన్ తండ్రి షైక్-ఉర్-రెహమాన్ 4) ప్రభుత్వ భూమి (సబ్ - స్టేషన్)
318	ప్రైవేట్	మెట్ట	4499	1) లంబాడి లక్ష్మి భర్త పెద్ద రాములు 2) లంబాడి మాస్య తండ్రి ఇస్రా 3) రేష్మా బేగం భర్త అహ్మద్ సయ్యద్ అజాజ్ 4) కడావత్ రాములు తండ్రి పెద్ద కాసన్య 5) ఎందూరి మానయ్య తండ్రి నర్సయ్య 6) ఎందూరి కిష్టయ్య తండ్రి నర్సయ్య 7) ఎందూరి మల్లమ్మ భర్త నర్సయ్య 8) ఎందూరి మల్లయ్య తండ్రి అతవయ్య 9) ఎందూరి బీజయ్య తండ్రి అంజయ్య
మండలం : 1.అల్లాదుర్గ్				గ్రామం : (5) రాంపూర్
95	ప్రైవేట్	మెట్ట	962	శ్రీమతి గువ్వా వెంకమ్మ భర్త కిష్టయ్య శ్రీమతి గువ్వా రామకిష్టమ్మ భర్త కిష్టయ్య
96	ప్రైవేట్	మాగాణి	5059	1) శ్రీమతి లంబాడి మోత్య తండ్రి బాల్ నాయక్ 2) శ్రీ లంబాడి విఠల్ తండ్రి రూప్యా 3) శ్రీ మల్లయ్యగారి నారాయణ్ గౌడ్ తండ్రి రాందాస్ గౌడ్ 4) శ్రీ మల్లయ్య గారి కిష్టా గౌడ్ తండ్రి నారాయణ గౌడ్ 5) శ్రీ మల్లయ్య గారి నాగరత్నం గౌడ్ తండ్రి నారాయణ గౌడ్ 6) శ్రీ మల్లయ్య గారి బలరాం గౌడ్ తండ్రి నారాయణ గౌడ్
99	ప్రైవేట్	మాగాణి	1315	1) శ్రీ మల్లయ్యగారి నారాయణ్ గౌడ్ తండ్రి రాందాస్ గౌడ్ 2) శ్రీ మల్లయ్య గారి కిష్టా గౌడ్ తండ్రి నారాయణ గౌడ్ 3) శ్రీ మల్లయ్య గారి నాగరత్నం గౌడ్ తండ్రి నారాయణ గౌడ్ 4) శ్రీ మల్లయ్య గారి బలరాం గౌడ్ తండ్రి నారాయణ గౌడ్
100	ప్రైవేట్	మాగాణి	8296	1) శ్రీ మల్లయ్యగారి నారాయణ్ గౌడ్ తండ్రి రాందాస్ గౌడ్ 2) శ్రీ మల్లయ్య గారి కిష్టా గౌడ్ తండ్రి నారాయణ గౌడ్ : 2 - బోర్లు, 1- పైప్ లైన్ 3) శ్రీ మల్లయ్య గారి నాగరత్నం గౌడ్ తండ్రి నారాయణ గౌడ్ 4) శ్రీ మల్లయ్య గారి బలరాం గౌడ్ తండ్రి నారాయణ గౌడ్
149	ప్రభుత్వ	మెట్ట	23877	1) శ్రీ గొండా వెంకటేశం తండ్రి లింగమయ్య 2) శ్రీ గొండా లక్ష్మయ్య తండ్రి లింగమయ్య 3) శ్రీ గొండా విఠల్ తండ్రి లింగమయ్య 4) శ్రీమతి గువ్వా రామ కిష్టమ్మ భర్త కిష్టయ్య 5) శ్రీమతి గువ్వా వెంకమ్మ భర్త కిష్టయ్య 6) శ్రీ ఎం. నారా గౌడ్ 7) శ్రీ ఎం. సాయిరాం గౌడ్ తండ్రి రామా గౌడ్ 8) శ్రీ ఎం. సంగా గౌడ్ తండ్రి రామాగౌడ్ 9) శ్రీ ఎం. అశోక్ గౌడ్ తండ్రి రామాగౌడ్ 10) శ్రీ ఎం. శ్రీనివాస్ గౌడ్ తండ్రి రామాగౌడ్ 11) శ్రీ ఎం. వెంకయ్య తండ్రి కిష్టయ్య 12) శ్రీ గొండా నర్సిములు తండ్రి పోచయ్య 13) శ్రీ గొండా అనుసమ్మ భర్త నర్సిములు 14) శ్రీ నారా గౌడ్ తండ్రి అస్మాయిల్ గౌడ్ 15) శ్రీ మల్లయ్యగారి నారాయణ్ గౌడ్ తండ్రి రాందాస్ గౌడ్ 16) శ్రీ మల్లయ్య గారి కిష్టా గౌడ్ తండ్రి నారాయణ గౌడ్ 17) శ్రీ మల్లయ్య గారి నాగరత్నం గౌడ్ తండ్రి నారాయణ గౌడ్ 18) శ్రీ మల్లయ్య గారి బలరాం గౌడ్ తండ్రి నారాయణ గౌడ్ 19) శ్రీ తలారి మల్లయ్య తండ్రి పోచయ్య 20) శ్రీమతి తలారి భూమయ్య భర్త రామయ్య 21) శ్రీ తలారి చంద్రయ్య తండ్రి రామయ్య 22) శ్రీ తలారి శంకరయ్య తండ్రి రామయ్య 23) శ్రీ తలారి మల్లేశం తండ్రి ఎల్లయ్య 24) శ్రీ బేగరి దుర్గయ్య తండ్రి వెంకయ్య 25) శ్రీ బేగరి బాలమ్మ భర్త రామయ్య 26) శ్రీ బేగరి శాంతమ్మ భర్త శివయ్య 27) శ్రీ బేగరి నాగమ్మ భర్త పోచయ్య 28) శ్రీ బేగరి రామయ్య తండ్రి నర్సయ్య
211	ప్రభుత్వ	మెట్ట	1518	1) శ్రీ బక్కన్న గారి నాగి రెడ్డి తండ్రి గాలి రెడ్డి 2) గ్రామ రోడ్డు
220	ప్రైవేట్	మాగాణి	152	శ్రీ బక్కన్నగారి రఘురాం రెడ్డి తండ్రి నాగిరెడ్డి
221	ప్రైవేట్	మాగాణి	506	బక్కన్నగారి రఘురాం రెడ్డి తండ్రి నాగిరెడ్డి
222	ప్రైవేట్	మాగాణి	3035	1) శ్రీ కె. శేషారెడ్డి తండ్రి కృష్ణా రెడ్డి 2) శ్రీ బక్కన్నగారి రఘురాం రెడ్డి తండ్రి నాగిరెడ్డి
226	ప్రైవేట్	మాగాణి	2732	శ్రీ కన్నయ్యగారి రవీందర్ తండ్రి లక్ష్మణ్
227	ప్రైవేట్	మాగాణి	1872	1) శ్రీ పిప్పల సంగమేశ్వర్ తండ్రి అగమయ్య 2) శ్రీ కె. శేషారెడ్డి తండ్రి కృష్ణా రెడ్డి
229	ప్రైవేట్	మాగాణి	2125	1) శ్రీ పిప్పల సంగమేశ్వర్ తండ్రి అగమయ్య 2) శ్రీమతి కొప్పుల మానస తండ్రి శేషారెడ్డి
230	ప్రైవేట్	మాగాణి	405	1) శ్రీ ఎర్రబోయిన శైలు తండ్రి మోతయ్య 2) శ్రీ రామయ్యగారి కిషోర్ తండ్రి లక్ష్మి నారాయణ
231	ప్రైవేట్	మాగాణి	1416	శ్రీ యాటకారి భూమయ్య తండ్రి పోచయ్య
234	ప్రభుత్వ	మెట్ట	10927	1) శ్రీ జక్కుల బాగయ్య తండ్రి మల్లయ్య : 1- బోరు 1- పైప్ లైన్ 2) శ్రీ జక్కుల పీరయ్య తండ్రి మల్లయ్య 3) శ్రీ జక్కుల లింగయ్య తండ్రి మల్లయ్య 4) శ్రీ జక్కుల కేశమ్మ తండ్రి మల్లయ్య 5) శ్రీ వజ్జ శ్రీను తండ్రి విఠల్ 6) శ్రీ వజ్జ రామవులు తండ్రి రమేష్ 7) శ్రీమతి మ్యాదరి లింగమ్మ భర్త విఠల్: 1 -బోరు 8) శ్రీ ఎం. దుర్గేష్ తండ్రి కిష్టయ్య 9) శ్రీ ఎం.బుచ్చయ్య తండ్రి లింగం: 1- బేతిపంపు 10) పెద్దమ్మ గుడి
260	ప్రైవేట్	మెట్ట	5160	1) శ్రీ గొండా వెంకయ్య తండ్రి కిష్టయ్య 2) శ్రీ గొండా ఎల్లయ్య తండ్రి పెంటయ్య 3) శ్రీ గొండా శ్రీనివాస్ తండ్రి నర్సిములు 4) శ్రీమతి గొండా అనుసమ్మ తండ్రి విఠల్ 5) శ్రీమతి గొండా బేతమ్మ భర్త శంకరయ్య 6) శ్రీ గొండా బాల కిష్టయ్య తండ్రి రాజయ్య 7) శ్రీ గొండా విఠల్ తండ్రి లింగమయ్య 8) శ్రీ గొండా నాగయ్య తండ్రి పెంటయ్య 9) శ్రీ గొండా విఠల్ తండ్రి ఈశయ్య
263	ప్రైవేట్	మెట్ట	809	1) శ్రీ శెట్టి గారి సంగయ్య తండ్రి రామయ్య 2) శ్రీ శెట్టి గారి మొగులయ్య తండ్రి రామయ్య 3) 2) శ్రీ శెట్టి గారి దుర్గయ్య తండ్రి కిష్టయ్య
264	ప్రైవేట్	మెట్ట	8195	1) శ్రీమతి బక్కయ్య గారి నర్సమ్మ భర్త విఠల్: 1 -బోరు 1 - పైప్ లైన్ 2) శ్రీ కారంగుల కొండల్ రెడ్డి తండ్రి కిష్టా రెడ్డి 3) శ్రీ మంగలి సాయిరాం తండ్రి శివయ్య 4) శ్రీ మల్లయ్య గారి మాణిక్ గౌడ్ తండ్రి శంకర్ గౌడ్ 5) శ్రీ బక్కన్న గారి జయరాంరెడ్డి తండ్రి బాల్ రెడ్డి 6) శ్రీ గొతు రమేష్ 7) శ్రీ గొండా లక్ష్మయ్య : 1 - ఇల్లు 8) శ్రీ కొత్త శైలు 9) ఆశ్రమం 10) శ్రీ ఎం. సంగమ్మ భర్త అశోక్ గౌడ్ : 1 -దాబా బేస్‌మెంట్ 11) శ్రీ కె. సాయ గౌడ్ తండ్రి పెంట గౌడ్: బేస్‌మెంట్ 12) శ్రీ అవురం పోచయ్య తండ్రి బాలయ్య 13) శ్రీ గొండా సాయిబాబా తండ్రి దుర్గయ్య
265	ప్రైవేట్	మెట్ట	6374	1) శ్రీమతి కారంగుల అమల భర్త వెంకట్రాం రెడ్డి 2) శ్రీమతి కారంగుల దానమ్మ భర్త విఠల్ రెడ్డి 3) శ్రీ ఎడికి శంకర్ 4) శ్రీ శెట్టిగారి దుర్గయ్య 5) శ్రీ శెట్టిగారి సంగయ్య 6) శ్రీ శెట్టిగారి మొగులయ్య
266	ప్రైవేట్	మెట్ట	6774	1) శ్రీ గొండా విఠల్ తండ్రి లింగమయ్య : 1-బోరు, పైప్ లైన్ 2) శ్రీ గొండా నగయ్య తండ్రి పెంటయ్య 3) శ్రీ గొండా అనుసమ్మ భర్త విఠల్ 4) శ్రీ గొండా రవీందర్ తండ్రి నాగయ్య 5) శ్రీ గొండా విఠల్ తండ్రి ఈశయ్య 6) శ్రీ గొండా బేతమ్మ భర్త శంకరయ్య 7) శ్రీ గొండా బాలకిష్టయ్య తండ్రి రామయ్య: పైప్ లైన్
మండలం : 1.అల్లాదుర్గ్				గ్రామం : (6) కైదంపల్లి
18	ప్రైవేట్	మెట్ట	1922	తిమ్మాపురం పాపమ్మ భర్త పోచయ్య
19	ప్రైవేట్	మెట్ట	10522	1) బేస్త వెంకయ్య తండ్రి భూమయ్య 2) తిమ్మాపురం పాపమ్మ భర్త పోచయ్య
22	ప్రభుత్వ	మెట్ట	32273	1) నాగారం మలమ్మ భర్త శివయ్య 2) నాగారం గంగమ్మ భర్త బాలయ్య 3) నాగారం బేతయ్య తండ్రి నాగయ్య 4) నాగారం బేతయ్య తండ్రి రామయ్య 5) నాగారం లక్ష్మయ్య తండ్రి నాగయ్య 6) నాగారం శివయ్య తండ్రి లక్ష్మయ్య 7) నాగారం బేతయ్య తండ్రి లక్ష్మయ్య 8) ప్రభుత్వ భూమి
23	ప్రైవేట్	మెట్ట	2529	మూసిగారి అతివమ్మ భర్త విఠల్
36	ప్రభుత్వ	మెట్ట	12241	1) వంకిడి భూమయ్య తండ్రి రామయ్య 2) నాగారపు మల్లయ్య తండ్రి బాలయ్య 3) గుడేలు బేతమ్మ భర్త శివరాములు 4) ముసిరిగారి బాగయ్య తండ్రి కిష్టయ్య 5) ముసిరిగారి మల్లయ్య తండ్రి కిష్టయ్య 6)ముసిరిగారి రాములు తండ్రి కిష్టయ్య 7) ప్రభుత్వ భూమి
66	ప్రైవేట్	మాగాణి	607	1) జల భూమయ్య తండ్రి ఎల్లయ్య 2) జల కేశయ్య తండ్రి నాగయ్య 3) జల సాయిలు తండ్రి మల్లయ్య 4) జల పోచమ్మ భర్త అంజయ్య 5) జల సాయిలు తండ్రి బాలయ్య 6) జల రాజయ్య తండ్రి దుర్గయ్య 7) జల దుర్గయ్య తండ్రి బాగయ్య 8) లీల భూమయ్య తండ్రి రాజయ్య 9) జల సత్యమ్మ భర్త రాజయ్య 10) జల అగమయ్య తండ్రి భూమయ్య 11) జల రాములు తండ్రి పీరయ్య 12) జల మోతయ్య తండ్రి లింగయ్య 13) జల భూమయ్య తండ్రి కిష్టయ్య 14) జల భూమయ్య తండ్రి ఎల్లయ్య
68	ప్రైవేట్	మెట్ట	5261	1) నత్తి కిష్టయ్య తండ్రి దుర్గయ్య 2) నత్తి బాగయ్య తండ్రి దుర్గయ్య
69	ప్రైవేట్	మాగాణి	607	1) జల మోతయ్య తండ్రి సంగయ్య 2) జల సాయి కృష్ణ తండ్రి నాగయ్య 3) జల దిలీప్ కుమార్ తండ్రి నాగయ్య 4) జల దుర్గయ్య తండ్రి బాగయ్య 5) జల సాయిలు తండ్రి మల్లయ్య 6) జల రాజయ్య తండ్రి దుర్గయ్య 7) జల కేశయ్య తండ్రి నాగయ్య
70	ప్రభుత్వ	మాగాణి	1214	1) జల మోతయ్య తండ్రి లింగయ్య 2) జల బేతయ్య తండ్రి మోతయ్య 3) జల దుర్గయ్య తండ్రి పోచయ్య 4) లీల దుర్గయ్య తండ్రి రామయ్య 5) లీల భూమయ్య తండ్రి పాపయ్య
71	ప్రైవేట్	మాగాణి	3743	1) జల రామయ్య తండ్రి దుర్గయ్య 2) జల మోతయ్య తండ్రి లింగయ్య 3) గుమ్మాని ప్రమీల భర్త భూషణం 4) జల కేశయ్య తండ్రి నాగయ్య 5) జల భూమయ్య తండ్రి మోతయ్య 6) జల మల్లయ్య తండ్రి మోతయ్య 7) జల అగమయ్య తండ్రి భూమయ్య 8) జల బాలయ్య తండ్రి పీరయ్య 9) జల సాయిలు తండ్రి ఎల్లయ్య 10) జల రాములు తండ్రి పీరయ్య 11) జల సాయిలు తండ్రి దుర్గయ్య 12) జల పోచయ్య తండ్రి అంజయ్య 13) జల సాయి కృష్ణ తండ్రి నాగయ్య 14) జల దిలీప్ కుమార్ తండ్రి నాగయ్య 15) జల దుర్గయ్య తండ్రి బాగయ్య 16) జల సాయిలు తండ్రి మల్లయ్య
72	ప్రభుత్వ	శిఖం	1922	శిఖం భూమి
73	ప్రైవేట్	మాగాణి	2732	1) జల భూమయ్య తండ్రి ఎల్లయ్య 2) జల కేశనయ్య తండ్రి నాగయ్య 3) జల రాజయ్య తండ్రి దుర్గయ్య 4) జల సాయిలు తండ్రి ఎల్లయ్య 5) లీల పోచమ్మ భర్త అంజయ్య 6) జల మల్లయ్య తండ్రి మోతయ్య 7) జల అగమయ్య తండ్రి భూమయ్య 8) జల గున్నమ్మ భర్త దుర్గయ్య 9) జల మల్లయ్య తండ్రి ఎల్లయ్య 10) గుమాని ప్రమీల భర్త భూషణం 11) జల భూమయ్య తండ్రి కిష్టయ్య 12) జల రాజమల్లయ్య తండ్రి కిష్టయ్య 13) లీల దుర్గయ్య తండ్రి బాగయ్య 14) జల సవిత భర్త శ్రీనివాస్ 15) జల రాజయ్య తండ్రి దుర్గయ్య 16) జల అనూషమ్మ భర్త బేతయ్య
75	ప్రైవేట్	మాగాణి	2833	1) నార్ల భూమయ్య తండ్రి బాగయ్య 2) నార్ల కిషన్ తండ్రి హనుమయ్య 3) నార్ల పెంటయ్య తండ్రి లక్ష్మయ్య 4) నార్ల భూమయ్య తండ్రి శివరాములు 5) నార్ల లింగయ్య తండ్రి శివరాములు 6) నార్ల దుర్గమ్మ భర్త సంగయ్య
76	ప్రైవేట్	మెట్ట	304	1) నార్ల భూమయ్య తండ్రి బాగయ్య 2) నార్ల కిషన్ తండ్రి హనుమంతు 3) నార్ల పెంటయ్య తండ్రి లక్ష్మయ్య 4) నార్ల భూమయ్య తండ్రి శివరాములు 5) నార్ల లింగయ్య తండ్రి శివరాములు 6) నార్ల భూమయ్య తండ్రి శివరాములు
78	ప్రైవేట్	మాగాణి	3035	1) నార్ల భూమయ్య తండ్రి శివరాములు 2) నార్ల దుర్గమ్మ భర్త సంగయ్య 3) నార్ల భూమయ్య తండ్రి బాగయ్య 4) నార్ల పెంటయ్య తండ్రి లక్ష్మయ్య 5) నార్ల కిషన్ తండ్రి హనుమయ్య
79	ప్రైవేట్	మాగాణి	809	గోను శ్రీనివాస్ తండ్రి భూమయ్య
80	ప్రభుత్వ	మాగాణి	2630	1) ఎర్రగొల్ల సావిత్రి భర్త సంగయ్య 2) నార్ల సంగయ్య తండ్రి దుర్గయ్య
82	ప్రైవేట్	మాగాణి	1619	1) ముసిరిగారి బాలయ్య తండ్రి అగమయ్య 2) ముసిరిగారి పోచయ్య తండ్రి కిష్టయ్య 3) ముసిరిగారి బాగయ్య తండ్రి కిష్టయ్య 4) ముసిరిగారి మల్లయ్య తండ్రి కిష్టయ్య
83	ప్రైవేట్	మాగాణి	1214	1) నార్ల భూమయ్య తండ్రి బాగయ్య 2) నార్ల కిషన్ తండ్రి హనుమయ్య 3) నార్ల పెంటయ్య తండ్రి లక్ష్మయ్య 4) నార్ల లింగయ్య తండ్రి శివరాములు 5) నార్ల దుర్గమ్మ భర్త సంగయ్య 6) నార్ల భూమయ్య తండ్రి శివ రాములు
84	ప్రైవేట్	మెట్ట	7578	1) వాంకిడి దుర్గయ్య తండ్రి బాగయ్య: చింత చెట్టు 2) వాంకిడి మల్లయ్య తండ్రి బాగయ్య 3) వాంకిడి లక్ష్మయ్య తండ్రి లింగయ్య: చింత చెట్టు 4) వాంకిడి సిద్దయ్య తండ్రి శివయ్య 5) వాంకిడి పెంటయ్య తండ్రి రామయ్య 6) వాంకిడి భూమయ్య తండ్రి రామయ్య
మండలం: 2. శంకరంపేట (ఎ)				గ్రామం: (1) వెంకటాపూర్ (కల్లెల)
86	ప్రైవేట్	మెట్ట	101	పులబోయిన నారాయణ తండ్రి మల్లయ్య
91/1 91/21	ప్రైవేట్	మెట్ట	1825.32	1) లంబాడి నాగమణి భర్త కిష్టయ్య 2) పున్యా తండ్రి హరి చంద్ 3) శంకర్ తండ్రి తుక్యా 4) లంబాడి హెర్కి భర్త కాంద్యా 5) లంబాడి చండి భర్త వెంక్య 6) పులబోయిన నర్సయ్య తండ్రి మల్లయ్య 7) పులబోయిన బేతయ్య తండ్రి మల్లయ్య 8) పులబోయిన నారాయణ తండ్రి మల్లయ్య 9) పులబోయిన రామమ్మ భర్త సంగయ్య 10) చాకలి బేతయ్య తండ్రి లింగయ్య 11) చాకలి గోపాల్ తండ్రి లింగయ్య 12) చాకలి మొగులమ్మ భర్త బాలయ్య 13) చాకలి బేతయ్య తండ్రి పాపయ్య 14) చాకలి పోచయ్య తండ్రి పాపయ్య 15) చాతిక్ నాయక్ తండ్రి జాగ్య
54	ప్రైవేట్	మెట్ట	1099.37	1) చాకలి పోచయ్య తండ్రి దుర్గయ్య 2) చాకలి మల్లేశం తండ్రి దుర్గయ్య 3) మిద్దెకింది పాపయ్య తండ్రి మోతయ్య 4) మిద్దెకింది సాయిలు తండ్రి మోతయ్య 5) మిద్దెకింది రామ కిష్టయ్య తండ్రి మోతయ్య 6) చాకలి నారాయణ తండ్రి మల్లయ్య 7) చాకలి నారాయణ తండ్రి మొగులయ్య
85	ప్రైవేట్	మెట్ట	1307.42	1) చాకలి బేతయ్య తండ్రి లింగయ్య 2) చాకలి గోపాల్ తండ్రి లింగయ్య 3) చాకలి మొగులమ్మ భర్త బాలయ్య 4) చాకలి ముత్తయ్య తండ్రి పాపయ్య 5) చాకలి పోచయ్య తండ్రి పాపయ్య 6) చాకలి మల్లేశం తండ్రి దుర్గయ్య 7) చాకలి పోచయ్య తండ్రి దుర్గయ్య 8) చాకలి మణెమ్మ భర్త నారాయణ
మండలం: 2. శంకరంపేట (ఎ)				గ్రామం: (2) కొళ్ళపల్లి
12	ప్రైవేట్	మాగాణి	1012	గంపల పెంటమ్మ తండ్రి లక్ష్మయ్య
13	ప్రైవేట్	మాగాణి	1315	గంపల పెంటమ్మ తండ్రి లక్ష్మి
14	ఇనాం	మాగాణి	911	1) గొండ్ల క్రిష్ణ తండ్రి సత్తయ్య 2) గొండ్ల మోతయ్య తండ్రి రామకిష్టయ్య 3) గొండ్ల సాయమ్మ భర్త నర్సింలు 4) గొండ్ల నర్సింలు తండ్రి మాణిక్యం 5) గొండ్ల శంకరయ్య తండ్రి లక్ష్మయ్య
15	ఇనాం	మాగాణి	809	1) యాటకారి రామయ్య తండ్రి లక్ష్మయ్య 2) యాటకారి సంగయ్య తండ్రి రామయ్య 3) యాటకారి దుర్గయ్య తండ్రి లక్ష్మయ్య
63	ప్రైవేట్	మెట్ట	6576	1) చాకలి లచ్చమ్మ భర్త ముత్తయ్య 2) చాకలి నాగయ్య తండ్రి రామయ్య 3) చాకలి పోచయ్య తండ్రి పాపయ్య 4) చాకలి నారాయణ తండ్రి బాలయ్య 5) చాకలి బేతయ్య తండ్రి లింగయ్య 6) చాకలి గోపాల్ తండ్రి లింగయ్య 7) చాకలి బేతయ్య తండ్రి బాలయ్య 8) చాకలి నాగయ్య తండ్రి రామయ్య
64	ప్రైవేట్	మెట్ట	1113	1) పుల్లబోయిన నారాయణ తండ్రి మల్లయ్య 2) పుల్లబోయిన నర్సింలు తండ్రి మల్లయ్య 3) పుల్లబోయిన నారాయణ తండ్రి రామయ్య 4) పుల్లబోయిన గోవర్ధన్ తండ్రి సంగయ్య
69	ప్రభుత్వ	మెట్ట	3136	1) చాకలి మొగులమ్మ భర్త పోచయ్య 2) చాకలి లక్ష్మయ్య తండ్రి చంద్రయ్య 3) చాకలి సాయిలు తండ్రి బాలయ్య 4) చాకలి మాణిక్యం తండ్రి బాలయ్య 5) చాకలి ముత్తయ్య తండ్రి అశన్న
184	ప్రైవేట్	మెట్ట	4495	1) ధారావత్ రాములు తండ్రి బాల్యా నాయక్ 2) ధారావత్ ధనసింగ్ తండ్రి రూప్లా 3) ధారావత్ లోక్య తండ్రి రూప్లా 4) ధారావత్ సత్తి బాయి తండ్రి గామ్య
185/17 185/21 185/23 185/24 185/25 185/26 185/27 185/41 185/42	ప్రభుత్వ	మెట్ట	8126	1) బేగారి దుర్గయ్య తండ్రి పెంటయ్య 2) బేగరి సాయిలు తండ్రి రామయ్య 3) హట్కారి సుశీలా బాయి భర్త జనార్ధన్ రావు
191	ప్రైవేట్	మెట్ట	1343	1) టి. శివరాం సింగ్ తండ్రి గోపాల్ సింగ్ 2) టి. రాం స్వరూప్ సింగ్ తండ్రి శివరాం సింగ్
193	ప్రైవేట్	మెట్ట	2032	1) మంగలి మొగులయ్య తండ్రి రామయ్య 2) పులబోయిన రాజు తండ్రి భీమయ్య 3) శ్రీనివాస్ గౌడ్ తండ్రి రాము గౌడ్
206	ప్రైవేట్	మెట్ట	141	నడిమింటి దుర్గయ్య తండ్రి బీతయ్య
208	ప్రైవేట్	మెట్ట	911	1) కుమ్మరి రాజు చారి తండ్రి ఈశ్వరయ్య చారి 2) చాకలి పేరమ్మ భర్త గంగయ్య 3) మిద్దెకింది రాములు తండ్రి చంద్రయ్య 4) గొండ్ల సత్యమ్మ భర్త సత్తయ్య 5) గొండ్ల క్రిష్ణ తండ్రి సత్తయ్య
212	ప్రైవేట్	మెట్ట	1579	1) గంప కాశమ్మ భర్త దుర్గయ్య, 1 - ఇల్లు 2) గంప కిషన్ తండ్రి దుర్గయ్య 1- ఇల్లు 3) కుమ్మరి నారాయణ తండ్రి లక్ష్మయ్య 1- ఇల్లు 4) కుమ్మరి యాదయ్య తండ్రి నారాయణ 1 - ఇల్లు 5) పులబోయిన సత్తమ్మ భర్త కిష్టయ్య 1 -ఇల్లు 6) పులబోయిన టిల్లు తండ్రి కిష్టయ్య 1 - ఇల్లు 7)యాటకారి దుర్గయ్య తండ్రి హనుమయ్య 8) పులబోయిన బేతయ్య తండ్రి లక్ష్మయ్య 1- ఇల్లు 9) బద్దారం పెంటయ్య తండ్రి పోశెట్టి 10) మంగలి శివయ్య తండ్రి పోశెట్టి 11) మంగలి సంగమేశ్వర్ తండ్రి బేతయ్య 12) మంగలి ప్రవీణ్ తండ్రి బేతయ్య 1 బేస్‌మెంట్ 13) హెచ్. శ్రీనివాస్ రావు తండ్రి నారయణ్ రావు 1 - బేస్‌మెంట్ 14) హెచ్. వినోద్ రావు తండ్రి విఠ్ఠల్ రావు 1- పెంకుటిల్లు 15) గొడ్ల సత్యమ్మ భర్త నర్సింలు
244	ప్రైవేట్	మాగాణి	458	1) గంపల మొగులయ్య తండ్రి లక్ష్మయ్య 2) గంపల లింగయ్య తండ్రి బాలయ్య 3) గంపల దుక్కమ్మ భర్త లింగయ్య 4) గంపల దుర్గయ్య తండ్రి వెంకయ్య 5) గంపల కిషన్ తండ్రి దుర్గయ్య 6) గంపల దుర్గమ్మ భర్త బేతయ్య 7) గంపల కిషన్ తండ్రి దుర్గయ్య
245	ప్రైవేట్	మాగాణి	1416	1) గంపల మొగులయ్య తండ్రి లక్ష్మయ్య 2) గంపల గంగారం తండ్రి బాగయ్య 3) గంపల దుర్గయ్య తండ్రి పాపయ్య 4) గంపల యాదయ్య తండ్రి అశోక్ 5) గంపల దుక్కవ్వ భర్త లింగయ్య 6) గంపల కిషన్ తండ్రి దుర్గయ్య 7) గంపల కాశమ్మ భర్త దుర్గయ్య
249	ప్రైవేట్	మాగాణి	1338	1) మంగలి అనుషమ్మ భర్త లక్ష్మయ్య 2) మంగలి బాలమ్మ భర్త లక్ష్మయ్య 3) మంగలి బాలయ్య తండ్రి లింగయ్య 4) మంగలి రామయ్య తండ్రి లింగయ్య 5) మంగలి అశోక్ తండ్రి లింగయ్య 1 - బోరు బావి 6) మంగలి రామయ్య తండ్రి లింగయ్య
250	ప్రైవేట్	మాగాణి	606	1) మంగలి అనుషమ్మ భర్త లక్ష్మయ్య 2) మంగలి మొగులయ్య తండ్రి రామయ్య
252	ప్రైవేట్	మాగాణి	1529	చాకలి మోతయ్య తండ్రి అశోక్
254	ప్రైవేట్	మాగాణి	1498	టి. శివరాం సింగ్ తండ్రి గోపాల్ సింగ్
255	ప్రైవేట్	మాగాణి	2226	చాకలి మోతయ్య తండ్రి అశయ్య
256	ప్రైవేట్	మాగాణి	405	వడ్ల దుర్గయ్య తండ్రి మల్లయ్య
మండలం: 2. శంకరంపేట (ఎ)				గ్రామం: (3) తిరుమలాపూర్
1	ప్రభుత్వ	మెట్ట	2483.25	బిల్డింగ్ మరియు ఖాళీ స్థలం : కన్యకాపరమేశ్వరి టెంపుల్ బిల్డింగ్స్ & ఓపెన్ స్థలం
236	ప్రైవేట్	మెట్ట	3075	1) పోతరాజు సుదర్శన్ తండ్రి లింగయ్య 2) పోతరాజు రాధాకిషన్ తండ్రి లింగయ్య 1- చింత చెట్టు 3) పోతరాజు మోహన్ తండ్రి లింగయ్య
235	ఇనాం	మాగాణి	264	1) కోయిల కొండ లక్ష్మి భర్త నారాయణ 2) కోయిల కొండ నర్సింలు తండ్రి పర్వయ్య
233	ప్రభుత్వ	మెట్ట	1853	పోరం బోకు స్థలం: ఏ.పి. ల్యాండ్
232	ప్రైవేట్	మెట్ట	2066	1) చాకలి జోగవ్వ భర్త మల్లయ్య 2) చాకలి పెద్ద కిష్టయ్య తండ్రి అశయ్య
163	ప్రైవేట్	మాగాణి	8868	1) వడ్ల జగ్గుబాయి భర్త వైద్యనాథ్ 2) బొగ్గుల పెంటయ్య తండ్రి లింగయ్య 3) బొగ్గుల రాములు తండ్రి లింగయ్య 4) మంగలి మనోహర్ తండ్రి సాయిలు: బోరు బావి & కేసింగ్ వైర్ 5) మంగలి లచ్చమ్మ భర్త సాయిలు 6) మంగలి పద్మ భర్త శివరాములు 7) మంగలి వెంకటేశం 8) మంగలి మల్లికార్జున తండ్రి మల్లయ్య
161	ప్రైవేట్	మాగాణి	996	1) కందుకూరి భూషణం తండ్రి నారాయణ 2) కందుకూరి నర్సింలు తండ్రి నారాయణ
139	ప్రైవేట్	మాగాణి	1350	బండి పీరమ్మ భర్త భూమయ్య
138	ప్రైవేట్	మాగాణి	349	1) పాసుల సంగమ్మ భర్త భాగయ్య 2) పాసుల సాయిలు తండ్రి పెంటయ్య
147	ప్రైవేట్	మాగాణి	1076	1) సిరిసన్ సాయి రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి 2) హొట్కారి నర్సయ్య తండ్రి పాపయ్య & ఇతరులు
128	ప్రైవేట్	మాగాణి	1148	విగ్రం గౌరాగౌడ్ తండ్రి యెల్లాగౌడ్
261	ప్రైవేట్	మెట్ట	2098	1) వైద్యనాథ్: 1-ఆర్‌సిసి ఇల్లు & 1-బోరు, 2) వడ్ల విఠల్: 1-సా మిల్, 3) సంగారెడ్డి : 1- పెంకుటిల్లు 4) వడ్ల శ్రీను : 1-ఆర్‌సిసి ఇల్లు 5) పట్లోళ్ళ రాంరెడ్డి
13	ప్రైవేట్	మెట్ట	3237	ఎ. సావిత్రి భర్త రామాచారి
14	ప్రైవేట్	మెట్ట	1922	మురళీచారి తండ్రి కేశవ చారి & ఇతరులు
17	ప్రైవేట్	మెట్ట	16188	1) పాసుల వెంకట నర్సమ్మ భర్త వెంకటయ్య 2) నీరుడి భూమమ్మ భర్త సాయిలు 3) లద్ద లింగమ్మ భర్త రామయ్య 4) తంపులూరి లక్ష్మినారాయణ 5) తంపులూరి సాయిలు తండ్రి రాములు 6) కొండా భూమయ్య తండ్రి చంద్రయ్య 7) సయ్యద్ మహ్మద్ తండ్రి సయ్యద్ సాబ్ 8) మురళీచారి తండ్రి కేశవ చారి & ఇతరులు
18	ప్రైవేట్	మెట్ట	708	శేషాచారి తండ్రి భరత్ చారి
19	ప్రైవేట్	మెట్ట	10117	1) మురళీచారి తండ్రి కేశవ చారి 2) శికం స్థలం
20	ప్రైవేట్	మెట్ట	2428	టీచర్స్ కాలనీ
30	ప్రైవేట్	మెట్ట	7170	1) పెల్లబోయిన బాగయ్య 2) జిన్నా సంగమ్మ భర్త ఈశ్వరయ్య 3) జిన్నా లక్ష్మి భర్త నారాయణ
29	ప్రైవేట్	మెట్ట	11201	1) గండ్ల రాజశేఖర్ 2) గండ్ల లింగయ్య : 1-బోరు బావి- 10- చింతచెట్లు, 7- కొబ్బరి చెట్లు, 3- శ్మశానం
26	ప్రైవేట్	మెట్ట	6306	1) మంగలి లింగయ్య 2) ఆర్.ఎస్. అరుణ భాయి భర్త లక్ష్మణ్, 3) బాల్‌రాం లక్ష్మణ్ 4) శేరిపల్లి దుర్గయ్య
27	ప్రైవేట్	మెట్ట	6596	1) బాల్‌రాం లక్ష్మణ్, 2) నీలకంఠి మాణిక్యం 3) కలాలి శ్రీనివాస్ గౌడ్, 4) బెంటకి కిష్టయ్య .
234	ప్రైవేట్	మెట్ట	1077	కోయిల కొండ నర్సింలు తండ్రి పార్వతయ్య
256	ప్రైవేట్	మెట్ట	2175	1) పుసాల వెంకట నర్సమ్మ భర్త వెంకయ్య 2) మురళి చారి తండ్రి కేశవచారి 3) మోడల్ స్కూల్ హాస్టల్
129	ప్రైవేట్	మెట్ట	1315	విగ్రాం గౌర గౌడ్ తండ్రి ఎల్లాగౌడ్
130	ప్రైవేట్	మెట్ట	127	మురళి పంతులు తండ్రి శేషాచారి
141	ప్రైవేట్	మెట్ట	1720	1) హొదగిరి విజయ భర్త రాములు 2) హొదగిరి కేశయ్య తండ్రి కిష్టయ్య 3) హొదగిరి బీతయ్య తండ్రి పోచయ్య
142	ప్రైవేట్	మెట్ట	1012	1) సున్నం నర్సింలు తండ్రి రాములు 2) సున్నం సంగమ్మ భర్త నర్సింలు
160	ప్రైవేట్	మాగాణి	3050	1) అలి ఖాన్ తండ్రి మొయినుద్దీన్ ఖాన్, 2) మొహ్మద్ జకీర్ తండ్రి గౌసెమియ 3) మొహ్మద్ యాదుల్లా తండ్రి గౌసెమియ
140	ప్రైవేట్	మాగాణి	1805	1) వడ్ల యద్యనాథ్ తండ్రి కేశప్ప 2) కందుకూరి నర్సింలు 3) కందుకూరి భూషణం తండ్రి నర్సింలు
మండలం: 2. శంకరంపేట(ఎ)				గ్రామం: (5) కమలాపూర్
1	ప్రైవేట్	మెట్ట	8098	1) వడ్ల విఠల్ తండ్రి అంజయ్య 2) వడ్ల సరస్వతి భర్త నాగయ్య 3) వడ్ల బాలయ్య తండ్రి అంజయ్య 4) వడ్ల మల్లమ్మ భర్త లక్ష్మయ్య 5) వడ్ల చిన్న విఠల్ తండ్రి నారాయణ 6) వడ్ల శ్రీనివాస్ తండ్రి దుర్గయ్య 7) వడ్ల చిన్న దుర్గయ్య తండ్రి చంద్రయ్య
11	ప్రైవేట్	మెట్ట	3542	1) సీతన్నగారి రాజేశ్వర్ రాము తండ్రి శంకర్ రావు 2) సీతన్నగారి దాత రావు తండ్రి శంకర్ రావు 3) సీతన్నగారి సీతారామారావు తండ్రి శంకర్ రావు
15	ప్రైవేట్	మెట్ట	6704	1) నీలకంటి మాణిక్యం తండ్రి అంజయ్య 2) జాడు సాయిలు తండ్రి పోచయ్య 3) భూపతి కాశయ్య తండ్రి బాలయ్య 4) భూపతి బాలయ్య తండ్రి బాలయ్య 5) భూపతి అంజయ్య తండ్రి బాలయ్య 6) నందయ్యగారి మోహన్ తండ్రి చత్రు 7) జాడు సాయిలు తండ్రి బాలయ్య 8) కలాలి శ్రీనివాస్ గౌడ్ తండ్రి దుర్గా గౌడ్ 9) కలాలి చంద్రకళ భర్త లక్ష్మా గౌడ్: 1-బోరు 10) రంగరాజ్ నౌలె లక్ష్మణ్ తండ్రి చొండిబ 11) కుంట సంగమేశ్వర్ రెడ్డి తండ్రి రాజారెడ్డి 12) కలాలి తులసి భర్త శ్రీనివాస్ గౌడ్ 13) జాడు దుర్గయ్య తండ్రి గంగయ్య 14) కలాలి శ్రీనివాస్ గౌడ్ తండ్రి దుర్గా గౌడ్ 15) కలాలి దుర్గా గౌడ్ తండ్రి లక్ష్మా గౌడ్ 16) కలాలి నాగార్జున గౌడ్ తండ్రి విట్టా గౌడ్ 17) కలాలి సువర్ణ భర్త లక్ష్మా గౌడ్ 18) కలాలి దుర్గా గౌడ్ తండ్రి లింగా గౌడ్
16	ప్రైవేట్	మెట్ట	3236	1) యశోదా బాయి భర్త శరణప్ప 2) ఎస్.కళావతి భర్త సుభాష్ 3) కుంట సంగయ్య తండ్రి శివ మల్లయ్య 4) కలాలి సువర్ణ భర్త లక్ష్మా గౌడ్ 5) ఎల్లమ్మ గుడి: 2 - ట్రాన్స్‌ఫార్మర్లు 6) నాంచారమ్మ గుడి, 7) తోట యాదగిరి తండ్రి విఠల్ 8) చిన్నా బాలయ్య తండ్రి గంగయ్య: 1- బోరు
125	ప్రైవేట్	మెట్ట	1203	1) జాడు ఎల్లయ్య తండ్రి లక్ష్మయ్య 2) బెంకటి లింగయ్య తండ్రి భూమయ్య 3) కలాలి ప్రభావతి భర్త నారాగౌడ్
126	ప్రైవేట్	మెట్ట	369	1) తోట పెద్ద నర్సింలు తండ్రి వెంకయ్య 2) తోట కిష్టమ్మ భర్త విఠల్ 3) కలాలి చంద్రకళ భర్త దుర్గా గౌడ్
మండలం: 2. శంకరంపేట (ఎ)				గ్రామం: (6) సిహెచ్.లక్ష్మాపూర్ (డిపి)
3	ప్రైవేట్	మెట్ట	202	నీలకంటి పాండురంగం తండ్రి వెంకయ్య & ఇతరులు
4	ప్రైవేట్	మెట్ట	1518	1) చాకలి బాలయ్య తండ్రి రామయ్య 2) సమ్మక్క సారలమ్మ గద్దె 3) శివనూర్ పోచమ్మ గుడి
5	ప్రైవేట్	మెట్ట	405	వడ్ల శ్రీనివాస్ తండ్రి దుర్గయ్య & ఇతరులు
6	ప్రైవేట్	మెట్ట	141	1) కుంటి పోచమ్మ 2) కుంటి దుర్గయ్య 3) కుంటి కాశయ్య 4) కుంటి లక్ష్మయ్య

(మిగతా 6వ పేజీలో)

Andhraprabha business 2018
బిజినెస్
BUSINESS



త్వరలో కొత్త టెలికామ్ పాలసీ

న్యూఢిల్లీ: కొత్త టెలికామ్ పాలసీ దాదాపుగా సిద్ధమైందని కేంద్ర మంత్రి మనోజ్ సిన్హా తెలిపారు. కేబినెట్ ఆమోదం పొందిన అనంతరం కొత్త పాలసీని వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెడతామని వెల్లడించారు. దీనదయాళ్ స్పర్ష్ యోజన పురస్కారాల ప్రదానోత్సవానికి మంత్రి మంగళవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర కేబినెట్ ఇటీవల టెలికామ్ రిలీఫ్ ప్యాకేజీకి ఆమోదం తెలపటంతో టెలికామ్ రంగం మంచి విజయాన్ని ఆస్వాదిస్తున్నదని తెలిపారు. ఈ విజయం కొనసాగుతుందని, భారత్ మంచి కనెక్టివిటీని కొనసాగిస్తుందని ఆయన అన్నారు. టెలికామ్ కంపెనీలు స్పెక్ట్రమ్ కోసం కొత్త పేమెంట్ షెడ్యూల్ లేదా ప్రస్తుత విధానం ఎంచుకోవచ్చని తెలిపారు. కేబినెట్ ఈ నెల మొదట్లో టెలికమ్ కంపెనీలు స్పెక్ట్రమ్‌కు 10 సంవత్సరాలకు బదులుగా 16 సంవత్సరాలకు పైగా చెల్లింపులు జరిపేందుకు అనుమతి ఇచ్చింది. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న రంగానికి ఊరటనిస్తున్నట్టుగా మరిన్ని ఎయిర్ వేవ్స్ కలిగి ఉండటానికి సైతం కంపెనీలను అనుమతించింది. స్పెక్ట్రమ్ కలిగి ఉండటంపై పెట్టుబడులను సడలించింది. వోడాఫోన్, ఐడియా లాంటి కంపెనీల మధ్య విలీనాలకు ఉపకరిస్తున్నది.



ఉపాధికి కొత్త టరమ్!



● అన్ని రంగాలకు 'నిర్ణీత కాల ఉపాధి' ● ఉద్వాసన నోటీసుకిక చెల్లు చీటీ

న్యూఢిల్లీ: ప్రభుత్వం నిర్ణీత కాల ఉపాధిపై కార్మికులను పనిలోకి తీసుకునే సదుపాయాన్ని అన్ని రంగాలకు వర్తింప జేసింది. నిర్దేశిత ప్రాజెక్టులు, కార్యకలాపాలు లేదా ఆర్డర్లు పూర్తి చేయడానికి ప్రజలను పనిలోకి తీసుకోవాలనుకునే వారి సులభ తర వ్యాపారం(ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) మెరుగుదలకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. 1946 నాటి పారిశ్రామిక సిబ్బంది(స్టాండింగ్ ఆర్డర్) ఉత్తర్వు ప్రకారం ఈ సదుపాయ కేవలం దుస్తుల తయారీ రంగానికి మాత్రమే వర్తించేది. కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ సదరు ఉత్తర్వును సవరిస్తూ జారీ చేసిన ఒక నోటిఫికేషన్‌లో దుస్తుల తయారీ రంగంలో నిర్ణీత కాల ఉపాధి అనే పదానికి బదులుగా నిర్ణీత కాలిక ఉపాధి అని పదాన్ని ఉంచింది. అన్ని రంగాలకు అది వర్తిస్తుందని అర్థమిచ్చింది. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గత మాసం మొదట్లో తన బడ్జెట్ ప్రసంగంలో నిర్ణీత కాల ఉపాధి సదుపాయాన్ని అన్ని రంగాలకు వర్తింపజేస్తాము అని తెలిపారు. పారిశ్రామిక ఉపాధి(స్టాండింగ్ ఆర్డర్) చట్టంలో నిర్ణీత కాల ఉపాధిని దుస్తుల తయారీ రంగంలో 2016, అక్టోబర్ మాసంలో ప్రవేశపెట్టారు. నిర్ణీత కాల ఉపాధి ఉద్యోగ కాలపరిమితి, సర్వీసు, వేతనాల షరతులను ప్రవచిస్తుంది. పలు కార్మిక చట్టాల కింద రెగ్యులర్ ఉద్యోగులు పొందే ప్రయోజనాలను నిర్ణీత కాల పరిధి సదుపాయం వర్తింపజేస్తుంది. ఒక కాంట్రాక్టు కార్మికునితో పోలిస్తే స్వల్ప కాల పరిమితికి ఉపాధి పొందిన కార్మికుడు మెరుగైన పని, సర్వీసు పరిస్థితులను పొందుతాడు. తాత్కాలిక కార్మికులు లేదా బీడీ కార్మికులకు పని నుంచి తొలగిస్తూ నోటీసు ఇవ్వాల్సిన అవసరం లేదని తాజా సవరణ సూచిస్తున్నది. కార్మికుని సేవలను నిలుపదల చేసినప్పుడు లేదా కాంట్రాక్టు పునరుద్ధరణకు నోచుకోనప్పుడు లేదా ఉపాధి కాల వ్యవధికి కాలం చెల్లినప్పుడు నిర్ణీత కాల కార్మికుడు ఎలాంటి నోటీసు లేదా అదనపు చెల్లింపునకు అర్హులు కారు. క్రమం తప్పకుండా మూడు నెలల సర్వీసు పూర్తి చేసుకున్న ఒక తాత్కాలిక కార్మికుని కాంట్రాక్టులో పొందుపరిచిన నిబంధనలకు విరుద్ధంగా తొలగించాలనుకున్నప్పుడు అతడికి రెండు వారాల నోటీసు ఇవ్వాలని సవరణ స్పష్టం చేస్తున్నది. నిర్ణీత కాల కార్మికుడు పర్మనెంట్ కార్మికుడి తరహాలో వేతనాలు, పని గంటలు, భత్యాలు, ఇతర చట్టబద్ధమైన ప్రయోజనాలను పొందుతారు. ఒక కార్మికుడు కాంట్రాక్టు ప్రాతిపదికన ఒక నిర్ణీత కాల వ్యవధికి ఉపాధి పొందడంగా నిర్ణీత కాల ఉపాధి నిర్వచించబడింది. సంబంధిత యజమాని, కార్మికుడి మధ్య కాంట్రాక్టు పునరుద్ధరణకు నోచుకోని పక్షంలో సదరు కార్మికుడు అయాచితంగా ఉద్యోగం నుంచి తప్పుకుంటాడు. దానిని ఉద్యోగం నుంచి తొలగించినట్టుగా భావించరాదు. ఈ సదుపాయం కాలానుగుణంగా ఉత్పత్తి చేస్తూ గిరాకీలో ఆటుపోట్లను చవిచూసే రంగాల్లో కార్మికులను నియమించుకోవడానికి సాయపడుతుంది. కార్మికుని తీసుకోవడంలో వెసులుబాటును కల్పిస్తుంది. దీని కింద ఎలాంటి కాంట్రాక్టర్ మధ్యవర్తిత్వంతో పనిలేకుండా యజమాని ఒక నిర్ణీత కాల వ్యవధికి ఒక కార్మికుని నేరుగా తీసుకోవచ్చు.

వస్త్ర పరిశ్రమలకు మంచి భవిష్యత్తు

కొరియన్ ప్రతినిధులతో జయేష్ రంజన్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదనీ, భవిష్యత్తులో ఈ పరిశ్రమకు మహర్దశ పట్టనుందని పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ చెప్పారు. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చిన కొరియా కంపెనీకి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని అన్నారు. వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధి చెందడానికి సానుకూల అంశాలు ఉన్నాయని చెప్పారు. దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ వస్త్ర తయారీ సంస్థ టీకే కెమికల్స్ కార్పొరేషన్ ప్రతినిధి బృందంతో జయేష్ రంజన్, టిఎస్-ఐఐసి ఎండి నర్సింహారెడ్డి మంగళవారం సమావేశమయ్యారు. పరిశ్రమలశాఖ మంత్రి కేటీ రామారావు పిలుపు మేరకు రాష్ట్ర పర్యటనకు వచ్చిన ఈ కొరియన్ టెక్స్‌టైల్ కంపెనీ టీకే కెమికల్స్ కార్పొరేషన్ బృందంలో ఆ కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ టీకే కిమ్, జనరల్ మేనేజర్ ఎస్‌బి కిమ్, అసిస్టెంట్ మేనేజర్ కేఎస్ క్వాన్, జియోన్ ఇంటర్నేషనల్ ఎండి కార్తికేయ ఉన్నారు. టీకే కెమికల్స్ కార్పొరేషన్‌కు యాన్ ఫిలమెంట్ వస్త్ర తయారీలో దక్షిణ కొరియాలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది. కొరియన్ ఫెడరేషన్ టెక్స్‌టైల్స్ ఆధ్వర్యంలోని ఈ కంపెనీ ఫిలమెంట్, స్పాండెస్, లైక్రా, యాన్ ఫిలమెంట్ దుస్తులను తయారు చేస్తోంది.

జలమార్గాలు.. అభివృద్ధికి రాదారులు

• రవాణా వ్యయంలో కోతకు ఊతం • కాలుష్య నివారణ, ఉపాధి కల్పన • గోవాలో ఫెర్రీ బోట్ సర్వీస్ ప్రారంభించిన మంత్రి గడ్కరీ



పనాజీ: దేశంలో లాజిస్టిక్స్ వ్యయం తగ్గింపునకు జల మార్గాల మెరుగదల ఆవశ్యకతను కేంద్ర షిప్పింగ్ మంత్రి నితిన్ గడ్కరీ ప్రధానంగా ప్రస్తావించారు. అది దేశ ఆర్థిక వ్యవస్థతో పాటుగా పర్యాటక రంగానికి ఊతమిస్తుందని అన్నారు. ఉత్తర గోవా, దక్షిణ గోవా జిల్లాలను కలుపుతూ వాస్కో, ఓల్డ్ గోవాల మధ్య ఫెర్రీ బోట్ సర్వీస్‌ను గడ్కరీ మంగళవారం ప్రారంభించారు. ఈ మార్గం సుందరమైన సాగర తీరాలకు ప్రసిద్ధి చెందినది. దేశ, విదేశాలకు చెందిన పర్యాటకులను ఆకర్షిస్తున్న నేపథ్యంలో ఫెర్రీ బోట్ సర్వీస్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ మన దేశానికి 7.500 కి.మీ. పొడవైన కోస్తా తీరం ఉందని అన్నారు. అది దేశాభివృద్ధికి, పర్యాటక రంగానికి ఉపకరిస్తుందని తెలిపారు. గోవా పర్యాటకానికి సాగర తీరం వరదాయినిగా మారింది. పర్యాటక రంగం ఈ అనుకూలతను మూలధన పెట్టుబడుల్లో 49 శాతాన్ని ఉద్యోగాల కల్పనకు వినియోగించుకుంటున్నదని అన్నారు. నేను జాతీయ రహదారులకు మంత్రిగా వ్యవహరిస్తున్నాను. రహదారి మార్గంలో ప్రయాణించడానికి ఒక కిలోమీటరుకు రూ.1.50 ఖర్చు అవుతుంది. రైలు మార్గం ద్వారా ఒక రూపాయి అవుతుంది. అదే జల మార్గంలో ప్రయాణిస్తే కేవలం 20 పైసలు మాత్రమే ఖర్చవుతుంది అని గడ్కరీ వివరించారు. లాజిస్టిక్స్ వ్యయం తగ్గింపు దేశానికి అతి పెద్ద అవసరమని ఆయన అన్నారు. లాజిస్టిక్స్ వ్యయాన్ని తగ్గించడానికి మనం జల రవాణాను ప్రోత్సహించాలని మంత్రి తెలిపారు. ఆ క్రమంలో 7,500 కి.మీ.ల కోస్తా తీరాన్ని ఒక సరకులు, ప్రయాణికుల రాకపోకల కారిడార్‌గా అభివృద్ధి చేసిన పక్షంలో అది మన ఆర్థిక వ్యవస్థకు ఒక ఊతం అవుతుందని వివరించారు. కాలుష్యాన్ని తగ్గించే జల మార్గాలు దేశ, విదేశీ పర్యాటకులు వారు బస చేసిన హోటళ్ళకు బోట్లలో ప్రయాణించడానికి ఉపకరిస్తుందని గడ్కరీ తెలిపారు. ఫలితంగా డీజిల్ వినియోగం తగ్గుముఖం పడుతుందని చెప్పారు. జలాల్లో ప్రయాణించడం ద్వారా ప్రజలు పర్యాటకం కొత్త కోణాన్ని ఆస్వాదిస్తారని మంత్రి తెలిపారు.

ఈ మార్పు కొత్త ఉద్యోగాలను సృష్టిస్తుందని అన్నారు. అంతటా జెట్టీలను ఏర్పాటు చేయడం ద్వారా అన్ని హోటళ్ళను జల మార్గాలకు ఎందుకు అనుసంధానం చేయకూడదని గడ్కరీ ప్రశ్నించారు. మంగళవారం ఆవిష్కృతమైన ఫెర్రీ బోట్ సర్వీస్‌ను మొర్మగువా పోర్ట్ ట్రస్ట్, గోవాలో బీచ్ మేనేజ్‌మెంట్‌ను నిమగ్నమైన దృష్టి మెరైన్ ఏజెన్సీ సంయుక్తంగా చేపట్టాయి.

టాటా కార్ల రేట్లు పెంపు



న్యూఢిల్లీ: పాసింజర్ వాహనాల(పివి) ధరను రూ.60,000కు పెంచుతున్నట్టు టాటా మోటార్స్ టాటా మోటార్స్ మంగళవారం ప్రకటించింది. ఇన్‌పుట్ వ్యయాలు పెరిగిపోతున్న కారణంగా ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి పాసింజర్ వాహనాల ధర పెంపు అనివార్యమైందని టాటా మోటార్స్ పాసింజర్ వెహికల్ బిజినెస్ ప్రెసిడెంట్ మయాంక్ పరీక్ తెలిపారు. పెరిగిపోతున్న ఇన్‌పుట్ వ్యయాలు, మారుతున్న మార్కెట్ పరిస్థితులు, పలు బాహ్య ఆర్థిక అంశాలతో ధర పెంపుదల తప్పలేదని తెలిపారు. టియాగో, హెక్సా, టిగోర్, నెక్సోన్ లాంటి మోడల్స్ వెన్నుదన్నుగా రానున్న సంవత్సరంలో వృద్ధిని వ్యూహాత్మకంగా కొనసాగించగలననే ఆశాభావంతో కంపెనీ ఉందని ఆయన చెప్పారు. కంపెనీ పలు రకాల పాసింజర్ వాహనాలను విక్రయిస్తున్నది. వాటిలో ప్రారంభ ధర రూ.2.28 లక్షలు కలిగిన జెన్ ఎక్స్ నానో నుంచి రూ.17.42 లక్షలకు(ఢిల్లీ ఎక్స్ షోరూమ్) ప్రారంభ ధరతో లభించే ప్రీమియమ్ హెచ్‌యువి హెక్సా దాకా ఉన్నాయి. గతవారం జర్మన్ లగ్జరీ కార్ల మేకర్ ఆడి రూ.1-9 లక్షల రేంజ్‌లో ధరలు పెంచింది. బడ్జెట్‌లో కస్టమ్స్ సుంకం పెంపుదల ప్రభావాన్ని ఖాతాదారులపై మోపేలా పెంచిన ధరలను ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి వర్తింపజేయనుంది.

అదే బాటలో నిస్సాన్

న్యూఢిల్లీ: డాట్సన్ బ్రాండ్ సహా అన్ని వాహనాల ధరలను వచ్చే నెల నుంచి రెండు శాతం దాకా పెంచుతున్నట్టు జపనీస్ ఆటోమేకర్ నిస్సాన్ మంగళవారం ప్రకటించింది. నిస్సాన్ ప్రస్తుతం మైక్రా, సన్నీ, టెర్రనో మోడళ్ళను రూ.4.64 లక్షల నుంచి రూ.14.46 లక్షల మధ్య విక్రయిస్తున్న ది. డాట్సన్ మోడల్స్ అయిన్ గో, గోప్లస్, రెడి-గో వాహనాలను రూ.2.49 లక్షల నుంచి రూ.5.12 లక్షలు(ఢిల్లీ ఎక్స్ షోరూమ్) మధ్య విక్రయిస్తున్నది. ఇన్‌పుట్ వ్యయాలు పెరిగిపోతున్న కారణంగా తమ నిస్సాన్, డాట్సన్ కార్ల ధరలను ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి పెంచుతున్నట్టు నిస్సాన్ మోటార్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ జెరోమ్ సాయిగోట్ ఒక ప్రకటనలో తెలిపారు. తమ కార్లు తమ ఖాతాదారులకు అద్భుతమైన విలువ, ఎంపికను అందించడం కొనసాగిస్తాయనే ధీమాతో తాము ఉన్నట్టు చెప్పారు.

ఎన్ఎండీసీ గనులకు ఫైవ్ స్టార్ రేటింగ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎన్ఎండిసికి చెందిన ఐదు గనులకు కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ ఫైవ్‌స్టార్ రేటింగ్ ప్రకటించింది. ఈ గనుల నిర్వహణ పూర్తిగా యాంత్రీకరించడాన్ని పరిగణలోకి తీసుకుని ఫైవ్‌స్టార్ రేటింగ్ ఇచ్చారు. రెండు మైన్స్ బాచలీ కాంప్లెక్స్, రెండు మైన్స్ కిరండల్ కాంప్లెక్స్ (చత్తీస్‌గఢ్), ఒక మైన్ కర్నాటకలోని డొనిమలైలో ఉన్నాయి. మంగళవారం ఢిల్లీలో జరిగిన మూడవ జాతీయ సదస్సులో కేంద్ర గనులశాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమార్ ఈ గనులకు ఫైవ్‌స్టార్ రేటింగ్ సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో గనులశాఖ సహాయ మంత్రి హరిభాయ్ పరాతిభాయ్ చౌదరి, ఆ శాఖ కార్యదర్శి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. సస్టెనబుల్ డవలప్‌మెంట్ ఫ్రేమ్‌వర్క్ అమలు చేయడంలో ఉత్తమ పనితీరు కనబరిచిన సంస్థలకు స్టార్ రేటింగ్‌కు ఎంపిక చేశారు. స్థానిక గ్రామాల్లో సేవా కార్యక్రమాలు, పునరావాసం, మైనింగ్ ప్రాక్టీస్, మైనింగ్‌లో శాస్త్రీయ పద్ధతుల అమలు, ఖనిజాల పరిరక్షణ, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని దాని ద్వారా ప్రయోజనాలు పొందడాన్ని బట్టి ఎస్‌డిఎఫ్ ప్రమాణాలను నిర్ధారించారు. ఈ ఫైవ్‌స్టార్ రేటింగ్ తమ సంస్థ పనితీరుకు గుర్తింపు ఇస్తుందని, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా లబ్ధి పొందేందుకు స్ఫూర్తినిస్తుందని ఎన్ఎండిసి సీఎండి ఎన్.బైజేంద్ర కుమార్ పేర్కొన్నారు.

డబ్ల్యూటీఓకు ఊపిరి పోద్దాం

• కలసికట్టుగా పనిచేద్దాం
• భారత్ చొరవకు ఊతమివ్వండి
• సభ్య దేశాలకు సురేష్ ప్రభు పలుపు



న్యూఢిల్లీ: ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీఓ) బలోపేతానికి ఉమ్మడి క్షేత్రాన్ని గుర్తించాల్సిందిగా కేంద్ర వాణిజ్య మంత్రి సురేష్ ప్రభు డబ్ల్యూటీఓ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. డిసెంబర్‌లో బ్యూనోస్ ఎయిరెస్‌లో డబ్ల్యూటిఓ సదస్సులో ప్రతిష్టంభన చోటు చేసుకున్న దరిమిలా అది సవాళ్ళు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సురేష్ ప్రభు పై విజ్ఞప్తి చేశారు. మంగళవారమిక్కడ డబ్ల్యూటీఓ సదస్సుకు అమెరికా, చైనాతో పాటుగా 52 దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. డబ్ల్యూటీఓకు ఊపిరి పోసే నిమిత్తం భారత్ ఈ సదస్సుకు ఆతిథ్యం వహిస్తున్నది. ఈ సందర్భంగా ప్రతినిధులను ఉద్దేశించి మంత్రి ప్రసంగిస్తూ ఆర్థిక వృద్ధి, అంతర్జాతీయ వాణిజ్యం, అభివృద్ధి, ఉద్యోగాలు లాంటి అంశాలకు డబ్ల్యూటిఓ గణనీయమైన సేవలు అందించినవైనాన్ని మీలో అత్యధికులు అంగీకరిస్తారని అన్నారు. డబ్ల్యూటిఓ, దాని సేవలకు మీరు విలువ ఇచ్చిన పక్షంలో దాని బలోపేతానికి చేస్తున్న అన్ని ప్రయత్నాలను మీరు సమష్టిగా ఆహ్వానించాలని తెలిపారు. నిష్క్రియాపరత్వం మనలో ఏ ఒక్కరికి ఐచ్ఛికం కారాదు అని మంత్రి తెలిపారు. మంగళవారంనాడు భారత్ చొరవ తీసుకొని ఏర్పాటు చేసిన సమావేశం ఉమ్మడి ప్రయోజనానికి సంబంధించి అన్ని అంశాలపై అభిప్రాయాలను స్వేచ్ఛగా, నిర్మొహమాటంగా ఇచ్చిపుచ్చుకోవడానికి తోడు సవాళ్ళకు పరిష్కారాన్ని చూపాలి అని సురేష్ ప్రభు ఆకాంక్షించారు. డబ్ల్యూటీఓను పునరుజ్జీవంపజేయటానికి మనమందరం సమష్టిగా పనిచేయాలని అన్నారు. డబ్ల్యూటీఓలో మున్ముందు కార్యాచరణకు రాజకీయ మార్గదర్శనం, దాని అభివృద్ధికి మార్గం లాంటి అంశాలపై దృష్టిపెట్టాలని సదస్సుకు హాజరైన వారికి మంత్రి పిలుపునిచ్చారు. అమెరికా ప్రభుత్వం ఉక్కు, అల్యూమిని యంపై దిగుమతి సుంకాల విధింపు, ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమాలపై భారత్‌ను అమెరికా డబ్ల్యూటీఓ ముందు నిలబెట్టిన నేపథ్యంలో సదస్సు చోటు చేసుకుంది. పాకిస్తాన్ భారత్ ఆహ్వానాన్ని తోసిరాజని మరీ సదస్సుకు గైర్హాజరైంది. డబ్ల్యూటిఓ డైరెక్టర్ జనరల్ రోబెర్టో అజెవెడో సదస్సును ఉద్దేశించి ప్రసంగిస్తూ తాము డబ్ల్యూటీఓ లోపలా, వెలుపలా అనేక సవాళ్ళు ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో అంతర్జాతీయంగా వాణిజ్య వాతావరణం అత్యంత క్లిష్టతను సంతరించుకుందని అన్నారు. ఈ సమావేశంలో ఒక బాహటమైన, నిజాయతీతో కూడిన చర్చల కోసం తాము ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. డబ్ల్యూటీఓ వివాదాల పరిష్కార విభాగానికి సభ్యుల నియామకం అంశంపైన సైతం సదస్సు చర్చించనుంది. అమెరికా ఈ సభ్యుల నియామకాన్ని అడ్డుకోవడంతో దాని కార్యకలాపాలు దెబ్బ తిన్నాయి. గతేడాది బ్యూనోస్ ఎయిరెస్‌లో జరిగిన సదస్సులో డబ్ల్యూటీఓ సభ్యుల మధ్య అభిప్రాయ భేదాల కారణంగా వాణిజ్య చర్చలు విఫలం కావడంతో ప్రస్తుతం ఢిల్లీలో జరుగుతున్న సదస్సుకు భారత్ ఆతిథ్యమిస్తున్నది. భారత్ డబ్ల్యూటిఓ వద్ద వ్యవసాయానికి అంశాలను తీసుకు రావడానికి మొగ్గు చూపుతున్నది. కొత్త అంశాలకు వ్యతిరేకంగా మరీ ముఖ్యంగా వాణిజ్యంతో ప్రత్యక్షంగా సంబంధం లేని అంశాలను సంప్రదింపుల స్థాయికి తీసుకురావడానికి వ్యతిరేకంగా భారత్ తన వాణి వినిపిస్తున్నది.

(5వ పేజీ తరువాయి)

14	ప్రైవేట్	మెట్ట	405	భూపతి సాయిలు తండ్రి హన్మయ్య
15	ప్రైవేట్	మెట్ట	535	పొట్టి శంకరయ్య తండ్రి పోశెట్టి
49/1	ప్రైవేట్	మెట్ట	6688	నీలకంటి పాండురంగం & ఇతరులు
80	ప్రైవేట్	మాగాణి	1265	1) పొట్టి శివయ్య తండ్రి పోశెట్టి 2) పొట్టి శంకరయ్య తండ్రి పోశెట్టి
మండలం : 2. శంకరంపేట (ఎ)				గ్రామం : (7) జందికుంట
341	ప్రైవేట్	మెట్ట	2046	గడిల యల్లమ్మ భర్త వెంకటరెడ్డి
347	ప్రైవేట్	మెట్ట	809	మామిడి పద్మ భర్త పీతాంబర్
348	ప్రైవేట్	మెట్ట	5919	దరిగె పార్వతమ్మ భర్త బసవయ్య
349	ప్రైవేట్	మెట్ట	9005	1)కొల్హాపురి భర్త చందరి 2) సైని రాములు తండ్రి కిష్టయ్య 3)మరిగి మంజుల భర్త మల్లారెడ్డి
మండలం : 3. టేక్మాల్				గ్రామం : (1) బొడ్మట్‌పల్లి
113/1	ప్రైవేట్	మెట్ట	1987.9	1)బేగరి శంకరయ్య తండ్రి బాలయ్య 2) బేగరి దుర్గమ్మ భర్త దుర్గయ్య 3)బేగరి దుర్గమ్మ భర్త దుర్గయ్య
111	ప్రైవేట్	మెట్ట	809	గొల్లిడ సంజీవ్ రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి
112	ప్రైవేట్	మెట్ట	6070	1)బేగరి శంకరయ్య తండ్రి బాలయ్య 2) బేగరి దుర్గమ్మ భర్త దుర్గయ్య 3)బేగరి దుర్గమ్మ భర్త దుర్గయ్య
116	ప్రైవేట్	మెట్ట	5767	1)కొలపల్లి వీరయ్య తండ్రి బాలయ్య 2)కొలపల్లి కిష్టమ్మ భర్త కిష్టయ్య 3)కొలపల్లి కిష్టమ్మ భర్త కిష్టయ్య 4)కొలపల్లి కిష్టమ్మ భర్త కిష్టయ్య 5)పెద్ద దుర్గపోళ్ళ బాలయ్య తండ్రి లక్ష్మయ్య 6)పెద్ద దుర్గపోళ్ళ పెంటయ్య తండ్రి లక్ష్మయ్య
128	ప్రైవేట్	మెట్ట	7891	దలపతిరావు తండ్రి ఎస్‌ఎసిఆర్ మూర్తి
130 130/2 130	ప్రైవేట్	మెట్ట	993	1)తలారి జ్యోతి భర్త ప్రభువినయ్ కుమార్ 2) తలారి సుదర్శన్ తండ్రి అంజయ్య
146 146/2	ప్రైవేట్	మెట్ట	2374	పుల్లయ్యగారి రవిప్రసాద్ తండ్రి సత్తియ్య
201/1	ప్రైవేట్	మెట్ట	4763	1)గజ్జల నరేష్ రెడ్డి తండ్రి వీరారెడ్డి : 1-బోరు, ఆర్‌సిసి ఇల్లు 1-పట్టర్ 2)ఎల్.పద్మిని బాయి భర్త బల్వంతరావు 3)కటనాన్‌పల్లి దుర్గమ్మ భర్త అతివయ్య :1- పట్టర్ 4)దాకలి గంగయ్య తండ్రి మాణిక్యం : 1 -పట్టర్ 5)మ్యాకలి కామమ్మ భర్త లక్ష్మయ్య : 1-బోరు ఆర్‌సిసి ఇల్లు 6)తలారి శాంతి భర్త దాండాస్ 7)ఎంఎ పత్తార్ అలీ తండ్రి సయ్యద్‌హాష్మీన్ 8)ఖాజా మైనోద్దీన్ తండ్రి అలీసాబ్ : 1 బోరు 9)జహీరాబీ భర్త ఖాజా 10) గౌసెయాబేగం భర్త యూసుఫ్: 1-ఎసిసి పెంకుటిల్లు 11)సాలెహిన్ ఆబేద్ తండ్రి అబూముద్దీన్ సలాం : 1-ఎసిసి పెంకుటిల్లు 12) పరిహా బీ భర్త పాషా మియా : 1-పెంకుటిల్లు 13) నజీమాబేగం భర్త బాసేరుల్లా 14)పరిశెట్టి శాంతమ్మ భర్త శంకరప్ప 15) వడ్ల సత్యనారాయణ తండ్రి మల్లయ్య 16) బైరి కుమ్మరి నర్సమ్మ భర్త రాములు 17)పెద్ద దుర్గపోళ్ళ మల్లయ్య భర్త పెంటయ్య 18)మ్యాకలి గోపాల్ తండ్రి పెంకన్న
219	ప్రైవేట్	మాగాణి	2180	1)అందోల్ కిష్టయ్య తండ్రి యల్లయ్య 2)అందోల్ అంజయ్య తండ్రి యల్లయ్య
246	ప్రైవేట్	మాగాణి	1619	1)కంకర దుర్గయ్య తండ్రి భూమయ్య 2)కంకర వీరయ్య తండ్రి భూమయ్య 3) కంకర కిష్టయ్య తండ్రి మొగులయ్య
247	ప్రైవేట్	మాగాణి	3761	1)గటంగారి శివప్ప తండ్రి పంగప్ప 2)పట్లోళ్ళ వీరప్ప తండ్రి పెస్ బసప్ప
పూర్తి మొత్తం			591817.26	

సం/- రాజేష్ గుప్తా, డిప్యూటీ సెక్రటరీ
[F.No. NHAI/PIU-HYD/NH-161/S-N-A/GC/1/2016]

సం/- ఎం.నగేష్
Revenue Divisional Officer/ Compentent Authority for Land Acquisition (NH.161) NHAI Medak

హైదరాబాద్‌కు విస్తరించిన సేఫ్ వాటర్ నెట్‌వర్క్


• 2019 నాటికి తెలంగాణలో 30 సురక్షిత నీటి కేంద్రాలు
• ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల్లో 3.30 లక్షల మందికి సరఫరా చేయడమే లక్ష్యం
• హనీవెల్ ఇండియా సీఈఓ కుర్ట్ సోడర్ లుండ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: హనీవెల్ ఇండియా సంస్థ మొదలుపెట్టిన సేఫ్ వాటర్ నెట్‌వర్క్‌ను హైదరాబాద్ నగరానికి విస్తరింపజేసింది. తెలంగాణ వ్యాప్తంగా ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల్లో 3,30,000 మంది ప్రజలకు సురక్షిత నీటిని అందించడమే లక్ష్యంగా ముందడుగు వేస్తున్నామని సంస్థ ఇండియా సీఈవో కుర్ట్ సోడర్ లుండ్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక యాజమాన్యంతో నిర్వహించే సేఫ్ వాటర్ స్టేషన్లు రివర్స్ ఒస్మోసిస్, అల్ట్రా వయొలెట్ ఫిల్ట్రేషన్‌తో సహా అత్యాధునిక ఆరు అంచెల వడపోత సాంకేతికతను కలిగి ఉంటుందన్నారు. సోలార్ ఆధారిత వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఆధారిత రిమోట్ మానిటరింగ్ సిస్టమ్ వంటి విశిష్ట సాంకేతికతల వినియోగంతో వాటర్ ఏటిఎంలు నిరంతరాయ సేవలు అందిస్తాయన్నారు. సుస్థిరదాయక విధానంలో, అందుబాటు ధరల్లో పరిశుద్ధమైన తాగునీటికి తాము వీలు కల్పిస్తున్నట్లు చెప్పారు. సురక్షిత తాగునీరు లాంటి ప్రాథమిక అవసరం అందరికీ తీరాలి అనేది తమ ఆశయమన్నారు. వ్యూహాత్మక భాగస్వామ్యాలు, సాంకేతికత, వినూత్న, క్షేత్రస్థాయిలో స్థానికులకు ప్రమేయం కల్పించడం, విశ్లేషణల ద్వారా మేము పటిష్ఠ మార్కెట్ ఆధారిత సోషల్ ఎంటర్‌ప్రైజ్ నమూనాని వినియోగించడంలో మేము విజయవంతమయ్యామని అన్నారు. ఇది ప్రధానంగా గ్రామాల్లోని వారికి సురక్షిత నీటిని పొందేందుకు వీలు కల్పించడంతో పాటుగా జీవనోపాధులను కల్పిస్తోంది. ఎంటర్‌ప్రెన్యూర్, ఆపరేటర్, డిస్ట్రిబ్యూటర్, టెక్నీషియన్‌గా ఒక్కో సేఫ్ వాటర్‌స్టేషన్ కనీసం నలుగురికి ఉపాధి కల్పిస్తోందని కుర్ట్ తెలిపారు.

ఐసిఐసిఐ సెక్యూరిటీస్ ఐపీఓ

• రూ. 5 ముఖ విలువ షేరుపై రూ. 520 ప్రైస్ బిడ్
• 7.72 కోట్ల ఈక్విటీ షేర్లు విడుదల
• 22న ప్రారంభం, 26న ముగింపు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఐసిఐసిఐ సెక్యూరిటీస్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫరింగ్‌గా షేర్ ప్రీమియంతో సహా రూ.5 ముఖ విలువ కలిగిన 7,72,49,508 ఈక్విటీ షేర్లను 22న మార్కెట్‌లోకి విడుదల చేయనుంది. ప్రతి ఈక్విటీ షేర్‌కు రూ.519 నుంచి రూ.520గా ప్రైస్ బ్యాండ్‌ను నిర్ణయించారు. కనీసం 28 ఈక్విటీ షేర్లకు బిడ్ దాఖలు చేయాల్సి ఉంటుంది. అనంతరం 28 ఈక్విటీ షేర్ల మల్టీపుల్స్‌గా ఎన్నైనా చేయవచ్చు. ఈ బిడ్ ఆఫర్ బుధవారం ప్రారంభం కానుండగా, 26న ఈ బిడ్ ముగుస్తుందని రిటైల్ హెడ్ కేతన్ కర్కాని మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో చెప్పారు. ఈనెల 13న రెడ్ హియరింగ్ ప్రాస్పెక్టర్ ద్వారా ఆఫర్ చేస్తున్న ఈక్విటీ షేర్లను బిఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలలో లిస్టు చేయడానికి ప్రతిపాదించామని ఆయన చెప్పారు. ఈ ఆఫర్‌కు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా డీఎస్‌పీ మెరిల్ లించ్ లిమిటెడ్, సిటీ గ్రూప్ గ్లోబల్ మార్కెట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సీఎల్ఎస్ఏ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఎడల్‌వీస్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, ఐఐఎఫ్ఎల్ హోల్డింగ్స్ లిమిటెడ్, ఎస్‌బిఐ క్యాపిటల్ మార్కెట్స్ లిమిటెడ్ వ్యవహరిస్తున్నాయి. ఈ ఆఫర్‌కు బీఆర్ఎల్ఎం మార్కెటింగ్‌గా ఐసిఐసిఐ సెక్యూరిటీస్ లిమిటెడ్ వ్యవహరిస్తుంది. లీడ్ మేనేజర్లను సంప్రదించిన తర్వాత క్యూఐబీ పోర్షన్‌లో 60 శాతాన్ని యాంకర్ ఇన్వెస్టర్లకు యాంకర్ ఇన్వెస్టర్ కేటాయింపు ధరలో ప్రమోటర్ కేటాయించే అవకాశం ఉందని కర్కాని చెప్పారు. ఇందులో కనీసం మూడోవంతు దేశీయ మ్యూచువల్ ఫండ్స్‌కు మాత్రమే కేటాయించాల్సి ఉందన్నారు. యాంకర్ ఇన్వెస్టర్ భాగం మినహాయించి క్యూఐబిలో 15 శాతం మ్యూచువల్ ఫండ్స్‌కు మాత్రమే దామాషా పద్ధతిలో కేటాయిస్తామని ఆయన తెలిపారు. మిగిలిన క్యూఐబీ భాగాన్ని దామాషా పద్ధతిలో క్యూఐబీ బిడ్డర్స్‌కు కేటాయిస్తారు. అంతేగాక నెట్ ఆఫర్‌లో 15 శాతం మించకుండా నాన్ ఇనిస్టిట్యూషనల్ బిడ్డర్స్‌కు, 10 శాతం మించకుండా రిటైల్ ఇండివిడ్యువల్ బిడ్డర్స్‌కు సెబీ ఐసీడీఆర్ నిబంధనలకు అనుగుణంగా కేటాయిస్తామని ఆయన వివరించారు.

ఎంసీఐ నిబంధనల మేరకే


పీజీ మెడికల్ సీట్ల భర్తీ

● జీవోలు 21, 22 జారీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) నిబంధనల ప్రకారమే పీజీ మెడికల్ సీట్ల భర్తీపై స్పష్టతనిస్తూ ప్రభుత్వం మంగళవారం రెండు జీవోల (జీవో 21, 22)ను జారీ చేసింది. నేషనల్ పూల్‌లో 50 శాతం సీట్లు పోనూ మిగతా 50 శాతం సీట్లు స్థానికులకే ఉంటాయని ఆ జీవోలో పేర్కొంది. అలాగే రూరల్, ట్రైబల్ ఏరియాల్లో పనిచేసే వాళ్ల వెయిటేజ్ మార్కుల మీద కూడా ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. జీవో 21 ప్రకారం పీజీ సీట్లలో ఇన్ సర్వీస్ అభ్యర్థులు రూరల్ లేదా ట్రైబల్ ఏరియాల్లో పనిచేస్తున్న వాళ్లకి సర్వీస్ రిజర్వేషన్లకు (రాజ్యాంగ రిజర్వేషన్లు యధావిధిగా ఉంటాయని) బదులుగా నీట్‌లో వచ్చిన మార్కులకు అదనంగా వెయిటేజీ మార్కులను కలుపుతామని జీవోలో పేర్కొన్నారు. ట్రైబల్ ఏజెన్సీ ఏరియాలో మూడేళ్లు అంతకు మించి పనిచేసిన అభ్యర్థులకు నీట్ ప్రవేశ పరీక్షల్లో వచ్చిన మార్కులను అదనంగా 30 శాతం మార్కులను కలుపుతారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో మూడేళ్లు లేదా అంతకుమించి పనిచేసిన అభ్యర్థులకు నీట్ ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కులకు అదనంగా 24 శాతం మార్కులను కలుపనున్నారు. ఇదిలా ఉండగా ఇంతకుముందు సర్వీస్ అభ్యర్థులకు డిప్లమా చేసిన సబ్జెక్టుల్లో తప్పనిసరిగా పీజీ చేయాలన్న నిబంధనను ప్రస్తుతం తొలగించడంతో విద్యార్థులకు ఊరట లభించింది. జీవో 22 ప్రకారం 50 శాతం సీట్లు నీట్ పరీక్షల్లో భాగంగా నేషనల్ పూల్‌కు వెళుతుండగా మిగతా 50 శాతం సీట్లను స్థానిక కోటాగా పరిగణిస్తారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్ణయించిన ఈ నిబంధనలకు అనుగుణంగానే పీజీ సీట్ల భర్తీ జరుగుతుందని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్శిటీ ఉప కులపతి డాక్టర్ కరుణాకర్ రెడ్డి తెలిపారు. ఈ సవరణలను అభ్యర్థులు గుర్తించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పీఆర్ఎల్ఐఎస్ వ్యయం పెంపు వ్యాజ్యం..

నవయుగ, మెగా సంస్థలకు నోటీసులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : పాలమూరు - రంగారెడ్డి నీటిపారుదల ఎత్తిపోతల పథకం(పీఆర్ ఎల్ఐఎస్) అంచనా వ్యయం పెంపుపై చోటు చేసుకున్న అక్రమాల వ్యవహారంలో దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంలో మెగా ఇంజనీరింగ్ ఇన్ ఫ్రా లిమిటడ్, నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్‌లను ప్రతివాదులుగా చేర్చాలని హైకోర్టు ఆదేశించింది. పీఆర్ఎల్ఐఎస్‌ను పూర్తి చేసే వ్యవహారంలో మూడు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ హైకోర్టు ఆ రెండు ఇంజనీరింగ్ కంపెనీలకు నోటీసులు జారీ చేసింది..ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయ లక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది. పీఆర్ఎల్ఐఎస్ 1,5,8,16 ప్యాకేజీల్లో ఎల్రక్ట్రో మెకానికల్ సామాగ్రి అంచనా వ్యయంలో భారీ ఎత్తున చోటు చేసుకున్న అక్రమాలపై సీబీఐ చేత దర్యాప్తు జరిపేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థిస్తూ మాజీ ఎమ్మెల్యే నాగం.జనార్ధన్ రెడ్డి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే.

వ్యక్తిగతంగా హాజరుకండి

● మంచిర్యాల జిల్లా కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మంచిర్యాల జిల్లా, నెన్నెల్ మండలంలో రూ.ఐదు వేల కోట్ల విలువచేసే రెండు వేల ఎకరాల ప్రభుత్వ భూ కుంభకోణం వ్యవహారంలో తాము జారి చేసిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదో ఏప్రిల్ 4న కోర్టుకు వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ మంచిర్యాల జిల్లా కలెక్టర్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మంచిర్యాల జిల్లా, నెన్నెల్ మండలంలో రూ.5వేల కోట్ల విలువ చేసే రెండు వేల ఎకరాల ప్రభుత్వ భూ కుంభకోణంపై దర్యాప్తు చేసి, రెండు వారాల్లో నివేదిక సమర్పించాలని హైకోర్టు మంచిర్యాల జిల్లా కలెక్టర్‌ను గత విచారణ సందర్భంగా ఆదేశించిన విషయం తెలిసిందే. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మితో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు చేసింది. తదుపరి విచారణ ఏప్రిల్ 4కు వాయిదా పడింది.

జస్టిస్ ధర్మారావు మృతిపట్ల సంతాపం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఇ.ధర్మారావు మృతి పట్ల హైకోర్టు సంతాపం ప్రకటించింది. హైకోర్టు లోని 1వ కోర్టు హాలులో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలో న్యాయమూర్తులందరూ మంగళవారం సమావేశమై (ఫుల్ కోర్టు) ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. అనారోగ్య కారణాలతో జస్టిస్ ఇ.ధర్మారావు ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ ప్రసంగిస్తూ..తూర్పు గోదావరి జిల్లాలో చేపల చెరువుల అక్రమ తవ్వకాల వల్ల పంట పొలాలు నాశనమవుతున్నాయంటూ హైకోర్టుకు లేఖ రాసినట్లు తెలిపారు. దీన్ని సుమోటోగా విచారణకు స్వీకరించాలని పిల్ కమిటీ నిర్ణయిందన్నారు. ఈ ప్రజాహిత వ్యాజ్యం విచారణ దశలోనే ఉందన్నారు. ఇంతలోనే ఆయన తుది శ్వాస విడిచారని ,ఆయన లేని లోటు తీరనిదన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ పీపీ ప్రతాప్ రెడ్డి, ఏపీ పీపీ పోసాని వెంకటేశ్వర్లు, జస్టిస్ ధర్మారావు కుటుంబ సభ్యులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

రిక్రూట్‌మెంట్‌లో అప్రెంటీస్‌లకు రిజర్వేషన్లు

● రైల్వే మంత్రి పీయూష్ గోయల్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వివిధ రైల్వే సంస్థల్లో అప్రెంటీస్ కోర్సు శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్దులకు రైల్వే రిక్రూట్‌మెంట్‌లో 20 శాతం రిజర్వేషన్లను అమలు చేయడం జరుగుతుందని రైల్వే మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. అప్రెంటీస్ చట్టంలోని సెక్షన్ 22(1) ప్రకారం, సుప్రీంకోర్టు గతంలో వెలువరించిన అనేక తీర్పులను అనుసరించి ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి తెలియచేశారు. అప్రెంటీస్‌షిప్ కోర్సు పూర్తయిన వారికి శిక్షణా సమయంతో సమానమైన కాలం వయోపరిమితితో సడలింపు కూడా ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు. అప్రెంటీస్‌తో పాటు సమాజంలోని అన్ని వర్గాల యువతీ యువకులకు దేశంలని ఏ ఇతర సంస్థ చేపట్టని స్థాయిలో భారతీయ రైల్వే ప్రకటించిన ఉద్యోగావకాశాల కల్పనలో ఇది అతి పెద్ద నియామకాల కార్యక్రమంగా భావిస్తున్నామన్నారు. ఎలాంటి అవకతవకలకూ అవకాశం లేకుండా పారదర్శకంగా నియామక ప్రక్రియ నిర్వహించబడుతుందన్నారు. భారీ సంఖ్యలో భారతీయ రైల్వే ప్రకటించిన ఈ ఉద్యోగాల కోసం దరఖాస్తులు పంపడానికి మార్చి 31 చివరి తేదని పేర్కొన్నారు.

రిజర్వేషన్లు సద్వినియోగం చేసుకోండి

● మైనారిటీలకు బీసీ కమిషన్ చైర్మన్ రాములు పిలుపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మైనార్టీ గురుకుల పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ బీసీ, ఓసీ వర్గాలకు ప్రభుత్వం రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తున్నదని, అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 204 మైనార్టీ గురుకుల పాఠశాలలు ఉన్నాయని, ఆ పాఠశాలల్లో చేరే విద్యార్థులు ఏప్రిల్ 20 వరకు దరఖాస్తు చేసుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లింలకు - 64 , బీసీ- 12 , ఎస్సీ- 6, ఎస్టీ- 4, ఓసీ- 3, క్రిష్టియన్- 7, జైన్- 1, పార్శీ- 1, బుద్దిస్టులకు - 1, సిక్కిలకు- 1 శాతం రిజర్వేషన్లు ఉంటాయని రాములు తెలిపారు. 5 తరగతిలో మొత్తం సీట్లతో పాటు 6,7,8,9 తరగతుల్లోని బ్యాక్‌లాగ్ సీట్లను కూడా భర్తీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నకిలీ పీఏ అరెస్టు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉపరాష్ట్రపతి పీఏగా చెప్పుకుంటూ అక్రమాలకు పాల్పడిన నిందితుడు పసుపులేటి నవీన్ అలియాస్ అర్జున్‌రావు (20) (సూపర్ వైజర్ ఆఫ్ సువర్ణభూమి వెంచర్స్, బోగాపురం, విజయనగరం జిల్లా)ని హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి ఈ నెల 13న సీసీఎస్‌లో బీజేపీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి. ఫిర్యాదు చేశారు. నిందితుడు అర్జున్‌రావు తనకు రాజకీయ నేతలతో, ప్రభుత్వ ఉన్నతాధికారులతో సన్నిహిత సంబంధాలున్నాయంటూ స్నేహితులు, బంధువుల వద్ద ఫోజిచ్చేవాడు. ఇదే క్రమంలో తాను ఉపరాష్ట్రపతి పీఏనంటూ పబ్లిక్ సర్వెంట్స్‌ని బ్లాక్‌మెయిల్ చేస్తూ బదిలీలు, కాలేజీలలో సీటు కోసం యత్నించేవాడు. ఈ విషయంపై ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి ఫిర్యాదుతో సీసీఎస్ పోలీసులు అర్జునరావుని అరెస్టు చేశారు.


అట్రాసిటీ కేసుల్లో తక్షణ అరెస్టులు వద్దు

● సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: రాజ్యాంగ ఆదర్శాలను అమలు చేయడంలో భాగంగా అణగారిన వర్గాలవారిని దురాగతాల నుంచి కాపాడవలసిన అవసరం ఉందని సుప్రీంకోర్టు తెలిపింది. ఎస్సీ, ఎస్టీ దురాగతాల నిరోధక చట్టం ప్రకారం ఫిర్యాదు దాఖలైనప్పుడు ఆటోమేటిక్ (వెంటనే)గా ఎఫ్ఐఆర్ నమోదు, అరెస్టు జరగడాన్ని తోసిపుచ్చింది. జస్టిస్ ఆదర్శ్ కె.గోయల్, జస్టిస్ ఉదయ్ యూ లలిత్ ధర్మాసనం ఈ స్పష్టతనిచ్చింది. ఈ చట్టం ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు, అరెస్టుల విషయంలో రక్షణ ఏర్పాట్లు ఉండాలని తెలిపింది. మూడు దశాబ్దాల నుంచి జరుగుతున్న సంఘటనలను పరిశీలించిన తర్వాత దుర్వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని స్వాతంత్ర్యాన్ని పరిరక్షించవలసిన అవసరం ఉందని తెలిపింది.

ఎస్సీ, ఎస్టీలపై దురాగతాల నిరోధక చట్టం ప్రకారం ఫిర్యాదు వచ్చినప్పుడు పోలీసులు ఓ వారంలోగా ప్రాథమిక దర్యాప్తు చేయాలని, ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయడానికి ఈ చట్టం ప్రకారం ఆ ఫిర్యాదుకు అర్హత ఉందో, లేదో నిర్ణయించాలని తెలిపింది. ప్రాథమిక దర్యాప్తు తప్పనిసరిగా జరగాలనే అసాధారణ విభాగంలోకి ఈ చట్టం ప్రకారం నమోదయ్యే కేసులు కూడా చేరినట్టు తాము అభిప్రాయపడుతున్నట్లు న్యాయమూర్తులు తెలిపారు. ఎఫ్ఐఆర్ దాఖలైనప్పటికీ నిందితులను ఆటోమేటిక్‌గా అరెస్టు చేయరాదన్నారు. తప్పుడు ఆరోపణలతో ఇరికించడం, అనవసరమైన అరెస్టులు వంటి వాటి నుంచి అమాయకులను కాపాడవలసిన అవసరం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం నమోదైన కేసుల్లో అరెస్టులు తప్పనిసరి కాదన్నారు.

అయితే, ప్రభుత్వోద్యోగిపై ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం ఫిర్యాదు దాఖలైనప్పుడు ఆ ఉద్యోగిని అరెస్టు చేయాలంటే సంబంధించిన నియామక అధికారి నుంచి అనుమతి పొందడం తప్పనిసరి అని తెలిపారు. ఇతరులపై ఫిర్యాదు దాఖలైనప్పుడు సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ లేదా డీఎస్పీ లిఖితపూర్వకంగా తప్పనిసరిగా అనుమతి ఇవ్వవలసి ఉంటుందన్నారు. నమోదు చేసిన కారణాల మేరకు ఈ అనుమతులను మంజూరు చేయాలని, ఈ వివరాలను అరెస్టు కాబోయే నిందితులకు, న్యాయస్థానానికి తెలియజేయాలని తెలిపారు. అరెస్టు చేసిన వ్యక్తిని న్యాయమూర్తి సమక్షంలో హాజరుపరిస్తే, తదుపరి నిర్బంధం అవసరమో, కాదో న్యాయమూర్తి నిర్ణయిస్తారని పేర్కొన్నారు.



ఇటువంటి కేసుల్లో ముందస్తు బెయిలును మంజూరు చేయడంపై నిషేధంలేదని వివరించారు. తప్పుడు ఆరోపణలు, కల్పిత ఆరోపణలు చేసినట్లు ప్రాథమికంగా చూపించగలిగితే అరెస్టుకు ముందు బెయిలు పొందే అర్హత నిందితులకు ఉందని తెలిపారు. బొంబాయి హైకోర్టు తీర్పుపై డా.సుభాష్ కాశీనాథ్ మహాజన్ చేసిన అపీలును విచారించిన సుప్రీంకోర్టు ఈ తీర్పునిచ్చింది.

ఆరోగ్య మిత్ర ఉద్యోగులను తొలగించవద్దు

● ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఆరోగ్యమిత్ర ఉద్యోగులను ఉన్నపళంగా తొలగించడానికి వీల్లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌లో అత్యున్నత న్యాయస్థానం ఈ మేరకు తీర్పునిచ్చింది. ఆరోగ్యమిత్ర ఉద్యోగుల్ని తమ విధుల్లో కొనసాగించాలని, వారి పనిని బట్టి రాతపరీక్షలు నిర్వహించుకోవచ్చునని ఆదేశించింది. ప్రభుత్వం తాజాగా నిర్ణయించిన అర్హతలను, ఈ ఏడాది నుంచి నియామకం అయ్యే వారికే వర్తిస్తాయని ధర్మాసనం పేర్కొంది. గతంలో హైకోర్ట్ సైతం ఉద్యోగుల తొలగింపుపై స్టే విధిస్తూ తీర్పునివ్వగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీం కోర్టులో అప్పీల్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ కేసులో బాధిత ఉద్యోగుల తరపున న్యాయవాది గల్లా సతీష్ వాదనలు వినిపించారు. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. 2007లో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించినప్పుడు ఆరోగ్యమిత్ర పేరుతో 300 మంది వలంటీర్ల నియామకం జరిగింది. 2014 నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొత్తం 1,600 మంది ఉద్యోగులయ్యారు. వీరందరినీ ఏదైనా డిగ్రీ అర్హతతో నియమించగా, 2014లో కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వం విద్యార్హతలను మార్చుతూ బీఎస్సీ లేదా ఎమ్మెస్సీ మైక్రోబయాలజీ, లేబలేటరీ కోర్సులు చేసినవారిని మాత్రమే అర్హులుగా పేర్కొంది. పథకం పేరును కూడా రాజీవ్ ఆరోగ్యశ్రీ నుంచి ఎన్టీఆర్ ఆరోగ్యమిత్రగా మార్చింది.

మార్చిన కొత్త విద్యార్హతల ప్రకారం పాత ఉద్యోగులను తొలగించడంతో అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఉద్యోగులు హైదరాబాద్ హైకోర్టులో 2016లో విడివిడిగా రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. హైకోర్టు ఈ ఉద్యోగుల తొలగింపుపై స్టే విధిస్తూ తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయగా, జస్టిస్ గోయల్ మరియు యూయూ లలిత్ ధర్మాసనం ముందుకు కేసు విచారణకొచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన గుంటూరు ప్రభాకర్, సరైన విద్యార్హతలు లేని కారణంగా ఉద్యోగులు తమ విధులు సరిగా నిర్వర్తించలేకపోతున్నారని అన్నారు. ఉద్యోగుల తరపున వాదనలు వినిపించిన న్యాయవాది గల్లా సతీష్, గత పదేళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై ఎలాంటి రిమార్కులు లేవని, వారికి అప్పగించిన పనుల్ని సక్రమంగా నిర్వహిస్తున్నారన్నారు. వాదోపవాదాల అనంతరం తీర్పునిచ్చిన ధర్మాసనం ఒక్క వేటుతో ఉద్యోగులందరినీ తొలగించడం సమంజసం కాదని పేర్కొంది. వారికి అప్పగించే బాధ్యతలను అనుసరించి కొత్తగా రాత పరీక్షలు నిర్వహించుకోవచ్చునని తీర్పులో స్పష్టం చేసింది.

అవిశ్వాసంపై తెరాస తటస్థం?

హైదరాబాద్, ఆంధ్రప్రభ: టిడిపి, వైసిపిలు లోక్‌సభలో అవిశ్వాసం ప్రవేశపెట్టగా.. ఎన్‌డిఏను వ్యతిరేకిస్తున్న పలు ప్రాంతీయ, జాతీయ పార్టీలు దీనికి మద్దతు ప్రకటించాయి. టిఆర్ఎస్ ఇది తమకు సంబంధం లేదని వ్యవహారంగా భావిస్తోంది. తమ రాష్ట్రప్రయోజనాలే తమకు ముఖ్యమని, రిజర్వేషన్ల పెంపుకు తమ డిమాండ్ వినిపిస్తూనే ఉంటామని టిఆర్ఎస్ ఎంపీలు స్పష్టం చేస్తున్నారు. మంగళవారం టిఆర్ఎస్ ఎంపీలు వినోద్, బూరనర్సయ్యగౌడ్‌లు ఇదే అంశాన్ని స్పష్టం చేశారు. రెండువారాలుగా తాము మా వాదన వినిపిస్తున్నాం..డిమాండ్లను సభలో పెట్టి పరిష్కరించుకుంటాం. మాకు ఎవరినీ అనుసరించాల్సిన అవసరంలేదు అని తేల్చేశారు. దేశమంతా అవిశ్వాసంపై చర్చకు ఎదురుచూస్తుండగా.. అన్నాడిఎంకె, టిఆర్ఎస్ ఎంపీల ఆందోళన వల్ల తీర్మానం చర్చకు రావడంలేదని.. సభ ఆర్డర్‌లో లేదని వాయిదాలు వేస్తున్నారని అవిశ్వాసంపై చర్చకు పట్టుబడుతున్న పార్టీలు ఆరోపిస్తున్నాయి. మా డిమాండ్లపై హామీ నిచ్చి.. మమ్మల్ని కూర్చోబెడితే కూర్చోవడానికి సిద్ధం అని చెబుతున్నారు. అవిశ్వాసంతో తమకు సంబంధంలేదని భావిస్తున్న టిఆర్ఎస్.. రిజర్వేషన్ల అంశంలో ప్రభుత్వం ప్రకటన చేసేదాకా ఆందోళన కొనసాగించాలని నిర్ణయించింది. ఒకవేళ అవిశ్వాసంపై ప్రభుత్వం చర్చకు సిద్ధపడితే.. చర్చలో రాష్ట్రంలో ఉన్న సమస్యలు, విభజన హామీలు ప్రస్తావించాలని నిర్ణయించింది. డివిజన్ జరిగే పరిస్థితి వస్తే తటస్థవైఖరిని అవలంభించాలని నిర్ణయించింది.

స్టేషన్లలో నీటి ఎద్దడి నివారణ చర్యలు

● సన్నద్ధమవుతున్న దక్షిణ మధ్య రైల్వే

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వేసవిలో సికింద్రాబాద్, హైదరాబాద్ రైల్వే స్టేషన్ల నీటి అవసరాలను తీర్చేందుకు దక్షిణ మధ్య రైల్వే సన్నద్ధమవుతుంది. ముందస్తుగా తీసుకున్న అనేక నీటి పొదుపు చర్యలతో లభ్యమైన జల వనరుల సహాయంతో ఈ వేసవిలో నీటి వినియోగంలో పెరిగే ఒత్తిడిని ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉంది.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో...

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రతి రోజూ 1.60 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. స్టేషన్ అవసరాలకు ప్రతి రోజు 35 లక్షల లీటర్ల నీరు అవసరమవుతుంది. పది ప్లాట్ ఫారాలపై ఉండే ప్రయాణికుల తాగునీటి అవసరాలకు ప్రతి రోజు 12 లీటర్ల నీరు ఖర్చవుతుంది. కోచులన్నింటికీ 20 లక్షల లీటర్ల నీరు ప్రతి రోజూ అవసరమవుతుంది. దాదాపు 3 లక్షల లీటర్ల నీరు రైలు పెట్టెలు, ప్లాట్ ఫారాలు, రైలు పట్టాల పరిశుభ్రతకు అవసరం. ఈ స్టేషన్ ద్వారా వెళ్లే ప్రతి రైలు కోచ్‌కి 1350 లీటర్ల నీరు అవసరమవుతుంది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో నీటి అవసరాలకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నుండి 30 లక్షల లీటర్ల నీరు సరఫరా అవుతుంది. నీటి రీ సైక్లింగ్ ప్లాంటు ద్వారా 3 లక్షల లీటర్ల నీరు అందుబాటులో ఉంటుంది. సికింద్రాబాద్‌లో గత సంవత్సరం పునరుద్ధరించబడిన ఆలుగడ్డ బావి నుండి సుమారు 2 లక్షల లీటర్ల నీరు ప్రతి రోజు లభిస్తుంది. దీనికి తోడు స్టేషన్ పరిసరాల్లో ఏర్పాటైన బోర్లు, ఇంకుడు గుంతల ద్వారా కూడా నీరు లభ్యమవుతుంది. సికింద్రాబాద్ స్టేషన్‌లో వాటర్ రీ సైక్లింగ్ ప్లాంటు ద్వారా ప్రతి రోజు 3 లక్షల లీటర్ల నీరు శుద్ధి చేయబడి వాడకానికి వస్తుంది. ఈ నీరు ప్లాట్ ఫారాలు, రైలు పట్టాల పరిశుభ్రతకు వినియోగించబడుతుంది. రీ సైక్లింగ్ ప్రక్రియలో 10 నుండి 15 శాతం నీరు మాత్రమే వృధా అవుతుంది. రీ సైక్లింగ్‌లో నీటి శుభ్రత మూడు దశల్లో జరుగుతుంది.

హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో..

హైదరాబాద్ స్టేషన్ ద్వారా ప్రతి రోజు 90 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. స్టేషన్లో ప్రతి రోజు నీటి అవసరాలకు 10.05 లక్షల లీటర్ల నీరు అవసరమవుతుంది. వివిధ రైళ్లకు సంబంధించిన 380 కోచ్‌లకు సుమారు 4.50 లక్షల లీటర్ల నీరు ఆవశ్యకమవుతుంది. కోచ్‌లు, ప్లాట్‌ఫారాలు, రైలు పట్టాల పరిశుభ్రతకు ప్రతి రోజు 2.50 లక్షల లీటర్ల నీరు వినియోగించబడుతుంది. నీటి అవసరాలకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 1.50 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేస్తుంది. బోరుబావుల ద్వారా 9 లక్షల లీటర్ల నీరు లభ్యమవుతుంది. వాటర్ రీ సైక్లింగ్ ప్లాంట్, ఇతర పొదుపు మార్గాల స్టేషన్ అవసరాలను తీర్చుతుంది.

తహశీల్దార్లే ధ్రువపత్రాలివ్వాలి


● ఎస్సీ ఉపకులాల సమరభేరిలో వంగపల్లి



హైదరాబాద్ (నల్లకుంట), ప్రభన్యూస్ : ఎస్సీ ఉపకులాలకు కుల ధ్రువీకరణ పత్రాలు తహసీల్దార్ కార్యాలయం నుంచే ఇవ్వాలని ప్రజా గాయకుడు గద్దర్, ఎమ్మార్పీఎస్ నేత వంగపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎస్సీలు అనగానే మాల, మాదిగలు మాత్రమే అందరికీ గుర్తుకు వస్తున్నారని, 59 ఎస్సీ ఉపకులాల ప్రజలు అట్టడుగున ఎలాంటి అభివృద్ధికి నోచుకోకుండా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం ఎస్సీలకు అమలుచేసే సంక్షేమ పథకాలు ముందుగా ఎస్సీ ఉప కులాలకు అమలు చేయాలని, తరువాతనే మాల, మాదిగలకు వర్తింపజేయాలని సూచించారు. ఎస్సీ ఉప కులాలకు తహసీల్దార్ కార్యాలయం ద్వారానే కుల ధ్రువీకరణ పత్రాలు జారీచేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారంనా సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ ఎస్సీ ఉప కులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన సమర భేరి సభలో గద్దర్, వంగపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికీ ఎస్సీ ఉప కులాలు కనీస అవసరాలు కూడా తీర్చుకోలేని దుస్థితిలో ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు వచ్చిన రిజర్వేషన్‌ల ఫలాలు సహా, ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్ని మాల, మాదిగలు మాత్రమే వినియోగించుకొని వృద్ధి చెందారని ఎస్సీ ఉప కులాలకు అవి ఏమాత్రం అందలేదన్నారు. ఉప కులాలకు ఆర్డీవో కార్యాలయం ద్వారా జారీ చేస్తున్నారని, దీనివల్ల ఎంతో మంది కుల ధ్రువీకరణ పత్రం కూడా పొందలేకపోతున్నారన్నారు. ఎస్సీ ఉప కులాల డిమాండ్లను పరిష్కరించడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సీ ఉప కులాలకు వెయ్యి కోట్ల రూపాయలతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాతాకుల భాస్కర్ మాదిగ, జాతీయ ప్రధాన కార్యదర్శి మేడి పాపయ్య మాదిగ, ఎస్సీ ఉప కులాల ఐక్య వేదిక జాతీయ అధ్యక్షులు చితంల మల్లిఖార్జున్, గౌరవ అధ్యక్షులు డాక్టర్ చంద్రగిరి రామమౌళి, తూర్పాటి హనుమంతు, టంటం వీరేశం, బాణాల మంగేశ్, ఏర్పుల భాస్కర్ బైండ్ల, ముప్పాళ్ళ సుధాకర్ బైండ్ల తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర ఘరానా దొంగ అరెస్టు

● స్టార్ హోటళ్లే టార్గెట్ ● 12 రాష్ట్రాలలో పలుమార్లు అరెస్టు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : దేశంలోని పలు స్టార్ హోటల్స్‌నే లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న గుజరాత్‌కు చెందిన జయేష్ రావ్‌జీ సెజ్‌పాల్ (46) అనే అంతర్రాష్ట్ర ఘరానా దొంగను బంజారాహిల్స్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. గత ఆరు సంవత్సరాల కాలంలో 12 రాష్ట్రాల్లోని 17 నగరాలలో 30కి పైగా స్టార్‌హోటల్స్‌లో చోరీలకు పాల్పడ్డాడు. అరెస్టయిన నిందితుడి వద్దనుంచి 30 లక్షలకు పైగా బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్టార్ హోటల్స్‌లో కొత్తగా పెళ్లయిన దంపతులు, ఫ్యామిలీ పార్టీలు చేసుకునే వారితో చనువుగా మెసులుతూ తన బాడీ లాంగ్వేజ్‌తో వారిని ఆకట్టుకుంటూ చోరీలకు పాల్పడటంతో సెజ్‌పాల్ సిద్ధహస్తుడు. ఇందుకుగానూ ఆయా నగరాల్లోని లాడ్జీల్లో బసచేస్తాడు. టిప్ టాప్‌గా డ్రస్ వేసుకుని స్టార్ హోటల్‌ను చేరుకుంటాడు. 2002-03లో ముంబైలోని కొలాబా పోలీసులు సెజ్‌పాల్‌ని అక్కడి తాజ్ హోటల్‌లో మూడు చోరీలకు పాల్పడటంతో అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. 2004-05లో ఈ ఘరానా దొంగ సెజ్‌పాల్‌ను చెన్నై పోలీసులు అరెస్టు చేశారు. సెజ్‌పాల్‌పై టీపీడీఏ యాక్ట్‌ప్రయోగించి 14 నెలలు జైలుకు పంపారు. 2005-06లో బెంగళూరు పోలీసులు ఇటువంటి చోరీ కేసుల్లో అరెస్టు చేసి జైలుకు పంపారు. 2007-08లో యూపీ రాష్ట్రంలోని ఆగ్రా పోలీసులు సెజ్‌పాల్‌ని అరెస్టు చేశారు. అక్కడ నేరారోపణ రుజువు కావడంతో ఐదేళ్లు జైలు శిక్ష అనుభవించాడు. 2013లో ఆగ్రా జైలు నుంచి సెజ్‌పాల్ బయటకు వచ్చిన తర్వాత రమేష్ చాగ్‌తో కలిసి చండీఘర్ పార్క్ ప్లాజా హోటల్‌లో చోరీలకు పాల్పడ్డాడు. ఈ కేసులో రమేష్ పట్టుబడగా సెజ్‌పాల్ పరారయ్యాడు. ప్రస్తుతం 11 కేసులలో సెజ్‌పాల్ వాంటెడ్ క్రిమినల్‌గా ఉన్నాడు. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్‌లోని హోటల్ పార్క్ హయత్, బంజారాహిల్స్ (6-3-2018), ఆబిడ్ రోడ్ పీఎస్ పరిధిలోని మెర్క్యురీ హోటల్ (6-6-2014), ఎస్ఆర్ నగర్ పీఎస్ పరిధిలోని మేరీ గోల్డ్ హోటల్‌లో (6-12-2016), వైజాగ్‌లోని నోవాటెల్ హోటల్ (30-10-2017), చండీఘర్‌లో పార్క్ ప్లాజా (11-2-2013 (రెండుసార్లు), పంజాబ్ జలంధర్‌లో రేడిసన్ హోటల్ (14-2-2013), కోల్‌కతాలోని నోవాటెల్ హోటల్ (5-12-2017), ఛత్తీస్‌ఘర్ రాయపూర్‌లోని హయత్ హోటల్ (3-12-2016), లక్నోలోని హయత్ రీజెన్సీ హోటల్ (23-11-2017), హర్యానాలోని ఘజియాబాద్‌లోని రెడిసన్ బ్లూహోటల్ (21-11-2016)లో చోరీలకు పాల్పడ్డాడు. ఆయా హోటల్స్‌లో చోరీలకు పాల్పడిన వెంటనే బస్‌లో ముంబై వెళ్లి చోరీ చేసిన ఆభరణాలను తనకు తెలిసిన రిసీవర్ హైరెన్ ఎం.షాకి ఇచ్చి సొమ్ము చేసుకునేవాడు.

ఈ మేరకు ఫిర్యాదు నందుకున్న బంజా రాహిల్స్ పోలీసులు ఈ కేసును ఛాలెంజింగ్‌గా తీసుకున్నారు. ఈ కేసు పరిశోధనలో పోలీసులు టెక్నాలజీని వినియోగించారు. దాని ఆధారంగా నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నామని హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ అంజనీకుమార్ తెలిపారు. నిందితుడు సెజ్‌పాల్‌పై పీడీయాక్ట్ ప్రయోగిస్తామని ఆయన తెలిపారు. చాకచక్యంగా ఈ కేసును శోధించిన పోలీసు సిబ్బందిని ఆయన ఈ సందర్భంగా అభినందించి రివార్డులు అందజేయనున్నట్లు తెలిపారు.

నాసా-స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్‌లో

ప్రపంచ చాంపియన్‌గా శ్రీచైతన్య

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నాసా -నేషనల్ స్పేస్ సొసైటీ అమెరికా వారి నాసా ఏమ్స్ స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్‌లో శ్రీచైతన్య-2018 సంవత్సరానికిగానూ ప్రపంచంలోనే అత్యధికంగా 334 మంది విద్యార్థులు వారి ప్రాజెక్టులకు అవార్డులు సాధించారు. దీంతో శ్రీచైతన్యను ప్రపంచ ఛాంపియన్‌గా నిలబెట్టారు. తద్వారా నాసా స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్టులో తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ వరసగా 5వ సంవత్సరం కూడా శ్రీచైతన్య వరల్డ్ ఛాంపియన్ అని మరోమారు నిరూపించారని స్కూల్స్ అకడమిక్ డైరెక్టర్ సీమ తెలిపారు. ఈ సందర్భంగా విన్నింగ్ ప్రాజెక్టులు సాధించిన334 మంది విద్యార్థినీ, విద్యార్థులను, వారి తల్లిదండ్రులు, అధ్యాపక బృందాన్ని శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్మన్ బిఎస్. రావు అభినందనలు తెలిపారు. ఎంపికైన విద్యార్థులందరూ ఈ సంవత్సరం లాస్ ఏంజిల్స్, కాలిఫోర్నియా, అమెరికాలో జరిగే ఐఎస్‌డీసీ కాన్ఫరెన్స్‌కు హాజరవుతారని ఆయన తెలిపారు.

కాంట్రాక్టు సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలి


హైదరాబాద్, ఆంధ్రప్రభ: గిరిజన మినీ గురుకులాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ వి. నిర్మల ప్రభుత్వాన్ని కోరారు. తమ డిమాండ్ల సాధన కోసం బుధవారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 29 గిరిజన గురుకులా (బాలికలు)లలో 1999- 2000 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభమైన నాటి నుంచి తక్కువ వేతనంతో బోధన, బోధనేతర సిబ్బంది పని చేస్తున్నారని ఆమె చెప్పారు.


మైనార్టీ అభ్యర్థులకు ఆర్ఆర్‌బీ పరీక్షలకు ఉచిత శిక్షణ

ఆర్ఆర్‌బీ పరీక్షలకు (గ్రూప్- డి) ప్రిపేరయ్యే మైనార్టీ విద్యార్థులు, యువత మైనార్టీ వెల్ఫేర్ స్టడీ సర్కిల్ అందించే ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ డైరెక్టర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసక్తిగల అభ్యర్థులు పదవ తరగతి మెమో, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోటోలతో పాటు ఆర్ఆర్‌బీ దరఖాస్తు చేసిన ఆన్‌లైన్ ధృవీకరణ పత్రం జత చేసి ఏప్రిల్ 5 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

భార్యా పిల్లల్ని హతమార్చాడు

● మరోసారి మీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో కలకలం







హైదరాబాద్ (సరూర్‌నగర్), ప్రభ న్యూస్: గ్రేటర్ హైదరాబాద్‌కు అతిసమీపంలో ఉన్న ప్రాంతంలో గత రెండు నెలల్లో భార్యపిల్లలను కడతేర్చిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. దీంతో మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో ప్రజల్లో కలకలం రేగింది. అభంశుభం తెలియని ఇద్దరు పిల్లలతో పాటు భార్యను అతికిరాతకంగా గొంతునులిమి కడతేర్చిన సంఘటన మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం లింగంపల్లి తెల్లాపూర్ ప్రాంతానికి చెందిన సంఘిశెట్టి సురేందర్ (35) ఆటోమెకానిక్‌గా పనిచేస్తున్నాడు. భార్య వరలక్ష్మీ(28), కుమారుడు నితీష్(5), కూతురు యశ్విని(3)లతో కలిసి లింగంపల్లిలో నివాసం ఉంటున్నాడు. వీరికి 7సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఉగాది పండుగను పురస్కరించుకొని సోమవారం ఉదయం వరలక్ష్మీ తన ఇద్దరు పిల్లలతో కలిసి తల్లిగారి ఇల్లు బడంగ్‌పేట్‌లోని సాయి ప్రభ హోమ్స్ కాలనీకి వచ్చింది. భర్త సురేందర్ సోమవారం రాత్రి అత్తామామ ఇంటికి వచ్చాడు. మంగళవారం ఉదయం 7గంటల ప్రాంతంలో మామ మహేష్, బావమర్ది తిలక్‌లను కల్లు తీసుకురావాల్సిందిగా పంపించాడు. వారు బయటకు వెళ్లిన వెంటనే బెడ్‌రూమ్‌కు తాళం వేసి భార్యను, ఇద్దరు పిల్లల గొంతు నులిమి హత్యచేశాడు. అనంతరం మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. అది గ్రహించిన తల్లిదండ్రులు పిల్లలు బతికున్నారేమోనని సంతోష్ నగర్‌లోని ఓవైసి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందారని వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

భార్యభర్తల మధ్య గొడవలు..

గత కొంతకాలంగా సంఘిశెట్టి సురేందర్, వరలక్ష్మీల మధ్య డబ్బుల విషయంలో గొడవలు జరుగుతున్నాయని తెలిసింది. వృధా ఖర్చులు చేయవద్దని వారించిన వరలక్ష్మీపై సురేందర్‌కక్ష పెంచుకున్నాడని తెలిపారు. ఉదయం కూడా ఇదే విషయంపై- మరోసారి గొడవ జరగడంతో భార్య, పిల్లలను అతి కిరాతకంగా హత్యచేశాడని బంధువులు ఆరోపిస్తున్నారు. కొన్ని రోజుల నుండి అదనపు కట్నం కోసం సురేందర్ భార్యను వేధించే వాడని అదనపు కట్నం ఇవ్వకపోవడంతోనే హత్య చేశాడని తల్లి దండ్రులు మండిపడ్డారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీసీపీ, ఏసీపీ

సాయిప్రభు హోమ్స్ కాలనీలో భార్య, పిల్లలను హత్య చేసిన సంఘటన తెలుసుకున్న ఎల్బీనగర్ డిసిపి వెంకటేశ్వరరావు, వనస్థలిపురం రవీందర్‌రెడ్డి, మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ మన్మోహన్, డిఐ మధుసూదన్, సంఘటనా స్థలానికి చేరుకొని డాగ్ స్క్వాడ్‌తో వివరాలను సేకరించారు. హత్యచేసిన ప్రాంతంలో చున్ని, గాజులు ఉన్నట్లు గుర్తించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని విచారణ చేస్తున్నామని తెలిపారు.


కేసీఆర్ ద్వంద్వ వైఖరి

• ఏపీ న్యాయశాఖ మంత్రి కొల్లు రవీంద్ర



అమరావతి, ఆంధ్రప్రభ: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ద్వంద్వ వైఖరి అవలంభిస్తున్నారని రాష్ట్ర న్యాయ, క్రీడలు, యువజన సర్వీసుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంగళవారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ, ఒకవైపు ప్రాంతీయ పార్టీలు ఏకం కావాలంటూనే మరోవైపు కేసీఆర్ బీజేపీకి సహకరిస్తున్నారన్నారు. బీజేపీకి సహకరించినవారినే కబళించే అలవాటుందని, అది కేసీఆర్ తెలుసుకోవాలన్నారు. విభజించు, పాలించు అన్న సూక్తిని నిజం చేస్తూ దేశ రాజకీయాలను శాసించాలని భావిస్తున్న అమిత్ షా కుయుక్తులను అడ్డుకోవాలని కోరారు. బీజేపీ ఎన్ని కుట్రలకు పాల్పడినా ప్రాంతీయ పార్టీలు బలపడటం ఖాయమన్నారు. అవిశ్వాస తీర్మానంపై లోక్ సభలో చర్చ జరగకుండా అన్నా డీఎంకే, టీఆర్ఎస్‌లు అడ్డుకోవడం వెనుక బీజేపీ కుట్ర దాగి ఉందన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయంగా థర్డ్ ఫ్రంట్ రావాలని చెబుతున్న టీఆర్ఎస్ ఇదే సమయంలో లోక్ సభలో బీజేపీకి మద్దతుగా వ్యవహరించడం సరైన పద్దతి కాదని హితవు పలికారు.

మార్కులు వేయడానికి పవన్ ఎవరు..?



అమరావతి, ఆంధ్రప్రభ : నాలుగు సంవత్సరాల్లో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి హైదరాబాద్‌లో కూర్చున్న వారికి ఏమి తెలుస్తుం దని రాష్ట్ర పంచాయతీరాజ్, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నా రు. తనపై జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై పరువు నష్టం దావా వేసే విషయం పార్టీ నిర్ణయిస్తుందని చెప్పారు. తనపై సీబీఐ విచారణ జరగనున్నదని ఎవరో అసత్యం ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ లాబీలో మంగళవారం ఆయన మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ తాను తన తాత ఎన్టీఆర్‌కు చెడ్డపేరు తీసుకురానని స్పష్టం చేశారు. అదే విధంగా నాన్న, ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడుకు కూడా చెడ్డపేరు తేబోనని స్పష్టం చేశారు. నోట్ల కేసులో ఇరుక్కు న్న శేఖర్ రెడ్డికి, తనకు సంబంధాలు ఉన్నయని ఆరోపణలు చేసిన పవన్ ఒక్కరోజులోనే మాట మార్చడంలోని అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. పనితీరులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు 2.5 మార్కులు వేయడానికి పవన్‌కల్యాణ్ ఎవరని ప్రశ్నించారు. తనపై ఆరోపణలు వస్తే నేరుగా మాట్లాడవచ్చని, పవన్ వద్ద తన ఫోన్ నెంబరు కూడా ఉందని గుర్తు చేశారు. ఆ విధంగా చేయకుండా ప్రజల మధ్య చౌకబారు ఆరోపణలు చేయడం సమంజసం కాదని అన్నారు.

రేపు జాతీయ రహదారుల దిగ్బంధం

అమరావతి, ఆంధ్రప్రభ: ఏపీకి ప్రత్యేక తరగతి హోదా, విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న ఏపీ ప్రత్యేకహోదా విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ రహదారుల దిగ్బంధన కార్యక్రమాలు జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గం పిలుపునిచ్చిందని రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం కె.రామాంజనేయులు అధ్యక్షతన విజయవాడలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను రామకృష్ణ విలేకరులకు తెలియజేశారు. సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ ఈడ్పుగంటి నాగేశ్వరరావు పాల్గొని అంతర్జాతీయ, జాతీయ రాజకీయ పరిణామాలను గురించి వివరించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర రాజకీయ పరిణామాలు, ప్రత్యేక హోదా ఉద్యమం తదతర అంశాల పై కార్యకలాపాల నివేదిక సమర్పించి, భవిష్యత్తు కర్తవ్యలను వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్రా నికి ప్రత్యేకహోదా, విభజన హామీల అమలుకై సాగే పోరాటం, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. అనంతరం సమావేశం పలు తీర్మానాలను ఆమోదించింది.

వ్యవసాయ వర్సిటీకి నిధుల విడుదల

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ప్రభుత్వం రూ.12.50 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు మంగళవారం వ్యవ సాయ సహకార శాఖ ముఖ్య కార్యద ర్శి పార్థసారధి జీవో విడుదల చేశారు. 2017-18 వార్షిక కేటాయింపుల్లో నాల్గవ త్రైమాసికం నిధులుగా పేర్కొన్నారు.

సైనిక సంక్షేమ నిధికి విరాళం

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : సైనిక సంక్షేమ నిధికి రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్లు ఒక రో జు మూల వేతనం ఇచ్చారు. లెక్చ రర్ల విజ్ఞప్తిమేరకు వారికి చెల్లించే వేతనంలో మూలవేతనం మినహా యిస్తున్నట్లు ప్రభుత్వం మంగళ వారం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రత్యేక మార్కెట్ కమిటీగా పాలకుర్తి


హైదరాబాద్, ఆంధ్రప్రభ : జనగామ జిల్లా కొడకండ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నుంచి పాలకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీని కొత్తగా ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం వ్యవసాయ మార్కెటింగ్ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారధి జీవో విడుదల చేశారు. రెండు వేర్వేరు మార్కెటింగ్ కమిటీలను ఏర్పాటు చేస్తూ నోటిఫికేషన్లను ఇచ్చారు.

ఏపీ పీసీబీకి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కృష్ణా జిల్లా , ఇబ్రహీంపట్నంలోని నార్ల తాతారావు థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి వెలువడుతున్న కాలుష్యం వల్ల గాలి, నీరు, కలుషితం అవుతున్నాయని పేర్కొంటూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. పిటిషనర్ లేవనెత్తిన అభ్యంతరాలపై పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, సభ్యకార్యదర్శి , నార్ల తాతారావు థర్మల్ ప్లాంట్ చీఫ్ ఇంజనీరు కు, ఏపీ జెన్ కో, ఇందనశాఖ, ఏపీ జెన్ కో లకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మి తో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ వాయిదా వేసింది.

ప్రైవేటు బీఈడీ,డీఈడీ కాలేజీల తనిఖీ కోసం రూ.లక్ష చెల్లించండి

• పిటిషనర్‌కు హైకోర్టు సూచన




హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఏపీ రాష్ట్రంలోని ప్రకాశం, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాలోని పలు ప్రైవేటు డీఈడీ, బీఈడీ కళాశాలల్లో బోధనా సిబ్బంది, తదితర మౌలిక సదుపాయాలను తనిఖీ చేసేందుకు ఏపీసీటీఈ డైరెక్టర్ వద్ద లక్ష రూపాయలు వారం రోజుల్లోగా డిపాజిట్ చేయాలని హైకోర్టు పిటిషనర్ ను ఆదేశించింది. ఆ మూడు జిల్లాల్లోని కాలేజీలను తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మి తో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. గుంటూరు జిల్లా, వినుకొండలోని ఎస్ఆర్టీఈడీ, జీఎస్ఆర్ డీఈడీ కాలేజ్ (బాలికలు), సలమ్ డీఈడీ, అమరావతి డీఈడీ కాలేజీలు, ప్రకాశం జిల్లా, కందుకూరు మండలం ఓగూరు గ్రామంలోని ఎస్ ఆర్ డీఈడీ , యర్రగొండ పాలెం గ్రామంలోని షారోన్ డీఈడీ కళాశాలలు, గోదావరి జిల్లా ఆత్రేయపురంలోని మహాత్మాగాంధీ డీఈడీ కళాశాలల్లో 2016-17, 17-18 విద్య సంవత్సరానికి ప్రభుత్వం నిర్వహించిన మొత్తం 1000 సీట్ల కౌన్సెలింగ్ లో కేవలం 163 మంది విద్యార్థులు మాత్రమే చేరితే మొత్తం సీట్లు భర్తీ అయినట్లు ప్రభుత్వం నుంచి ఆయా కళాశాలలు ఆమోదం పొందేందుకు యత్నిస్తున్నాయని పేర్కొంటూ జర్నలిస్టు ఎన్.మాధవరావు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

ఏపీపై బీజేపీ ఎదురుదాడి

• వంతపాడుతున్న వైకాపా, జనసేన • పవన్‌ది పూటకో మాట

• రాష్ట్ర ప్రయోజనాలకన్నా ఏదీ ముఖ్యంకాదు : చంద్రబాబు నాయుడు



అమరావతి, ఆంధ్రప్రభ : విభజన వల్ల నష్టపోయిన రాష్ట్రానికి న్యాయం చేయాల్సింది పోయి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎదురుదాడికి సిద్ధమైందని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు గాయపడిన సైనికులని వారి గాయాలను మాన్పలే తప్ప వాటిని మరింత రెచ్చగొట్టేలా చేయకూడదన్నారు. అన్ని విధాలా అండగా ఉండాల్సిన వారు నిర్లక్ష్యం చేస్తున్నారని దీనికి వైకాపా, జనసేనలు వంతు పాడుతున్నాయని ధ్వజమెత్తారు. అన్ని వేళ్లు కేంద్రం, మోడీవైపు చూపిస్తుంటే ఈ రెండు పార్టీల వేళ్లు తనవైపు చూపిస్తున్నాయన్నారు. మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన ఉండవల్లిలో తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ గడిచిన నాలుగేళ్లుగా ప్రతి అడుగు జాగ్రత్తగా వేస్తూ ఓపికగా ఎదురు చూసినా బీజేపీ న్యాయం చేయలేదని, ఇచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేదని అన్నారు. దెబ్బతిన్న రాష్ట్రానికి అండగా ఉండాలని 29 సార్లు ఢిల్లీ వెళ్ళినా ఏ మాత్రం ప్రయోజనం లేదన్నారు. విభజన చట్టంలోని 19 అంశాలు, పార్లమెంటులో ఇచ్చిన 6 హామీలలో ఏ ఒక్కటి నెరవేర్చలేదని దీంతో ఆ పార్టీతో తెగదెంపులు చేసుకొని బయటకు వచ్చామన్నారు. తొలి ఏడాది ఇవ్వాల్సిన ఆర్థిక లోటు నిధులను కూడా ఐదేళ్ల పాటు నాన్చి ఇప్పుడు ఇంకా రూ.138 కోట్లు ఇస్తామని చెప్పడం ఎంత వరకు న్యాయమన్నారు. ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా మిత్రబంధాన్ని వదులుకొని న్యాయం చేయాలని పోరాటం చేస్తుంటే తనను బలహీనపర్చడం ద్వారా రాష్ట్రంలో అశాంతి లేపాలనే ప్రయత్నం చేస్తుందని చంద్రబాబునాయుడు మండిపడ్డారు. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ దేశ రక్షణ, సైన్య నిధులు కూడా ఇవ్వమంటారా..? అని మాట్లాడిన మాటలు ప్రజలకు తీవ్ర ఆగ్రహాన్ని గురి చేశాయన్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్రంలో కొనసాగడం సరికాదనే నిర్ణయంతోనే ఇద్దరు మంత్రులను రాజీనామా చేయించడంతో పాటు ఎన్డీయే నుంచి కూడా వైదొలిగామన్నారు. దీంతో తనపై ఎదురుదాడి చేయించేందుకు వైకాపా, జనసేనలను వినియోగించుకుంటూ కుట్ర రాజకీయాలకు బీజేపీ తెర తీసిందంటూ దుయ్యబట్టారు. తనపై దాడి చేయడంలో చూపిస్తున్న శ్రద్ధ కొంతైనా రాష్ట్రంపై చూపించి ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. కేంద్రంలోని పెద్దలతో నిత్యం భేటీలు, ప్రధానమంత్రి కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ విజయసాయిరెడ్డి లాబీయింగ్ చేస్తున్నారని విమర్శించారు. కేంద్రం కూడా జగన్, విజయసాయిరెడ్డిలను కాపాడాలనే చూస్తుందనే ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్ళిందని నేతలకు చంద్రబాబు వివరించారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు అవిశ్వాసం నోటీసు ఇస్తే అనుమతించకుండా గడిచిన మూడు రోజులుగా సభను వాయిదాలు వేస్తున్నారని ఈ పరిణామాలన్నింటిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. మరోవైపు పవన్‌కళ్యాణ్ ఉదయం ఒక మాట, సాయంత్రం ఒక మాట మాట్లాడుతూ ప్రజలను గందరగోళంలోకి నెట్టేసే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. జనసేన అవిర్భావ సభలో లోకేష్‌పై విమర్శలు చేసి ఆ తరువాత అందరు అంటున్నారు కాబట్టే తాను అన్నానని ఆధారాలు లేవని అన్నారు. ఇప్పుడు ఆధారాలు ఉన్నాయంటూ మరో కొత్త డ్రామా ఆడుతున్నారన్నారు. ప్యాకేజీని పాచిపోయిన లడ్డూతో పోల్చడమే కాకుండా ఇప్పుడు హోదాతో లాభం లేదంటున్నారని చంద్రబాబు చెప్పారు. ప్రత్యేక హోదా కన్నా నిధులు ముఖ్యం అంటూ మాట్లాడుతూ నిలకడలేని తన మనస్తత్వాన్ని నిరూపించుకున్నారన్నారు.

జాయింట్ ఫైండింగ్ కమిటీ పేరు కూడా ఆవిర్భావ సభలో ప్రస్తావించలేదని కమిటీ కేంద్రం నుంచి రావాల్సిన బకాయిలు రూ.75 వేల కోట్లు ఉన్నాయని చెప్పిన వాటి గురించి కూడా మాట్లాడలేదన్నారు. మరో అడుగు ముందుకు వేసి అసలు ప్రత్యేక హోదా గురించి మోడీ ప్రస్తావించలేదని, యూపీఏ చెప్పిందంటూ పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారని విమర్శించారు. బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన పదేళ్ళ హోదా అంశాన్ని మర్చిపోయారా..? అంటూ ప్రశ్నించారు. ఈ నాటకాలన్ని ప్రజలు అర్థం చేసుకుంటున్నారని, సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. పోలవరం ప్రాజెక్టును కాంట్రాక్టర్ల నుంచి కమిషన్లు పొందేందుకే రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందని పవన్ కళ్యాణ్ చాలా దుర్మార్గపు వ్యాఖ్యలు చేశారని గతంలో వైసీపీ సీబీఐ దర్యాప్తు చేయాలని చెప్పిన మాటలనే ఆయన మళ్ళీ మాట్లాడుతున్నారన్నారు.

నాబార్డుకు వడ్డీ విడుదల

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ఈ త్రైమాసికానికి గానూ నాబార్డుకు చెల్లించాల్సిన వడ్డీని ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు పరిపాలనా అనుమతిని మంజూరు చేస్తూ రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి కె రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సాగునీటి ప్రాజెక్టులకు గానూ తీసుకున్న రుణాలకు వడ్డీ రూ. 45,12,620 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది.

24న పాస్‌పోర్ట్ మేళా


హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : బేగంపేటలోని పాస్‌పోర్ట్ కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 24 న పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్స్ (పీసీసీ) మేళా నిర్వహిస్తున్నారు. తమ పాస్ పోర్ట్ సేవాకేంద్రంలో తొలిసారిగా నిర్వహించనున్నట్లు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని రీజినల్ పాస్ పోర్టు అధికారి డాక్టర్ ఇ విష్ణువర్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచే మేళాలో పాల్గొనేందుకు 1000 స్లాట్స్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అవసరమైన సర్టిఫికెట్లతో మేళాలో పాల్గొనాలని, ఇతర సమాచారం కోసం డబ్ల్యు డబ్ల్యు డబ్ల్యు . పాస్ పోర్ట్ ఇండియా. గవ్‌ఇన్‌లో తెలుసుకోవచ్చని సూచిచారు. దరఖాస్తులు ఉచితంగా ఇస్తున్నామని పేర్కొన్నారు.

ఆ మూడు పార్టీలది ఒకే అజెండా

• టీడీపీని బద్నాం చేసేందుకు కుట్ర

• పవన్ మాటలు పచ్చి అబద్ధాలు

• ఏపీ సీఎం చంద్రబాబు



అమరావతి, ఆంధ్రప్రభ: బీజేపీ, వైసీపీ, జనసేన పార్టీల అజెండా ఒక్కటేనని కేవలం టీడీపీపై బురద జల్లడమే లక్ష్యంగా పనిచేస్తున్నాయని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ధ్వజమెత్తారు. ఈ మూడు పార్టీలది ఒకే స్క్రిప్టు అని, ఇది ఒకేచోట తయారవుతోందని చెప్పారు. వైసీపీ, జనసేన పార్టీలు బీజేపీకి కోవర్టుగా పనిచేస్తున్నాయని విమర్శించారు. అయితే ఈ ఆరోపణలన్నీ గతంలో జగన్ మీడియాలో వచ్చినవేనని వీటిని ప్రజలు తిరస్కరించారని అన్నారు. దగాపడ్డ రాష్ట్రానికి న్యాయం చేయాలని తెలుగుదేశం పార్టీ పోరాటం చేస్తుంటే, ఈ మూడు పార్టీలు టీడీపీని బద్నాం చేసేందుకు కుట్రలు పన్నుతున్నాయని మండిపడ్డారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉండవల్లిలోని తన నివాసం నుంచి పార్టీకి చెందిన ఎంపీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీపై బురద జల్లడం ఒక పద్దతి ప్రకారం ఈ మూడు పార్టీలు చేస్తున్నాయని, దీనిపై ప్రజలు కూడా ప్రశ్నిస్తున్నారన్నారు. రాష్ట్రానికి అన్యాయం చేయడం, సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాట్లాడేవన్నీ పచ్చి అబద్ధాలని, గతంలో జగన్ మీడియాలో వచ్చిన ఆరోపణలే చేస్తున్నారన్నారు. ప్రజల్లో గందరగోళం సృష్టించాలన్న లక్ష్యంతోనే ఈ నాటకాలు ఆడుతున్నారని దుయ్యబట్టారు. పోలవరం పునరావాస నిధులు ఇస్తామని కేంద్రం చెప్పిందని అయితే రాష్ట్ర ప్రభుత్వమే ముందుకు వచ్చినట్లుగా పవన్ కల్యాణ్ మాట్లాడిన మాటలు పచ్చి అబద్ధాలుగా అభివర్ణించారు. నిన్న మంత్రి లోకేష్‌కు శేఖర్‌రెడ్డికి ముడిపెట్టిన ఆయన ఈనాడు పోలవరంపై ఆరోపణలు చేస్తున్నారని, ఈ పరిణామాలన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడుతున్న ఈ కీలక సమయంలో పవన్ ఆరోపణలు ఎందుకు చేస్తున్నారో, ఎవరు చేయిస్తున్నారో చెప్పాలన్నారు. అంతేకాకుండా హోదా గురించి మోడీ చెప్పలేదు, యూపీయే ఇచ్చిన హామీనే అనడం వెనుక అర్థమేమిటని ప్రశ్నించారు. ఎవరికో కొమ్ము కాసి లబ్ధి చేకూర్చే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని మంత్రి మోడీకి, తనకు విరోధం ఏముందని దీనిపై మోడీ ఏమైనా చెప్పారా..? అంటూ పవన్ కల్యాణ్‌ను చంద్రబాబు సూటిగా ప్రశ్నించారు.

ప్రత్యేక హోదా ఎందుకు ఇవ్వరు..?

• శాసనసభలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా ఎందుకు ఇవ్వరని, అది ఆంధ్రప్రదేశ్ హక్కు అని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. మంగళవారం శాసనసభలో మాట్లాడుతూ విభజనతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌ను ఇంకా కష్టాల్లోకి నెట్టవద్దని కేంద్రాన్ని కోరారు. ఏపీ ప్రజలతో సంబంధం లేకుండా విభజన చేశారని, ఆనాడు అరుణ్ జైట్లీ, వెంకయ్య నాయుడు 10సంవత్సరాలు ప్రత్యేక హోదా ఇస్తామన్నారని, ఇప్పుడు ఎందుకు ఇవ్వరని నిలదీశారు. ఈరోజు దేశం మొత్తం సహకరిస్తున్నారని, బీజేపీ, తాము ఎన్నికల్లో పొత్తుపెట్టుకొని గెలిచామని, అన్ని రాజకీయ పార్టీలు ఏపీకి న్యాయం చేయాలని చెబుతున్నాయన్నారు. రాష్ట్రం కుదటపడే సమయంలో సహకరిస్తారనుకుంటే నిరాధరణకు గురిచేశారని, రాష్ట్రానికి సహకరిస్తుందనుకున్న మిత్రపక్షం అన్యాయం చేయడం బాధాకరమని వ్యాఖ్యానించారు. విభజన సరిగ్గా జరిగివుంటే రాష్ట్రం మరింత అభివృద్ధి జరిగేదని అభిప్రాయపడ్డారు. నాలుగు సంవత్సరాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని, కేంద్రం సహకారం ఇవ్వటంలేదని, చట్టంలో పొందుపర్చిన అంశాలను కూడా ఇవ్వటంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. వ్యవసాయానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చామని, అనుబంధ రంగాలైన హార్టికల్చర్, ఆక్వా తదితర రంగాలపై దృష్టిపెట్టామన్నారు. దీంతో వ్యవసాయంలో దేశంకంటే ఆరురెట్లు వృద్ధిరేటు సాధించామన్నారు. ఏపీలో పట్టణీకరణ తక్కువని, సేవారంగంలో అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో 24సార్లు సీఐఐ సదస్సులు జరిగితే 6సార్లు తాను నిర్వహించానని, గడిచిన 10సంవత్సరాల్లో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ రాలేదని, కాంగ్రెస్ అవినీతి భయపడి వోక్సు వాగన్ పరాణేకు పారిపోయిందన్నారు. అదేవిధంగా వాన్ పిక్, లేపాక్షికి భూములు కేటాయించినా ఆగిపోయాయన్నారు. ఈమూడు సంవత్సరాల కాలంలో రూ.18.55 లక్షల కోట్ల పెట్టుబడులతో 2630 ఒప్పందాలు జరిగాయని, 4.44 లక్షల ఉద్యోగాలు వస్తాయన్నారు. ఇప్పటివరకు 2.64 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. రాష్ట్రంలో పలు పరిశ్రమలు వచ్చాయని, ఎడారిగా మారిపోతుందన్న అనంతపూర్‌కు కియా మోటార్ వచ్చిందని, 23తేదీన హీరో మోటార్స్ కూడా వస్తుందని, రాయలసీమను ఆటో మోబైల్ హబ్‌గా తయారవుతుందన్నారు. ఒకప్పుడు సైన్సు సిటీ అన్నారని, అది అడ్రస్ లేకుండా పోయిందన్నారు. ఒక్కో ఇంటిలో ఒక పారిశ్రామిక వేత్త తయారు కావాలని, ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 175 ఎమ్మెస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తామని, ఇప్పటికీ 90 నియోజకవర్గాల్లో భూమి తీసుకున్నామన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో పరిశ్రమలు వచ్చేవిధంగా ముందుకు పోతున్నామని, మెగా సీడ్ పార్కులతో ఓర్వకల్లు దగ్గర విమానాశ్రయాన్ని తీసుకొస్తున్నామని, జూన్‌లో ప్రారంభిస్తామన్నారు. దేశంలో గుర్గావ్ కంటే తిరుపతి, శ్రీసిటీలు హార్డ్ వేర్ హబ్‌గా తయారవుతాయన్నారు. పారిశ్రామిక కారిడార్లకు కేంద్రం నిధులు ఇవ్వకుండా గ్రాంట్‌ల రూపంలో ఇస్తున్నారని మండిపడ్డారు.

అంతర్రాష్ట్ర డ్రగ్స్ సరఫరాదారు అరెస్టు


• 15 ఎల్‌సీడీ బ్లాట్స్, కేజీ గంజాయి స్వాధీనం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాచకొండ కమిషనరేట్ పరిధిలో సరూర్‌నగర్ పోలీ సులు, ఎస్‌వోటీ మల్కాజ్‌గిరి జోన్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి గోవా నుంచి డ్రగ్స్ తెస్తూ.. అక్కడికి గంజాయి సరఫరాకు పాల్పడుతున్న గణేష్ అలియాస్ బాబీ(27) అనే బీటెక్ విద్యార్థిని అరెస్ట్ చేశారు. అరెస్టయిన నిందితుడి వద్దనుంచి 15 ఎల్ఎస్‌డీ బ్లాట్స్, 10 యాంపిటమైన్ టాబ్లెట్స్, ఒక కేజీ వీడ్ (గంజా)తో పాటు బైక్, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. గణేష్ అలియాస్ బాబీ స్వస్థలం కృష్ణాజిల్లా ముసునూరు మండలం చెక్కపల్లి గ్రామం. ప్రస్తుతం హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో తన స్నేహితులతో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. బీటెక్ విద్యార్థి అయిన గణేష్ కొంతకాలం ఎంఎన్‌సీ కంపెనీలో పనిచేస్తూ మానివేశాడు. గణేష్ తన స్నేహితులు అరవింద్‌రెడ్డి, ప్రవీణ్, మహేష్‌లతో కలిసి తరచూ డ్రగ్స్ తీసుకునేందుకు గోవా వెళ్లేవాడు. అదే సమయంలో డ్రగ్స్ సరఫరాదారు ఆర్బిడ్ మీర్ అలియాస్ టైగర్‌తో వీరికి పరిచయమేర్పడింది. గణేష్ అతడి స్నేహితులతో టైగర్‌కు మంచి మిత్రుత్వం ఏర్పడింది. డ్రగ్స్ సరఫరాలో గోవాలో టైగర్‌ది అందెవేసిన చేయి. దీంతో తనకు వీడ్(గంజా) సరఫరా చేస్తే తాను డ్రగ్స్‌ను మీకు అందిస్తానని టైగర్ తెలిపాడు. దీంతో, గణేష్, అతడి స్నేహితులు విశాఖపట్నం, ఖమ్మం ఏజెన్సీ ఏరియాల నుంచి గంజాను టైగర్‌కు సరఫరా చేసేవారు. అక్కడ్నించీ టైగర్ వీరికి డ్రగ్స్ సరఫరా చేసేవాడు. ఈ విధంగా వచ్చిన డ్రగ్స్‌ను ఇక్కడి తమకు తెలిసిన కస్టమర్లకు విక్రయించడం ద్వారా సొమ్ము చేసుకునేవారు. ఈ విధంగా గణేష్, టైగర్‌లు పరస్పరం అవగాహనతో ఈ అక్రమ దందాకు తెరలేపారు. ఇంతకు మునుపే ఈ కేసులో ఆర్బిడ్ మీర్ అలియాస్ టైగర్, అరవిందరెడ్డిలను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. షేక్ అహ్మద్, షేక్ రషీద్‌లను ఈ నెల 15వ తేదీన సరూర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. వీరు అరవింద్‌రెడ్డి, గణేష్‌లకు గంజాయి సరఫరా చేసే సమయంలో పోలీసులకు చిక్కారు. తాజాగా మంగళవారం గణేష్ అలియాస్ బాబీని విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు అరెస్టు చేశారు. వీరు హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ ఇతర ప్రాంతాలకు వాట్సాప్ ద్వారా ఆర్డర్లు తీసుకుని సరఫరా చేసేవారు. ఇకహైదరాబాద్‌లో తనకు తెలిసిన కస్టమర్లకు డ్రగ్స్‌ను బాబీ విక్రయించేవాడని పోలీసులు తెలిపారు.

కాల్‌సెంటర్ ఉద్యోగాలపై అమెరికా ఆంక్షలు

• విదేశాల్లోని సెంటర్ల జాబితా తయారు • భారత్‌లోని టెక్కీల ఆందోళన



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తమ దేశస్తులకే అమెరికాలో ఉద్యోగాలంటూ ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన దశల వారీగా వివిధ రూపాల్లో అమల్లోకి వస్తోంది. ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు భారతీయ టెక్కీల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. హెచ్-1బీ వీసా, డ్రీమర్ల వీసాలపై ఇప్పటికే తన నిర్ణయం ప్రకటించిన ట్రంప్ ఇప్పుడు తాజాగా కాల్‌సెంటర్ ఉద్యోగులపై ఆంక్షలు విధించారు. అమెరికా ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న కొత్త చట్టం లక్షలాది మంది భారతీయుల ఉద్యోగాలను ప్రశ్నార్థకం చేయనుంది. కాల్‌సెంటర్ ఉద్యోగాలను ఔట్‌సోర్సింగ్ కింద విదేశాలకు తరలించడాన్ని నిషేధించేందుకు కొత్త చట్టం తేవాలని ట్రంప్ నిర్ణయించారు. అమెరికా కంపెనీల ఔట్‌సోర్సింగ్ భారత్‌లోనే పెద్ద సంఖ్యలో ఉన్నందున ఇక్కడి టెక్కీలపై దాని ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. అమెరికాలో పనిచేసే ఉద్యోగాలకేకాక భారత్‌లో కాల్ సెంటర్ ఉద్యోగాలకు ముప్పు పొంచి ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.అమెరికా కంపెనీల కాల్ సెంటర్ ఉద్యోగాలన్నీ విదేశాలకే తరలించారు. గతంలో అత్యధికంగా ఉపాధి కల్పించిన ఈ కాల్ సెంటర్ జాబ్స్‌కు భారత్ కేంద్రంగా సేవలు అందిస్తున్నారు. దీంతో ఈ రంగంపై దృష్టిపెట్టిన ట్రంప్ ఔట్‌సోర్సింగ్ సేవలను నిరోధించే ప్రయత్నం ముమ్మరం చేశారు. కాల్ సెంటర్ జాబ్స్‌ను ఔట్‌సోర్సింగ్‌కు ఇచ్చిన కంపెనీల జాబితా తయారు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు విదేశాలకు కాల్ సెంటర్ ఉద్యోగాలు ఇచ్చిన కంపెనీలకు కాంట్రాక్టుల్లో ప్రాధాన్యత తగ్గించాలని నిర్ణయించింది. అమెరికాలోనే కాల్ సెంటర్ నిర్వహించే కంపెనీలకు ప్రాధాన్యతతో పాటు రాయితీలు ఇవ్వాలని ప్రతిపాదించింది. అలాగే అమెరికాలోని కాల్ సెంటర్‌లో ఆ దేశస్తులకే ప్రాధాన్యత ఇవ్వాలని ట్రంప్ ఆదేశించారు.అమెరికా అంతటా కాల్ సెంటర్లను మూసేసిన కంపెనీలు భారత్, మెక్సికోకు తరలించాయని ఒహియో స్టేట్ సెనేటర్ షరాడ్ బ్రౌన్ ఆందోళన వ్యక్తంచేశారు. కాల్‌సెంటర్ల ఔట్‌సోర్సింగ్‌ను నిషేధించే కొత్త చట్టాన్ని కూడా బ్రౌనే ప్రతిపాదించారు.

అమెరికాలో పన్నులు చెల్లించకుండా తప్పించుకునేందుకే చాలా కంపెనీలు భారత్, మెక్సికో తదితర దేశాల్లో కాల్‌సెంటర్లు ఏర్పాటు చేశాయని ఆయన ఆరోపించారు. అమెరికా తీసుకొస్తున్న ఈ కొత్త బిల్లు చట్టంగా మారితే ముఖ్యంగా భారత్‌లో కాల్ సెంటర్ ఉద్యోగాలకు రిస్క్ పొంచి ఉందని ఐటిని నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఏ కంపెనీ అయినా వారి కస్టమర్ సర్వీస్ సిబ్బంది తోడ్పాటు లేకుండా తగిన విధంగా పని చేయలేదని, అలా కంపెనీల కంపెనీల అభివృద్ధికి తోడ్పడిన అమెరికన్ల ఉద్యోగాలు విదేశాలకు తరలివెళ్ళకుండా చూడాలని షరాడ్ బ్రౌన్ సూచించారు.

చిత్తశుద్ధిలేని చంద్రబాబు

• సీఎంపై మండిపడ్డ వైకాపా



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: అధికార పక్షం కంటే తామేమీ తక్కువ తినలేదంటోంది ప్రతిపక్షం. పార్లమెంట్ ప్రారంభమైన నాటి నుంచి టీడీపీతో పాటు విభజన హామీలు, ప్రత్యేక హోదాపై ఆందోళన చేపడుతున్న వైసీపీ ఏమాత్రం వెనక్కి తగ్గట్లేదు. అవకాశం దొరికితే చాలు చంద్రబాబుపై ఆ పార్టీ ఎంపీలు నిప్పులు చెరుగుతున్నారు. అవిశ్వాస తీర్మానం చర్చకు రాకపోవడానికి చంద్రబాబే కారణమని ఎంపీ విజయ సాయిరెడ్డి విరుచుకుపడ్డారు

బాబు అందరికీ విడాకులిచ్చారు: ఎంపీ విజయ సాయిరెడ్డి

ఈ అవిశ్వాస తీర్మానం చర్చకు రాకపోవడానికి కారణం చంద్రబాబు. గతంలో చంద్రబాబు ప్రతి ఒక్క రాజకీయ పార్టీతో పొత్తు పెట్టుకున్నారు. చంద్రబాబు 1999లో బీజేపీతో జత కట్టారు. 2004లో కమ్యూనిస్టుతో జత కట్టారు. 2009లో టీఆర్ఎస్‌ను పెళ్లి చేసుకున్నారు. అందరికీ విడాకులు ఇచ్చి ఇప్పుడు బీజేపీతో కలిశారు. చిత్తశుద్ధి లేని వ్యక్తి బాబు.

ప్రజలు గొప్పగా ఆలోచిస్తున్నారు: ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

ఇంకా ఎంతకాలం వాయిదాల పర్వం కొనసాగుతుందో తెలియదు. సభ వాయిదా పడిన తర్వాత స్పీకర్‌తో కలిసి చర్చకు తీసుకు రావాలని వేడుకున్నాం. సభ ఆర్డర్‌లో ఉంటే చర్చకి వస్తుందని స్పీకర్ చెప్పారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ఘోరంగా నష్టపోయింది. మొదటి నుంచి ఒకే మాట మీద వైస్సార్సీపీ పార్టీ నడుస్తుంది. మేము కేంద్రాన్ని కొత్త కోరికలు కోరడం లేదు. చంద్రబాబు ఎన్ని విన్యాసాలు చేశారో అందరూ చూశారు. చంద్రబాబు సామెతలు కూడా చెబుతున్నారు. ఇప్పుడు యు టర్న్ తీసుకొని అవిశ్వాస తీర్మానం ఇచ్చారు. ప్రజలు అనుకున్నంత అమాయకులు కారు. చేసిన వరకు చాలు. ఇప్పుడు ప్రజలు గొప్పగా ఆలోచిస్తున్నారు. రాష్ట్రానికి ఎన్డీయే అన్యాయం చేస్తోంది. టీడీపీ, బీజేపీ కలిసి రాష్ట్రానికి అన్యాయం చేశారు. కొందరు తీర్మానాన్ని చర్చకు రాకుండా చూస్తున్నారు.

చర్చ జరిగే వరకూ పోరాటం ఆగదు: ఎంపీ వైవీ సుబ్బారెడ్డి

రోజుకో మాట మార్చడానికి చంద్రబాబును కాదు. ఈ రోజు కూడా దురదృష్టవశాత్తు చర్చకు రాకుండా అన్యాయం చేశారు. ఈ రోజు అయిన చర్చకు వస్తుందేమో అని మేము ఆశించాం. మాట్లాడదామని రాజ్‌నాథ్ సింగ్ నిన్న చెప్పారు. టీఆరెస్, ఏఐడీఎంకేకి మద్దతు ఇవ్వాలని కోరాము. చర్చకు వచ్చేంత వరకు మా పోరాటం ఆగదు. మరోసారి వైఎస్సార్సీపీ తరపున అవిశ్వాస తీర్మానం ఇచ్చాం



అసెంబ్లీ సమావేశాలు



మీడియా పాయింట్..

ప్రజాసమస్యలపై స్పందించట్లేదు



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : వారం రోజుల నుంచి అనేక సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చాం అయినా ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనలేదని బీజేపి ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ విద్యారంగం, టీచర్ పోస్టుల భర్తీపై ప్రభుత్వం జాప్యం చేస్తుందని ఆయన విమర్శించారు. రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో 70 శాతం హైదరాబాద్ నుంచే వస్తుందన్నారు. రెండు రోజుల క్రితం ప్రకటించిన బడ్జెట్‌లో హైదరాబాద్ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆయన దుయ్యబట్టారు.

బీసీ రిజర్వేషన్లు పెంచాలి



బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లను పెంచాలని ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఇదే విషయంపై పార్లమెంట్‌లోనూ ఎంపీలు ఆందోళన చేస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వాలు బీసీలను మనుషులుగా గుర్తించడం లేదని, వారిని ఓట్లు వేసే మిషన్‌ల మాదిరి గానే చూస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు రాజ్యాధికారం వద్దా, బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది అందుకే రిజర్వేషన్లను పెంచాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



బిల్డింగ్ కార్మికుల సమస్యలు పరి ష్కరించాలని ఎమ్మెల్యే సున్నం రాజయ్యపేర్కొన్నారు. రాష్ట్రంలో 20 లక్షల మంది అసంఘటిత కార్మికులు ఉన్నారన్నారు. దేశ వ్యాప్తంగా అసంఘటితకార్మికులకు ఏ విధమైన చట్టాలు ఉన్నాయో వాటిని మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

హామీలను అమలు చేయాలి



ప్రజలకు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్ర భు త్వాలు వెంటనే అమలు చేయాలని ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పేర్కొన్నారు. తెలం గాణకు రావాల్సిన నిధులపై పార్లమెంట్‌లో పోరాడాలని సూచించారు. తెలంగాణ ప్రభు త్వం మనకు వచ్చే నిధుల గురించి పార్లమెం ట్‌లో పోరాడమంటే ఫెడరల్ ఫ్రంట్ పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆయన విమర్శించారు.

అరగంటకు పార్కింగ్ ఫ్రీ

(మొదటిపేజీ తరువాయి)

విషయం తెలిసిందే. నగరంలోని పలు వాణిజ్య సముదాయాల్లో పార్కింగ్ ఫీజు దోపడి చేస్తున్నారన్న ఆరోపణలు ప్రజల్లో పెద్దఎత్తున రావడంతో.... ప్రభుత్వం కొత్త పార్కింగ్ విధానానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఏప్రిల్ మొదటి తేదీ నుంచి ముందుగా వాణిజ్య సముదాయాల వద్ద నూతన విధానాన్ని అమలు చేస్తోంది. ఆయా ప్రాంతాల్లో అడ్డదిడ్డమైన పార్కింగ్‌ను నియంత్రించడానికి కొత్త నిబంధనలను అమలు చేయాలని నిర్ణయించింది. మొదటి అరగంట వరకు ఎలాంటి రుసుం వసులు చేసే అవకాశం లేకపోవడంతో వాహనదారులు నేరుగా వచ్చి పార్కింగ్ స్థలంలో తమ వాహనాలను నిలిపి...వెనువెంటనే తమ పనులను పూర్తి చేసుకుని వెళ్ళిపోనున్నారు. దీని ద్వారా ట్రాఫిక్‌ను క్రమబద్దీకరించడంతో పాటుగా వాహనదారులకు కూడా ఫార్కింగ్ ఫీజు నుంచి వెసలుబాటు కల్పించినట్లు అవుతుంది. ఈ తరహా విధానం విజయవంతం అయితే అన్ని మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పాటు ముఖ్యమైన ప్రాంతాల్లో మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసే అంశంపై కూడా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. నగర, శివారు ప్రాంతాల్లో ని ఖాళీ స్థలాలను వాహనాల పార్కింగ్ కోసం సేకరించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా హెచ్ఎండిఏ పరిధిలో గల ఖాళీ స్థలాల యజమానులు ఆయా స్థలాలను పార్కింగ్ కోసం అద్దె రూపంలో ప్రభుత్వానికి అప్పగించాలని కోరుతూ హెచ్ఎండిఏ అధికారులు ఎంఎస్ఎంఎస్‌లు కూడా పంపుతున్నారు. దీనికి ముందుకు వచ్చిన వారి స్థలాలు తీసుకుని ఆయా ప్రాం తాల్లో మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. దీంతో నగరంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో మునుముందు పార్కింగ్ సమస్యను తీర్చడంతో పాటుగా ట్రాఫిక్ సమస్యను కూడా నియంత్రించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

త్వరలో శాస్త్రీయ విధానం

అసెంబ్లీలో కేటీఆర్ ప్రకటన



హైదరాబాద్,ఆంధ్రప్రభ : హైదరాబాద్‌లో వాహనాల పార్కింగ్‌కై శాస్త్రీయ విధానం రూపొందించినట్లు రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖమంత్రి కె తారకరామారావు చెప్పారు. జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం 50,29,475 వాహనాలు ఉండగా, వాటిలో 40,14,034 ద్విచక్ర వాహనాలు, 10,15,431 నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయని వెల్లడించారు. మంగళవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో టీఆర్ఎస్ సభ్యుడు శ్రీనివాసగౌడ్ అడిగిన ప్రశ్నకు మంత్రి పై సమాధానం చెప్పారు. వాహనాల కొనుగోలుదారులకు పార్కింగ్ ప్రదేశాలు ఉన్నప్పుడే రిజిస్ట్రేషన్ ప్రతి పాదన ఏమీ ప్రభుత్వంవద్ద లేదని కేటీఆర్ చెప్పారు. హైదరాబాద్ మహానగరంతో పాటు తెలంగాణలోని ఇతర పట్టణాలలో పార్కింగ్‌కి సంబంధించి ప్రణాళిక, అభివృద్ధి, అమలు,నిర్వహణకు సంబంధించి 2017 జూలై7 న జీఓఎంఎస్ నంబర్ 187 ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో నిర్దిష్టమైన పార్కింగ్ ఫీజు వసూలుపై నాలుగు చక్రాలు, ద్విచక్ర వాహనాల పార్కింగ్ కోసం తమ ఖాళీ భూమిని వినియోగించడానికి ఆసక్తిగల ప్రైవేట్ పార్టీల నుండి దరఖాస్తులను ఆహ్వానించినట్లు కేటీఆర్ వెల్లడించారు. ప్రైవేట్ బహిరంగ ప్లాట్లలో పార్కింగ్ శాస్త్రీయంగా నిర్వహణతో పాటు పార్కింగ్ విధానం అమలుకు అనుగుణంగా పార్కింగ్ ప్రాంతాలను పెంచేందుకు ఏజెంట్ల నియామకం కోసం ఇటీవలే ఒక ప్రతిపాదనను తీసుకువచ్చినట్లు కేటీఆర్ చెప్పారు. కార్గో, ట్రక్ పార్కింగ్ ఇతర పార్కింగులపై పర్యవేక్షణకు ఐపీఎస్ స్థాయి అధికారిని ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్‌గా నియమించినట్లు వెల్లడించారు.

శరవేగంగా మెట్రో రెండో దశ

మెట్రో రైల్ నిర్మాణ పనులపై శాసనసభలో మంగళవారం జరిగిన చర్చ ఆసక్తికరంగా సాగింది. ఎంఐఎం పక్ష నాయకుడు అక్బరుద్దీన్ ఓవైసీ, సభ్యులు ముంతాజ్ అహ్మద్ ఖాన్, మహ్మద్ మోజాంఖాన్ తదితరులతో పాటు బీజేపీ పక్ష నాయకుడు జి కిషన్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖల మంత్రి కె తారకరామారావు సమాధానాలు చెప్పారు. మంత్రి సమాధానం సంతృప్తికరంగా లేదంటూ బీజేపీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ, మెట్రోరైల్ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 14,132 కోట్లు కాగా, రాష్ట్ర ప్రభుత్వం రూ. 2,296 కోట్లు నిధులు విడుదల చేసిందని,అలాగే, కేంద్ర ప్రభుత్వం కూడా రూ. 1450 కోట్లు మంజూరు చేసిందని కేటీఆర్ వెల్లడించారు. జూబ్లీ బస్ స్టేషన్ (జేబీఎస్) నుంచి మహాత్మాగాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) వరకు ఆగస్టు వరకు పనులను పూర్తి చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఉందని తారకరామారావు వెల్లడించారు.

సభలో అశ్రద్ధ తగదు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : మంత్రులు సమధానం చెబుతున్న సమయంలో సభ్యులు కొందరు ఏమాత్రం శ్రద్ధపెట్టకుండా ఉండడం తగదని మండలి చైర్మన్ స్వామిగౌడ్ అన్నారు. వారు చెబుతున్న సమాచారం పూర్తిగా విని....దానిని ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత సభ్యులందరిపై ఉందన్నారు.మంగళవారం సభలో మంత్రులు సమాధానం చెబుతున్న సమయంలో సభ్యులు కొందరు తమ పక్కవారితో మాట్లాడుతుండడం స్వామిగౌడ్ గమనించారు. వారిని ఉద్దేశించి చైర్మన్ మాట్లాడుతూ, సభ్యులు అడిగిన ప్రశ్నలపై మంత్రులు సమాధానం చెబుతున్నారన్నారు. కానీ కొందరు సభ్యులు ఏ మాత్రం పట్టించుకోకుండా పక్కవారితో మాట్లాడడం మంచిది కాదన్నారు. దీనివల్ల సభకు అంతరాయం కలుగుతుందన్నారు. కాగా మండలికి కేటాయించిన మంత్రులంతా సభలోనే ఉండాలని, అలాగే సభలో సభ్యుల హాజరు శాతం పెరగాలని చైర్మన్ స్వామిగౌడ్ జారీ చేసిన ఆదేశాల నేపథ్యంలో....సభలో మంత్రుల సంఖ్యతో పాటు సభ్యుల హాజరు శాతం కూడా పెరిగింది.

1,333 కిలోమీటర్ల జాతీయ రహదారులు



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో 1333 కిలోమీటర్ల రహదారులను జాతీయ రహదారులుగా ప్రకటించినట్లు రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్ల డించారు.అదే విధంగా 1767 కిలోమీటర్ల పొడవు గల 13 రహదారులను జాతీయ రహదారులుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో బీజేపీ పక్ష నాయకుడు జి కిషన్ రెడ్డి, డాక్టర్ కె లక్ష్మణ్ , చింతల రామచంద్రారెడ్డి, ఎన్‌విఎస్‌ఎస్ ప్రభాకర్ అడిగిన లిఖిత పూర్వక ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు.

జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 8 వేల కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. స్టేట్ హైవేస్ నిర్మాణాలకు భూసేకరణ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందన్నారు. నేషనల్ హైవే అథారిటీస్ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఎఐ) రహదారులకు కూడా భూసేకరణ ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ (సమ్మతి, నిర్ణయం, స్వచ్ఛంద సేకరణ, ఆర్ఆర్ నిమిత్తం ఏకమొత్తం చెల్లింపు) నియమావళి చట్టం సవరణ,2017 కి అనుగుణంగా భూసేకరణ జరుపుతున్నట్లు తుమ్మల తెలియజేశారు.

అభివృద్ధిలో అగ్రగామి తెలంగాణ

- అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- ఆరోపణలు అవాస్తవం : మంత్రి ఈటల
- అసెంబ్లీలో బడ్జెట్‌పై ముగిసిన చర్చలు
- భాజపా,తెదేపా,సీపీఎం వాకౌట్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కొత్తగా ఏర్పడిన చిన్న రాష్ట్రం అయినప్పటికీ అనతికాలంలోనే అభివృద్ధిలో దేశాన్నే అధిగమించి అన్ని రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్ వివరించారు. ప్రగతి దాయకమైన పాలనతో తెలంగాణ ప్రభు త్వం ప్రజల హృదయాలను దోచుకుందన్నారు. తమది మానవీయ ప్రభుత్వం అయినందుననే ముందస్తు వాగ్దానాలతో సంబంధం లేకుండానే సంక్షేమ కార్యక్రమాలను అమలు జరపడం, అభివృద్ధి పథకాలను చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రభుత్వంపై బురదజల్లడం కోసమే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం చేసిన తప్పులేమిటో చెప్పకుండానే ఆరోపణలు చేయడం అర్ధరహితం అన్నారు. అభివృద్ధి కోసం అప్పులు చేస్తున్నాం, పరిమితికి లోబడే రుణాలు తీసుకుంటున్నాం, అప్పులతో నిర్దిష్టమైన అభివృద్ధిని సాధిస్తున్నాం, కేంద్రం నుండి తాము ఆశించిన మేరకు సహకారం అందడం లేదు, నీతిఆయోగ్ చేసిన సిఫార్సులను కూడా కేంద్రం తుంగలో తొక్కింది అని మంత్రి వివరించారు. బడ్జెట్ కేటాయింపులలో 95 శాతం మేరకు ఖర్చు చేశామన్నారు. అన్ని వర్గాల సంక్షేమం, తెలంగాణ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు. శాసనసభలో బడ్జెట్ పై రెండు రోజుల పాటు జరిగిన చర్చకు ఆర్ధిక మంత్రి సమాధానం ఇచ్చారు.

మంత్రి సమాధానంతో సంతృప్తి చెందని భాజపా, తెదేపా, సీపీఎం పక్షాలు సభ నుండి వాకౌట్ చేశాయి. మజ్లీస్ సభ్యులు హైదరాబాద్ పాత బస్తీ అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, మైనారిటీల సంక్షేమం కోసం బడ్జెట్‌లో జరిపిన కేటాయింపులను పూర్తి స్థాయిలో విడుదల చేయాలని కోరారు. రైతులు, పారిశ్రామిక వర్గాలు, ఎస్సీ ఎస్టీల రాయితీలు, జర్నలిస్టలకు ఇచ్చిన హామీలను అమలు జరపడంలో ప్రభుత్వం విఫలమైందని భాజపా ఆరోపించింది. ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు జరపాలని వెంకటవీరయ్య (తెదేపా), బీసీలకు ఉప ప్రణాళిక ప్రకటించాలని సున్నం రాజయ్య (సీపీఎం) చేసిన డిమాండ్లపై ప్రభుత్వం నుండి సానుకూల స్పందన రాకపోవడంతో సభ నుండి వాకౌట్ చేశారు. గడచిన ఆర్ధిక సంవత్సరంలో మైనారిటీల సంక్షేమం కోసం రూ. 994 కోట్లు విడుదల చేశాం, పాతబస్తీతో పాటు హైదరాబాద్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తున్నాం, ఉద్యోగాల కల్పన కోసం ఇప్పటికే శాఖల వారిగా నియామకాలు చేపట్టాం, పారిశ్రామిక వర్గాలకు రూ. 416 కోట్ల వరకు రాయితీలు అందచేశాం, చిన్న పరిశ్రమలను ఆదుకొనేందుకు రూ. 100 కోట్లు విడుదల చేశాం,అర్చకులకు దశల వారిగా పీఆర్‌సీ అమలు జరపబోతున్నాం, ఎంబీసీలకు రూ. 1000 కోట్లు ఖర్చు చేయబోతున్నాం, రైతాంగానికి ఏటా రూ. 12 వేల వరకు నగదు ప్రయోజనం అందించడం జరుగుతుంది. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే వివిధ వర్గాల ప్రయోజనాలను ఆశించి వివిధ కార్యక్రమాలను ప్రారంభించడానికి కార్యాచరణ రూపొందించుకున్నాం అని ఈటెల రాజేందర్ వివరించారు. ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న ప్రతిపక్షాలు గ్రామాలు తిరిగితే అభివృద్ధి కనబడుతుందన్నారు. భాజపా పక్షం నేత జి. కిషన్‌రెడ్డి, ఎంఐఎం పక్షం నాయకులు అక్బరుద్దీనోవైసీ, తెదేపా సభ్యులు వెంకటవీరయ్య, సీపీఎం సభ్యులు సున్నం రాజయ్యలు అడిగిన అంశాలపై ప్రభుత్వం నుండి స్పష్టత రాకపోవడంతో సభలో వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. మైనారిటీలకు నిధుల కేటాయింపులో అక్బరుద్దీన్ ప్రభుత్వంతో విబేధించారు. ఎంబీసీలకు గత ప్రభుత్వంలో రూ. 1000 కోట్లు కేటాయించి పైస కూడా ఖర్చు చేయలేదని సున్నం రాజయ్య ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు జరపడంపై వెంకట వీరయ్య ప్రభుత్వం నుండి సమాధానం రాబట్టలేక పోయారు.

విపక్షాలు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణకు ఇతర రాష్ట్రాలకు చిన్నదిగా చేసి చూపే ప్రయత్నం మానుకోవాలని ఈ సందర్భంగా మంత్రి ఈటెల రాజేందర్ హితవు పలికారు. కేంద్ర మంత్రులు, దేశంలోని ఇతర రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులు తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి అభినందించడంతో పాటుగా తమ రాష్ట్రాల్లో అమలు జరపడానికి చర్యలు తీసుకుంటున్న తీరును విపక్షాలు పరిగణలోకి తీసుకోవాలని కోరారు. ఉద్యమ కాలంలో ప్రజల కష్టాలను స్వయంగా చూసిన వారమైనందుననే అన్ని వర్గాల అవసరాలను పరిగణలోకి తీసుకొని సంక్షేమ కార్యక్రమాలను పెద్ద ఎత్తున అమలు జరుపుతున్నామని వివరించారు. మంత్రి సమాధానం అనంతరం బడ్జెట్ పై చర్చ ముగిసిందని స్పీకర్ మధుసూదనాచారి ప్రకటించి సభను బుధవారానికి వాయిదా వేశారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించండి

సండ్ర వెంకటవీరయ్య, పువ్వాడ అజయ్

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్రంలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని టీడీపీ సభ్యు డు సండ్ర వెంకటవీరయ్య, టీఆర్ఎస్ సభ్యుడు పువ్వాడ అజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జీరోఅవర్‌లో వారు ఈ విషయం ప్రస్తావించారు. వెంక టవీరయ్య మాట్లాడుతూ, ఖమ్మం, వరంగల్‌కు సీఎం కేసీఆర్ వచ్చిన సందర్భంగా జర్నలిస్టులకు ఇండ్లు మంజూరు చేస్తామని, ప్రారంభోత్సవాలకు హాజరవుతానని హామీ ఇచ్చిన మేరకు హామీని నిలబెట్టుకోవాలని కోరారు. మక్కా మజీదు మరమ్మతులను గూర్చి ఎంఐఎం సభ్యు డు అహ్మద్ పాషా ఖాద్రీ, ఎస్సీ ఉపకులాలల సమస్యలను బీజేపీ సభ్యుడు ఎన్ విఎస్ఎస్ ప్రభాకర్, నారా యణపేటలో డిగ్రీ కళాశాల విషయం టీఆర్ఎస్ సభ్యుడు రాజేం దర్ రెడ్డి ప్రస్తావించారు.మిషన్ భగీరథ పథకానికి హైద రాబాద్‌లో కొత్త పైపులు వేయాలని, నీలోఫర్ ఆస్పత్రిలో వెంటిలేటర్ల ఏర్పాటుపై మజ్లిస్ సభ్యుడు జాఫర్ హుస్సేన్, చెన్నూరులో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని నల్లాల ఓదేలు, బోథ్‌లో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని రాథోర్ బాపూరావు ప్రభుత్వాన్ని కోరారు.

తెలంగాణ బడ్జెట్

దేశానికే ఆదర్శం

మండలిలో బడ్జెట్‌పై చర్చ తెరాస



హైదరాబాద్,ఆంధప్రభ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2018-19 వార్షిక బడ్జెట్ దేశానికే ఆదర్శవంతమైన బడ్జెట్ అని పలువురు ఎమ్మెల్సీలు పేర్కొన్నారు. మంగళవారం శాసనమండలిలో వార్షిక బడ్జెట్ చర్చలో భాగంగా ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో తలసరి అప్పులు రూ.51వేలు ఉండగా , తలసరి ఆదాయం రూ.1.75లక్షలు ఉందని ఇది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సాధించిన ప్రగతిని సూచిస్తుందన్నారు. రాష్ట్రంలో సాగునీటి పారుదల ప్రాజెక్టులు పూర్తిచేసి కోటి ఎకరాలకు నీరివ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. రాష్ట్రంలోని 112 కులాల వారికి సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయన్నారు. గీత కార్మికులకు బడ్జెట్‌లో రూ.ఆరు వేలు కేటాయించారని , 5కోట్ల ఈత మొక్కలు పెంపకం చేపట్టారన్నారు.నిరుద్యోగ సమస్యకు పరిష్కారంగా ఇప్పటికే ప్రభుత్వం 83వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చిందని పేర్కొన్నారు. బాలసాని లక్ష్మినారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ఈ రంగానికి రూ.65వేల కోట్లు కేటాయించారన్నారు. కాళేశ్వరం అద్భుత పథకం అన్నారు. రాష్ట్రప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమాన్ని దృష్టిలోపెట్టుకుని ప్రజారంజక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందన్నారు. పూల రవీందర్ మాట్లాడుతూ రాష్ట్రం ఇప్పటికే విద్యుత్ రంగంలో స్వయం సమృద్దిని సాధించిందన్నారు. విద్య, వైద్యరంగాల్లో ఎంతో పురోభివృద్దిని సాధించిందన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూముల రికార్డులను ప్రక్షాళన చేస్తోందన్నారు. డబుల్ బెడ్ ఇళ్ల పథకంతో ప్రభుత్వం పేదల అభిమానం చూరగొందన్నారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి స్వయంగా వ్యవసాయం చేసిన రైతే కాకుండా ఉద్యమ కారుడని అందుకే రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో ఫలితాలను చూపగలుగుతున్నారని అన్నారు. వ్యవసాయ రంగంలో పాలిహౌస్ పథకం మంచి పథకం అని తక్కువ భూమిలో ఎక్కువ దిగుబడిని సాధించుకోవచ్చన్నారు. కర్నె ప్రభాకర్ మాట్లాడుతూ ఎస్టీ ఎస్సీ సబ్‌ప్లాన్‌కు నిధుల కేటాయింపు బాగుందన్నారు. ఈ రంగానికి బడ్జెట్‌లో రూ.16వేల కోట్లు కేటాయించారన్నారు. యాదవ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం బడ్జెట్‌లో సంక్షేమ రంగానికి 12శాతం నిధులు కేటాయించిందన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నికల విధానం అంటున్న కేంద్ర ప్రభుత్వం దేశమంతటా ఒకే రిజర్వేషన్ విధానం అమలు జరపాలన్నారు. దీనిపై పదిరోజులుగా మన ఎంపీలు పార్లమెంట్‌లో ఆందోళన కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ ఆదర్శవంతమైన బడ్జెట్ అన్నారు. అధికారుల ప్రవర్తనలో పరివర్తన వస్తేనే బడ్జెట్ ఫలాలు ప్రజలకు అందుతాయన్నారు. కాటేపల్లి జనార్ధన్ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్ అన్ని రంగాలకు సముచిత ప్రాధాన్యత ఇచ్చిందని పేర్కొన్నారు. అనంతరం మండలి చైర్మన్ స్వామిగౌడ్ సభను బుధవారం ఉదయం పదిగంటలకు వాయిదా వేశారు.

4,271 శ్మశాన వాటికల నిర్మాణం

పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్రంలో 4271 శవదహన వాటికల నిర్మాణం సాగుతోందని, వాటిలో 1000 దహన వాటికల పనులు పురోగతిలో ఉన్నాయని రాష్ట్ర పంచాయతిరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో టీఆర్ఎస్ సభ్యులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, బానోత్ శంకర్ నాయక్ అడిగిన లిఖిత పూర్వక ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. జిల్లాల వారిగా చూస్తే అదిలాబాద్ 45, భద్రాద్రి కొత్తగూడెం 13, జగిత్యాల 174, జనగామ 56, జయశంకర్ భూపాలపల్లి 23, కామారెడ్డి 11, కరీంనగర్ 52, ఖమ్మం 14, కుమ్రం భీం 3, మహబూబ్‌నగర్ 6, మహబూబాబాద్ 18, మంచిర్యాల 28, మెదక్ 59, నాగర్‌కర్నూలు 5, నల్గొండ 21, నిర్మల్ 91, నిజామాబాద్ 50, పెద్దపల్లి 85, రాజన్న సిరిసిల్ల 40, రంగారెడ్డి 27, సంగారెడ్డి 20, సిద్ధిపేట 57, సూర్యాపేట 23, వికారాబాద్ 9,వనపర్తి 19, వరంగల్ అర్బన్ 5, వరంగల్ రూరల్ 22, యాదాద్రి భువనగిరి 24 శవ దహన వాటికలు నిర్మాణంలో ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. శ్మశానవాటికల సమస్య దశాబ్దాలుగా ఉందని, గత ప్రభుత్వాలు పట్టించుకోనందుకే ఈ పరిస్థితి వచ్చిందని జూపల్లి తెలియజేశారు.

రైతుల్లో ఆత్మగౌరవం నింపిన కేసీఆర్



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు రైతుల పాలిటఒక వరం... రాజు ...అనీ, ఆయన వారిలో ఆత్మగౌరవం నింపారని రాష్ట్రవ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి ప్రశంసించారు. గతంలో రాముడు, అశోకుడు, కాకతీయుల కాలంలో రైతుల నుంచి శిస్తు వసూలు చేస్తే, కేసీఆర్ రైతులకు పంట పెట్టుబడులకై రూ. 8 వేలు ఇస్తూ సీఎం కేసీఆర్ రైతుల పాలిటరాజు....మన రాజు అయ్యారని వ్యాఖ్యానించారు. మంగళవారం శాసనసభలో పంటకు ఎకరానికి రూ. 4,000 ఇచ్చే పథకంపై టీఆర్ఎస్ సభ్యులు ఏనుగు రవీందర్ రెడ్డి, పుట్టామధుకర్, వేముల వీరేశం తదితరులు అడిగిన ప్రశ్న కమంత్రి సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ, మనం రామరాజ్యం.., అశోకుని పాలన, కాకతీయుల పాలన గూర్చి చాలా గొప్పగా చెప్పుకుంటామని, అయితే, వాళ్ల హయాంలో కూడా రైతుల నుంచి శిస్తు వసూలు చేసిన విషయాన్ని గమనించాలని కోరారు. ప్రపంచంలో ఎక్కడ కూడా రైతులకు పెట్టబడులు ఇచ్చే పథకం లేదని, ఇక్కడ ఉల్టా ఉంది....ఒక్కతెలంగాణ రాష్ట్రంలో మాత్రమే పెట్టుబడి రాయితీ ఉందని చెప్పారు. ఈ పథకం ద్వారా 72,13,111మంది రైతులకు లబ్ది చేకూరుతుందని, ఈ పథకానికి బడ్జెట్‌లో రూ. 12 వేలు ప్రతిపాదించినట్లు తెలిపారు. వానాకాలం పంటకు ఏప్రిల్ 20 నుంచి మే నెలాఖరు వరకు, యాసంగి పంటకు నవంబర్ 20 నుండి చెక్కులను పంపిణీ చేస్తామని వెల్లడించారు. భూముల సర్వే పార్ట్ ఎ కార్యక్రమం గత సెప్టెంబర్ నుంచి డిసెంబర్ 31వరకు జరిగిందని, పార్ట్ బీలో కేవలం 4 శాతం మాత్రమే వివాదాస్పద భూములు ఉన్నాయని చెప్పారు.

రాష్ట్రంలో 2638 రైతు వేదిక భవనాలు

రాష్ట్రంలోని 2638 క్లస్టర్లలో రైతు వేదిక భవనాలను నిర్మించనున్నట్లు ,వాటి కోసం రూ. 300 కోట్లు ఖర్చు చేయడం జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. టీఆర్ఎస్ సభ్యులు చల్లా ధర్మారెడ్డి, పాయం వెంకటేశ్వర్లు, హన్మంత్ షిండే అడిగిన లిఖిత పూర్వక ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రతి 5000 ఎకరాలకు ఒక ఎఇఒ, చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 2638 క్లస్టర్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెండు,మూడు గ్రామాలను కలిపి క్లస్టర్‌గా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక్కో భవనంలో 200మంది కూర్చునేందుకు వీలవుతుందని, మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. రైతులు సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ఈ వేదికలు ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. ఒక్కో రైతు వేదిక భవనానికి రూ. 12 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు పోచారం తెలియజేశారు. ఇప్పటి వరకు 711 చోట్ల స్థలాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు.



మూడో సారీ!

అవిశ్వాసంపై చర్చ ఇక అనుమానమే!

● ఆగని టీఆర్ఎస్, అన్నాడిఎంకే ఎంపీల ఆందోళన ● సభ ఆర్డర్‌లో లేదని అవిశ్వాసం చేపట్టని స్పీకర్ ● ఇరాక్‌లో భారతీయుల మృతి ప్రకటనకు అంతరాయం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ముచ్చటగా మూడోసారీ మళ్లీ అదే కథ. కేంద్ర ప్రభుత్వంపై టీడీపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం చర్చకు నోచుకోలేదు. అన్నాడిఎంకె, టీఆర్ఎస్ పార్టీ ఎంపీల ఆందోళనలతో లోక్‌సభ దద్దరల్లింది. దాంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ అవిశ్వాస తీర్మానాన్ని ముందుకు తీసుకువెళ్లలేమన్నారు. మంగళవారం ఉదయం 11గంటలకు పార్లమెంటు సమావేశాలు ప్రారంభంకాగానే విపక్షాల ఆందోళనతో లోక్‌సభ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడింది. తిరిగి సభ ప్రారంభం కాగానే స్పీకర్ సుమిత్రా మహాజన్, టీఆర్ఎస్, అన్నా డిఎంకె ఎంపీల ఆందోళనల మధ్యనే అవిశ్వాస తీర్మానాలకు సంబంధించిన నోటీసులను లోక్‌సభలో చదివి వినిపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ వైవి.సుబ్బారెడ్డి, టీడీపీ ఎంపీ తోటనరసింహం అవిశ్వాస తీర్మానాలను ఇచ్చారని ఆమె సభకు తెలిపారు. తన విధిలో భాగంగా సభ సజావుగా ఉంటే దీనిపై తదుపరి చర్యలు చేపడతామని ఆమె ప్రకటించారు. అవిశ్వాస తీర్మానాన్ని అనుమతించాలా లేదా అనే దానికి మద్దతిస్తున్న 50 మంది ఎంపీలు తమ తమ స్థానాల్లో నిలబడితే లెక్కించాల్సి ఉందన్నారు. వెంటనే, అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా అవిశ్వాస తీర్మానాలకు మద్దతుగా సభలో కాంగ్రెస్, టిఎంసి, వామపక్షా లు, ఆర్జేడీ, సమాజ్‌వాదీ, ఎంఐఎం పార్టీల ఎంపీలు లేచి నిల్చున్నారు.. అయితే అదే సమయంలో టీఆర్ఎస్, అన్నాడిఎంకె పార్టీలు వెల్‌లో ఆందోళన కొనసాగించాయి. కావేరి నదీ జలాల బోర్డు ఏర్పాటు చేయాలని అన్నాడిఎంకె ఎంపీలు, రిజర్వేషన్ల కోటా పెంచాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి వ్యవసాయానికి అనుసంధానం చేయాలని నినాదాలుచేశారు. స్పీకర్ సుమిత్రా మహాజన్ , వారిని తమ తమ స్థానాలకు వెళ్లి కూర్చోవాలని ఆమె పదే పదే విజ్ఞప్తి చేశారు. తీర్మానానికి మద్దతిస్తున్న ఎంపీలను లెక్కించాల్సి ఉందని, వెల్‌లో ఉన్న సభ్యులు కూర్చోవాలని కోరారు. అయినా వెల్‌లో నిరసన వ్యక్తంచేస్తున్న టీఆర్ఎస్, అన్నాడిఎంకె సభ్యులు పట్టించుకోలేదు. దాంతో సభ కార్యక్రమాలు సజావుగా నడిచే పరిస్థితి లేనందున అవిశ్వాస తీర్మానాన్ని చేపట్టలేమని స్పీకర్ ప్రకటించారు. అనంతరం సభను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అంతకుముందు టీడీపీ, వైఎస్సార్సిపి ఎంపీలు పార్లమెంటు ఆవరణలో ధర్నా నిర్వహించారు. మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిలబడి టీడీపీ ఎంపీలు నిరసన వ్యక్తం చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని నినాదాలు చేశారు. టీడీపీ ఎంపీ శివప్రసాద్ స్కూల్ విద్యార్థి వేషధారణలో నిరసన వ్యక్తం చేశారు. మోడీ బ్యాడ్ బాయ్ అంటూ స్కేల్ పట్టుకుని నినాదాలు చేశారు. మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు పార్లమెంటు ప్రధాన ద్వారం వద్ద నిరసన వ్యక్తం చేశారు.

చర్చ అనుమానమే!

మూడురోజులుగా అవిశ్వాస తీర్మానంపై చర్చ జరగడం లేదు. ముమ్ముందు కూడా ఇదే పరిస్థితి పునరావృతం అయ్యే అవకాశముంది. అన్నాడిఎంకె, టీఆర్ఎస్ ఎంపీలు తమ తమ అంశాలపై పట్టువీడకుండా ఆందోళన కొనసాగిస్తున్నాయి. లోక్‌సభలో కనీసం ఇరాక్‌లో చనిపోయిన మృతులపై కేంద్ర విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ ప్రకటన చేసే సమయంలోనూ ఈ పార్టీలు ఆందోళన కొనసాగించాయి.

అవిశ్వాసానికి మళ్లీ నోటీసులు

కేంద్ర ప్రభుత్వంపై టీడీపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరో అవిశ్వాస తీర్మానానికి సిద్ధమైంది. ఈ మేరకు అవిశ్వాస తీర్మానానికి టీడీపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు నోటీసు ఇచ్చాయి. అవిశ్వాస సమయంలో ఎంపీలంతా విధిగా హాజరై మద్దతుగా నిల్చోవాలని ఎంపీలకు విప్ జారీ చేశారు.

మోడీ బ్యాడ్ బాయ్

● స్కూలు విద్యార్థి వేషధారణలో ఆకట్టుకున్న ఎంపీ శివప్రసాద్
● అవిశ్వాసం అంటే భయం అందుకే వెనకడుగు
● కేంద్రంపై మండిపడ్డ టీడీపీ ఎంపీలు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఎవరి సహాయం లేకున్నా అన్ని రంగాల్లో దూసుకుపోతున్న ఆంధ్రులంటే కేంద్ర ప్రభుత్వానికి కంటగింపుగా ఉందని, అందుకే సహకరించకుండా సాధిస్తోందని తెలుగుదేశం పార్టీ ఎంపీలు మండిపడ్డారు. మంగళవారం పార్లమెంటు ఆవరణలోని మహాత్మ గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులు పట్టుకుని నిరసన ప్రదర్శన చేపట్టిన టీడీపీ ఎంపీలు అవిశ్వాస తీర్మానం విషయంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎంపీలందరిలో తన వేషధారణతో ప్రత్యేకంగా నిలుస్తున్న చిత్తూరు ఎంపీ శివప్రసాద్, మంగళవారం స్కూల్ పిల్లవాడి వేషంలో వచ్చారు. చిన్నపిల్లలు మాట్లాడినట్టుగా ముద్దు ముద్దు మాటలతో ప్రధాని మోడీని దుయ్యబట్టారు. ''మోడీ తాత, నువ్వు బ్యాడ్ బాయ్. మా చంద్రబాబు తాతకు డబ్బులెందుకు ఇవ్వడం లేదు? మా టీంలో దేవాన్ష్ ఉన్నాడు, నిన్ను స్కేల్‌తో కొట్టి, పెన్సిల్‌తో ముఖం మీద బరబరా గీరేస్తాం'' అంటూ చిన్న పిల్లల హావభా వాలతో హెచ్చరించారు. అనంతరం మీడి యాతో మాట్లాడుతూ ప్రధాని మోడీ చేస్తున్న అన్యాయం గురించి రాష్ట్రంలో స్కూలు పిల్లల్లోనూ చర్చ జరుగుతోందని అన్నారు. తాను ప్రతి రోజూ రాష్ట్రంలోని ఒక్కో వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ అందుకు తగ్గ వేషధారణలో వస్తున్నానని, స్కూలు పిల్లల మనోభావాలను వెల్లడించడం కోసం స్కూలు బాయ్ వేషధారణలో వచ్చానని తెలిపారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ఎంపీలతో కలసి ధర్నా చేసిన తెలంగాణ ప్రాంత ఎంపీ గరికపాటి మోహన్ రావు మాట్లాడుతూ అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్న తెలుగు వారంటే ప్రధాని మోడీకి కంటగింపుగా ఉందని అన్నారు. తెలుగువారి ఎదుగు దలను చూసి ఓర్వలేకనే ఇలా చేస్తున్నారని తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. శివప్రసాద్ తరహాలోనే అందరి కంటే భిన్నంగా తన నిరసన తెలియజేసే ఏలూరు ఎంపీ మాగంటి బాబు, ''చెడు వినకు, చెడు కనకు, చెడు అనకు'' అనే మహాత్మా గాంధీ సూక్తిని ప్రదర్శిస్తూ దక్షిణాది రాష్ట్రాలపై బీజేపీ చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. అందుకే దక్షిణ భారతదేశంలో బీజేపీకి చోటు దక్కడం లేదని ఎద్దేవా చేశారు. ఇలాగే అన్యాయం చేస్తూ పోతే దక్షిణాది రాష్ట్రాలకు విడిగా ఒక ప్రధాని అవసరమవుతాడని వ్యాఖ్యానించారు. ఈ ముగ్గురితోపాటు మాజీ మంత్రి అశోక్ గజపతి రాజు, ఎంపీలు తోట నరసింహం, ముత్తంశెట్టి శ్రీనివాస్ (అవంతి), కేశినేని శ్రీనివాస్ (నాని), కొనకళ్ల నారాయణ, గల్లా జయదేవ్, మాగంటి మురళీమోహన్, తోట సీతారామలక్ష్మి, నిమ్మల కిష్టప్ప, జేసీ దివాకర్ రెడ్డి, పి. రవీంద్రబాబు, మాల్యాద్రి తదితరులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. మంత్రి పదవికి రాజీనామా ఇచ్చిన మర్నాటి నుంచి అశోక్ గజపతి రాజు ప్రతి రోజూ ధర్నాలో పాల్గొంటున్నారు. అనంతరం ఎంపీలంతా సభ ప్రారంభమయ్యే సమయానికి ఎవరి సభలకు వారు వెళ్లిపోయారు. లోక్‌సభలో తొలుత మొదలయ్యే ప్రశ్నోత్తరాల సమయాన్ని అడ్డుకుంటున్న తెదేపా ఎంపీలు, మంగళవారం ఆ సమయంలోనూ శాంతంగా ఉన్నారు. సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో వెల్‌లోపలకు వెళ్లిన దృశ్యాలను చూపుతూ అవిశ్వాస తీర్మానాన్ని టీడీపీ ఎంపీలే అడ్డుకుంటున్నారని వైకాపా నేతలు ప్రచారం చేయడంతో, మంగళవారం ఈ నిర్ణయం తీసుకున్నారు. సభ అవిశ్వాస తీర్మానాన్ని చర్చకు తీసు కోకుండానే మళ్లీ వాయిదా వేయడంతో ఎంపీలు విజయ్ చౌక్ మీడియా పాయింట్ వద్ద నిరసన తెలిపారు.

అవిశ్వాసం అంటే కేంద్రానికి భయం: తోట నరసింహం

మేం మళ్లీ అవిశ్వాస తీర్మానం నోటీస్ ఇచ్చాం. అన్నాడీఎంకే, టీఆర్ఎస్ వెల్‌లోకి రావడాన్ని సాకుగా చూపుతూ స్పీకర్ సభను వాయిదా వేశారు. కేంద్ర ప్రభుత్వానికి ఆంధ్ర ప్రజల పట్ల విశ్వాసం లేదు. సుష్మా స్వరాజ్ మాట్లాడిన తర్వాత చర్చకు తీసుకొస్తామని చెప్పారు. చర్చకొస్తుందని మేం ఎంతో శ్రద్ధగా ఎదురుచూశాం. కానీ పరిస్థితి చూస్తుంటే బీజేపీ ఈ తీర్మానం విషయంలో భయపడుతున్నట్టుగా ఉంది. తమ సొంత పార్టీ ఎంపీల్లో ఉన్న అసమ్మతి ఓటింగ్ ద్వారా బయటికి వస్తుందని, బండారం బయటపడుతుందని ఆందోళన చెందుతోంది. స్పీకర్ కావాలనుకుంటే ఎంత గందరగోళం ఉన్నా బిల్ పాసయిపోతుంది. ఆర్థిక బిల్లు ఎవరి అనుమతి తీసుకోకుండానే పాస్ చేశారు.

పార్లమెంటులో పిల్లలాటా?

కేంద్రంపై విమర్శనాస్త్రాలు సంధించిన తెరాస ఎంపీలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : మంగళవారమూ సీన్ మారలేదు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాల పరిష్కారానికి డిమాండ్ చేస్తూ తెరాస ఎంపీలు రోజులాగే ఆందోళన చేపట్టారు. అనంతరం వారు పాత్రికేయులతో మాట్లాడుతూ.. తమ నాయకుడి ఆదేశానుసారమే తమ నిర్ణయాలు ఉంటాయని నొక్కి చెప్పారు. కేంద్ర ప్రభుత్వ తీరుపై భువనగిరి ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు. అవిశ్వాస తీర్మానం రాజకీయ స్వార్థంలో భాగమేనన్న ఆయన, ఆంధ్రప్రదేశ్ ఎంపీలు తమను సంప్రదించకుండా తీర్మానం ప్రవేశపెడితే మేమెందుకు మద్దతు ఇవ్వాలని ప్రశ్నించారు. మరోవైపు పార్లమెంట్ స్ట్రీట్‌లో ఆర్ఆర్‌బీ (అఖిల భారత గ్రామీణ బ్యాంక్స్) చేస్తున్న ఆందోళనకు తెరాస తరఫున ఎంపీ వినోద్ మద్దతు తెలిపారు. కేసీఆర్ నిర్ణయం మేరకు రిజర్వేషన్ల అంశంపై కేంద్రం స్పందన వచ్చే వరకు లోక్‌సభలో పోరాటం చేస్తాం. అవిశ్వాస తీర్మానం పిల్లలాట కాదు. బీజేపీకి గానీ, ఇతర పార్టీలు గానీ తెరాసను ఆడించేసత్తా ఎవరికీ లేదు.

ఎవరినైనా ఆడించే సత్తా కేసీఆర్‌కు ఉంది. పొలిటికల్ అజెండానే అవిశ్వాస తీర్మానంలా మాకు కనిపిస్తుంది. మాతో చర్చించకుండా అవిశ్వాసం పెడితే మేమెందుకు మద్దతు ఇవ్వాలి. పక్క రాష్ట్రం గురించి మేము ఎందుకు పట్టించుకోవాలి. మా రాష్ట్రం ఎవరికి సామంత రాష్ట్రం కాదు. స్వతంత్ర రాష్ట్రం.

వాయిదాల పర్వంపై అసంతృప్తి

ఎంపీల విందు రద్దు చేసిన ఉప రాష్ట్రపతి

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: పార్లమెంట్ మలి దశ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ఎలాంటి చర్చ జరగకుండానే ఉభయ సభలు వాయిదా పడుతున్న తీరుపై ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ ఎం. వెంకయ్య నాయుడు అసంతృప్తిగా ఉన్నారు. రాజ్యసభ ఛైర్మన్‌గా సభను నిర్వహిస్తున్న ఆయన, ప్రతి రోజూ సభలో చోటు చేసుకుంటున్న గందరోళం పట్ల అసహనంగా ఉన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న కొద్ది సేపు మినహాయిస్తే గత 12 రోజులుగా సభా కార్యక్రమాలు సవ్యంగా సాగకపోవడంతో ఆయన ఎంపీలకు ఇచ్చే విందును రద్దు చేస్తూ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. నిజానికి మంగళవారం పెద్దల సభలోని ఎంపీల కోసం ప్రత్యేక విందు జరగాల్సి ఉంది. ఈ విందు కోసం గత వారమే ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సహా అధికార, విపక్షాలకు చెందిన నాయకులు, పలువురు ఫ్లోర్ లీడర్లకు వెంకయ్య నాయుడు ఇప్పటికే చెప్పారు. ఆహ్వాన పత్రాలు సైతం సిద్ధం చేశారు. అయితే ఆహ్వానాలు పంపడానికి ఒక రోజు ముందైనా సభ సజావుగా సాగుతుందని ఆశించారు. కానీ మూడో వారం కూడా పరిస్థితిలో మార్పు రాకపోయేసరికి ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. వివిధ పార్టీల ఫ్లోర్ లీడర్లతో సమావేశమైన వెంకయ్యానాయుడు, విందు రద్దు చేస్తున్నట్టు తెలియజేశారు. సభా కార్యకలాపాలు సజావుగా జరగకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు వారికి చెప్పారు.

ధైర్యంగా పోరాడండి

● ఎమ్మెల్యే సంపత్‌కు రాహుల్ సూచన

హైదరాబాద్, ఆంధ్రప్రభ : టీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల పక్షాన పోరాటం చేయాలని, పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్‌గాంధీ రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు హామీ ఇచ్చారు. శాసన సభ్యత్వం రద్దుపైన ఆందోళన వద్దని, అవసరమైతే సుప్రీం కోర్టులోనూ మన పార్టీకి చెందిన సీనియర్లు కపిల్ సిబాల్, అభిషేక్ సింఘ్వీలు వాదనలు వినిపిస్తారని సంపత్‌కుమార్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలకు బరోసా ఇచ్చారు. ఏఐసీసీ ప్లీనరీ సమావేశాల అనంతరం రాహుల్‌గాంధీతో టీ పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ రాంచంద్ర కుంతియా, సంపత్‌కుమార్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ఇద్దరు సభ్యుల శాసన సభ్యాత్వాల రద్దు, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్ తదితర అంశాలపై రాహుల్‌గాంధీకి ఉత్తమ్ వివరించారు. సంపత్‌కుమార్ మంచి వాగ్దాటి ఉన్న నేతగా ఎదిగే అవకాశముందని, పార్టీలో మంచి భవిష్యత్ ఉంటుందని రాహుల్ అన్నారు.

కేసీఆర్‌కు దీదీ మొట్టికాయలు

● కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కలకత్తా ముఖ్యమంత్రి మమతా బెనర్జీని తెలంగాణ సీఎం చంద్రశేఖర్‌రావు ఆదర్శంగా తీసుకుని తన విలాసవంతమైన జీవితానికి స్వస్తిపలకాలని మాజీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచించారు. సీఎం కేసీఆర్ థర్డ్ ఫ్రంట్‌పై మాట్లాడటం విచిత్రంగా ఉందన్నారు. ఫ్రంట్ విషయంపై సీఎం కేసీఆర్‌కు మమతా బెనర్జీ మొట్టికాయలు వేసిందని కోమటిరెడ్డి విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి మద్దతిస్తూ.. థర్డ్ ఫ్రంట్ అంటే ఎవరూ నమ్మరన్నారు. జై తెలంగాణ అంటే తెలియని సంతోష్‌కు రాజ్యసభ సీటు ఇవ్వడం శోచనీయమన్నారు.

రాజకీయ కుట్రలకు రాజ్‌భవన్ వేదిక

● రేవంత్‌రెడ్డి ఆరోపణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాజ్‌భవన్ రాజకీయ కుట్రలకు వేదికగా మారిందని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎమ్మెల్యేల సభ్యత్వాలను రద్దు చేస్తే గవర్నర్ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడి ఎజెండాను అమలు చేసేందుకు గవర్నర్ నరసింహన్ రాజ్‌భవన్‌ను వాడుకుంటున్నారని విమర్శించారు. నరసింహన్ పదవీ కాలం ముగిసినా గవర్నర్‌గా కొనసాగించడంలో ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని రేవంత్‌రెడ్డి తెలిపారు.

శాసనసభకు 4 సవరణ బిల్లుల ప్రతిపాదన

ఆంధ్రప్రభ, హైదరాబాద్: తెలంగాణ శాసనసభలో మంగళవారం ప్రభుత్వం నాలుగు బిల్లులను సవరణ కోరుతూ ప్రతిపాదించింది. తెలంగాణ అసైన్డ్ ల్యాండ్స్ (పీఓటి) సవరణ చట్టం-2018ని మంత్రి హరీష్‌రావు ప్రతిపాదించిగా, తెలంగాణ మెడికల్ ప్రాక్టిసెస్ రిజిస్ట్రేషన్ సవరణ బిల్లు-2018ను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి ప్రతిపాదించారు. తెలంగాణ అడ్వొకేట్లు, క్లర్కుల సంక్షేమ నిధి-2018 సవరణ బిల్లును మంత్రి హరీష్ సభలో ప్రతిపాదించారు. తెలంగాణ న్యావాదులు, గుమాస్తాల సంక్షేమ నిధి చట్టం 1992 సవరణ కోరుతూ ప్రభుత్వం బిల్లును సభలో ప్రవేశపెట్టింది. ఆయా బిల్లులపై చర్చ జరిపిన పిమ్మట ఆమోదం తెలుపనున్నారు.

వాళ్లిద్దరికి ఓటు హక్కు కల్పించాలి

● అనర్వ్హత ఎమ్మెల్యేలకు మద్దతుగా సీఈసీని కలవనున్న కాంగ్రెస్ నేతలు ● పార్టీ ఎమ్మెల్యేలకు విప్ జారీ చేయాలని నిర్ణయం
● విప్‌గా రామ్మోహన్‌రెడ్డిని నియమించాలి ● అసెంబ్లీ కార్యదర్శికి సీఎల్పీ నేత జానారెడ్డి లేఖ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్‌కు ఓటు హక్కును పునరుద్ధరించాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌ను కలిసి విజ్ఞప్తి చేయాలని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకున్నది. మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డితో పాటు అనర్హత వేటుకు గురైన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్‌లు బుధవారం ఢిల్లీకి వెళ్లి ఎన్నికల కమిషన్‌ను కలవనున్నారు. సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి నివాసంలో మంగళవారం టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ స్పీకర్లు కేఆర్ సురేష్‌రెడ్డి, నాదెండ్ల మనోహర్, మండలిలో విపక్ష నేత షబ్బీర్‌అలీ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రేవంత్‌రెడ్డితో పాటు హై కోర్టు న్యాయవాది జంద్యాల రవిశంకర్ తదితర కాంగ్రెస్ పార్టీ నేతలు హాజరయ్యారు. ఈ భేటీలో రాజ్యసభ ఎన్నికలు, పార్టీ ఎమ్మెల్యేలకు విప్ జారీ, అనర్హత వేటుకు గురైన ఎమ్మెల్యేల భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బలరాంనాయక్ బలపరుస్తూ పార్టీకి చెందిన ఎమ్మెల్యేందరూ సంతకాలు చేయడంతో పాటు అనర్హతకు గురైన సభ్యుల పేర్లు ఓటర్ జాబితాలో ఉన్నందున, వారికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఇవ్వాలని కేంద్ర ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకుపోవాలని నిర్ణయం తీసుకున్నారు. కాగా రాజ్యసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌ను వీడి టీఆర్ఎస్‌లో చేరిన ఎమ్మెల్యేలతో పాటు ప్రస్తుతం కాంగ్రెస్ సభ్యులకు విప్ జారీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ విప్‌గా ఉన్న సంపత్‌కుమార్ స్థానంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని నియమించాలని నిర్ణయించారు. ఇదే అంశంపై అసెంబ్లీ కార్యదర్శికి సీఎల్పీ నేత జానారెడ్డి లేఖ రాశారు. సంపత్‌పై అనర్హత వేటు పడినందున విప్ జారీ చేసే అవకాశం రామ్మోహన్‌రెడ్డికి కల్పించారు.

టీడీపీ సహకారం కోరాం: ఉత్తమ్

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు, ఇద్దరు సభ్యులపై అనర్హత వేటును ప్రజలు గమనిస్తున్నారని టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అసెంబ్లీలో జరిగిన ఘటనపై హై కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. సీఎల్పీ నేత జానారెడ్డి నివాసం వద్ద ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హెడ్‌ఫోన్ విసిరితే మండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌కు గాయమైనట్లు చిత్రీకరించారని ఉత్తమ్ విమర్శించారు. ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ మాత్రం హైకోర్టులో ఆ వాదనలే వినిపించలేదన్నారు. స్వామిగౌడ్ అంటే తమకు ఎంతో గౌరవం ఉందని, గాయమైన వీడియో పుటేజీలను ఎందుకు చూపించడం లేదన్నారు. న్యాయస్థానంపై తమకు పూర్తి నమ్మకం ఉందని, రాజ్యసభ ఎన్నికల్లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్‌లు ఓటు వేస్తారని ఉత్తమ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించమని టీడీపీ అధినాయకత్వానికి కూడా విజ్ఞప్తి చేస్తున్నామని ఉత్తమ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ గుర్తుపైన గెలిచి టీఆర్ఎస్‌లో చేరిన వారు కూడా తమ పార్టీ బలరాంనాయక్‌కు ఓటు వేయాల్సిందేనని ఆయన హితవు పలికారు.

టీఆర్ఎస్, బీజేపీ లాలూచీ: పొన్నాల

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : లోక్‌సభలో తెలంగాణ రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీలు లాలూచీతో కూడిన డబుల్ గేమ్ రాజకీయాలు చేస్తున్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత పొన్నాల లక్ష్మయ్య ఆరోపించారు. ఢిల్లీలో విజయ్ చౌక్ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన ఆయన టీఆర్ఎస్ వ్యవహారశైలిపై విరుచుకుపడ్డారు. రెండు పార్టీలు పరస్పర అవగాహనతో లోపాయికారి ఒప్పందాలు కుదుర్చుకుని ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నాయని మండిపడ్డారు. టీఆర్ఎస్‌కు చిత్తశుద్ధి ఉంటే, బీజేపీతో చేసేది నిజమైన పోరాటమే అయితే అవిశ్వాసానికి మద్దతిచ్చి విభజన హామీలపై కేంద్రాన్ని నిలదీయాలని అన్నారు. ''రెండు పార్టీల మధ్య పరస్పర అవగాహన ఉన్నందునే, టీఆర్ఎస్ గొడవ ఆపడం లేదు, బీజేపీ సస్పెండ్ చేయడం లేదు'' అని వ్యాఖ్యానించారు. ఇద్దరూ నీచ రాజకీయాలు చేస్తూ తప్పించుకుంటున్నారని పొన్నాల దుయ్యబట్టారు. మూడో ఫ్రంట్ పేరుతో కోల్‌కత్తాకు వెళ్లి బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని కలిసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆమెను చూసి చాలా నేర్చుకోవాలని పొన్నాల లక్ష్మయ్య హితవు పలికారు. పనుల్లో పర్సంటేజీలు తీసుకోమని మున్సిపల్ శాఖ మంత్రి కే.టీ. రామారావే స్వయంగా చెప్పారని సిరిసిల్ల మున్సిపల్ ఛైర్‌పర్సన్ పావని చెప్పిన విషయాన్ని గుర్తుచేస్తూ, తెలంగాణాలో జరుగుతున్న అవినీతికి, లంచావతారాలకు ఇదొక ప్రత్యక్ష నిదర్శనమని అన్నారు. మంత్రి కేటీఆర్ నియోజకవర్గంలోనే ఇలా ఉంటే, ఇక రాష్ట్రంలో పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని ఎద్దేవా చేశారు. చేవెళ్లకు చెందిన టీఆర్ఎస్ జడ్పీటీసీ శైలజా రెడ్డి, స్థానికసంస్థలకు నిధులివ్వడం లేదని తన సొంత ప్లాట్ అమ్మకానికి పెట్టి మరీ ప్రజలికిచ్చిన హామీలు నెరవేర్చడానికి ముందుకొచ్చిన ఉదంతాన్ని పొన్నాల గుర్తుచేశారు.

కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో రైతులకు అన్యాయం



డిచ్‌పల్లి, ప్రభన్యూస్ : కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో కైడా రైతులకు అన్యాయం జరగడం విడ్డూరమని, రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తోందని రాజకీయ ఐకాస ఛైర్మన్ కోదండరాం అన్నారు. మంగళవారం నిజామా బాద్ జిల్లా, డిచ్‌పల్లి మండల కేంద్రంలోని కెఎఆర్ గార్డెన్‌లో జిల్లా ఐకాస గోపాల్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సమస్యలపై సదస్సుకు కోదండరాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము 500 గ్రామాల్లో తిరిగి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నామని ఏ ఒక్క రైతు సంతోషంగా లేడని చెప్పారు. సబ్సిడిపై విత్తనాఈలు, ఎరువులు, పంటలు నష్టపోయి నపుడు నష్ట రిహారం, బీమా సౌకర్యం కల్పిస్తే రైతులు బాగు పడతారని రైతాంం ఐకాస విన్నవించిందని చెప్పారు. వ్యవసాయం మీద ఆశను వదులు కుంటున్న రైతులు కొందరు తమ పిల్లలను మంచిగా చదివించి ఇతర రంగాల వైపు మళ్లించే విధంగా ప్రయత్నిస్తున్నారని అన్నారు. వరిధాన్యం, ఎర్రజొన్న, పసుపు పంటలు పండించే రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

రాజకీయాల్లో శాశ్వత శత్రువులు ఉండరు

● తేదేపా తెలంగాణ అధ్యక్షుడు రమణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరని, సమీకరణలు ఎప్పుడు ఎలా మారుతాయో చెపలేమని తెలుగుదేశంపార్టీ తెలంగాణ అధ్యక్షుడు ఎల్.రమణ అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీతో ఎన్నికల పొత్తులు ఉంటాయో ఇప్పుడే చెప్పలేమని, కాంగ్రెస్‌తో పొత్తుపై తాము అధికారికంగా ఎప్పుడు మాట్లాడలేదని ఆయన అన్నారు. రాష్ట్రంలో రెండు ప్రధాన పార్టీలకు సమదూరం పాటించాలన్నదే తమ పార్టీ విధానమని మంగళవారం మీడియాతో జరిపిన ఇష్టాగోష్టిలో ఆయన అన్నారు. 1983 నుంచి తెలుగుదేశం మిత్రపక్షాలతో కలిసి పోటీ చేసిందనీ, భవిష్యత్తులో కూడా అలాగే ఉండవచ్చునని ఆయన అన్నారు. నిన్నటి వరకు భాజపాతో కలిసి నడిచామని, ఇప్పుడు ఆ పార్టీతో విభేదించి బయటకు వచ్చామన్నారు. రాజకీయాల్లో ఎన్నికల పొత్తులు ఎప్పుడూ ఒకే పార్టీతో ఉండవని, పరిస్థితిని బట్టి మారుతుంటాయని రమణ అన్నారు. తెలంగాణలో ఎవరి ప్రణాళికలు వారికి ఉన్నాయని, ఎన్నికల ముందే వారి వ్యూహాలు, పొత్తులు ఉంటాయని రమణ అన్నారు. తెలుగు రాష్ట్రాలను విభజించింది కాంగ్రెస్, భాజపాలేనని, విభజన హామీలను అమలు చేయడంలో భాజపా విఫలమైందని ఆయన అన్నారు.

తెలంగాణలో తెలుగుదేశం రాష్ట్ర సమితి (టిడిఆర్ఎస్) ప్రభుత్వం నడుస్తోందని తాము అనుకుంటుంటామని ఆయన వ్యంగ్యంగా అన్నారు. తెరాస ప్రభుత్వంలో సగం మందికిపైగా మంత్రులు తెలుగుదేశం వారేనని, మా పార్టీ నేతలే అక్కడ ఉన్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలకు సీట్ల కేటాయింపులో ప్రాధాన్యత ఇస్తామని, తెదేపా అధికారంలోకి వస్తే మంత్రివర్గంలో బీసీలకు 9 మందికి అవకాశం కల్పిస్తామని రమణ స్పష్టంచేశారు. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు మోత్కుపల్లి నర్సింహులుపై పార్టీ అధినేత చంద్రబాబు నాయుడే తగిన నిర్ణయం తీసుకోవలసి ఉంటుందని ఆయన చెప్పారు.

బందీలు బలయ్యారు

- ఇరాక్‌లో 39 మంది భారత కార్మికుల కిడ్నాప్ విషాదాంతం
- ఐసిస్ ఉగ్రవాదుల చేతిలో హతం
- డీఎన్ఏ నమూనాలతో స్పష్టత
- వారం రోజుల్లో మృతదేహాలను రప్పిస్తాం
- మృతుల్లో 27 మంది పంజాబీలే
- రాజ్యసభలో సుష్మా స్వరాజ్ ప్రకటన
- బాగ్దాద్‌కు కేంద్ర మంత్రి వి.కె. సింగ్
- నాలుగేళ్ల క్రితమే చెప్పానన్న హర్జీత్



న్యూఢిల్లీ: ఇరాక్‌లో భారతీయుల కిడ్నాప్ ఘటన విషాదాంతమైంది. నాలుగేళ్ల క్రితం ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు బందీలుగా చేసుకున్న 39 మంది భారతీయులు మృతిచెందినట్లు కేంద్ర విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ మంగళవారం రాజ్యసభలో వెల్లడించారు. 'సుదీర్ఘ విచారణ తర్వాత ఆ 39 మంది భారతీయులు మృతిచెందినట్లు వెల్లడైంది. డీఎన్ఏ పరీక్షల నిమిత్తం వారి భౌతికకాయాలను బాగ్దాద్‌కు పంపించారు. వీరిలో 38 మంది డీఎన్ఏ వారి బంధువుల డీఎన్ఏతో సరిపోయింది. ఒకరిది మాత్రం 70శాతం కలిసినట్లు ఇరాక్ అధికారులు సోమవారం సమాచారం పంపారు. భౌతికకాయాలను స్వదేశానికి తీసుకొచ్చేందుకు కేంద్ర మంత్రి వీకే సింగ్ ఇరాక్ వెళ్లనున్నారు. మృతదేహాలను తీసుకొచ్చే విమానం మొదట అమృత్‌సర్, తర్వాత పాట్నా, కోల్‌కతా వెళ్తుంది' అని సుష్మాస్వరాజ్ తెలిపారు. మృతుల్లో 27 మంది పంజాబ్, 6 బిహార్, 4 హిమాచల్ ప్రదేశ్, ఇద్దరు పశ్చిమ బెంగాల్‌కు చెందినవారున్నారు. ఇస్లామిక్ చెర నుంచి తప్పించుకుని వచ్చిన హర్జిత్ మాషిని విచారణ పేరుతో వేధించారన్న ఆరోపణలను ఆమె ఖండించారు. ఓ శవాల దిబ్బలో 30 మంది మృతదేహాలను తొలుత స్థానికులు గుర్తించారు. ఈ విషయాన్ని అక్కడి ప్రభుత్వానికి చెప్పారు. దీనిపై భారత్‌కు సమాచారం అందింది. కేంద్ర మంత్రి వీకేసింగ్ ఇరాక్ చేరుకున్నారు. చివరకు ఓ శాటిలైట్ ద్వారా వీటిని కనుగొనడం జరిగింది. డీఎన్ఏ టెస్టుల కోసం మృతదేహాలను బాగ్దాద్‌కు తరలించారు. గతేడాది నవంబర్‌లోనే డీఎన్ఏ శాంపిళ్లు సేకరించారు. డీఎన్ఏ నమూనాలు మ్యాచ్ కావడంతో బందీలు మృతిచెం దినట్లు ఇరాక్ ప్రభుత్వం అధికారికంగా ధ్రువీకరిస్తూ భారత్‌కు సమాచారం ఇచ్చింది. కాగా, మంగళవారం రాజ్యసభ లో మృతులకు సంతాపంగా రెండు నిమిషాల పాటు మౌనం వహించారు. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ వల్ల లోక్‌సభలో నివాళి అర్పించలేకపోయామని స్వరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు.

మృతులంతా కూలీలే

ఐసిస్ మారణకాండలో అసువులు బాసిన 39మంది సాధారణ కూలీలే. ఉపాధి నిమిత్తం ఇరాక్‌లోని మోసుల్ నగరం వెళ్లారు. అయితే ఈ బృందం 2014లో కిడ్నాప్‌కు గురైంది. మోసుల్ నుంచి తిరిగి వస్తుండగా ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు అడ్డగించి వీరిని బందీలుగా చేసుకున్నారు. అప్పటి నుంచి వీరి ఆచూకీ తెలియరాలేదు. వీరిని విడిపించేందుకు భారత ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

ముందే చెప్పిన హర్జీత్

కాగా.. వీరిలో ఒకరైన హర్జిత్ మాసీ అనే వ్యక్తి ఆ మధ్య ఇస్లామిక్ చెర నుంచి తప్పించుకుని ప్రాణాలతో బయటపడ్డాడు. ఆ సమయంలో ఆయన కొన్ని కీలక విషయాలు చెప్పారు. తనతో పాటు బందీలుగా పట్టుబడిన మిగతావారిని బాదుష్ సమీపంలోని ఎడారిలో ముష్కరులు హతమార్చినట్లు చెప్పాడు. అయితే హర్జిత్ వ్యాఖ్యలను అప్పట్లో మన ప్రభుత్వం తోసిపుచ్చింది. సరైన ధ్రువీకరణ లేకుండా వారంతా చనిపోయారని భావించడం సరికాదని పేర్కొంది.

మూడేళ్ల తర్వాత ఆచూకీ..

గతేడాది జులైలో మోసుల్ నగరంలో ఒకేచోట వందల సంఖ్యలో సామూహిక సమాధులు గుర్తించారు అక్కడి అధికారులు. దీంతో ఆ దిశగా విచారణ చేపట్టారు. ఈ క్రమంలో 39 మంది భారతీయులు చనిపోయినట్లు తేలింది. విచారణ నిమిత్తం మృతదేహాలను సమాధుల నుంచి వెలికితీసి డీఎన్ఏ పరీక్షలు చేసినట్లు సుష్మాస్వరాజ్ వెల్లడించారు. డీఎన్ఏ పరీక్షతో వారు చనిపోయారని నిర్ధారణకు వచ్చిన తర్వాతే ఈ విషయాన్ని వెల్లడిస్తున్నట్లు తెలిపారు. ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులే వీరిని చంపేసినట్లు చెప్పారు.

దిగ్భ్రాంతికరం: మమతాబెనర్జీ

కోల్‌కతా: ఇరాక్‌లో 39 మంది భారతీయుల మృతిపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. 'మోసుల్ నుంచి ఈ వార్త తెలియగానే దిగ్భ్రాంతికి గురయ్యాను. ఇది చాలా విచారకరం. ఆ 39 మంది కుటుంబాలను ఓదార్చేందుకు మాటలు రావట్లేదు. వారికి ఆ దేవుడు అండగా ఉండాలి' అని మమత ట్వీట్ చేశారు. భారతీయుల మృతిపై కాంగ్రెస్ పార్టీ కూడా సంతాపం తెలిపింది.

'ఇది చాలా బాధకరమైన సమయం. ఇలాంటి సమయంలో బాధిత కుటుంబాలకు మేం అండగా ఉంటాం. మా డిమాండ్ ఒక్కటే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేయాలి. ఉద్యోగాలు కూడా కల్పించాలి' అని కాంగ్రెస్ సీనియర్ నేత గులాం నబీ ఆజాద్ అన్నారు.



మమ్మల్ని మోసం చేస్తారా?

ఇరాక్‌లో 2014లో కిడ్నాప్‌కు గురైన 39 మంది భారతీయులు చనిపోయారని ఇవాళ ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ ఇవాళ లోక్‌సభలో ఈ ప్రకటన చేశారు. దీనిపై బాధితుల కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. టీవీల్లో చూసి వాళ్లు చనిపోయినట్లు తెలుసుకున్నామని, మా కంటే ముందు ప్రపంచానికి ప్రభుత్వం ఈ వార్త చెప్పిందని వాళ్లు అంటున్నారు. నాలుగేళ్లుగా వాళ్లు బతికే ఉన్నారని చెబుతూ.. ప్రభుత్వం మమ్మల్ని మోసం చేసిందని మండిపడుతున్నారు. బాధిత కుటుంబీకుల్లో గుర్పిందర్ కౌర్ కూడా ఒకరు. చనిపోయిన ఆ 39 మందిలో ఆమె తమ్ముడు కూడా ఉన్నాడు. ఆ వార్త టీవీలో చూశాం. ఇది మమ్మల్ని షాక్‌కు గురిచేసింది. ఇన్నాళ్లూ బతికే ఉన్నారని చెప్పారు. ఇప్పుడు వాళ్లు చనిపోయిన విషయాన్ని మాకంటే ముందు ప్రపంచానికి చెప్పారు. టీవీల్లో వచ్చి రెండు గంటలకుపైనే అయినా.. మాకు మాత్రం ఇంకా అధికారికంగా చెప్పలేదు అని గుర్పిందర్ విమర్శించింది. ఆమె తమ్ముడు మన్‌జిందర్ సింగ్ మోసుల్‌లో కిడ్నాప్‌కు గురయ్యాడు. నాలుగేళ్లుగా మంత్రి అతను బతికే ఉన్నాడని చెప్పారు. ఇప్పుడు వాళ్లపై నమ్మకం పోయింది అని ఆమె చెప్పింది.

మృత్యుంజయుడు హర్జీత్



గుర్‌దాస్‌పూర్: ఇరాక్ లోని మోసుల్‌లో ఐసిస్ ఉగ్రవాదుల చెర నుంచి తప్పించుకున్న ఏకైక భారతీయుడు హర్జీత్ మసీహ్. కాలికి బుల్లెట్ గాయమైనప్పటికీ నాలుగేళ్ల క్రితమే ఉగ్రవాదుల చెరనుంచి హర్జీత్ తప్పించుకుని బయటపడ్డారు. 2014లో ఐఎస్ఐఎస్ ఉగ్రవాదులు ఇరాక్‌లోని మసూల్‌లో కిడ్నాప్ చేసిన 40 మంది భారతీయ కార్మికుల్లో హర్జీత్ ఒకరు. తక్కిన 39 మంది ఐఎస్ ఊచకోతలో హతమైనట్లు విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ పార్లమెంట్‌లో తొలిసారి ప్రకటించిన నేపథ్యంలో హర్జీత్ హసీహ్ మరోసారి వార్తల్లోకెక్కారు. పంజాబ్‌లోని గుర్‌దాస్‌పూర్‌కు చెందిన హర్జీత్ తన సంపాదనతోనే నలుగురు సభ్యుల కుటుంబాన్ని పోషించేవాడు. బతుకుదెరువుకు ఇరాక్ వెళ్లిన తాము ఐసిస్ ఉగ్రవాదులకు ఎలా చిక్కామో అనేవిషయాలను పూసగుచ్చినట్లు వివరించాడు. ఉగ్రవాదులు తమను ఒక అజ్ఞాత ప్రదేశానికి తరలించి..మోకాళ్ల మీద వరుసగా కూర్చోబెట్టి. టపటపా కాల్పులు జరిపారని తెలిపారు. కాల్పుల్లో. ఒక తూటా నా కుడి కాలికి తగలడంతో తాను మృతదేహాల గుట్టపై స్పృహతప్పి పడిపోయాని.. మరుసటి రోజు స్పృహ రావడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీశానని చెప్పాడు.కొద్దిరోజుల పాటు ప్రయాణించి ఎలాగో బంగ్లాదేశ్‌కు చెందిన సహాయక శిబిరానికి చేరుకున్న తనను అక్కడి సిబ్బందిఆస్పత్రికి తరలించి.. వారం తర్వాత భారత్ కు పంపారని తెలిపాడు. అపహరణకు గురైన తన తోటి సహచరులందరినీ ఐఎస్ ఊచకోత కోసినట్టు హర్జీత్ ఆనాడే చెప్పినా... కేంద్ర ప్రభుత్వం మాత్రం 39 మంది భారతీయుల జాడ తెలియలేదనే చెబుతూ వచ్చిందన్నాడు.

పార్లమెంటుకు ముందు చెప్పడం నా బాధ్యత



ఇరాక్‌లోని మోసుల్‌లో చనిపోయిన 39 మంది భారతీయుల గురించి ముందుగా పార్లమెంట్‌లో చెప్పడాన్ని కేంద్ర మంత్రి సుష్మా స్వరాజ్ సమర్థించుకున్నారు. ఆ బందీ మృతుల గురించి పూర్తి ఆధారాలు వచ్చిన తర్వాతనే ఈ సమాచారాన్ని వెల్లడించినట్లు ఆమె చెప్పారు. పార్లమెంట్ కంటే ముందు మాకెందుకు చెప్పలేదని కొందరు బాధితులు ప్రశ్నిస్తున్నారు, కానీ పార్లమెంటరీ వ్యవస్థలో ముందు ఆ విషయాన్ని సభలో చెప్పాలని, ఆ బాధ్యతతోనే ముందుగా ఆ విషయాన్ని పార్లమెంట్‌లో వెల్లడించినట్లు సుష్మా తెలిపారు. మంగళవారం రాజ్యసభలో మోసుల్ మృతుల పట్ల కేంద్ర మంత్రి సుష్మా ప్రకటన చేశారు. దీంతో ఆ అంశం వివాదాస్పదమైంది.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం



ఇరాక్‌లోని మోసుల్ లో ఐసిస్ ఉగ్రవాదుల చెరలో చిక్కుకుని హతమైన భారతీయుల కుటుంబీకులకు ప్రధానమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. అసువులు బాసిన వారి కుటుంబీకుల గురించి ప్రతీ భారతీయుడు ఆలోచిస్తున్నాడని తెలిపా రు. విదేశాల్లో ఉంటున్నప్రతీ భారతీయుడి పరిరక్షణకు ప్రభుత్వంకట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

ఆ వార్త విని షాకయ్యా: రాహుల్



39 మంది భారతీ యు లు ఇరాక్‌లో చనిపోయారన్న వార్త తెలియగానే ఒక్కసారిగా షాకయ్యాన ని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ అన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. తన ఆలోచనలు, ప్రార్థన మృతుల కుటుంబాల గురించేఅని ట్విట్టర్ ద్వారా రాహుల్ ఆవేదన వ్యక్తం చేశారు. భారతీయుల మృతి వార్త విన్న వెంటనే దేశం మొత్తం తీవ్ర విచారంలోకి వెళ్లిందని కాంగ్రె స్ ఎంపీ గులాంనబీ ఆజాద్ అన్నారు.

కవ్వించైనా యుద్ధోన్మాదం

- చైనాకు పూర్వవైభవం తెస్తాం
- మా భూభాగాలను వదులుకోం
- చైనీయుల చిరకాల స్వప్నం కోసం యుద్ధానికైనా సిద్ధమే
- పార్లమెంటు ముగింపు సభలో జిన్‌పింగ్



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి: చైనాకు శాశ్వత దేశాధ్యక్షుడిగా నియమితుడైన అనంతరం షీ జిన్‌పింగ్ చైనా పార్లమెంట్ సమావేశాల ముగింపు రోజైన మంగళవారం పార్లమెంట్‌నుద్దేశించి చేసిన ప్రసంగంపైకి హాంకాంగ్, తైవాన్‌ల గురించేనన్నట్లుగా ఉన్నప్పటికీ అంతర్లీనంగా భారత్ గురించి కూడా ప్రస్తావించినట్లేనని పరిశీలకులు అంచనాలేస్తున్నారు. ఈ ప్రసంగం అరుణాచల్‌ప్రదేశ్‌లో చైనా తమదిగా ప్రకటిస్తూ వస్తున్న భూభాగానికి సంబంధించి భారత్‌కు పరోక్ష హెచ్చరికలాంటిదేనని విశ్లేషిస్తున్నారు. తమ భూభాగ పరిరక్షణకు రక్తపాతపోరుకైనా తాము సిద్ధమేనంటూ తన ప్రసంగంలో జిన్‌పింగ్ స్పష్టం చేశారు. ప్రస్తుతం తైవాన్, హాంకాంగ్‌లు చైనా ఆధిపత్యం నుంచి వేరుపడాలని ప్రయత్నిస్తున్నాయి. చైనా ఆధిపత్యాన్ని ఈ రెండు ప్రాంతాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. రాజకీయంగా అత్యంత శక్తివంతుడిగా మారిన జిన్‌పింగ్ తన తొలి అస్త్రాన్ని దేశ సార్వభౌమత్వ పరిరక్షణ అంశంపైనే ఎక్కుపెట్టారు. తద్వారా చైనాలో ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాలు దేశ ప్రయోజనాలు, ప్రతిష్టను పెంచుతాయన్న విశ్వాసాన్ని కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. దీర్ఘకాలంగా చైనా,ఇండియాల మధ్య సరిహద్దు వివాదాలున్నాయి. ముఖ్యంగా అరుణాచల్‌ప్రదేశ్ మొత్తం తమ దక్షిణ టిబెట్ అంటూ చైనా వాదిస్తోంది. అరుణాచల్‌లో భారత ప్రధాని, రాష్ట్రపతుల పర్యటనల్ని కూడా చైనా తరచూ వ్యతిరేకిస్తోంది. చైనా విడుదల చేసే అట్లాస్‌లు, ఆ దేశ పటాల్లో అరుణాచల్‌ను తమ భూభాగంగానే ప్రచురిస్తోంది. దీనిపై భారత్ ఎన్నిసార్లు అంతర్జాతీయ వేదికలపై తన అభ్యంతరాన్ని వ్యక్తం చేసినా చైనా స్పందించడంలేదు. తవాంగ్ ప్రాంతాన్ని భారత్ ఆక్రమించుకుందంటూ తరచూ ఆరోపణలకు దిగుతోంది. 1962 ఇండో-చైనా యుద్ధ సమయంలో చైనాయే ఈ ప్రాంతాన్ని దురాక్రమించేందుకు విశ్వయత్నం చేసింది. ఇదొక్కటే కాదు.. వాస్తవాధీనరేఖ వెంబడి అనేక ప్రాంతాల్లో భారత్‌తో చైనాకు వివాదాలున్నాయి. మెక్‌మోహన్‌లైన్ సరిహద్దుల్ని చైనా పలుచోట్ల అతిక్రమించింది. 1914సిమ్లా ఒప్పందాన్ని బుట్టదాఖలు చేసింది. జమ్మూకాశ్మీర్‌లోని కారాకోరం పాస్ ఏరియాలో చైనా చొచ్చుకొచ్చింది. లేహ్ జిల్లాలోని డంచోక్‌లో ముందుకొచ్చేసింది. 1950వ దశకంలోనే సుమారు 1200కిలోమీటర్ల పొడవునా సరిహద్దు రేఖను జరిపేసింది. అక్సాయ్‌చిన్ ప్రాంతంలో సరిహద్దులు దాటి ముందుకొచ్చింది. 1865నాటి జాన్సన్ లైన్ సరిహద్దు ఒప్పందాన్ని తుంగలో తొక్కింది. 1899లో ఇరుదేశాల మధ్య ప్రతిపాదించిన మెకార్టనీ మెక్‌డొనాల్డ్ ఒప్పందాన్ని కూడా తుంచేసింది. పాంగ్‌కాంగ్ సరస్సును ఆక్రమించింది. లేహ్ ప్రాంతంలోని దౌలత్‌బేగ్ ఓల్డీ ప్రాంతాన్ని గుప్పెటపట్టింది. చుమార్‌లో నిబంధనల్ని అతిక్రమించి రోడ్డు నిర్మాణం మొదలెట్టింది. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ వెంబడి 545కిలోమీటర్ల పొడవైన సరిహద్దు రేఖలో 8చోట్ల చైనా అతిక్రమణలు జరిపింది. తాజాగా డోక్లామ్ వివాదం ఉండనేఉంది. భారత్, భూటాన్, చైనా సరిహద్దులోని ప్రాంతంపై తమకే హక్కుందని వాదిస్తోంది. ఈ దశలో జిన్‌పింగ్ ప్రసంగం తైవాన్, హాంకాంగ్‌లనుద్దేశించే అంటూ ఆ దేశ మీడియా చేస్తున్న ప్రచారాన్ని భారత్ మాత్రం విశ్వసించడంలేదు. ఓ వైపు అభివృద్ధి గురించి ప్రస్తావిస్తూనే శత్రువులపై రక్తసిక్తపోరుకైనా తాము సిద్ధం.. ఒక్క అంగుళం భూమినైనా వదులుకునేదిలేదంటూ ఆయన చేసిన ప్రకటన సారాంశాన్ని భారత మీడియా విశ్లేషిస్తోంది. చైనా రక్షణమంత్రిగా ఆ దేశ మిస్సైల్ మేన్ లెఫ్టినెంట్ జర్నల్ వెరుఫెంగిన్‌ను నియమించడం కూడా పలు సందేహాలకు తావిస్తోంది. వెరుఫింగన్ దక్షిణాసియా రక్షణ వ్యవహారాల్లో నిపుణుడు. భారత్‌తో పాటు సరిహద్దు దేశాల వ్యూహాత్మక రక్షణ విధానాలపై ఆయనకు మంచిపట్టుంది. ఫెంగిన్‌ను ప్రభుత్వంలో కీలకశాఖకు మంత్రిగా నియమించారు. అదే సమయంలో సార్వభౌమత్వ పరిరక్షణకు యుద్ధానికైనా వెనుకాడేదిలేదంటూ ప్రకటించారు. ఇంతవరకు దేశీయంగా అసమ్మతివాదుల్ని, రాజకీయ ప్రత్యర్థుల్ని తుదముట్టించిన జిన్‌పింగ్ చైనా సామ్రాజ్య విస్తరణకు అడ్డొచ్చిన దేశాలపై తన సైనికసామర్థ్యాన్ని ప్రదర్శించేందుకు్కూడా వెనుకాడే ప్రసక్తేలేదన్న సంకేతాల్నిచ్చారు. ఈ దశలో భారత్‌కు ఆచితూచి వ్యవహరించాల్సిన అవసరముంది. శాశ్వత అధ్యక్షునిగా నియమితులు కాగానే జిన్‌పింగ్‌కు భారత ప్రధాని మోడి చైనా భాషలో శుభాకాంక్షలు తెలిపారు. అసలే ఇరుదేశాల మధ్య ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రజాస్వామ్య విరుద్ధ వైఖరితో పరోక్ష నియంతృత్వానికి తెరదీసిన జిన్‌పింగ్‌కు చైనా భాషలో శుభాకాంక్షలు తెలపడం ఇప్పటికే పలు విమర్శలకు దారితీసింది. తాజా ప్రకటన నేపథ్యంలో చైనాతో సంబంధాలపై భారత్ పునఃసమీక్ష నిర్వహించుకోవాల్సిన ఆవశ్యకతుదని నిపుణులు సూచిస్తున్నారు.

బీజింగ్: తమ దేశంలోని ఒక్క అంగుళం భూభాగాన్నికూడా వదులుకునేందుకు సిద్ధంగా లేమని చైనా అధ్యక్షుడు జీ జిన్ పింగ్ స్పష్టం చేశారు. అవసరమైతే రక్తపాత యుద్ధానికి కూడా సిద్ధమని పేర్కొన్నారు.ఆదేశ పార్లమెంట్ ముగింపు సమావేశాల సందర్భంగా జిన్ పింగ్ మాట్లాడుతూ చైనాకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు తనవంతు కృషిచేస్తున్నానని అన్నారు. చైనా ప్రజలు తమ భూభాగంలోని అంగుళం

నెత్తుటి పోరుకైనా సిద్ధం

స్థలాన్ని కూడా వదులుకునేందుకు సిద్ధంగా లేరు.అని నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ సమావేశంలో వెల్లడించారు. అయితే ఏఏ దేశాల విషయంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారనే అంశంపై స్పష్టత ఇవ్వలేదు. ఇటీవల భారత్-చైనా మధ్య అంతరాలు పెరుగుతున్న నేపథ్యంలో జిన్‌పింగ్ ఈ వ్యాఖ్యలు చేసి ఉంటారని వి శ్లేషకులు అంచనా వేస్తున్నారు.

జిన్‌పింగ్‌కు మోడీ శుభాకాంక్షలు

చైనా అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికైన జిన్‌పింగ్‌కు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుభాకాంక్షలు తెలియజేశారు. జిన్‌పింగ్ చైనా శాశ్వత అధ్యక్షుడిగా కొనసాగే అవకాశం కలగడంపై ఆనందం వ్యక్తం చేశారు.

పద్మ పురస్కారాల ప్రదానం



న్యూఢిల్లీ: రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఇళయరాజా, హిందుస్తానీ శాస్త్రీయ సంగీత గాయకుడు గులామ్ ముస్తఫా ఖాన్, హిందుత్వ ఆలోచనవాది పి.పరమేశ్వరన్, కేరళ బిషప్ ఫిలిపోస్ మార్ క్రైసోస్టోమ్, మరో 39 మంది ప్రముఖులు 2018 సంవత్సరానికి ప్రతిష్ఠాత్మక పద్మ పురస్కారాలను మంగళవారం అందుకున్నారు. రాష్ట్రపతి భవన్ వద్ద జరిగిన పురస్కారాల ప్రదానోత్సవానికి ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు, ప్రధాని నరేంద్ర మోడీ, ఆయన మంత్రివర్గ సహచరులు, పలువురు ప్రముఖులు హాజరయ్యారు. పేదలకు సేవలందించినవారు, పాఠశాలలు నెలకొల్పినవారు, గిరిజన కళలకు అంతర్జాతీ య ఖ్యాతి తెచ్చిన పలువురు పద్మ పురస్కారాలు అందుకున్నారు. ఇళయరాజా, గులామ్ ముస్తఫా ఖాన్, పి.పరమేశ్వరన్‌లకు పద్మ విభూషణ్ పురస్కారాలను స్వీకరించారు. మార్ థోమా సిరియన్ చర్చ్ ఫిలిపోస్ ఎమరేట్స్ మెట్రోపాలిటన్ బిషప్ మార్ క్రైసోస్టోమ్, చరిత్రకారుడు రామచంద్రన్ నాగస్వామి, న్యాయవేత్త వేద్ ప్రకాష్ నందా, సితార వాయిద్యకారుడు అరవింద్ పరిఖ్ పద్మ భూషణ్ పురస్కారాలు పొందారు. పద్మశ్రీ పురస్కారాలు స్వీకరించిన 37 మంది ప్రముఖుల్లో ఐఐటీ కాన్పూర్ పూర్వ విద్యార్థి అరవింద్ గుప్తా, కేరళ గిరిజన మహిళ లక్ష్మి కుట్టి ఉన్నారు.

పెరియార్ మరో విగ్రహం ధ్వంసం



పుదుకొట్టై: విగ్రహాల విధ్వంస పరంపర లో మరో ఘటన చోటుచేసుకుంది. తమిళనాడు లో సాంఘిక సంస్కర్త, ద్రావిడ ఉద్యమకర్త ఈవీ రామస్వామి (పెరియార్) మరో విగ్రహాన్ని రౌండ్తానాలో దుండగులు ధ్వంసం చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు కొంతమంది పెరియా ర్ విగ్రహంలోని తల భాగాన్ని ఉలి సాయంతో వేరుచేసి సమీపంలో పడేశారని పోలీసులు తెలిపారు. విగ్రహ ధ్వంసంపై సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, రెవెన్యూ సిబ్బంది సంఘటన ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణం రంగంలోకి దిగి విగ్రహానికి మరమ్మతులు చేయించి యథాస్థితికి విగ్రహాన్ని పునరుద్ధరించారని పోలీసులు తెలిపారు. ఈ విగ్రహాన్ని 2013లో ద్రావిడార్ కజగం నేత కే.వీరమణి ఆవిష్కరించారు. విగ్రహ ధ్వంసం జరిగిన సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈ ప్రాంతాన్ని పెద్ద ఎత్తున పోలీసులు మోహరించి తమ అధీనంలోకి తీసుకున్నారు. సంఘటనపై కేసు రిజిస్టర్ చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఇంతకుముందు ఇదే నెల 6వతేదీన వెల్లూరు జిల్లాలో ద్రవిడ ఉద్యమనేత పెరియార్ విగ్రహాన్ని ధ్వంసం చేయగా ఆ ఘటనకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు.

నా వెనుక దేవుడున్నాడు



చెన్నై: తన వెనుక బీజేపీ ఉందంటూ వస్తున్న వార్తలను తమిళ తలైవా రజనీకాంత్ మంగళవారం ఖండించారు. తన వెనుక బీజేపీ లేదని, దేవుడు ఉన్నాడని స్పష్టం చేశారు. హిమాలయాల నుంచి చెన్నై చేరుకున్న రజనీకాంత్ మీడియాతో మాట్లాడుతూ... తన రాజకీయ ప్రయాణం వెనుక బీజేపీ ఉందని కొందరు ప్రచా రం చేస్తును ఆరని, అయితే తన వెనుక దేవుడు ఉన్నాడని, తనకు అండగా ప్రజలున్నారని చెప్పారు. అంతేకాకుండా, పెరియార్ విగ్రహం కూల్చివేత ఘటనను రజనీ తీవ్రంగా ఖండించారు. ఇది పూర్తిగా అనా గరిక చర్య అని ఆయన పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించిన తరువాత తొలిసారి రజనీ హిమాలయ యాత్రకు వెళ్లారు. అక్కడ సాధువులకు భోజనాలు ఏర్పాటుచేశారు. అక్కడి నుంచి చెన్నై వచ్చిన రజనీ మీడియా సమావేశంలో మాట్లాడారు. తాను ఏర్పాటుచేయబోయే పార్టీపై వస్తున్న ఆరోపణలను ఖండించారు.

శశికళకు 15 రోజుల పెరోల్


బెంగళూరు: పరప్పణ అగ్రహారం జైలులో ఆదాయానికి మించి ఆస్తుల కేసులో జైలుశిక్ష అనుభవిస్తున్న శశికళకు న్యాయస్థానం 15 రోజుల పెరోల్ మంజూరు చేసింది. శశికళ భర్త నటరాజన్ మూత్రపిండాల వ్యాధితో మంగళవారం అర్ధరాత్రి మృతి చెందారు. భర్తను కడసారి చూసేందుకు ఆమె పెరోల్ కోసం దరఖాస్తు చేసుకోగా న్యాయస్థానం మంజూరు చేసింది. దీంతో ఆమె బెంగళూరులోని పరప్పణ అగ్రహార జైలు నుంచి విడుదలయ్యారు. అయితే, శశికళ భర్త ఎం.నటరాజన్(73) మూత్రపిండాల వ్యాధితో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అక్టోబర్‌లో మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న నటరాజన్ రెండు వారాల క్రితం అనారోగ్యంతో చెన్నైలోని గ్లోబల్ ఆస్పత్రిలో చేరారు. తన భర్తను చూసేందుకు శశికళ సోమవారం పెరోల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. దానిపై కోర్టు నిర్ణయం తీసుకునేలోగానే నటరాజన్ మరణించారు. నటరాజన్, శశికళ వివాహం 1975లో జరిగింది.

ఎస్ఎస్‌సీ లీక్‌పై సీబీఐ దర్యాప్తు



న్యూఢిల్లీ: స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సి) పేపర్ లీక్‌పై సీబీఐ దర్యాప్తు ప్రారంభించిందని కేంద్రం సుప్రీంకోర్టుకు నివేదించింది. జస్టిస్ ఆర్‌కే అగర్వాల్, జస్టిస్ ఏఎం సాప్రేతో కూడిన బెంచ్ ఎదుట కేంద్రం అఫిడవిట్ దాఖలు చేయటంతో ఎస్ఎస్‌సీ లీక్ విషయంపై సీబీఐ దర్యాప్తును ఉద్దేశించి దాఖలైన పిల్ (ప్రజా ప్రయోజన వ్యాజ్యం)ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. మార్చి 12న లీక్‌పై పిల్ దాఖలవటంతో కేంద్రానికి నోటీసు జారీ చేయకుండానే సుప్రీంకోర్టు స్పందించి వివరణ కోరింది. ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని న్యాయవాది ఎంఎల్ శర్మ సుప్రీం కోర్టులో ఫైల్ చేశారు. గత ఫిబ్రవరి 17 నుంచి 21 వరకు జరిగిన కంబైన్డ్ గ్రాడ్యూ యేట్ లెవెల్ (టైర్.2) 2018 పరీక్షలో ప్రశ్నలు లీక్ అవటంపై దర్యాప్తునకు ఆదేశం చాల్సిందిగా ఆయన పిల్‌లో సుప్రీంకోర్టును కోరారు. పేపర్ లీక్‌పై సీబీఐ దర్యాప్తు ప్రారంభించటంతో పిల్‌ను సుప్రీంకోర్టు డిస్పోజ్ చేసింది. కాగా ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ పరీక్షద్వారా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లోని క్లరికల్ పోస్టులను భర్తీ చేస్తారు.

2019లోనూ మోడీయే ప్రధాని



న్యూఢిల్లీ: బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిలో అనిశ్చితి నెలకొందన్న ఆరోపణలు కేంద్ర మంత్రి, లోక్ జనశక్తి పార్టీ అధ్యక్షుడు రామ్ విలాస్ పాశ్వాన్ కొట్టిపారేశారు. లోక్ సభ ఎన్నికల అనంతరం ప్రధానిగా నరేంద్ర మోడీనే ఉంటారని స్పష్టం చేశారు. బీహార్‌లో బీజేపీ నేతలు కొంత మంది తన భవిష్యత్ ప్రణాళికలను విమర్శిం చటాన్ని ఆయన తిప్పికొట్టారు. ఈ సందర్భంగా విలేఖరులతో రామ్‌విలాస్ పాశ్వాన్ మాట్లాడుతూ ఎన్డీయే కూటమిలో ఎటువంటి చిక్కులు లేవన్నారు. నేను ఇంతకముందే చెప్పినట్టు ప్రధాని పదవికి ఖాళీ లేదన్నారు. నరేంద్రమోదీనే ప్రధానిగా కొనసాగుతారన్నా రు. ఎన్డీయే ప్రభుత్వమే కేంద్రంలో కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుపై ఆయన స్పందిస్తూ పార్టీల సమావేశాలు జరుగుతూనే ఉంటాయనీ, కానీ వాటి వల్ల ఒరిగేదేమీ ఉండదన్నారు. కేంద్రంలోని జనతా కు టుంబాన్ని విడదీయాలని చేసే ప్రయత్నం ఒక విఫలయత్నంగానే మిగిలిపోతుందన్నారు. బీహార్‌లో బీజేపీ నేత లు, కేంద్ర మంత్రి ఒకరు చేసిన మతపరమైన వివాదాస్పద వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ ప్రభుత్వం దళితులు, మైనార్టీల సంక్షేమానికి ఎన్నో చర్యలు చేపట్టిం దన్నారు. కాగా దళిత నాయకుడైన పాశ్వాన్ గతంలోఎన్నికల ముందు ప్రతిసారి గెలుపు కూటమివైపు జంప్‌చేసి తద్వారా అధికారంలో కొనసాగుతుండటం విదితమే.

ఢిల్లీ వర్సిటీలో పన్ను చెల్లింపులపై సదస్సు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు పన్నులు సక్రమంగా చెల్లిస్తేనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని ఆదాయ పన్నుల శాఖ ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్ నీనా కుమారి అన్నారు. ఢిల్లీ యూనివర్సిటిలో ఇన్‌కమ్ ట్యాక్స్, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్స్ మరియు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇంటర్ కాలేజీ నుక్కడ్ నాటక్ కాంపిటీషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పన్నులు చెల్లించడంపై పిల్లల నుంచి యువత వరకూ అవగాహన కల్పించడమే తమ ఉద్దేశమని ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నీనా కుమారి తెలిపారు. సరైన సమయంలో సక్రమంగా పన్నులు చెల్లించకపోవడంతో జరిమానాతో పాటు జైలుకూ వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని ఆమె హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా పన్నులు చెల్లించడం వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయని నీనా ఉదాహరణలతో సహా చెప్పారు.

క్రీడాప్రభ

మియామి మాస్టర్స్ టోర్నీలో
యుకీ రెండో రౌండ్లోకి



మియామి(యుఎస్): ఈ సీజన్‌లో బాగా రాణిస్తున్న టెన్నిస్ ఆటగాడు యుకీ బాంబ్రి ఏటీపీ మియామి మాస్టర్స్ క్వాలిఫైయిర్స్ పోటీలో అదే దూకుడుతో ముందుకు దూసుకుపోతున్నాడు. 79,72,535 డాలర్ల ప్రైజ్‌మనీ విలువగల ఈ టోర్నీలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో యుకీ అర్జెంటీనాకు చెందిన రెంజో ఒలివోపై వరుస సెట్లలో విజయం సాధించి ఫైనల్ రౌండ్‌కు అర్హత సాధించాడు. కాగా మరో ఆటగాడు రామ్‌కుమార్ రామనాథన్ ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించాడు. ఇటీవల ఇండియన్ వెల్స్‌లో టోర్నీలో అద్భుత ప్రతిభచూపి ప్రపంచ నం.12 లుకాస్ ప్యుల్లె చేతిలో అనుకోని రీతిలో ఓడిన యుకీ తాజా మ్యాచ్‌లో 6-4, 6-1 తేడాతో ఒలివోపై అలవోకగా విజయం సాధించాడు. తర్వాతి రౌండ్లో యుకీ స్వీడన్‌కు చెందిన ఎలియాస్ ఎమర్‌ను ఢీకొన నున్నాడు. రామ్‌కుమార్ అమెరికా ఆటగాడు మైకేల్ మ్మోహ్ చేతిలో 7(4)-6, 6-4 తేడాతో ఓటమి పాలయ్యాడు.

నకిలీ హెల్మెట్లు
తయారీ నిరోధించండి
రవాణాశాఖ మంత్రికి సచిన్ లేఖ



న్యూఢిల్లీ: నకిలీ హెల్మెట్ల తయారీ, అమ్మకాలను నిరోధించాలని క్రికెట్ దిగ్గజం, రాజ్య సభ సభ్యుడు సచిన్ టెండూల్కర్ గళమెత్తాడు. నాణ్యతలేని నాసిరకమైన హెల్మెట్లు ద్విచక్రవాహనాదారులు ప్రమాదానికి గురైనప్పుడు వారి ప్రాణాలను రక్షించలేకపోతున్నాయని అన్నాడు. ఈ మేరకు నకిలీ హెల్మెట్ల తయారీని నిరోధించడానికి తగిన చర్యలు చేపట్టాలని సచిన్ కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాశాడు. ద్వి చక్ర వాహనదారుల్లో ప్రమాదాల స్థాయి ఎక్కువ ఉందని, వారి ప్రాణాలు కాపాడటంలో నాణ్యమైన రక్షణ పరికరాల పాత్ర అత్యంత కీలకమని సచిన్ పేర్కొన్నాడు. ' హెల్మెట్ తయారీదారులు నాసిరకం ముడిసరుకును ఉపయోగించి హెల్మెట్లను తయారు చేసి వాటికి నకిలీ ఐఎస్ఐ మార్క్‌ను అంటించి అమ్మడాన్ని నిరోధించేందుకు మీ మంత్రిత్వ శాఖ తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. ఒక క్రీడాకారుడిగా అసలైన నాణ్యమైన రక్షణ పరికాల అవశ్యకత నాకు తెలుసు. క్రీడల్లో మేము ఉపయోగించే హెల్మెట్ల స్థాయిలో అసలైన, నాణ్యమైన హెల్మెట్లను కూడా ద్విచక్ర వాహనదారులకు అందించాలి' అని సచిన్ లేఖలో రాశాడు. దేశంలో 70శాతానికి పైగా ద్విచక్ర వాహనదారులు నకిలీ హెల్మెట్లను కొంటున్నారని సచిన్ పేర్కొన్నాడు. 2016 జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్ర వాహనాలు 30శాతంకు పైగా వాటాను కలిగివున్నాయి. అసలైన హెల్మెట్లను ధరించడం వల్ల రైడర్లు ప్రాణాపాయంనుంచి తప్పించుకునే అవకాశాలు 42 శాతం పెరుగుతాయని సచిన్ వ్యాఖ్యానించాడు. ప్రభుత్వం నాన్ ఐఎస్ఐ, నకిలీ ఐఎస్ఐ హెల్మెట్ల తయారీ చట్ట వ్యతిరేకమని పేర్కొంటోంది. కాని ఈ చట్టం అమలు పటిష్టంగా జరుగడంలేదని సచిన్ ఆవేదన వెలిబుచ్చాడు. వినియోగ దారులకు అసలైన ఉత్పత్తులను అందుబాటులో ఉంచడంతోపాటు.. హెల్మెట్ల ధరలను కూడా తగ్గించాలని సచిన్ లేఖలో మంత్రిని కోరారు. అసలైన హెల్మెట్లను ధరించేందుకు ప్రజల్లో చైతన్యం తెచ్చేలా ప్రచారాన్ని నిర్వహించాల్సిన ఆవశ్యకత ఉందని.. అందుకు ప్రభుత్వం నడుం బిగించాలని సచిన్ కోరాడు.

రబాడాపై నిషేధం ఎత్తివేత



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా క్రికెటర్ కగిసో రబాడా ఆసీస్‌తో జరుగనున్న మిగతా రెండు టెస్టుల్లో ఆడటానికి గ్రీన్ సిగ్నల్ దొరికింది. ఆసీస్‌తో జరుగిన రెండో టెస్టులో రబాడా, ఆసీస్ కెప్టెన్ స్టీఫెన్ స్మిత్‌ను భౌతికంగా ఢీకొన్నాడు. దీనితో ఐసీసీ రబాడాను మిగతా రెండు టెస్టులు ఆడకుండా నిషేధించింది. అనంతరం తాను కావాలని స్మిత్‌ను ఢీకొనలేదని, తాను తప్పుచేయలేదని ఐసీసీకి సోమవారం మొరపెట్టుకున్నాడు. న్యూజిలాండ్‌కు చెందిన జ్యుడీషియల్ కమిషనర్ మైకేల్ హెరోన్ రబాడా అభ్యర్థనపై విచారణ జరిపి అంతకు ముందు విధించిన డీ మెరిట్ పాయింట్ల సంఖ్యను 3 నుంచి ఒకటికి తగ్గించడమేకాక, అతని మ్యాచ్ ఫీజులో పెట్టిన కోతను మొత్తాన్ని 50 శాతం నుంచి 25 శాతానికి తగ్గించాడు. ఈమేరకు ఒక ప్రకటనను ఐసీసీ మంగళవారం మీడియాకు విడుదల చేసింది. దీనితో రబాడా ఇప్పటివరకు పొందిన డీ మెరిట్ పాయింట్లు 9 నుంచి ఏడుకు తగ్గాయి. రబాడా మళ్లీ తప్పుచేస్తే అతని డీ మెరిట్ పాయింట్లు పెరిగి నిషేధంను ఎదుర్కొంటాడని హెరోన్ తెలిపాడు.



అధ్యక్షుడు రామ్ నాత్ కోవింద్ చేతులు మీదుగా పద్మశ్రీ అవార్డును అందుకుంటున్న బ్యాడ్మింటన్ ఆటగాడు కిదాంబి శ్రీకాంత్

క్రీడాకారులకు పద్మ పురస్కారాలు అందజేత



అధ్యక్షుడు రామ్ నాత్ కోవింద్ చేతులు మీదుగా పద్మశ్రీ అవార్డును అందుకుంటున్న టెన్నిస్ ఆటగాడు, సోమదేవ్ కిశోర్‌దేవ్ వర్మన్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ప్రపంచ నెంబర్ 2 బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిదాంబి శ్రీకాంత్, టెన్నిస్ క్రీడాకారుడు సోమ్‌దేవ్ దెవ్వర్మాన్‌లను పద్మశ్రీ అవార్డుతో భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సత్కరించారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో భారత ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సమక్షంలో అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన షట్లర్ శ్రీకాంత్, వరుసగా మూడు గోల్డ్ మెడల్లు గెలుచుకున్న తొలి భారత క్రీడాకారుడిగా నిలిచారు. గ్రాండ్ ప్రిక్స్ గోల్డ్, సూపర్ సిరీస్, సూపర్ సిరీస్ ప్రీమియర్ టైటిళ్లను గెలుచుకుని భారత పతాకాన్ని రెపరెపలాడించారు. అలాగే టెన్నిస్ క్రీడాకారుడు సోమ్‌దేవ్ ఏషియన్ గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్‌లో పలు పతకాలను సాధించారు. భారత ప్రభుత్వం 69వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబర్చిన వారికి ఈ పురస్కారాలను ప్రకటించింది. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మ విభూషణ్ వంటి 3 విభాగాల్లో పద్మ అవార్డులకు ఎంపికైన మొత్తం 85 మందిలో 43 మందికి మంగళవారం రాష్ట్రపతి అవార్డులను ప్రదానం చేశారు. మిగతావారికి ఏప్రిల్ 2న ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డులను అందజేయనున్నారు. అవార్డుల జాబితాలో భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని, పంకజ్ అద్వానీ ఉన్నారు. వీరిద్దరూ దేశంలోని అత్యున్నత పౌర పురస్కారాల్లో మూడవదైన పద్మ భూషణ్ అందుకోనున్నారు. వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ సైఖోం మీరాబాయ్ ఛాను, పారాలింపిక్ గోల్డ్ మెడలిస్ట్ మురళీకాంత్ పేట్కర్‌లు పద్మశ్రీ విభాగంలో అవార్డులు అందుకోనున్నారు. దేశంలోని అత్యున్నత పౌర పురస్కారాల్లో రెండవదైన పద్మవిభూషణ్‌కు ముగ్గురిని, పద్మ భూషణ్‌కు 9 మందిని, పద్మశ్రీకు 73 మందిని కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది.

మహిళా క్రికెట్‌లో సంస్కరణలు



ఇటీవల ఆస్ట్రేలియా చేతిలో భారత మహిళా జట్టు ఘోర పరాజయం పొందడంతో బీసీసీఐ జట్టును శక్తివంతంగా తీర్చిదిద్దడానికి కసరత్తు ప్రారంభించింది. దేశ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలనుంచి మహిళా క్రికెటర్లను ఎంపిక చేసి కొత్త రక్తంతో జట్టును పరిపుష్టం చేయాలని తలుస్తోంది. ఇందుకు వేదికగా జాతీయ క్రికెట్ అకాడమీని వేదికగా ఉపయోగించుకోనుంది



• ఆస్ట్రేలియాతో ఓటమిపై సమీక్ష • కొత్త క్రీడాకారిణుల కోసం శోధన

న్యూఢిల్లీ: ఇటీవల ఆస్ట్రేలియా చేతిలో పరాజయం పాలైన భారత మహిళల క్రికెట్ జట్టులో మార్పులు తేవాలని బీసీసీఐ భావిస్తోంది. ఆసీస్‌తో మూడు వన్డే మ్యాచ్‌ల సిరీస్‌లో మిథాలి సేన ఘోర పరాజయం పాలైంది. సిరీస్‌ను 3-0 తేడాతో ఆసస్‌కు కోల్పోయింది. మిథాలిరాజ్, హర్మన్ ప్రీత్ కౌర్ తదితర సీనియర్ ఆటగాళ్లున్న జట్టు దక్షిణాఫ్రికాలో అద్భుతంగా రాణించింది. సఫారీలపై వన్డే సిరీస్‌ను 2-1 తేడాతో గెలుచుకోగా, టీ20 సిరీస్‌ను 3-1తో గెలుచుకుని అభిమానుల ఆధరణను చూరగొంది. అదే జోరును స్వదేశంలో పర్యటిస్తున్న ఆస్ట్రేలియాపై ప్రదర్శించడంలో విఫలమైంది. గెలుపుకు కారణాలు తక్కువగా కనపడినా... ఓటమికి అనేక కారణాలు కన్పిస్తాయంటున్నారు పరిశీలకులు. మరోవైపు భారత మహిళా జట్టులో సీనియర్ ఆటగాళ్ల వయసు పెరిగిపోవడంతో వారి స్థానంలో కొత్త ఆటగాళ్లకు అవకాశమివ్వాలని బీసీసీఐ ఆలోచిస్తున్నది.

జాతీయ క్రికెట్ అకాడమీ నుంచి ఎంపిక

ఇప్పటికే ఈ దిశలో బీసీసీఐ ఇండియా 'ఎ' జట్టును ప్రవేశపెట్టడం, ఆ జట్టును పర్యటనలకు పంపడంతో తన వైఖరిని స్పష్టం చేసింది. ఈ నెలాఖరులో జాతీయ క్రికెట్ అకాడమీలో ఆటగాళ్ల క్యాంప్ నిర్వహించి కొంతమంది పేసర్లు, స్పిన్నర్లు, వికెట్ కీపర్లను ఎంపిక చేసి వారిని పరీక్షించాలని నిర్ణయించింది. మిథాలి రాజ్, జులన్ గోస్వామి తదితర సీనియర్ క్రీడాకారిణులు దీర్ఘకాలం ఆడలేకపోవచ్చని సెలెక్టర్లు భావిస్తున్నారు. భవిష్యత్తు ఆటకోసం జట్టును తీర్చి దిద్దడానికి ఇదే మంచి సమయమని వారు అనుకుంటున్నారు. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో భారత జట్టులో లీడ్ పేసర్‌గా రాణిస్తున్న జులన్ గోస్వామి అనారోగ్య కారణాలతో ఆటకు దూరంగా ఉండటంతో సిరీస్‌ను ఆస్ట్రేలియా క్లీన్ స్వీప్ చేసిన విషయం తెలిసిందే.

28న సీఓఏ సభ్యుల సమావేశం

బీసీసీఐ పాలన కమిటీ సభ్యురాలు డయానా ఎడుల్జీ, వన్డే కెప్టెన్ మిథాలి రాజ్, టీ20 కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్, సెలక్షన్ కమిటీ చీఫ్ హేమలతా కళా, కన్వీనర్ ప్రొఫెసర్ రత్నాకర్ శెట్టిలతో కూడిన మహిళా సభ్యుల కమిటీ ఈ నెల 28న భేటీ కానుంది. ఆస్ట్రేలియాపై భారత జట్టు ప్రదర్శించిన ఆటతీరును సమీక్షనుంది. ' జట్టుకు తప్పనిసరిగా మరింత నైపుణ్యమున్న పేసర్లు, స్పిన్నర్లు అవసరముంది. ఆస్ట్రేలియా సిరీస్‌లో ఇది తేట తెల్లమైంది. వారు మన స్పిన్నర్లను తేలకగా ఎదుర్కొన్నారు. మన బ్యాట్స్‌మన్లు వారి స్పిన్నర్లను ఎదుర్కోలేకపోయారు. బ్యాటింగ్ విభాగంలో కూడా మరింత శక్తివంతం చేయాల్సిన అవసరముంది' అని సీఓఏ పాలన కమిటీ సభ్యురాలు, మాజీ భారత జట్టు కెప్టెన్ ఎడుల్జీ వ్యాఖ్యానించింది. హర్మన్ ప్రీత్ కౌర్, స్మృతి మంధాన వంటి సీనియర్ క్రీడాకారిణులనుంచి నిలకడతో కూడిన ఆటను సెలెక్టర్లు ఆశిస్తున్నారు. జట్టును పరిపుష్టం చేయడానికి దేశ వ్యాప్తంగా.. (ఈశాన్య రాష్ట్రాలతో సహా) రాణిస్తున్న క్రీడాకారిణులను పరిశీలించనుంది. ' ఇటీవల దేశీయ క్రికెట్ ఫార్మాట్లలో తెచ్చిన మార్పులు కొత్త క్రీడాకారులను వెలుగులోకి తేవడానికి ఉద్దేశించినవే. ఇందులో భాగంగా అండర్-16 విభాగాన్ని ప్రవేశపెట్టాము. ఇది పూర్తి స్థాయిలో ఫలితాలు ఇవ్వడానికి కొంచెం సమయం పడుతుంది. అయినప్పటికి, దేశంలోని అన్ని మూలల నుంచి సరైన నైపుణ్యమున్న వారిని వెలికి తీయాల్సిన అవసరముంది' అని ఎడుల్జీ అంది.



మహిళా క్రికెట్‌కు ఆదరణ పెరిగింది

పురుషుల క్రికెట్‌తో పోలిస్తే, మహిళల క్రికెట్‌కు దేశీయంగా ఉన్న ఆదరణ అంతత మాత్రమే. వారికి వచ్చే ఆదాయం కూడా తక్కువే. అయితే గత ఏడాది ఇంగ్లండ్‌లో జరిగిన ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ ఆడినప్పటి నుంచి మహిళా క్రికెటర్ల దశ తిరిగింది. అభిమానులు కూడా పెరిగారు. పలువురు క్రీడాకారిణులు పేరుమోసిన కంపెనీ ఉత్పత్తులకు ప్రచారకర్తలుగా నియమింపబడ్డారు. ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురైనా మహిళా క్రికెటర్లకు కాలం కలసివస్తోంది. ' ప్రస్తుతం వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాము. ఆటలో వారు నిలకడగా రాణించాల్సిన అవసరముంది. అదొక్కటే మహిళా క్రికెట్ ప్రయోజనాలను కాపాడుతుంది' అని ఎడుల్జీ అంది. ముంబై వేదికగా గురువారం నుంచి ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌తో జరిగే ముక్కోణపు టీ20 సిరీస్ భారత్ జట్టు ముందున్న పెద్ద సవాల్, ఈ టోర్నీలో భారత్ గెలిచి మునపటి పటిమ జట్టులో తగ్గలేదని నిరూపించుకుంటుందని అభిమానులు ఆశిస్తున్నారు.

కొత్త ఆటగాళ్లు కుదురుకోవాలంటే రెండేళ్లు పడుతుంది

భారత జట్టు శక్తి విహీనంగా ఉందని మిథాలి రాజ్ అంగీకరించింది. కొత్త క్రీడాకారిణులు వచ్చి జట్టును శక్తివంతమైనదిగా తీర్చి దిద్దడానికి కనీసం రెండేళ్లు పడుతుందని పేర్కొంది. గత ఏడాది నుంచి ఇండియా ఎ టీం పేర కొత్త ఆటగాళ్లను వెలికితీసేందుకు సెలెక్టర్లు ప్రయత్నాలు ప్రారంభించారు. కొత్త ఆటగాళ్లు జాతీయ జట్టులోకి రావడానికి కొంచెం సమయం పడుతుంది. కొంత మంది యువ క్రీడాకారిణులను మా జట్టు కలిగివుంది. అయితే వారు రాణించాల్సిన అవసరముంది. అంతర్జాతీయ క్రీడాకారులతో ఆడటం మూలాన వారు తమ నైపుణ్యాలు మెరుగు పర్చుకోవడానికి వీలు చిక్కుతుందని మిథాలి అంది

మహిళలకు ఐపిఎల్ ?

మహిళా క్రికెట్‌లో ఐపీఎల్ తరహా ఈవెంట్‌ను నిర్వహించాలంటే...బీసీసీఐ దానికి తగ్గట్టుగా దేశీయంగా ఆటగాళ్లను ఎంపిక చేయాల్సి ఉంటుందని వన్డే కెప్టెన్ మిథాలి రాజ్ అంది. మంగళవారం ముంబైలో మీడియాతో ఆమె మాట్లాడుతూ.. ఐపీఎల్ వంటి లీగ్‌లకు ఆటగాళ్లను ఎంపిక చేయడం బీసీసీఐ ముందున్న సవాలు. ఇండియా టీం 'ఎ' కు నాణ్యమైన క్రీడాకారిణుల అవసరముంది. ఆటగాళ్ల కొరతను అధిగమించి.. ఐపీఎల్ బరిలోకి మహిళలను దించితే ఉత్తమంగా ఉంటుంది' అని మిథాలి అంది. కాగా, వచ్చే ఐపీఎల్ 11వ సెషన్‌కోసం క్రికెట్ బోర్డు మహిళా జట్లతో ఎగ్జిబిషన్ వ్యాచులు నిర్వహించనుంది. దేశీయంగా మహిళా క్రికెటర్లను పూర్తి స్థాయిలో తీర్చిదిద్దిన అనంతరమే ఐపీఎల్ బరిలోకి దిగాలి.. అలా కాని పక్షంలో దేశీయ ఆటగాళ్లకు అంతర్జాతీయ స్థాయిలో ఆడే ఆటగాళ్ల మధ్య వైరుధ్యాలు ఉత్పన్నమవుతాయి. ఇది మహిళా క్రికెట్ అభివృద్ధికి విఘాతం కలిగిస్తుంది అని మిథాలి వ్యాఖ్యానించింది. ఈ ఇంటర్వ్యూలో మిథాలితో పాటు పేసర్ జులన్ గోస్వామి కూడా పాల్గొంది. మిథాలి అన్న వ్యాఖ్యలకు గోస్వామీ కూడా మద్దతు తెలిపింది. 'మిథాలి వ్యాఖ్యలు ప్రాక్టికల్‌గా ఉన్నాయి. దేశీయంగా ఆటగాళ్లను వెలికితీసి మహిళా క్రికెటర్లతో కూడిన బలమైన టీంల ఏర్పాటు అనంతరమే ఐపీఎల్ టోర్నీకి అర్థముంటుంది' అని జులన్ వ్యాఖ్యానించింది.

ది ఫ్యూచర్ కబడ్డీ హీరోస్ కార్యక్రమం

హైదరాబాద్: దేశీయ క్రీడ కబడ్డీని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడ్డ నేపథ్యంలో.. పలు ప్రైవేట్ సంస్థలు కూడా ఈ క్రీడ అభివృద్ధికి ముందుకు వస్తున్నాయి. 'ది ఫ్యూచర్ కబడ్డీ హీరోస్' (ఎఫ్‌కెహెచ్) పేర మాషల్ ప్రేవేట్ లిమిటెడ్, ఎకెఎఫ్‌ఐలు రూపొందించిన ఈ కార్యక్రమం మాధ్యమంగా ఔత్సాహిక క్రీడాకారులను వెలుగులోకి తెస్తోంది. ఇందుకోసం విశాఖపట్నం, హైదరాబాద్‌లో రెండు రోజుల ట్రయల్స్‌ను నిర్వహిస్తోంది. ఇప్పటికే వందల మంది కబడ్డీ క్రీడాకారులు ఈ శిభిరంలో పాలుపంచుకునేందుకు ముందుకు వచ్చారు. వీరి నుంచి వడపోత ప్రక్రియ ద్వారా ప్రతిభగల ఆటగాళ్లను ఎంపికచేసి వివో ప్రో కబడ్డీ సీజన్-6 వేలం ప్రక్రియలో వారికి అవకాశం కల్పించనున్నారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో భారత క్రీడా ప్రాధికార శిక్షకుడు జైవీర్ శర్మ, ఆంధ్ర ప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ గౌరవ కార్యదర్శి వీర లంకయ్య దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు.



ముంబై: గల్ఫ్ ఆయిల్ లూబ్రికెంట్ ఇండియా లిమిటెడ్ సంస్థ బ్రాండ్ అంబాసడర్‌గా నియమితుడైన ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యాతో సంస్థ ఉపాధ్యక్షుడు నాగేంద్ర పాయ్, కంపెనీకి ఇప్పటికే అంబాసడర్‌గా వ్యవహరిస్తున్న భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీతో కలిసివున్న దృశ్యం

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.





ఆర్తులకు అభయం!

సామాజిక సేవలో రఘుబాబు గుంటూరు

దేశ, విదేశాల వ్యాపారానికి సంబంధించిన అంశాలను సెట్ చేయడంలో ఆయనకు అపార అనుభవం.. ఎన్నో కార్పోరేట్ సంస్థలకు న్యాయ సలహాలు ఇస్తుంటారు. ఆర్ అండ్ ఏ అసోషియేట్స్ అనే న్యాయసంస్థ కో- ఫౌండర్, భాగస్వామి... అలాగే సమిష్టి లీగల్ అనే న్యాయసంస్థ కో-ఫౌండర్ మరియు మెంటర్.. ఉదయం, సాయంత్రం ఊపిరాడని పని ఒత్తిడి..అయినా.. ఆ మాటలో ..ఆ మనసులో సామాజిక స్పృహ....సమాజానికి తన వంతు సేవచేయాలనే తపన..అందుకు తగ్గ నిబద్ధత.. అలాగని మేమేదో సేవచేస్తున్నామని చెప్పుకోవడం ఇష్టం ఉండని వ్యక్తిత్వం. ఆయనే ...అభయ ఫౌండేషన్ ట్రస్టీ రఘుబాబు గుంటూరు. సమాజానికి సేవచేయడం అంటే ..మాలోని మానవత్వాన్ని మేమే తట్టి లేపుకోవడమే కానీ, గొప్ప పనులు చేస్తున్నట్లు కాదంటారు రఘుబాబు గుంటూరు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పరిధిలోని కొండ్రపోల్ గ్రామానికి చెందిన రఘుబాబు...చదువుకుంది ప్రభుత్వ పాఠశాలలో! వృత్తి రీత్యా టీచర్ అయిన తన తండ్రి నుంచి అలవడిన క్ర మశిక్షణ... సామాజిక స్పృహతో ..ఎదిగారు. నిత్యం క్షణం తీరిక లేని పనులతో సమతమయ్యే రఘుబాబు.. అభయ ఫౌండేషన్ ద్వారా తన సమాజసేవను కొనసాగిస్తున్నారు. అంత బిజీ షెడ్యూల్‌లో సమాజా సేవా కార్యక్రమాలు ఎలా సాధ్యం? అదే విషయాన్ని ఆంధ్రప్రభ లైఫ్ ఆయనను ప్ర శ్నించింది. వివిరాలు ఆయన మాటల్లోనే..!

మనసుంటే మార్గం ఉంటుంది

మనిషి సంఘ జీవి.. అందుకే మనతోపాటు ..మన చుట్టూ ఉన్న వాళ్లు కూడా హాయిగా ఉంటేనే..మనం హాయిగా ఉన్నట్లు... అవసరం ఉన్న చోట...మన వంతు సాయం చేయడం అనేది సాటి మనుషులుగా మన బాధ్యత. నేను అదే చేస్తున్నాను...అంతే! టైం అంటారా.. మనసుంటే మార్గం ఉంటుంది..నాకు సమాజానికి సేవచేయాలనే తపన ఉంది.. ఆ తపనే మార్గం చూపింది. అభయ ఫౌండేషన్ ద్వారా సమాజ సేవ చేయగల్గుతున్నాను. మన కంటే



ముందు తరం వాళ్లు.....ఉద్యోగస్తులైతే రిటైర్ అయిన తర్వాత...వ్యాపార ఇతర రంగాలకు చెందిన వారయితే... కృష్ణా రామా అనుకునే వయస్సులో సమాజ సేవకు పూనుకునే వారు. అయితే ప్రస్తుతం ట్రెండ్ మారింది. మనం సంపాదించుకునే దాంట్లోనే మనకు తోచినంత సాయం చేయాలనే సామాజికస్పృహ యూత్‌లో వచ్చింది. రోజులో ఎంతో కొంత సమయాన్ని సామాజిక సేవకు కేటాయిస్తున్నారు.

ఆయనే స్ఫూర్తి

నేను నా సామాజిక సేవగురించి చెప్పాలంటే అభయ ఫౌండేషన్ గురించి చెప్పాలి. అంతకన్నా ముందు దాని ఫౌండర్ బాలచంద్ర సుంకు గురించి మాట్లాడాలి. ఆయనది కంపెనీ సెక్రెటరీ హోదా. 20 సంవత్సరాల అనుభవం. ఆయన తన జీవితాన్నే అభయ ఫౌండేషన్ కోసం త్యాగం చేశారు. యుక్తవయస్సు నుంచే ఆయన సామాజిక సేవలో ఉన్నారు. పెళ్లి చేసుకుంటే కుటుంబం అడ్డువస్తుందని పెళ్లి చేసుకోకుండా అభయకు జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి. వృత్తి రీత్యా ఇద్దరిది ఒకే ఫీల్డ్ కాబట్టి, ఆయనను చూసే నేను స్ఫూర్తి పొందానని చెప్పాలి.

హృదయపూర్వకంగా సేవ

సేవ చేయడం అనేది హృదయపూర్వకంగా ఉండాలి. సర్వ్ విత్ హార్ట్ (హెచ్ .ఇ.ఏ.ఆర్.టి)..అనేది అభయ ఫౌండేషన్ నినాదం..విధానం కూడా! హెచ్...అంటే హెల్త్ కేర్, ఇ..అంటే ఎడ్యుకేషన్ ఏ.. అంటే అవేర్ నెస్, ఆర్....అంటే రూరల్ డెవలప్ మెంట్, టీ..అంటే ట్రాన్స్‌ఫార్మేషన్ (పరివర్తన) అనే ..ఐదు మూల సిద్ధాంతాలతో ముందుకు సాగుతోంది అభయ!

హెల్త్ కేర్

ఆరోగ్యమే మహాభాగ్యం.. సరైన ఆరోగ్య సేవలు అందక దేశంలో వేలాది మంది మృత్యువాత పడుతున్నారు. అందుకే పేద రోగులకు అభయ హస్తం అందిస్తున్నాము. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నాము. క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, ప్రమాధాల్లో గాయపడిన వారికి అభయ అండగా నిలుస్తోంది.అభయాన్‌లు(అభయ వాలెంటీర్లు) ఇలాంటి వారి విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తారు. వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక స్థోమత లేని పేద రోగులు, అభయను ఆశ్రయిస్తే.. వారికి వైద్య సేవలు అందిస్తున్నాము.

విద్యతోనే సమాజంలో మార్పు

సమాజంలో మనం కోరుకున్న మార్పు సాధ్యం కావాలంటే విద్య ద్వారానే సాధ్యమని అభయ ఫౌండేషన్ విశ్వాసం. అందుకే ప్ర జల్లో విద్య పట్ల అవగాహన కల్పిస్తున్నాము. ఏపీలోని తూర్పుగోదావరి, అనంతపురం జిల్లాలో 400మంది విద్యార్థులకు ఉచితంగా విద్య అందిస్తున్నాము. వారికి భోజనం, బట్టలు, పుస్తకాలు, ఇతర సౌకర్యాలన్నీ అభయ కల్పిస్తోంది. ఉన్నత విద్యకోసం ఆర్థిక స్థోమత లేని వారికి సాయం చేస్తున్నాము. కాకపోతే వారికి సాయం పొందే అర్హత ఉందాలేదా అని నిర్ధారించుకున్న తర్వాతే సాయం చేస్తాము. సుమ అనే అమ్మాయికి ఇంజనీరింగ్ చదివేందుకు అభయ ఆర్థిక సాయం చేసింది. చదువు పూర్తికాగానే ఇన్‌ఫోసిస్‌లో జాబ్ వచ్చింది. అప్పటి నుంచి ఆమె అభయకు తనవంతు విరాళం అందిస్తోంది. వాలెంటీర్‌గా సేవలు చేస్తోంది. ఇబ్రహీం పట్నంలో నిర్మించిన అభయ హ్యాపీ హోం ప్రాజెక్టును రెడీ చేసింది సుమే. బెంగళూరులో ఆటో రాజా అనే వ్యక్తి ఒక్కడే 400 మంది నిరాశ్రయులు,రోగులు అనాధలను చేరదీసిన కథనం చదివిన తర్వాత సుమ స్పందించి, ఇబ్రహీం పట్నం ప్రాజెక్టుకు ప్రాణం పోసిందనే చెప్పాలి.

అవగాహన

ప్రభుత్వ పథకాలు, విద్య, ఆరోగ్యం,పరిశుభ్రత, పారిశుధ్యం తదతర అంశాలపై అటు గ్రామీణ,ఇటు పట్టణ ప్రాంతాల ప్రజలకు అవగాహం కల్పిస్తున్నాము. ముఖ్యంగా ఈ అవగాహన అనేది ప్రాథమిక స్థాయిలోనే కల్పించాలనే లక్ష్యంతో ముందుకు పోతున్నాము. పాఠశాలలు, కళాశాలల్లో సమావేశాలు నిర్వహిస్తున్నాము. అభయ వాలెంటీర్లు ఈ విషయంలో చాలా చురుకుగా కదులుతారు. ఈ



కార్యక్రమం ద్వారా లక్షలాది మందికి దగ్గరయ్యే అవకాశం లభిస్తోంది.

గోదుమగూడ గ్రామం దత్తత

మనది గ్రామీణ భారతం. అం దుకే అభయ రూరల్ డెవలప్ మెంట్ పై అధిక శ్రద్ధ తీసుకుంటుంది., అందులోభాగంగా రాజేంద్రనగర్ పరిధిలోని గోదుమగూడ గ్రామాన్ని దత్తత తీసుకున్నాము. యువత, మహిళల స్వయం ఉపాధికోసం కార్యక్రమాలు చేపడుతున్నాము. ఒక డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు చేశాము. మహిళలకు టైలరింగ్, ఎంబ్రాయిడరీలో శిక్షణ ఇప్పిస్తున్నాము. శిక్షణ పూర్తి అయిన తర్వాత సబ్సిడీ మీద కుట్టుమిషన్లు అందజేశాము. ఇప్పటి వరకు 500 మంది వరకు లబ్ధిపొందారు. అలాగే హైదరాబాద్, సికింద్రాబాద్, కరీంనగర్‌లలో శిక్షణా కేంద్రాలు నిర్వహిస్తున్నాము.

అభయ హోమ్ ఆఫ్ హ్యాపీనెస్

అభయ ఫౌండేషన్ స్థాపించిన మరో ప్రిస్టేజియస్ ప్రాజెక్టు అభయ హోమ్ ఆఫ్ హ్యాపీనెస్. ఇది ఇబ్రహీం పట్నం సమీపంలో ఉంది. రెండెకరాల స్థలంలో ఏర్పాటు చేశాము. నిరాశ్రయులకు మేమున్నామనే హోప్ ఇవ్వడం దీని లక్ష్యం. హై ద రా బా ద్ ,దాని పరిసర ప్రాంతాలలోని వేలాది మంది నిరాశ్రయులు,నిర్భాగ్యులు, అనాథ పిల్లలు, ఏ దిక్కులేని వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్నాము. గ్రామీణ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకోసం..అభయ లైఫ్ స్కిల్ సెంటర్‌ను ఏర్పాటు చేశాము. ఈ ప్రాజెక్టు ద్వారా అభయ-హుండాయ్ డ్రైవింగ్ స్కూల్, అభయ-ఎన్‌ఏసీ ట్రైనింగ్ సెంటర్, అభయ సీసీఎల్ కమ్యూనికేషన్ స్కిల్స్ ను ఏర్పాటు చేసి, నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి మార్గాలు చూపుతున్నాము. మహిళల కోసం వృత్తి శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నాము. టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జూట్ బ్యాగ్స్ తయారీలో మహిళలకు శిక్షణ ఇస్తున్నాము.

యూత్‌కు లైఫ్ స్కిల్స్

మన దేశంలో యూత్‌కు కొరతలేదు. కాకపోతే వారికి సరైన మార్గదర్శనం దొరకక పెడదారి పడుతున్నారు. అందుకే యూత్‌కు లైఫ్ స్కిల్స్‌లో శిక్షణ ఇచ్చి ..వారిని యువ పారిశ్రామిక వేత్తలుగా తీర్చి దిద్దాలన్నదే నా ఆశయం. అందుకు ఇప్పుడు కేటాయిస్తున్న సమయం సరిపోదు। అందుకే భవిష్యత్తులో వారికోసం మరింత సయం కేటాయించాలనుకుంటున్నా. ఇక నేను చదువుకున్న కొండ్రపోల్ ప్రభుత్వ పాఠశాలకు వసతుల కల్పన కోసం నాకు చేతనయినంత ఆర్థిక సాయం చేశాను. ఇక ముందు చేస్తాను. అలాగైనా జన్మభూమి రుణం కొంతైనా తీరుతుందని భావిస్తున్నా!

- చొల్లేటి వేంకటేశ్వరా చారి



మన జీవనశైలి... పిచ్చుకపై బ్రహ్మాస్త్రం!

నగరానికి రావే... నేస్తమా!

ఒక చిన్న పుల్లలో, గింజనో, పురుగునో పట్టుకుని రివ్వు రివ్వున...ఇళ్లల్లో వసారాల్లో కట్టుకున్న తమ గూళ్లలోకి వచ్చిపోయే పిచ్చుకలు...ఇప్పుడు మన కళ్లకు కనిపించడంలేదు. గడ్డి తాటాకు ఇళ్లు తగ్గిపోయాక గ్రామాల్లోనే పిచ్చుకల ఆచూకీ తగ్గిపోయింది. ఇక నగరాల సంగతి చెప్పేదేముంది....పిచ్చుకలను నేటి పిల్లలు కేవలం పుస్తకాల్లోనే చూస్తున్న పరిస్థితి. మనల్ని పలకరించవు...మనం పిలిస్తే పలకవు...మనతో వాటికెలాంటి సంబంధం లేదు...అయినా సరే పిచ్చుక మనకో ఆత్మీయ నేస్తమే. ఎందుకంటే...ఇతర పక్షుల్లా కాకుండా మనుషులతో జతకట్టి బతికే బుల్లి పక్షులు ఇవి. ఒకటికాదు, రెండుకాదు పదివేల సంవత్సరాలుగా అవి మనుషులతోనే కలిసి బతుకుతున్నాయనేది ఒక అంచనా. అందుకే ఇప్పటిపిల్లలలకు పిచ్చుకలు తెలియకపోయినా...పిచ్చుక మాట వినగానే చాలామంది పెద్దలు...పిల్లలైపోతారు..తమ చిన్ననాటి జ్ఞాపకాల్లోకి వెళ్లిపోతారు. కంటికి అరుదుగా మాత్రమే కనిపిస్తున్న పిచ్చుకలను ఇప్పుడు మనం తరచుగా గుర్తు చేసుకుంటున్నాం. వాటికి నచ్చేలా మన జీవితాలను మార్చుకుందామని ప్రయత్నాలు కూడా చేస్తున్నాం. ఇంతకీ పిచ్చుకలకు మనపై అలక ఏమిటి...ఎందుకు మనవైపు రావటం లేదు..అనే ప్రశ్న వేసుకుంటే చాలా సమాధానాలు కనబడతాయి. సాధారణంగా చిన్న లక్ష్యం కోసం పెద్ద ప్రయత్నాలను చేసేటప్పుడు ఎందుకంతగా...పిచ్చుకపై బ్రహ్మాస్త్రం అన్నట్టుగా... అంటూ ఉంటాం. అయితే ఇప్పుడు మాత్రం నిజంగానే... పిచ్చుకలపై... అవికోలుకోలేనంతగా మన జీవనశైలి... అనే బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగిస్తున్నాం. అయినా తిరిగి మనమే...రావమ్మా చిన్ననాటి నేస్తమా అని పిలుస్తున్నాం. అయితే ఈ చిన్నిప్రాణులు నగరాల వరకు రావాలంటే...మన జీవితాల్లో చేసుకోవాల్సిన మార్పులు కొన్ని ఉన్నాయి-

పిచ్చుకలు జీవించాలంటే సురక్షితమైన ఒక గూడు కావాలి. వాటి బుల్లిపొట్ట పట్టేంత ఆహారం దొరకాలి. మరి అలాంటి పరిస్థితి ఇప్పుడు నగరాల్లో ఎక్కడ ఉంది. గత యాభై అరవై ఏళ్లుగా పిచ్చుకలు నగరాల్లో కనిపించడమే లేదు. ఇష్టంలేని వాతావరణంలో ఇమిడి...అడ్జస్ట్ అయి.. ఎలాగోలా బతికేద్దాం... అనుకోవడానికి అవి మనుషులు కాదు కదా. తమకి నచ్చని, సరిప డని వాతావరణంలో పక్షులు జంతువులు ఉండవు. అందుకే పిచ్చుకలు మనుషులతో పాటు వలస రాలేదు. అవి మనం లేకుండానే జీవించడానికి అలవాటు పడ్డాయి. కానీ మాత్రం వాటిని రారమ్మని పిలుస్తూనే ఉన్నాం. వాటికోసం ప్రత్యేక దినోత్సవాలను సైతం జరుపుకుంటున్నాం. ఢిల్లీ అయితే ఇళ్లలో పెరిగే పిచ్చుకను రాష్ట్రపక్షిగా ఎంపిక చేసింది. ఇంతకీ ఇవి నగరాలకి రాకుండా ఎందుకు మొహం చాటేస్తున్నాయి...అనే ప్రశ్న వేసుకుంటే అనేక సమాధానాలు కనబడతాయి.



పచ్చని ఆకులు లేవు...ధాన్యం పురుగులూ లేవు

రణగొణధ్వనులు, వాతావరణ కాలుష్యాలతో నిండిపోయిన పట్టణాలు నగరాలు మన జీవితాలకే ప్రశాంతత లేకుండా చేస్తున్నాయి. ఇక ఆ బుల్లి పిట్టలు ఏం తట్టుకుంటాయి. పిచ్చుకలు చాలావరకు ధాన్యాన్ని, భూమిపై మొక్కల మధ్య తిరిగే చిన్నపాటి పురుగులను తిని బతుకుతాయి. అంటే వాటికి మొక్కలు కావాలి. ముఖ్యంగా కూరగాయల మొక్కలు ఉన్నపుడు వాటికోసం వచ్చే పురుగులు క్రిమి కీటకాలు... పిచ్చుకలకు ఆహారంగా మారుతుం టాయి. అందుకే ఇవి కొన్ని వందల వేల ఏళ్లుగా మనుషులను నమ్ముకునే జీవిస్తున్నాయి. కానీ నగరాల్లోని బిల్డింగుల్లో మొక్కల పెంపకం, కూరగాయల తోటలు, వాటి కోసం వచ్చే పురుగుపుట్రా.. ఇవన్నీ ఎక్కడ.. అందుకే పిచ్చుకలు మనల్ని వదిలేశాయి. దోమలు ఈగలు బొద్దింకలు... ఇలాంటివేమీ చేరని ఇళ్లకోసం మనం రకరకాల రసాయన మందులను వాడుతున్నాం. ఇవన్నీ పిచ్చుకలకు ఆహారాన్నే లేకుండా చేయడమూ ఒక కారణమే. అలాగే ఏసిల కోసం పిచ్చుకలు దూరని ఏర్పాట్లు ఇంటికి చేసుకుంటున్నాం. ఎంత విశాలమైన ఇల్లు కట్టుకున్నా...ఇక్కడో రెండు పిచ్చుకలు ఉండవచ్చు..అనేలాంటి ప్రదేశాలు నగరాల్లోని ఇళ్లకు ఉండటం లేదు. ఇక్కడ అంగుళం స్థలం కూడా అపురూపమే మరి. ఇక ఇలాంటి పరిస్థితుల్లో పిచ్చుకలు ఏ ఇంటికి వస్తాయి.

రణగొణధ్వనులు...కాలుష్యం...రేడియేషన్...

నగరాల్లో వాహనాల ధ్వనులు, అవి విడుదల చేసే పొగ, కలుషితాలను గురించి చెప్పేదేముంది. ఇవి చాలవన్నట్టు ఇప్పుడు మన చుట్టూ సెల్‌ఫోన్ టవర్లు వాటి నుండి వచ్చే ఎలక్ట్రో మ్యాగ్నటిక్ తరంగాలు. ఇంటా బయటా అదే వాతావరణం. ఇవన్నీ మనిషికి పిచ్చుకను దూరం చేస్తున్నాయి. అయితే సెల్‌ఫోన్ రేడియేషన్లకంటే ముందే పిచ్చుకలు నగరాలను వదిలేయటం మొదలుపెట్టాయి. 1962లోనే సైలెంట్ స్ప్రింగ్ అనే పుస్తకంలో దాని రచయిత్రి రాచెల్ కార్సన్ ఈ విషయం గురించి హెచ్చరించింది. ఈ పుస్తకం అనేక అవార్డులను సొంతం చేసుకుంది. 1939 నుండి మనం పురుగులను చంపే మందులను విచక్షణ, అవగాహన లేకుండా వాడుతున్నామని...అవి పురుగులనే కాకుండా...ప్రత్యక్షంగా పరోక్షంగా మన జీవితాలే నాశనం చేస్తున్నాయని...రాచెల్ పేర్కొంది.

అంతరించడం లేదు...ఆవాసాలు మార్చుతున్నాయి

పిచ్చుకలను అంతరించిపోతున్న జాతిగా పేర్కొంటున్న సందర్భాలు ఉండగా...అవి అంతరించి పోవటం లేదని...అవి తమకు సురక్షితంగా ఉండే స్థలాలకు వలస పోతున్నాయని...రాచెల్ కార్సన్ అంటున్నారు. అవి ఇళ్లను వదిలి మార్కెట్లు, పోర్టులు, రైల్వేస్టేషన్లు...ఇలా తమకు దగ్గర్లోని ప్రాంతాలకు పోతున్నాయని...ఆ సమీపంలోనే గూళ్లు కట్టుకుంటున్నాయని రాచెల్ తన పుస్తకంలో పేర్కొన్నారు. పిచ్చుకలు...తమ చుట్టూ ఉన్న మార్పులకు అనుగుణంగా తమ నివాసాలను ఆహారాన్ని మార్చుకుంటూ బతికేస్తాయనే అభిప్రాయం కొంతమంది నిపుణుల్లో ఉంది. ఏదిఏమైనా...భూమిమీద జీవులన్నీ అంతరించి పోతుండగా...మనిషి మాత్రం...విడాకులు తీసుకున్న తల్లిదండ్రుల బిడ్డలా... ఒంటరిగా మిగిలిపోతాడని హార్వర్డ్ యూనివర్శిటీ జీవవైవిధ్య నిపుణుడు ఎడ్వర్డ్ ఓ విల్సన్ హెచ్చరిస్తున్నారు.

మళ్లీ పిచ్చుక మనల్ని చేరేదెలా...


- ☆ పిచ్చుకలు తిరిగి రావాలంటే ఇంటికి ఎంతో కొంత పెరడు ఉండాల్సిందే. వాటికి ఆహారం నీరు ఉండటానికి గూడు...అన్నీ ఇక్కడినుండే లభిస్తాయి.
- ☆ పిచ్చుకలు ముఖ్యంగా గింజలు, ధాన్యపు ఆహారాన్ని ఎక్కువగా తింటాయి. పురుగులు క్రిములు లాంటివి వీటికి గింజల తరువాతే. అందుకే విత్తనాలు ఉండే పూల చెట్లు, గడ్డిని పెరటితోటలో వేస్తే పిచ్చుకలకు అది సహజ ఆహారంగా పనికొస్తుంది. సజ్జలు రాగులు జొన్నలు సన్‌ఫ్లవర్ గింజలు లాంటివాటిని నేరుగా నేలమీద చల్లినా, లేదా అవి తినడానికి వీలుగా ఉండే ట్రేల్లో పోసి ఉంచినా పిచ్చుకలకు ఆహారంగా పనికొస్తుంది. అలాగే కాస్త పొదల్లా ఉండే చెట్లను పెంచితే అవి గూడు కట్టుకునేందుకు ఉపయోగపడతాయి.
- ☆ అవి తాగేందుకు స్నానం చేసేందుకు వీలుగా నీళ్లను ఏర్పాటు చేయాలి.
- ☆ పిచ్చుకలు తమకు ఏ మాత్రం రక్షణ లేదనిపించినా...అక్కడి నుండి వెళ్లిపోతాయి. అవి నివాసం ఉంటున్న ప్రాంతంలో అవి స్వేచ్ఛగా తిరిగేలా...ఎలాంటి ఆటంకాలు లేకుండా చూసుకోవాలి. పిల్లలు, పెంపుడు కుక్కల వలన అవి భయానికి గురికాకుండా చూసుకోవాలి.
- ☆ పిచ్చుకలు గూళ్లు పెట్టుకునేందుకు గడ్డి, పుల్లలు, సన్నని తాళ్లవంటివి వాడుతుంటాయి. అలాంటివాటిని వాటికి అందుబాటులో ఉండేలా చేయాలి. నిజంగా పిచ్చుకలు రావాలి...కావాలి...అనుకుంటే ఈ జాగ్రత్తలను తీసుకోవాల్సిందే మరి.

✍ వి.దుర్గాంబ

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

మౌనముద్ర



శ్రీరమణాశ్రమం
3-9-47

అన్నా,

ఈ మధ్యాహ్నం మూడింటికి భగవాన్ సన్నిధికి వెళ్లాను. ఇష్టాగోష్ఠిగా సంభాషణ జరుగుతున్నది. ప్రసంగవశంగా భగవాన్ ''శంకరులు దక్షిణామూర్తి అష్టకం మూడు భాగాలుగా విభజించి వ్రాశారు''అని లోగడ చెప్పినట్టే చెప్పి,, ''శంకరులు దక్షిణా మూర్తిని స్తోత్రం చేయాలని సంకల్పించారు. మౌనాన్ని ఏమని స్తుతిస్తారు. అందువల్ల సృష్టి, స్థితి లయాలను విభజించి చెప్పి, వీటన్నిటికీ విలక్షణమైన దక్షిణా మూర్తికి నమస్కరిస్తాను, అని చెప్పారు. అంతకంటే మౌనాన్ని స్తుతించేదెట్లా?'' అన్నారు భగవాన్.

ఒక భక్తుడందుకొని ''పూర్వం, ఒక శివరాత్రినాడు భక్తులంతా భగవానుని చుట్టూ చేరి 'ఈనాడు భగవాన్ దక్షిణామూర్తి అష్టకానికి అర్థం చెప్పాలి' అని కూర్చుంటే, భగవాన్ మందహాసంతో మాట్లాడకుండా ఊరుకున్నారనీ, వారంతా కొంతసేపు చూచి ఈ మౌనమే మనకు కూడా బోధ కాబోలని అనుకుంటూ లేచి వెళ్లారనీ దండపాణిస్వామి చెప్పారు. నిజమేనా?'' అన్నారు. భగవాన్ చిరునవ్వుతో ''ఊ-నిజమే'' అన్నారు. నాకు ఆశ్చర్యం కలిగి ''భగవాన్ మౌన వ్యాఖ్యానం చేశారా?'' అన్నాను. ''ఔను. మౌన వ్యాఖ్యానమే'' అన్నారు భగవాన్.

ఇంకొకరు ''మౌనం అంటే ఆత్మస్ఫూర్తియేగదా?'' అన్నారు. ''అవునండీ, ఆత్మస్ఫూర్తి లేనిది మౌనమేలాగవుతుంది?'' అన్నారు భగవాన్. ''అదే నేనడుగుతూ వున్నాను. ఆ ఆత్మస్ఫూర్తిని చెందక నోరుమూసుకొని మాట్లాడకుండా ఉన్నంత మాత్రాన మౌనం అవుతుందా?'' అన్నారు వారు. ''అదెట్లా పొసగుతుంది. కొందరు, మౌనం, మౌనం అంటూ కాగితం మీదనో, పలకమీదనో, వ్రాసి చూపుతారు. 'అదంతా వ్యవహారం కాదా యేమి?''అన్నారు భగవాన్. ''అయితే, వాఙ్మౌనం వల్ల ప్రయోజనమే లేదా?''అని ప్రశ్నించారు మరొకరు. ''బాహ్య ప్రతిబంధక నివారణార్థం వాఙ్మౌనం అవలంబించినా, అదే యథార్థమౌనమని అనరాదు. మౌనమంటే ఎడతెగని భాషన్నమాట. దాన్ని పొందటం అనేది లేదు. సదాఉండేదే. మరుగుపరిచే విషయవృత్తులను తోసివేయాలి గాని, దాన్ని పొందడానికి ప్రయత్నం అనవసరం ''అని సెలవిచ్చారు భగవాన్.

ఇంతలో భగవాన్ మాట్లాడే ధ్వని రికార్డు చేసుకోవాలని ఒక రేడియో కంపెనీ వారు యోచిస్తున్నారన్న గాలి వార్త వచ్చింది. భగవాన్ నవ్వుతూ ''ఓహో! అట్లాగా, నామాట మౌనమే గదా, మౌనాన్ని ఏవిధంగా రికార్డు చేస్తారబ్బా? ఉన్నది మౌనమేనాయె. దాన్ని రికార్డు చేయడం ఎవరి వశం?'' అన్నారు. సభ్యులంతా ఒకరివంక ఒకరు చూచుకుంటూ ఊరుకున్నారు. హాలంతా నిశ్శబ్దమయింది. దక్షిణామూర్తి స్వరూపులయిన భగవాన్ దక్షిణాభిముఖంగా కూర్చుని, మౌనముద్ర ధరించారు. ఆత్మజ్యోతి ప్రకాశం వెల్లివిరిసిందా అన్నట్లు దేదీప్యమానమైన కాంతితో విరాజిల్లుతూ ఉన్నది ఆ మూర్తి. **'స్వాత్మారామం ముదిత వదనం దక్షిణామూర్తి మీడే'** నేడెంత సుదినమో!

సెలవు
సోదరి
- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

దినఫలాలు

మేష రాశి: పనులలో శ్రమ తగ్గుతుంది. ఆరోగ్యంలో అనుకూల మార్పులు చేకూరుతాయి. ఆర్థిక చిక్కులు మెల్లమెల్లగా పరిష్కరింపబడతాయి. శత్రుభీతి తగ్గుతుంది.

వృషభ రాశి: అనుకూల పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. ప్రయాణాల ద్వారా అనుకూలత ఉంటుంది. ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు పొందుతారు. కుటుంబ వ్యవహారాల్లో సమస్యలు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు.

మిథున రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు కలసి వస్తాయి. మానసిక ధైర్యం తగ్గుతుంది. ఆర్థిక అవమాన పరిస్థితులు కొనసాగుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గతంలోని ఒప్పులు ఇప్పుడు తప్పులుగా మారతాయి. అధిక ప్రయత్నాలతో ఆదాయ పరంగా అనుకూల పరిస్థితులు ఉంటాయి.

కర్కాటక రాశి: దూరప్రయాణాలు కలసి వస్తాయి. అభివృద్ధి కుటుంబరీత్యా ఆనందాన్ని కలిగిస్తుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. ఆలోచనదోషాల ద్వారా సమస్యలు, అవమానాలు ఉంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆదాయ మార్గాలు అనుకూలం.

సింహ రాశి: ఆర్థిక ప్రయత్నాలు అనుకూలం. వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం పర్వాలేదు. ఆర్థిక విషయాల్లో సులువుగా అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో ఆశాజనకమైన వాతావరణం ఉంటుంది.

కన్యా రాశి: ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆహ్లాద పరిస్థితులు గృహ రీత్యా ఉంటాయి. సంబంధ, బాంధవ్యాల విషయంలో మనస్పర్థలు చోటు చేసుకుంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు కొనసాగుతాయి. ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి

తులారాశి: విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. కళారంగంలో ప్రతిభ గుర్తించబడుతుంది. ముఖ్యమైన పనులలో జాప్యాలు కొనసాగుతాయి. ఆరోగ్యంలో అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

వృశ్చిక రాశి: వ్యాపార ఒప్పందాలు అనుకూలం. ఉద్యోగ వ్యవహారాల్లో ఆశించిన ఫలితాలు లభిస్తాయి. మానసిక చిరాకులు తగ్గుతాయి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. చేపట్టే కార్యాలలో వేగం తగ్గుతుంది. ఆదాయంలో అనుకూల/ప్రతికూలతలు ఉంటాయి.

ధనూ రాశి: ఉద్యోగ వ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆదాయంలో ప్రతికూలత ఉంటుంది. వేగంగా నిర్ణయాలు తీసుకోలేకపోతారు. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. గతంలోని పొరపాట్లు సరిదిద్దుకోగలుగుతారు. కుటుంబ వ్యవహారాల్లో ఆచితూచి వ్యవహరించాలి.

మకర రాశి: ఆరోగ్య రీత్యా అనుకూలత ఉంటుంది. విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. ఆదాయానికి అనుకూల పరిస్థితులు ఉంటాయి. సంబంధ బాంధవ్యాలు మెరుగవుతాయి. ఆర్థిక వ్యవహారాలు అనుకూలం.

కుంభరాశి: సంబంధ బాంధవ్యాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గృహకార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. ఆరోగ్య క్రమశిక్షణ తప్పనిసరి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. వ్యాపార అనుకూలత ఉంటుంది.

మీనరాశి: విద్యా ప్రయత్నాలు అనుకూలం. నూతన స్నేహాలు అనుకూలిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆరోగ్య ఖర్చులు తగ్గుతాయి. కోర్టు వ్యవహారాల్లో అనుకూలత ఉంటుంది. ఆదాయంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

మంచి ఆరోగ్యానికి పఠించవలసిన మంత్రం

ధర్మం-మర్మం

ఓం భూతభవనాయ నమః (లేదా) ఓం మహాధన్వంతరాయ నమః

మంత్ర జప విధానం

ప్రాతఃకాలమునే లేచి స్నానాదులు ముగించుకుని పరిశుద్ధమైన వస్త్రాలు ధరించి నుదుటన తిలకాన్ని దిద్దుకుని పూజా మందిరంలో దీపారాధన చేసి తమ నిత్య కృత్యములైన సంధ్యావందనాది కార్యక్రమా లను ముగించుకుని నిశ్చలమైన. పరిశుద్ధమైన మనస్సుతో తమ శక్తికి అనుగుణంగా మంత్రాన్ని జపించాలి.




- డా॥ కందాడై రామానుజాచార్య

కాల స్వరూప దిక్సూచి

కాలచక్రం

జ్యోతిష శాస్త్రాన్ని తెలుసుకోవాలంటే ముందుగా కాలాన్ని అధ్యయనం చేయాలి. కాల స్వరూపాన్ని తెలుసుకోవాలి. కాలాన్ని తెలుసుకోవడానికి మన వైదిక సంప్రదాయం అనుసరించేపద్ధతిని తెలుసుకోవాలి. మనం ఇప్పుడు కాలాన్ని తెలుసుకోవడానికి పాశ్చాత్య పద్ధతిని వాడుతున్నాం. వైదిక సంప్రదాయంలో కాలాన్ని తెలుసుకోవడానికి విశ్వ కాలచక్రాన్ని తెలుసుకోవాలి.



జ్యోతిష శాస్త్రం అన్ని శాస్త్రాల కంటె అతి పురాతనమైనది. అనాది కాలం నుంచి ఈ శాస్త్రం ఉంది. జ్యోతిషానికి అతి ముఖ్యం 'కాలం'. ఈ కాలాన్ని నిర్ణయించడానికి రాశులు, గ్రహాలు, నక్షత్రాల సంయోగాన్ని ఉపయోగిస్తారు. దేశ కాల పరిస్థితులకు అనుగుణంగా జ్యోతిష శాస్త్ర ఫలాన్ని తెలుసుకోవచ్చు. కాలానుగుణంగా జరిగే సమస్త క్రియల అధ్యయనానికి జ్యోతిష శాస్త్రం చాలా ఉపయోగపడుతుంది.

జ్యోతిష శాస్త్రాన్ని తెలుసుకోవాలంటే ముందుగా కాలాన్ని అధ్య యనం చేయాలి. కాల స్వరూపాన్ని తెలుసుకోవాలి. కాలాన్ని తెలుసు కోవడానికి మన వైదిక సంప్రదాయం అనుసరించే పద్ధతిని తెలుసు కోవాలి. మనం ఇప్పుడు కాలాన్ని తెలుసుకోవడానికి పాశ్చాత్య పద్ధతిని వాడుతున్నాం. వైదిక సంప్రదాయంలో కాలాన్ని తెలుసు కోవడానికి విశ్వ కాలచక్రాన్ని తెలుసుకోవాలి. జ్యోతిష శాస్త్రంలో మనం పరిగణనలోకి తీసుకునే 7 గ్రహాలు (రెండు ఛాయా గ్రహాలను మినహాయిస్తే), 12 రాశులు, 27 నక్షత్రాలు, కాలాన్ని తెలిపే కాలమాన యంత్రంలోని భాగాలు. మొత్తం ప్రపంచం లోనివారు కాలాన్ని తెలుసుకునే ఒక సాధనంగా (విశ్వ గడియారంగా) ఈ కాలచక్రం పని చేస్తుంది. మన గృహాలలోని గడియారాలు, కేలండర్లు బట్టి గంటలు, నిముషాలు, రోజులు, వారాలు, నెలలు తెలుసుకోవచ్చును. కాలచక్రం కాల విభజన ఈ విధంగా ఉంటుంది.

2 1/2 విఘడియలు ఒక నిముషం
ఒక ఘడియ 24 నిముషాలు
2 1/2ఘడియలు ఒక గంట
హోర (24 గంటలు) అంటే ఒక రోజు
వారాలు 7
ఒక పగలు ఒక రాత్రి కలిసి 1 దినం
15 దినాలు ఒక పక్షం
2 పక్షాలు ఒక మాసం
2 మాసాలు ఒక ఋతువు
6 ఋతువులు ఒక సంవత్సరం
3 ఋతువులు ఒక అయనం
6 ఋతువులు ఉత్తరాయనం, దక్షిణాయనం
మానవుల ఒక నెల పితృదేవతలకు ఒక దినం
మానవుల ఒక సంవత్సరం దేవతలకు ఒక దినం
యుగాలు కృత, త్రేతా, ద్వాపర, కలి యుగాలు
మన్వంతరాలు
కల్పాలు

కాల ప్రభావం

కాల ప్రభావం ఈ విధంగా ఉంటుంది. నక్షత్రాలు, సూర్యుడు మొదలుకుని భూమి మీది ప్రతి చిన్న జీవి వరకూ కాలం వల్లనే ఉనికిని కలిగి ఉన్నాయి. నిద్ర, కల, మెలకువ అనేవి కాలం వల్ల దేహంలో కలిగే భ్రాంతి స్వరూపాలే. నిద్ర, కల, మెలకువ లేకుండా ఏ జీవి ఉండదు. సత్వ రజస్తమో గుణాలు కూడా కాలం మీదనే ఆధారపడి ఉంటాయి. కాలం కలిసి రాకపోతే మూల ప్రకృతి కూడా ఏమీ చేయలేదు. అతి పెద్ద పరిమాణము కలది అలాగే అతి సూక్ష్మమైనది కాలం. అందువల్లనే కాలాన్ని జ్ఞానం ద్వారా మాత్రమే జయించాల్సి ఉంటుంది.

స్థూలమైన పంచభూతాలమీద, అవి కనిపించే ఆకార వికారాలమీద కాల ప్రభావం ఎంతో గొప్పగా ఉంది. శైశవం, బాల్యం, యౌవనం, కౌమారం, వృద్ధాప్యం, మరణం అన్నీ కాలం వల్ల కలిగే భ్రాంతులే.

కాల మహిమ

కాల మహిమ విస్తృతమైనది. మంత్రం, ఔషధం, ఫలించడానికి పట్టే సమయం కాలానికి లోబడి ఉంటుంది. పద్మాలు, కలువలు కాలాన్ని అనుసరించి వికసిస్తాయి. చెట్లు, చేమలు పుష్పించి, ఫలించేందుకు పట్టే సమయం, పక్షులు, జంతువులు . ఎదకు రావడం, విత్తనం అంకురించడం, మొక్కలు పెరగటం, బాలింతకు పాలు పడటం, పోవటం, జనన మరణాలు ఇవన్నీ కాల మహిమ (కాలాధీనం). సుఖ దుఃఖాలు కాలం గడిచిన కొద్దీ తరిగిపోయి, మానిపోతాయి. భోగం కాలా నుగుణమైనా, ప్రాప్తిగాని అప్రాప్తిగాని ఇస్తుంది. ఏదీ స్థిరం కాదు. ఎప్పుడు ఏమి సంభవించినా దానిని అనుభవించక తప్పదు. సృష్టిస్థితి లయాలు కాలప్రభావాన్ని బట్టి సంభవిస్తాయి. నిర్వికల్ప బ్రహ్మ సృష్టి సంకల్పాన్నెరుగుట కాలమహిమ. కర్మ చక్రం, కాల చక్రానికి లోబడి ఉంటుంది. సూర్యాస్తమయాలు, గ్రహగతులు, పంచాంగాలు అన్నీ కాల నియమాన్ని అనుసరించి ఉంటాయి. గడిచిన కాలం తిరిగి తీసుకుని రాలేము. భవిష్యత్తును ముందే రప్పించలేము. కాల గమనాన్ని ఆప లేము. వర్తమాన క్షణాన్ని నిలపలేము. ఒకరికి తక్కువగా అనిపించే కాలం, మరొ కరికి ఎక్కువగా అనిపించవచ్చు. ఇది కాలానికి సంబంధించి సాపేక్షమైన అనుభవం. మనో వేగాన్ని బట్టి కాల అకాల అనుభవాలుంటాయి. మనస్సు నశిస్తే కాలమే లేదు.


యుగాలు, కల్పాలు గడచిపోతే యుగాన్ని బట్టి ధర్మాలు మారిపోతుంటాయి. ఆధునిక కాలంలో కాలానికి విలువ కట్టి వ్యాపారాలు చేస్తుంటారు. పంచాంగం ద్వారా కాలానికి సంబంధించిన ఫలితాలు తెలుసుకోవచ్చు. ఉదాహరణకు శుభ ముహూర్త కాలం, రాహుకాలం, గుళికకాలం, యమ గండ కాలం, గ్రహ కాలం మొదలైనవి.

మహాకాళి

కాలం అనగా 'కదిలేది'. కదిలేది, కదిలించేది ఒక మహాశక్తి. ఈ మహాశక్తి కాల స్వరూపిణి. ఈ శక్తినే మహాకాళి అంటారు. ఈమె కాలానికి అధిదేవత. ఈ దేవత బాహ్య రూపమే భూత వర్తమాన భవిష్యత్తులు. ఈ కాలాధిదేవతల ద్వారా కాలాన్ని అందుకుని ఆ దేవత అనుగ్రహాన్ని పొందాలి. అప్పుడు అన్ని శభాలు కలుగుతాయి.

- శ్రీ హయగ్రీవ జ్యోతిష పరిశోధనా కేంద్రం
9949514583

భగవద్గీత



చంద్రలోకం చేరినా తిరిగి రావలసిందే!

అధ్యాయం 8,
శ్లోకం 25

ధూమో రాత్రిస్తథా కృష్ణః
షణ్మాసా దక్షిణాయనమ్।
తత్ర చాంద్రమసం జ్యోతిః
యోగీ ప్రాప్య నివర్తతే॥

తాత్పర్యం

ధూమమునందు, రాత్రియందు, కృష్ణపక్షమందు, సూర్యుడు దక్షిణముగా ప్రయాణించు దక్షిణాయన సమయము నందు మరణించు యోగి చంద్రలోకమును పొందినను మరల వెనుకకు తిరిగివచ్చును.

భాష్యం

మనకు శ్రీమద్భాగవతము మూడవ స్కందము నందు కపిల భగవానుడు చంద్రమండలము గురించి అనేక వివరాలను తెలియజేసినాడు. ఎవరైతే కర్మకాండలు, యజ్ఞములను దక్షతతో నిర్వహిస్తారో, వారు మాత్రమే చంద్రలోకాన్ని చేరుకుంటారని, అక్కడ వారు పదివేల సంవత్సరములు జీవిస్తారని చివరకు తిరిగి ఈ భూమిపై జన్మిస్తారని వివరించబడినది. దీనిని బట్టి చంద్రలోకములో ఉన్నత జీవులు ఉన్నారని వారు మన భౌతిక ఇంద్రియాలకు గోచరించరని అర్థం అవుతుంది.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

విశేషాల ద్వారకా తిరుమలేశుడు



వేంకటేశ్వరుని దివ్యధామం తిరుమల. అయితే ద్వారకా తిరుమల అనే పేరుతో ఆంధ్రప్రదేశ్ పశ్చిమ గోదావరి జిల్లాలో ఒక పుణ్య క్షేత్రం ఉంది. దీనిని చిన్న తిరుపతి అని అక్కడివారు పిలుస్తుంటారు. ఇక్కడ విశేషం ఏమంటే స్వామి పాదాలు లేకుండా వెలిశాడు. అందునా దక్షిణాభిముఖుడై ఉంటాడు. అంతేకాక ఒక విమాన శిఖరం కింద రెండు విగ్రహాలుంటాయి. ద్వారకుడనే భక్తుని చేత ఈ దివ్య క్షేత్రం వెలుగులోకి వచ్చింది. కాబట్టి దీనికి ద్వారకా తిరుమల అనే పేరు సార్థకమైంది. కృష్ణా, గోదావరీ నదుల మధ్య ప్రాంతంలో గల ఒక నగరంలో ద్వారకుడనే బ్రాహ్మణుడు, అతని భార్య జీవించేవారు. అతను సదాచార సంపన్నుడై కాలం గడిపేవాడు. వారు తరచుగా తిరుమల వెళ్ళడం, రావడం చేసేవారు. అదే విధంగా ఒకసారి కాలి నడకన వారు వెడుతుండగా దాహం వేసింది. దగ్గర నీళ్ళు లేవు. భార్య తల్లడిల్లిపోయింది. ఏమి చేయాలో తోచని సమయంలో ధోవతి ధరించి , శరీరంపై 12 చోట్ల విభూతి ఊర్ధ్వ పుండ్రాలుగా ధరించిన బ్రాహ్మణుడు ఒక రాగి చెంబులో నీరు తీసుకొచ్చి ద్వారకునికి ఇచ్చాడు. వారు పరమానందభరితులై చూస్తూండగానే ఆ బ్రాహ్మణుడు వేంకటేశ్వరునిగా తన నిజ రూపం ధరించి, వారిని ఆశీర్వదించి 'మీ భక్తికి మెచ్చాను. ఏమి కావాలో కోరుకో'మన్నాడు. వారు తమకు ఆయన నిత్య సేవాభాగ్యం ఇమ్మని కోరారు. ఆయన వారికి ఆ వరాన్ని అనుగ్రహిస్తానని చెప్పి, 'భక్తులారా! మీ స్వగ్రామమైన ద్వారకా పురాన్ని చుట్టి అనంత అనే కొండ ఉంది. దానిపై నేను త్రేతాయుగంలోనే వెలిసాను. కారణాంతరాల వల్ల అర్చామూర్తులు పూజాదికాలకు దూరమై ఉన్నాయి. ఆ మూర్తులు ఇప్పుడొక పుట్టలో ఉన్నాయి. అనంత గిరిపై ఉన్న అరణ్యంలోనికి గరుడుడు పక్షిరూపంలో వచ్చి ఒక చెట్టుపై వాలతాడు. ఆ చెట్టు సమీపంలో ఉన్న పుట్టలోనే నా ఉనికిని గుర్తించవచ్చు. నీ భక్తికి మెచ్చి నేను నా కళలను ఉద్ధరిస్తాను. నన్ను శేషాచలంలో అర్చించిన వారికి ఏ పుణ్యం కలుగుతుందో, అదే పుణ్యం అనంతాచలంలో పూజించిన వారికీ కలుగుతుంది. కనుక మీరు, ఇతర భక్తులు నన్ను అనంతాచలంపై అర్చించి తరిస్తారు' అని చెప్పి అదృశ్యమయ్యాడు. దంపతులు స్వగ్రామం చేరి 'గోవింద, గోవింద' అంటూ అరణ్యంలో వెతకనారంభించారు. ఇంతలో గరుడ పక్షి వచ్చి ఒక కుంకుడు చెట్టుపై వాలింది. దానితో వారు ఆ చుట్టుపక్కల దేవుని మూర్తికై వెతకసాగారు. కాని దొరకలేదు. ఈ లోగా చెట్టుకు ఈశాన్యభాగంలో ఉన్నానని వారికి ఒక కంఠం వినబడింది. వారు కొంత మందిని తీసుకొచ్చి అక్కడ పుట్టను తవ్వగా ముందు స్వామి కిరీటం, తదుపరి ఆయన వదనం, కుండలాలతో కూడిన కర్ణద్వయం, భుజాలు, విశాల వక్షస్థలం, ఉదరం, కటి, తొడలు, జంఘాలు కనబడ్డాయి. కాని పాదాలు కాన రాలేదు. అయితే దంపతులు ఇదేమిటని మళ్ళీ దేవ దేవుని ప్రార్థించగా. ఆయన,'భక్తులారా! నా పాదాలు పాతాళ వాసి అయిన బలిచక్రవర్తి ఆరాధనలో ఉన్నాయి. అతడు వాటిని వదలడు కనుక మీరు ఈ మూర్తినే ఆరాధించండి. పూర్తి ఫలితం పొందగలరు' అని పలికాడు. ద్వారకుడు ఆ విగ్రహానికి పూజలు చేస్తూ ఉత్సవాలు జరిపించాడు. భక్త శ్రేష్ఠుడైన ద్వారకుడు స్వామిని సేవిస్తూ సిరిసంపదలు, ధనధాన్యాలు, పుత్ర పౌత్రులతో భక్తి, జ్ఞానములు కలిగి జీవించి అంతమున వేంకటేశ్వరుని పరమ పదము పొందాడు. అప్పటి నుంచి ద్వారకుని పేరు మీద ఆ క్షేత్రం ద్వారకా తిరుమలగా పిలువబడుతోంది. కాగా 400 సంవత్సరాల క్రితం తిరుమల నుంచి వేంకటేశ్వరుని సంపూర్ణ విగ్రహాన్ని కూడా తెచ్చి ఈ ఆలయంలో అదే వేదికపై ప్రతిష్ఠించారు. రెండు విగ్రహాలు భక్తులకు దర్శనమిస్తుంటాయి.

- 'లక్ష్మణరేఖ' గోపాలకృష్ణ
9493053206





మొదటి మహిళ

మంచుఖండంలో మన 'మణి' పూస!

చలికాలంలో కొంచెం చలి పెరిగితేనే రగ్గులు కప్పుకుని, రూమ్‌లో హీటర్లు పెట్టుకుని, స్వెట్టర్లు వేసుకుని తిరుగుతూ జీవనం సాగిస్తుంటాం. ఆ కాలం ఎప్పటికి అయిపోతుందా అని ఎదురుచూస్తుంటాం. అలాంటిది - 90డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న ప్రాంతంలో రోజుల తరబడి ఉండాలంటే ఎవరైనా హడలి చస్తారు. కాని ఆమె అలాంటి పరిస్థితులలో ఏకంగా 403 రోజులు జీవనం సాగించింది. అంటార్కిటికా మంచు ఖండంలో సుదీర్ఘకాలం గడిపిన తొలి మహిళా శాస్త్రవేత్తగా పేరు సంపాదించుకుంది. ఆమే మంగళమణి.



అంటార్కిటికాలో 403రోజులు నివసించిన తొలి మహిళా శాస్త్రవేత్త మంగళమణి. ఆమె మన తెలుగు మహిళ కావడం మనందరికీ గర్వకారణం. ఆమె వయసు 56 సంవత్సరాలు. జీవితంలో ఇదే ఆమెకు మొదటి సుదీర్ఘ యాత్ర. ఇంతకు ముందు ఆమెకు ఇటువంటి యాత్రల విషయంలో ఎలాంటి అనుభవం లేదు. అయినా మనోధైర్యంతో ముందుకు కదిలి మంచుఖండంలో అన్ని రోజులు పరిశోధనలు సాగించి ఆరోగ్యవంతంగా తిరిగి వచ్చారు. ఆమెలోని ఆత్మస్థైర్యాన్ని చూస్తే ఎవరైనా స్ఫూర్తి పొందాల్సిందే.

ప్రపంచంలో అతి శీతల ప్రాంతమైన అంటార్కిటికా ఉష్ణోగ్రత మైనస్ 90డిగ్రీల సెల్సియస్ ఉంటుంది. అటువంటి ప్రాంతంలో ఒక్కరోజు ఉండడమే చాలా కష్టం. అటువంటిది ఆమె 403రోజులు ఉండడం సాధారణ విషయం కాదు. భారతి రీసెర్చ్ స్టేషన్‌లో పరిశోధనలు చేయడానికి 23మంది సభ్యులతో కూడిన ఒక బృందం అంటార్కిటికా యాత్రకు 2016 నవంబర్‌లో బయలుదేరింది. అందులో ఆమె కూడా ఉంది. చైనా, రష్యా దేశాలకు చెందిన బృందాలు కూడా అక్కడ పరిశోధనలు చేస్తున్నాయి. అన్ని టీమ్‌లలోనూ ఆమె ఒక్కరే మహిళ!

''అంటార్కిటికా మిషన్ చాలా ప్రమాదాలతో కూడుకున్నది. అక్కడ వాతావరణం మనకు ప్రతికూలమే. మేము రీసెర్చ్ స్టేషన్ నుండి బయటకు వెళ్లినప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకుని బయటకు వెళ్లేవాళ్లం. పోలార్ క్లాతింగ్ వేసుకుని వెళ్లేవాళ్లం. రెండు మూడు గంటలు బయట ఉంటే ఆ చలికి తట్టుకోలేక వెనక్కు వచ్చి వేడి వాతావరణంలో కూర్చునేవాళ్లం. మా టీమ్ సభ్యులు నా యాత్రలో నాకు బాగా సహకరించారు. మాకు ఇరువైపుల నుంచి సహాయ సహకారాలు ఎప్పటికప్పుడు అందేవి. ప్రతీ విషయం చాలా సున్నితంగానే ఉండేది. మా టీమ్ సభ్యులు నా పుట్టినరోజుని ఎర్త్ స్టేషన్‌లో జరపడం నేను మరిచిపోలేని విషయం'' అని ఎంతో ఆనందంతో ఆమె చెబుతున్నారు.

ఈ పర్యటనకి వాళ్లు ఎంపికయినప్పుడు ఆ సభ్యులందరినీ శారీరకంగా, మానసికంగా ఎన్నో వారాలు పరీక్షించారు. ఢిల్లీలోని ఎయిమ్స్‌లో ముందు మెడికల్ చెకప్‌లను పూర్తిచేశారు. చాలా కాలం చలిలో ఉండడానికి వారి శరీరతీరు ఎలా ఉంటుందనే అంశం మీద వారికి చేయాల్సిన పరీక్షలన్నీ చేశారు. ఆ తరువాత రెండు వారాలు ఆ టీమ్‌ను ఉత్తరాఖండ్ చామౌలి జిల్లాలోని అలి అనే ప్రాంతానికి తీసుకువెళ్లారు. అక్కడ 9000అడుగుల మంచు పర్వతం ఉంది. ఆ తరువాత బద్రీనాథ్ 10వేల అడుగులపైన ఉంది. ఇక్కడ ఉండడం ముందుగా అలవాటు చేశారు. ఆ తరువాత టీమ్ సభ్యులందరితో పెద్ద పెద్ద కొండల మీదకు బరువైన లగేజీ బ్యాగులతో ట్రెక్కింగ్ ప్రాక్టీసు చేయించేవారు. అలా చేయడం వల్ల వారి శారీరక పరిస్థితి ఏవిధంగా ఉంటుందనేది తెలుసుకోగలమని ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు తెలిపారు.

అంటార్కిటికా వైపు మా పయనం ప్రారంభమైంది. మగవారు బలిష్టంగా ఉంటారు. వారికి శారీరిక బలమెక్కువ. కాని మహిళ మానసికంగా దృఢంగా ఉంటుంది. మహిళలందరూ ధైర్యంగా ఉంటూ అభివృద్ధి వైపు తమ అడుగులు ముందుకు వేయాలని ఆమె పిలుపునిస్తుంది.

''మంగళమణి ఎల్లప్పుడూ కొత్త విషయాలు తెలుసుకోవాలని, తను ఏర్పరచుకున్న లక్ష్యాలు సాధించాలనే తపనతో ఉండేదని, తనకంటూ అవకాశం వస్తే దానిని తప్పకుండా రుజువు చేయాలని తపన పడేది. ఆమె అంటార్కిటికాల్లో ప్రదర్శించిన నైపుణ్యాన్ని చూసి పార్లమెంటులోని ఉభయసభలూ స్పందించాయి. మహిళ ధైర్యంగా ముందుకు అడుగు వేస్తే విజయానికి మార్గాలు వాటంతటవే తెరుచుకుంటాయి'' అని ఆమె బాస్ నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవిఎన్ కృష్ణమూర్తి అన్నారు. భారతి టీమ్‌లో ఆమె పని ఏమిటంటే 10 నుండి 14 కక్ష్యలను చూస్తూ వాటిని పరిశీలన చేయాలి. శాటిలైట్ సేకరించిన డేటాను వినియోగదారులకు పంపించాలి.

అంటార్కిటికాలో ఆమె అనుభవాలు ఆమె మాటల్లోనే...

ఈ రంగంలోకి రావడానికి గల మోటివేషన్ ఏమిటి?

నా చిన్నతనంలో ఏదైనా సమాచారాన్ని పేపర్లు, రేడియోల ద్వారా తెలుసుకోగలిగేవాళ్లం. ఎక్కువగా స్కూలు లేదా ఇంటిలో ఉన్న విషయాల పట్ల ప్రభావితులయ్యేవాళ్లం. మేము ఆరుగురం సంతానం. అందరిలో నేనే పెద్దదాన్ని. చదువు విషయంలో నా తల్లిదండ్రులు నన్ను బాగా ప్రోత్సహించేవారు. ఇతర కళల పట్ల కూడా ఆసక్తిని కల్పించేవారు. నేను చదువుకున్న స్కూల్ హోలీ మేరీ గర్ల్స్ హై స్కూల్, సైఫాబాద్. వాళ్లు చాలా చక్కని విద్యను అందించారు. జీవితంలో పాటించాల్సిన నీతులు, విలువలను తెలియజేసేవారు. మంచి మనిషిగా జీవితం కొనసాగిస్తూ సమాజానికి ఎంతో కొంత సేవ చేయాలని మా అమ్మానాన్న చెప్పేవారు. అదే నా మెదడులో బాగా ముద్రవేసుకుంది. ఆ వయసులోనే నేను ఏవిధంగా ఈదేశానికి సేవలందించగలనా అని ఆలోచించడం మొదలుపెట్టాను. నాకు చిన్నప్పటి నుంచి జాగ్రఫీ అంటే చాలా ఇష్టం. అందుకనే ఇంజనీరింగ్, టెక్నికల్ ప్రొఫెషన్‌లోకైనా వెళ్లామని నిర్ణయించుకున్నాను. అనుకోకుండా ఒకరోజు న్యూస్‌పేపర్‌లో నాసా నుంచి వెళ్లిన ఒక శాటిలైట్ గురించి చదివాను. అప్పటి నుండి నా ప్రయాణం స్పేస్‌లోకి ఎప్పుడా అని ఆలోచిస్తూ ఆ దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టాను. ఈలోగా మసాబ్‌ట్యాంక్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ''మోడల్ డిప్లమా ఫర్ టెక్నీషియన్స్-రేడియో అపార్చస్''లో సీటొచ్చింది. నాలుగు సంవత్సరాల కోర్సును మొదలు పెట్టాను. అందులో ఒక సెమిస్టర్‌లో నాకు ట్రెయినింగ్ హెచ్ఎఎల్‌లో లేదా ఇసిఐఎల్‌లో ప్రాజెక్ట్ వర్క్ ఉంటుంది. మా బ్యాచ్‌లో ఎనభై మంది విద్యార్థులుండేవాళ్లం. అందులో నేను ఒక్కదాన్నే అమ్మాయిని. మా ముందు బ్యాచ్‌వాళ్లు ఈ కంపెనీలలోనే ఉన్నారని తెలిసి చాలా సంతోష పడ్డాను. వారి సహాయ సహకారాలు నాకు ఎప్పుడూ అందుతుండేవి. ఆ కోర్సు అయిపోయాక నా కలలసాకారం కోసం ఇస్రోలో జాయిన్ అయ్యాను.

కాలేజ్ నుంచి కలల లోకంలోకి అడుగుపెట్టినప్పుడు ఎలా అనిపించింది?

ఇది అంత సున్నితమైనది కాదు. నా డిప్లొమా అయిపోయాక హెచ్ఎఎల్ బాలానగర్‌లో ఉన్న కంపెనీలో అప్రెంటీస్‌షిప్ కోసం చేరాను. అక్కడ నుండి నేను షార్/ఇస్రోకి మానాన్నగారితో కలిసి ఇంటర్వ్యూకి వెళ్లాను. మూడువారాలలో నాకు అపాయింట్‌మెంట్ ఆర్డర్ వచ్చింది. అది చూడగానే చాలా ఆశ్చర్యపోయాను. నా సంతోషానికి అవధుల్లేవు. కాని మా తల్లిదండ్రులు అక్కడకు పంపడానికి ఆలోచిస్తుండగా, మా అంకుల్ డిఎస్‌పిగా పనిచేస్తు న్నారు. ఆయన ఇంటికి వచ్చి అమ్మాయిని అక్కడకు పంపించడానికి ఏమీ సంకోచించవద్దని, అక్కడ ఎటువంటి ఇబ్బందీ ఉండదని, వచ్చిన అవకాశాన్ని చేజార్చుకోవద్దని సలహా ఇచ్చారు. ఆయన సలహాతో మా తల్లిదండ్రులు ఒప్పుకున్నారు. నేను ఇస్రోలో అడుగుపెట్టాను. అప్పటి నుండి నా సుదీర్ఘ ప్రయాణం సాగుతూనే ఉంది. ఇప్పుడు నేను నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, షాద్‌నగర్‌లో పనిచేస్తున్నాను. ఇక్కడ భూమికి సంబంధించిన విషయాలను శాటిలైట్ ద్వారా సేకరిస్తారు. నేను అక్కడ పనిచేయడంతో నా కోరిక, నాకు తెలిసిన విజ్ఞానంతో దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకు రావాలనే ఆశయం రెండూ నెరవేరాయి.

రీసెర్చ్ విభాగంలో కావలసిన వస్తువులు ఏమిటి?

మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ వాటిమీద చాలా నాలెడ్జ్ ఉండాలి. ఇవన్నీ ఇంజనీరింగ్ అయినా, మెడికల్ వృత్తికైనా అవసరమే. చాలా వృత్తులలో పరిశోధనలలో ఎక్కువగా అంతరిక్షం, వాతావరణం, సముద్రం, భూమి, కంప్యూటర్స్, నెట్‌వర్క్స్, ఆస్ట్రానమీ, ఆర్కియాలజీ, జియోలజీ మొదల గునవి అవసరం. అంతరిక్షపరిశోధనకు కూడా ఇవన్నీ తపనిసరిగా కావలసినవే.

ఎక్కువ మంది మహిళల ప్రవేశం ఈ రంగానికి అవసరమా?

మహిళ ప్రతిరంగంలోనూ అభివృద్ధి పథంలో నడుస్తుంది. ఏ అవకాశాన్నైనా అందిపుచ్చుకొనే విధంగా మహిళ ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి. తెలివితేటలు ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చు. ధైర్యంగా ప్రతి మహిళ తమకు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలి.

ఈ పర్యటనకు మీరు ఎంపికయ్యారని తెలిసినప్పుడు మీ ఫీలింగ్ ఏమిటి?

నాకు చాలా ఆశ్చర్యం, ఆనందం కలిగింది. నేను ఏమీ ఆలోచించకుండా ఓకె చెప్పేశాను. అక్కడ పరిస్థితులు ఎలా ఉంటాయి ఏమిటనేవి ఏదీ ఆలోచించలేదు. అతి శీతల ప్రాంతమైన ప్రదేశానికి నేను వెళ్లి ఉండబోతున్నానని తెలిసి ఎంతో ఉత్సాహం కలిగింది. ఇంతకు ముందు నేనెప్పుడూ ఇలాంటి ప్రదేశాలలో ఉండలేదు, చూడలేదు. ఇదే మొదటిసారి. ఇదే నాకు కలిగిన సరికొత్త అనుభవం.

అంటార్కిటికాలో మీ మొదటి అనుభవం ఏమిటి?

చుట్టూ దట్టమైన మంచుఖండంలో మధ్య శ్వాస తీసుకోవడం చాలా బాగుంటుంది. సౌత్ ఆఫ్రికా కేప్‌టౌన్ నుండి బయలుదేరినప్పుడు విమానం మంచు ఖండంలో ఎలా దిగుతుందా అని నాకు ఆశ్చర్యం కలిగింది. కాని చుట్టూ మంచు ఆకృతులను చూస్తుంటే ఎంతో ఆనందం కలిగేది.

మీరు అక్కడ వాతావరణానికి అలవాటు పడటానికి ఎంత సమయం పట్టింది?

అక్కడి వాతావరణం, చుట్టుపక్కల పరిసరాలు, అలవాటు చేసుకోవడానికి పదిహేను రోజులు పట్టింది. ముందుగానే పరిశుభ్రతకు కావలసిన వస్తువులను తెచ్చుకున్నాం. మేము తిన్న ఆహారం, గ్లాసులు, ప్లాస్టిక్, కార్డుబోర్డు, పేపర్ ఏదైనా సరే తిరిగి తీసుకెళ్లే విధంగా భద్రపరచడానికి ఒక టిన్ తీసుకువచ్చాం.

రోజువారీ కార్యక్రమాలు ఏమిటి?

రోజూ మేమందరం సమావేశం పెట్టుకునేవాళ్లం. ఆ సమయంలో మా పని గురించి చర్చించుకునేవాళ్లం. కొంతమందికి ప్రత్యేక అధికార విధులు ఉండేవి. మేము కూడా స్టేషన్‌కి కావలసిన మెయిన్‌టెయిన్స్ ఏమిటనేవి చూసుకుంటూ ఉండేవాళ్లం. దీనిని పరిశుభ్రంగా ఉంచే బాధ్యత పర్యటనకు వచ్చిన ప్రతి వ్యక్తిమీద ఉంది. కొంతమంది రాత్రి విధులు కాకుండా పొద్దున్నపూట కిచెన్ విధులను చేసేవాళ్లం.



ఇదంతా మీ పనిలోకే వస్తుందా?

ఇక్కడ ఏది చేసినా నేర్చుకున్నట్టే. నేను ఇక్కడకు వచ్చాకే ఎగ్‌లెస్ కేక్‌ను మైక్రోవేవ్‌లో తయారుచేయడం నేర్చుకున్నాను. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మా అమ్మ కోసం ఒక పిల్లో కవర్‌ను ఇక్కడే కుట్టాను. ప్రత్యేకమైన పండుగలు, తేదీలు మేమందరం ఎంతో ఉత్సాహంగా సెలబ్రేట్ చేసుకునేవాళ్లం. మా అందరి మధ్య పోటీ కూడా ఉండేది. క్రీడారంగంలో ఇండియా, చైనీస్, రష్యన్ స్టేషన్స్ మధ్య గట్టి పోటీ ఉండేది. అందరూ చాలా బాగా ఎంజాయ్ చేసేవాళ్లం.

ఇంటి గురించి దిగులు అనిపించలేదా?

ఏమీ లేదు కాని. ఎప్పుడు ఇండియాకి వెళ్తామో ఎవరికీ తెలిసేది కాదు. వైవిఎన్ కృష్ణమూర్తి (డిప్యూటీ డైరెక్టర్) మా జీవనం గురించి అడిగేవారు. మా రిలీవర్స్ రాకపోతే మేము వెళ్లడానికి లేదు. వాతావరణం ఎప్పటికప్పుడు మారిపోతుండేది. వాతావరణం మూడు స్టేషన్లలో చాలా మంచిగా ఉండేది. మేము బయలుదేరిన ప్రాంతం భారతి, రీ ఫ్యూయిలింగ్ చేసిన ప్రాంతం మైత్రి, ఎక్కడైతే దిగామో కేప్‌టౌన్. ఇవి తప్ప అన్నీ గందరగోళ ప్రాంతాలే. ఎనిమిది గంటల్లో 2800కిలోమీటర్లు తీసుకెళ్లే ఫీడర్ ఫ్లయిట్‌ను తీసుకున్నాం. దీనిలో 1500కేజీల బరువు పడుతుంది. దీనిమీదే మేమందరం అక్కడికి చేరుకున్నాం.

మీరు అక్కడ ఎటువంటి ఆహారం తీసుకున్నారు?

మేము అందరూ తినే ఆహారమే తీసుకునేవాళ్లం. రైస్, దాల్, విటమిన్లు, రోటీలు, ఫ్రోజెన్ ఫిష్, మటన్, చికెన్, ప్రాన్స్, కాయ గూరలు. మామూలుగా అయితే ఒక పడవలో సంవత్సరానికి సరి పడే ఈ ప్రొవిజన్స్‌ను తీసుకెళ్లేవాళ్లం. కాని కూరగాయలు, పాలు రెండు, మూడు నెలలు మాత్రమే పనికివస్తాయి. గుడ్లను 5,6 నెలలకు సరిపడా తీసుకున్నాం. ఆ తరువాత కండెన్స్‌డ్ పాలు, పౌడర్ పాలు వాడాం. డబ్బాలో సీజ్ చేసి పండ్లను వాడుకునే వాళ్లం. పచ్చళ్లను తినేవాళ్లం. బ్రెడ్, బటర్ జామ్, ఓట్స్, మొక్క జొన్న కూడా తిన్నాం. అందరం ఆరోగ్యంగానే ఉన్నాం. టీమ్‌లో ప్రతి ఒక్కరూ నాకు సహకరించి నాకు ప్రాధాన్యం ఇచ్చేవారు. మా అందరి మధ్య వాతావరణం ఎప్పుడూ ప్రశాంతంగానే ఉండేది.



లేడీ లెజెండ్స్

ఆదర్శం... ఆటో నారాయణమ్మ!

హైదరాబాద్ నిజాంపేట్‌లో నివసిస్తున్న కడపకు చెందిన నారాయణమ్మ కుటుంబ పోషణ భారం తనపై వేసుకుని, ఆటో నడుపుతూ నెలకు యాభై వేల రూపాయలు సంపాదిస్తోంది. కొడుకుని BTech కూతురిని MPharmacy చదివిస్తోంది. మహిళవై ఉండి ఆటో నడుపుతున్నావు నీకు ప్రయాణికుల వల్ల ఇబ్బంది లేదా అంటే... ఎందుకు భయం మనుషుల మధ్య బతుకుతున్నాము, అడవిలో జంతువులు మధ్య కాదు కదా భయపడటానికి అంటారు..ధైర్యంగా! అదీ సమాజం పట్ల ఆమెకున్న నమ్మకం..తన శక్తిమీద తనకున్న విశ్వాసం. ఆమె ఆటో నడుపుకుంటూ కుటుంబ భారాన్ని మోస్తున్న తీరు అందరి మన్ననలు పొందుతోంది. మరో నలుగురికి ఆటో నేర్పించాను, భర్త వదిలేసాడనో, చనిపోయాడనో కృంగిపోకుండా తమకు తెలిసిన ఏదో ఒక పని చేసుకుని ధైర్యంగా బతకాలని సాటి మహిళలకు నారాయణమ్మ ధైర్యం నూరిపోస్తుంటారు. అంతే కాకుండా కుటుంబ పోషణకు మహిళలు ఆర్థికంగా అండగా నిలబడాలని సూచిస్తారు. అందుకే నారాయణమ్మలోని సాహస గుణాన్ని తెలుసుకున్న ట్యూటర్ ప్రైడ్ తామిచ్చే LADY LEGENDS ACCOLADES AWARD కు నామినేట్ చేసింది.

అ అంటే అమ్మ! అమ్మ అంటే బాబీలహరి!!

మానవులలో వ్యత్యాసం మహా అయితే శారీరక బలం, మేధోసంపత్తి. కానీ, స్త్రీ పురుషులలో చూసుకుంటే అమ్మతనమే స్త్రీలను ప్రత్యేకమైన వారిగా నిలబెడుతుంది.

ఎన్నో త్యాగాలు చేసి, కష్టాలకు ఓర్చి ఒక తల్లి తన బిడ్డను సాకుతుంది. కొన్ని సందర్భాల్లో కన్న ప్రేమ, తల్లిప్రేమ ముందు విధి కూడా తలవంచుకు వెళ్లాల్సిందే. బాబీ లహరి అలియాస్ క్రిస్టినా నాయుడు జీవితంలో జరిగిన సంఘటనలు అమ్మ ప్రేమ గొప్పతనాన్ని లోకానికి చాటాయి. ఒక ఆసుపత్రి వారి నిర్లక్ష్యం వల్ల క్రిస్టినా నాయుడు కన్న ప్రేగు విలవిలలాడింది. సమయానికి సరైన వైద్యం అందక, పుట్టిన పాప అనేక శారీరక లోపాలకు గురై కంటి చూపుతో పాటు శారీరక పరిపక్వత కోల్పోయింది. ఆ సమ యంలో ఆ పసిగుడ్డుని వదిలించుకోవాలనే కుటుంబ సభ్యుల అభ్యర్థనను తిరస్కరించి కన్న ప్రేమను కాపాడుకోవడం కోసం అందరికీ దూరమై, ఆ చిన్నారిని అల్లారు ముద్దుగా ప్రాణం గా పెంచు కుంటున్నారు. ఈ సమాజంలో స్త్రీ బ్రతకాలంటే అన్నిటినీ ఎదుర్కొనే మనోధైర్యం కావాలి. లహరి గారి తండ్రి వారి పిల్లలకు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ ఇచ్చారు. డిప్లమో చేసి, మోడలింగ్‌లో ప్రవేశించారు. క్రమేణ హిందీ సీరియల్స్ లో నటించే అవకాశాలు దక్కాయి. ఇప్పుడు అనేక తెలుగు సీరియల్స్‌లో చేస్తున్నారు. అంతఃపురం సీరియల్‌కిగాను వీరికి ఉత్తమ ప్రతినాయకిగా నంది అవార్డ్ గెలుచుకున్నారు. అంతే కాకుండా, తెలుగు సీరియల్స్‌లో తెలుగువారికే ఎక్కువ అవకాశం ఇవ్వాలని పోరాటం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రతిఘటన అనే సీరియల్ చేస్తున్నారు, నిన్న వారిని సెట్స్ లో కలవటం జరిగింది. మహిళా సాధికారత పై తనకున్న అభిప్రాయం చాలా చక్కగా చెప్పారు. అందుకే ఆమెలోని అమ్మను గుర్తించిన ట్యూటర్ ప్రైడ్ తామిచ్చే LADYLEGENDSACCOLADES AWARD కు నామినేట్ చేసింది.



జాగీర్‌దార్ల వంశం.. కూచిపూడికి దాసోవాం!



పుట్టింది జాగీర్‌దార్ వంశం ..అయినా కళలంటే ఎంతో ఇష్టం..ముఖ్యంగా కూచిపూడి నృత్యం అంటే ప్రాణం. వృత్తి రీత్యా డ్యాన్స్ టీచర్. ప్రవృత్తి మాత్రం ప్రజాసేవ. ఆమె డాక్టర్ వనజా ఉదయ్. ఆమె ముత్తాత రాజా రఘురాం ఠాకూర్. నిజాం ఆస్థానంలో న్యాయ సలహాదారు. పాతబస్తీలోని కిషన్ బాగ్ గుడిని కట్టించింది ఆయనే. తండ్రి హరి వందన్ లాల్ ఎక్సైజ్ విభాగంలో అదనపు కమిషనర్ పనిచేసి రిటైర్ అయ్యారు. తల్లి కళావతి. ఆమెకే కాదు ఆమె కుటుంబానికే కళలపట్ల అభిమానం ఎక్కువ. దీంతో వనజకు చిన్నప్పట్నుంచి నృత్య కళలపై ఆసక్తి పెరిగింది. గురువులు మహతి లక్ష్మి, వెంకటేశ్వరరావు, డాక్టరు ఉమా రామారావు, డాక్టరు అలేఖ్య పుంజల, డాక్టరు భాగవతుల సేతురాం వద్ద కూచిపూడి నృత్యంలో శిక్షణ తీసుకున్నారు. ఇంతింతై, వటుడింతై అన్నట్లు నృత్యకళాకారిణిగా ఎదిగారు. ప్రస్తుతం పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో నాట్యవిభాగంలో ఆచార్యులుగా పనిచేస్తున్నారు. 40 సంవత్సరాల సుదీర్ఘ నృత్య సాధనలో అనేక రివార్డులు, అవార్డులు అందుకున్నారు. 2006 లో ఆమె ప్రతిభను గుర్తించిన అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉగాది పురస్కారంతో గౌరవించింది. 2008 లో హంస అవార్డు, 2010 లో ప్రతిభా రాజీవ్ పురస్కారం, 2014లో నృత్య వికాస్ శిరోమణి, 2016, 2018 లలో ప్రతిభా పురస్కారాలు, 2017లో ఫెమినా ఔట్ స్టాండింగ్ అవార్డు వంటి ఎన్నో అవార్డులు అందుకున్నారు. ఈ ఏడాది మహిళా దినోత్సవం సందర్భంగా ప్రైడ్ ఆఫ్ ఆంధ్ర అవార్డు అందుకున్నారు. గొప్ప నృత్యకళాకారిణిగా పండిట్ రవిశంకర్ మన్ననలు పొందారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లోని నిజాం క్లబ్‌లో మెంబర్‌గా ఉన్నారు. అయినా జీవిత సార్థకం కావాలంటే...నలుగురికి ఉపయోగపడాలనే యోచన ఆమెది. అందుకే తన ఇంటివద్దనే 25మంది చిన్నారులకు ఉచితంగా కూచిపూడి నేర్పిస్తున్నారు. ప్రస్తుతం.. ట్యూటర్స్ ప్రైడ్ వారి లేడీ లెజెండ్స్‌కు నామినేట్ అయినారు వనజా ఉదయ్.



సమంత



ఎన్టీఆర్

అక్టోబర్‌లో సెట్స్‌పైకి మల్టీస్టారర్?



రామ్‌చరణ్

ఎన్టీఆర్, రామ్‌చరణ్ కథానాయకులుగా ఓ మల్టీస్టారర్ చిత్రానికి తెరవెనుక సన్నాహాలు జరుగుతున్న విషయం కొద్దిరోజులుగా వింటున్నదే. ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కనుంది. కెరీర్ పరంగా ఇంతవరకు అపజయం ఎరుగని రాజమౌళి కాంబినేషన్‌లో సినిమా చేయాలని స్టార్ హీరోలంతా తహ తహ లాడుతుంటారు. ఆ అవకాశం తమను వరిస్తే బావుంటుందని ఎదురు చూస్తుంటారు కూడా. లోగడ జూ.ఎన్టీఆర్‌తో స్టూడెంట్ నెం.1, యమదొంగ, సింహాద్రి వంటి విజయవంతమైన చిత్రాలను చేసిన రాజమౌళి మరో హీరో రామ్‌చరణ్‌తో మగధీర వంటి విజయవంతమైన చిత్రాన్ని రూపొందించిన సంగతి తెలిసిందే. కాగా ఈ ఇద్దరు హీరోలతో రాజమౌళి చేయబోయే చిత్రం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. బాహుబలి-2 వంటి సంచలన విజయం తర్వాత రాజమౌళి ఏ హీరోతో సినిమా చేస్తారన్న అంశంపై ఏవేవో ఊహాగానాలు వెల్లువెత్తాయి. చివరకు ఆయన మల్టీస్టారర్ చేయడానికే మొగ్గుచూపినట్లు వార్తలు రావడంతో ఇప్పుడు ఆ సినిమా చుట్టూ రకరకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. సాధారణంగా స్క్రిప్ట్‌కు అత్యంత ప్రాధాన్యమిచ్చే రాజమౌళి అందుకోసం ఎక్కువ సమయాన్ని తీసుకుని పక్కాగా రూపొందించుకుంటారని అంటారు. ప్రస్తుతం ఆయన అదే పనిలో ఉన్నారని, ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లతో తీయబోయే మల్టీస్టారర్ స్క్రిప్ట్ కోసం దాదాపు నాలుగైదు నెలల సమయాన్ని వెచ్చించనున్నారట. అన్ని ప్రీ ప్రొడక్షన్ పనులు పక్కాగా ప్లాన్ చేసుకుని అక్టోబర్‌లో చిత్రాన్ని ప్రారంభించనున్నట్లు పరిశ్రమలో వినిపిస్తోంది. మరోవైపు జైలవకుశ చిత్రం తర్వాత ఎన్టీఆర్, దర్శకుడు త్రివిక్రమ్‌ల కలయికలో రూపొందే చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకుని వచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ చిత్రంలో న్యూలుక్‌తో ఎన్టీఆర్ కనిపిస్తారని, దానికోసం ఆయన కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. అలాగే రామ్‌చరణ్ రంగస్థలం తర్వాత బోయపాటి శ్రీను దర్శకత్వంలో నటిస్తున్న సంగతి తెలియంది కాదు. వీరిద్దరూ తాజాగా చేస్తున్న చిత్రాలు పూర్తికాగానే రాజమౌళి సినిమాలో నటిస్తారని అంటున్నారు. రాజమౌళి చిత్రం కోసం కూడా బాడీలాంగ్వేజ్‌ను పాత్రకు అనుగుణంగా తీర్చిదిద్దుకుంటారట.

పెళ్లి తర్వాత కూడా కెరీర్ పరంగా సమంత విజృంభిస్తోంది. తీరిక లేకుండా వరుస సినిమాల షూటింగ్‌లలో పాల్గొంటోంది. కెరీర్ ఆరంభం నుంచి తెలుగుతో పాటు తమిళ చిత్రాలు సైతం చేస్తున్న ఆమెకు నటిగా ఇక్కడ ఎంత పేరుందో కోలీవుడ్‌లో కూడా అంతే పేరుంది. ఇప్పుడు ఎంచక్కా ఈ రెండు భాషలలో కలుపుకుని అరడజను చిత్రాలను ఆమె చేస్తోంది. వాటిలో

ఆరు సినిమాలతో
సందడే సందడి

ఈ నెలలో మూడు చిత్రాల షూటింగ్‌ను కూడా ఆమె పూర్తిచేసేసింది. ఈ విషయాన్ని ఆమె సోషల్‌మీడియాలో తెలియజేస్తూ ఆనందాన్ని వ్యక్తంచేసింది. సావిత్రి జీవితకథ ఆధారంగా రూపొందుతున్న మహానటి చిత్రంలో ఆమె ఓ కీలక పాత్రలో నటించారు. జమున పాత్రలో ఆమె కనిపిస్తారంటూ చాలాకాలంగా వార్తలు వెల్లువెత్తినా తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం జర్నలిస్ట్‌గా ఆమె పాత్ర ఉంటుందట. ఇక రామ్‌చరణ్ సరసన నటించిన రంగస్థలం షూటింగ్‌తో పాటు విశాల్ సరసన నటించిన ఇరుంబు తిరై చిత్రం చిత్రీకరణ ఇదే నెలలో పూర్తయ్యాయి. ఇరుంబు తిరై చిత్రాన్ని తెలుగులో అభిమన్యుడు పేరుతో అనువదిస్తున్నారు. సంక్రాంతికే విడుదల చేస్తారనుకుంటున్న ఈ సినిమాను అప్పట్లో వాయిదా వేశారు. త్వరలోనే ఈ సినిమాను విడుదల చేయనున్నారు. రంగస్థలం ఈ నెల 30న విడుదల కానున్న విషయం తెలిసిందే. ఇక మహానటి చిత్రం మే 9న విడుదల కానుంది. ఇవి కాకుండా మరో మూడు చిత్రాలు సెట్స్‌పై ఉన్నాయి. వాటిలో తమిళంలో త్యాగరాజన్ రూపొందిస్తున్న సూపర్ డీలక్స్ చిత్రం ఒకటి. ఇందులో విజయ్‌సేతుపతి, సమంత హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. అలాగే శివకార్తికేయన్‌తో సీమరాజ అనే తమిళ చిత్రంలో కూడా సమంత నటిస్తోంది. కన్నడంలో విజయం సాధించిన యూటర్న్ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో రీమేక్ చేస్తున్నారు. ఈ చిత్రంలో కూడా సమంత మెరవనుంది. ప్రస్తుతం సెట్స్‌పై ఉన్న ఈ మూడు చిత్రాలు కూడా ఈ ఏడాది ద్వితీయార్థంలో విడుదల అవుతాయని చెబుతున్నారు. ఇలా ఆరు చిత్రాలతో వెండితెరపై సమంత అలరించనుంది.



నటి శ్రియ పెళ్లి

నటి శ్రియ పెళ్లి చేసుకుంది. కొద్ది రోజులుగా ఆమె పెళ్లి వార్త మీడియాలో హల్‌చల్ చేస్తోంది. తన బాయ్‌ఫ్రెండ్ ఆండ్రియా కోస్సీన్‌ను పెళ్లి చేసుకోనుందని వచ్చిన వార్తలను శ్రియ ఖండించింది. కేవలం రూమర్లు అని కొట్టిపారేసింది. కానీ అందరూ ఊహించినట్టుగానే శ్రియ తన బాయ్‌ఫ్రెండ్‌ను వివాహం చేసుకుంది. మార్చి 12న శ్రియ, ఆండ్రీయిల పెళ్లి కొద్దిమంది అతిథుల సమక్షంలో జరిగింది. ఇందుకు ముంబాయి వేదికపైంది. చాలా సింపుల్‌గా వీరి వివాహం జరిగినట్టు తెలుస్తోంది. దీనికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మార్చి 19న ఉదయ్‌పూర్‌లోని ఒక హోటల్లో వివాహ విందు ఇచ్చారు. తన వివాహాన్ని రహస్యంగా ఉంచింది శ్రియ. అయితే రిసెప్షన్ ఫోటోలు మాత్రం బయటకు వచ్చాయి. ఇష్టం (2001) సినిమాతో టాలీవుడ్‌లో కెరీర్ ప్రారంభించిన శ్రియ సీనియర్, జూనియర్ హీరోలు అందరితో కలిసి నటించింది. ఆమె వయస్సు 36 సంవత్సరాలు. రష్యాకు చెందిన ఆండ్రెయితో కొద్ది సంవత్సరాలుగా ప్రేమలో ఉంది.

నిఖిల్ కెరీర్‌లోనే అత్యధిక ఓపెనింగ్స్



కిరాక్ పార్టీ చిత్రం అన్నిచోట్ల విజయవంతంగా ప్రదర్శింపబడుతోందని నిర్మాతలలో ఒకరైన అనిల్ సుంకర తెలిపారు. నిఖిల్, సిమ్రాన్ పరీంజా, సంయుక్త హెగ్డే హీరోహీరోయిన్లుగా శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వంలో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఇటీవల విడుదలైన సంగతి తెలిసిందే. కాగా ఈ చిత్రం సక్సెస్‌మీట్ మంగళవారం హైదరాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా అనిల్ సుంకర మాట్లాడుతూ, సినిమాకు మంచి స్పందన లభిస్తోంది. థియేటర్లు మొత్తం 80 శాతం విద్యార్థులతో నిండిపోతున్నాయి. స్టూడెంట్స్‌కు ఈ సినిమా బాగా కనెక్ట్ అయ్యింది. నిర్మాతలుగా మాకు మూడు రోజుల్లోనే బ్రేక్‌ఈవెన్ ఇచ్చిన చిత్రమిది. ఓవర్‌సీస్‌లో అర మిలియన్ వసూళ్లను సాధించింది. నిఖిల్ కెరీర్‌లోనే అత్యధిక ఓపెనింగ్స్‌ను సాధించింది. తెలంగాణ, ఏపీలలో బుధవారం నుంచి విజయయాత్రను నిర్వహించబోతున్నాం. అని చెప్పారు.

హీరో నిఖిల్ మాట్లాడుతూ, హౌస్‌ఫుల్ కలెక్షన్లతో సినిమా ఆడుతోంది. నా గత సినిమాలకు రాని ప్రశంసలు ఈ సినిమాకు లభిస్తున్నాయి. క్లైమాక్స్‌కు ముందు నా నటన ప్రత్యేక ఆకర్షణగా ఉందని చెబుతున్నారు. ప్రతీఒక్కరు ఈ సినిమాను ఎంజాయ్ చేస్తున్నారు. తుని లాంటి చిన్న చిన్న పట్టణాలలో కూడా సినిమా మంచి వసూళ్లను సాధించింది. ప్రతీఒక్కరూ సినిమాను ఓన్ చేసుకుంటున్నారు. మౌత్‌టాక్‌తో రోజురోజుకు వసూళ్లు పెరుగుతున్నాయి అని చెప్పారు.

నటుడు బ్రహ్మాజీ మాట్లాడుతూ, యూత్ అందరితో కలిసిపోయి చేసిన సినిమా ఇది.నా సీన్స్ గురించి అందరూ మాట్లాడుతున్నారు. పెద్ద సినిమాలతో పాటు కథాబలం ఉన్న చిన్న సినిమాలను సైతం నిర్మిస్తూ విజయాల్ని అందుకుంటున్నారు అనిల్ సుంకర అని అన్నారు. తొలి చిత్రంతోనే విజయం దక్కడం ఆనందంగా ఉందని హీరోయిన్ సంయుక్త హెగ్డే అన్నారు.దర్శకుడు శరణ్ కొప్పిశెట్టి మాట్లాడుతూ, సినిమాకు పెద్ద విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ప్రతి విద్యార్థి తమ కథగానే ఈ చిత్రాన్ని భావిస్తున్నారు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో హేమంత్, రాకేందు మౌళి తదితరులు పాల్గొన్నారు.

గులేబకావళి గీతావిష్కరణ



ప్రభుదేవా, హన్సిక జంటగా నటించిన చిత్రం గులేబకావళి. రేవతి ప్రధాన పాత్ర పోషించారు. కల్యాణ్ దర్శకత్వం వహించారు. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై మల్కాపురం శివకుమార్ ఈ చిత్రాన్ని అదే పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. వివేక్ మెర్విన్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రం పాటలను హైదరాబాద్‌లో విడుదలచేశారు. బిగ్ సీడీని రాష్ట్ర సాంస్కృతిక శాఖ సారథి, శాసనసభ్యుడు రసమయి బాలకిషన్ విడుదలచేయగా, ఆడియో సీడీలను తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షుడు ఎన్.శంకర్ ఆవిష్కరించారు. తొలి సీడీని జీవిత రాజశేఖర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఎన్.శంకర్ మాట్లాడుతూ, చక్కటి వినోదంతో పాటు మిస్టరీ, సస్పెన్స్, యాక్షన్ అంశాలు మిళితమైన చిత్రమిది. నిధి అన్వేషణ నేపథ్య కథాంశాలతో దక్షిణాదిలో వచ్చిన సినిమాలన్నీ పెద్ద విజయాల్ని సాధించాయి. ఈ సినిమా ఆ జాబితాలో నిలవాలి. చిన్న నిర్మాతల సినిమాల్ని విడుదలచేసి, వారికి సాయపడాలనే తపన మల్కాపురం శివకుమార్‌లో కనిపిస్తుంది. ఆయనే చేసే ప్రతి సినిమా విజయవంతం కావాలి అని అన్నారు. తెలుగు, తమిళ నేటివిటికీ సరిపోయే కథ ఇదని, అందరికీ నచ్చేవిధంగా ఉంటుందని దర్శకుడు కల్యాణ్ చెప్పారు. చిత్ర నిర్మాత మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ, చెన్నైలో ఐదోవారంలో ఈ సినిమాను చూశాను. తమిళ భాష రాకపోయినా సాధారణ ప్రేక్షకుడిగా సినిమాను చాలా ఎంజాయ్ చేశాను. తప్పకుండా తెలుగు ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది. ఏప్రిల్ 6న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం అని చెప్పారు. రసమయి బాలకిషన్ మాట్లాడుతూ, అన్నం ఉడికిందా..లేదా చూడాలంటే ఒక్క మెతుకు చూస్తే చాలంటారు. పాటలు, ట్రైలర్‌ను బట్టి ఈ సినిమా విజయం తెలిసిపోతోంది. నాకు ఏం మిగులుతుందనే ఆలోచనను పక్కనపెట్టి ఎదుటివారిలో ఆనందాన్ని చూసి సంతోషపడే వ్యక్తి మల్కాపురం శివకుమార్. నేను ఓ సినిమా చేయబోతున్నాను. ఆ సినిమాకు శివకుమారే పంపిణీదారుడిగా వ్యవహరించనున్నారు. ప్రయోగాత్మకంగా ఆ చిత్రం తెరకెక్కనుంది అని అన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న జీవిత రాజశేఖర్, శ్రీనివాస్ బొగ్గరం, బీరం సుధాకర్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి, రచ్చరవి, జబర్దస్త్ రాము, కొరియోగ్రాఫర్ జానీ తదితరులు పాల్గొన్నారు.



పుష్కరకాల నట ప్రయాణంలో ఎన్నో విజయాలు అందుకుంది గోవా సుందరి ఇలియానా. ఐదారేళ్లు దక్షిణాదిలో అగ్ర తారగా వెలిగింది. ఆ తర్వాత బాలీవుడ్ వెళ్లి తన అదృష్టాన్ని కొనసాగించింది. బర్ఫీ, రుస్తుం లాంటి చిత్రాలతో పేరున్న నాయిక అయ్యింది. పరిశ్రమ ఏదైనా విజయాల బాటలోనే నడిచింది ఇలియానా. ఇంత పేరున్నా....ప్రతి సినిమా కొత్త చిత్రంలాగే ఒత్తిడికి గురవుతానని చెబుతోందీ భామ. ప్రతి శుక్రవారం పరిశ్రమకు,

ప్రతిసారీ కొత్తగానే ఉంటుంది..!

ప్రేక్షకులకు మీరు కొత్త నాయికే అంటుంది ఇలియానా. ప్రతిసారీ తమను తాము నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఉందని....అలా కొనసాగించే ప్రయాణమే విజయవంతమవుతోందని చెబుతోంది. ఇటీవల ఈ గోవా సుందరి మాట్లాడుతూ....గతంలో మీరేం చేశారు అనేది ఎవరికీ అవసరం లేదు. ఈ కొత్త చిత్రంలో మీరు ఎంత బాగా నటించి మెప్పించారు అన్నదే చూస్తారు. అందుకే ఇప్పటికీ నా కొత్త చిత్రం విడుదలవుతుంటే ఒత్తిడికి గురవుతుంటా. ప్రతి శుక్రవారం మాకు పరీక్షే. అందులో పాసవుతామా లేదా అని ఆత్రుతగా ఎదురుచూస్తుంటాం. అని చెప్పింది. ఇక తన నట ప్రయాణం గురించి మాట్లాడుతూ....నాయికగా గొప్ప శిఖరాలు చేరుకోవాలని ఆశలు పెట్టుకోలేదు. మరో ఐదేళ్ల తర్వాత ఈ స్థాయిలో ఉండాలని ఎప్పుడూ అనుకోలేదు. అలాంటి లక్ష్యాలు లేవు కాబట్టే....ప్రశాంతంగా సినిమాలు చేస్తూ వచ్చాను. లేకుంటే అనుకున్నది సాధించలేదనే నిరాశ నన్ను వెంటాడేది. ఈ క్రమంలో కొన్ని అద్భుతమైన పాత్రలు చేసే అవకాశం దక్కింది. అందుకే సినిమాల విషయంలో తొందరపడను. వచ్చినవన్నీ చేసుకుంటే వెళ్లే అలవాటు నాకు లేదు. ఆలస్యమైనా మంచి సినిమాలు చేయాలనుకుంటాను. తెలుగులోనూ మళ్లీ నటించేందుకు సిద్ధంగా ఉన్నా. అని చెప్పింది. ఇలియనా తాజా చిత్రం రైడ్ ప్రేక్షకుల నుంచి సానుకూల స్పందన తెచ్చుకుంటోంది.

ఇలియాన

మలేషియాలో నిన్నే చూస్తు



హేమలత

నూతన నటీనటులు శ్రీకాంత్, నితిన్, హేమలత ప్రధాన తారాగణంలో రూపొందుతున్న చిత్రం నిన్నే చూస్తు. సుమన్, భానుచందర్, సుహాసిని ఇతర ముఖ్యపాత్రధారులు. కె.గోవర్ధనరావు దర్శకత్వంలో వీరభద్ర క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. హేమలతా రెడ్డి నిర్మాత. ఇటీవలే రెండు షెడ్యూల్స్ పూర్తిచేసుకుంది. తాజాగా మూడవ షెడ్యూల్ చిత్రీకరణ జరుపుకుంటోంది. ఇటీవల నిన్నే చూస్తు అనే పాటను మలేషియాలో చిత్రీకరించారు. నిర్మాత మాట్లాడుతూ మా సినిమాకు టైటిల్ సాంగ్ ప్రత్యేకం. సంగీత దర్శకుడు రమణ్ రాథోడ్ మంచి బాణీలు అందించారు. మంచి కుటుంబకథతో తీస్తున్న సినిమా ఇది. సీనియర్ నటులు నటించడం ఆనందంగా ఉంది. త్వరలో షూటింగ్ పూర్తిచేస్తాం అన్నారు.

ఈ చిత్రానికి సంగీతం రమణ్ రాథోడ్, ఛాయాగ్రహణం ప్రసాద్ ఈదర, మాటలు కరణ్ గోపిని, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం కె.గోవర్ధన్ రావు.